

'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 141

సోమవారం 11-8-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




ప్రజల ముంగిటకే న్యాయం

న్యాయవ్యవస్థ లక్ష్యం అదే.. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ -6లో



ట్రిప్ జాలీగా సాగాలంటే!

విదేశీ పర్యటనలకు బీమాతో ఆర్థిక నష్టాన్ని భర్తీ చేసుకోవచ్చు -15లో



భారత్‌ను ఏ శక్తీ ఆపలేదు

భారత్ ఎదుగుదలను అమెరికా అధ్యక్షుడు స్వాగతించలేకపోతున్నారని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శించారు.

వివరాలు 6లో ▸



అలస్కా చర్చల్లో జెలెన్‌స్కీ?

ఈ నెల 15న అలస్కాలో పుతిన్‌తో ట్రంప్ జరిపే చర్చల్లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పాల్గొనే అవకాశాలు ఉన్నాయి.

వివరాలు 6లో ▸



పాక్‌కు చెక్ పెట్టాం

'సిందూర్' సంప్రదాయ ఆపరేషన్ కాదని, చదరంగం లాంటిదని ఆర్మీ చీఫ్ జనరల్ ద్వివేది అన్నారు.

వివరాలు 6లో ▸



సృష్టి కేసులో రంగంలోకి ఈడీ

సృష్టి ఫెర్టిలిటీ కేసులో ఈడీ రంగంలోకి దిగింది. ఈ కేసులో మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు జరిపేందుకు సిద్ధమైంది.

వివరాలు 16లో ▸

వరదను కట్టడి చేద్దాం ట్రంక్ లైన్ గీద్దాం

భారీ పైపులతో కూడిన వ్యవస్థ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్న సీఎం

హైదరాబాద్‌లోని అమీర్‌పేట, ఎస్సార్‌నగర్ ప్రాంతాల్లో ఆకస్మిక పర్యటన

బౌద్ధనగర్, గంగుబాయి బస్తీ, రిలయన్స్ లైన్‌లలో డ్రైనేజీ నాలాల పరిశీలన



ఆదివారం హైదరాబాద్ అమీర్‌పేటలో జరిపిన ఆకస్మిక పర్యటనలో మురికికాల్వను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్.

- మైత్రి వనం వద్ద నీరు నిలిచిపోవడంపై ఆరా..
- డ్రైనేజీ వ్యవస్థ మార్పు చేర్పులపై అధికారులకు సూచనలు
- ఏడో తరగతి బాలుడితో కలిసి బౌద్ధనగర్‌లో తిరిగిన రేవంత్
- వరద నీటితో ఇంట్లో పుస్తకాలు తడిచిపోయాయన్న జశ్వంత్
- ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్న సీఎం

సాక్షి, హైదరాబాద్/అమీర్‌పేట: భారీ వర్షాలతో అతలాకుతలం అవుతున్న హైదరాబాద్‌లోని అమీర్‌పేట, ఎస్సార్‌నగర్‌ల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ఆకస్మికంగా పర్యటించారు. ఆయా ప్రాంతాలను వరద, ముంపు ముప్పు నుంచి తప్పించడానికి ప్రత్యేకంగా ట్రంక్ లైన్ ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. బౌద్ధనగర్, గంగుబాయి బస్తీ, రిలయన్స్ లైన్‌లలో ఉన్న డ్రైనేజీ నాలాలను పరిశీలించారు. మైత్రి వనం వద్ద నీరు నిలిచిపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఆర్ నగర్ నుంచి బౌద్ధ నగర్ వరకు ఉన్న మురుగునీటి కాలువను చూసిన ఆయన ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కాలనీ రోడ్డు కంటే డ్రైనేజీ ఎక్కువ ఎత్తులో ఉండటంపై ఆరా తీశారు. ఈ కారణంగానే రోడ్డు ఇరుకుగా మారడంతో పాటు వరద బౌద్ధనగర్‌ను ముంచుతోందని గుర్తించారు. తక్షణమే డ్రైనేజీ వ్యవస్థ మిగతా 12వ పేజీలో ▶

ఆదివారం బెంగళూరులో మెట్రోరైల్లో ప్రయాణిస్తూ విద్యార్థులతో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ



మృతప్రాయ ఆర్థిక వ్యవస్థ కాదు.. 3వ స్థానానికి ఎదుగుతున్నాం

11 ఏళ్లలో పదో స్థానం నుంచి ఐదో స్థానానికి చేరుకున్నాం

- మూడో స్థానానికి చేరడం ఇక ఎంతోదూరంలో లేదు
- స్పష్టమైన ఉద్దేశాలు, నిజాయితీగల ప్రయత్నాలతో ముందుకెళ్తున్నాం
- బెంగళూరు పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- డొనాల్డ్ ట్రంప్ 'డెడ్ ఎకానమీ' వ్యాఖ్యలను తిప్పికొట్టిన మోదీ

6లో

భారతదేశ ఆర్థిక వ్యవస్థ మృతప్రాయంగా మారిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ప్రధాని మోదీ గట్టిగా తిప్పికొట్టారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారే దిశగా భారత్ పరుగులు తీస్తోందని తేల్చిచెప్పారు. స్పష్టమైన ఉద్దేశాలు, నిజాయితీగల ప్రయత్నాలతో ముందుకెళ్తున్నామని వివరించారు. మన ఆర్థిక వ్యవస్థలో వేగానికి 'సంస్కరణ, పనితీరు, మార్పు' చోదక శక్తిగా పని చేస్తున్నాయని వెల్లడించారు. ప్రధాని మోదీ ఆదివారం బెంగళూరులో మెట్రోరైలు నెట్‌వర్క్‌కు సంబంధించిన 'ఎల్లో లైన్'ను ప్రారంభించారు

న్యూస్‌రీల్

ఆర్టీసీకి 503 కొత్త బస్సులు



ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని మరిన్ని బస్సులు సమకూర్చుకునేందుకు టీఎస్ఆర్టీసీ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా కొత్తగా 503 బస్సులు కొనాలని నిర్ణయించింది. ఈ బస్సులకు రూ.195 కోట్లు అవసరమని అధికారులు తేల్చారు.

- వివరాలు 3లో ▶

బీజేపీలోకి మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత గువ్వల బాలరాజు బీజేపీలో చేరారు. ఆదివారం ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్ర రావు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ సమక్షంలో ఆయన చేరారు.

- వివరాలు 2లో ▶

సామరస్య మార్గమే సరి..



పార్టీలోని అంతర్గత విభేదాలను సామరస్య పూర్వకంగా పరిష్కరించే దిశగా టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ముందుకెళుతోంది. నేతల మధ్య ఉన్న అభిప్రాయభేదాలతోపాటు పార్టీ లైన్‌ను దాటి మాట్లాడారని వచ్చిన ఫిర్యాదులను రాజీ మార్గంలో పరిష్కరిస్తోంది.

- వివరాలు 12లో ▶

'యాక్ట్' ఉంటేనే యాక్షన్!



చిన్నారులపై లైంగిక నేరాలకు పాల్పడే వారికి జీవితఖైదు శిక్షలు విధించేలా పోక్సో చట్టం అమల్లో ఉండగా.. మహిళలు, యువతులను వేధించే ఆకతాయిలు, పోకిరీలపై కఠిన చర్యలు తీసుకోవడానికి మాత్రం ప్రస్తుత చట్టాల్లోని సెక్షన్లు ఉపయుక్తంగా లేవు.

- వివరాలు 16లో ▶

నేతలు పట్టించుకోక మరో దారి లేక

- రోడ్డు లేని తండాలోకి వెళ్లలేక 2 కి.మీ. దూరంలోనే ఆగిన '108'అంబులెన్స్
- భార్యను మోసుకుంటూ వర్షంలోనే బయలుదేరిన భర్త
- మార్గమధ్యంలోనే ప్రసవం.. సంగారెడ్డి జిల్లాలో ఘటన
- ఓట్లు తప్ప తమ బాగోగులు పట్టవా అంటూ నేతలపై గిరిజనుల ఆగ్రహం



నారాయణఖేడ్: ఓవైపు వర్షం.. మరోవైపు నిండు గర్భిణికి పురిటి నొప్పులు.. సకాలంలో 108 అంబులెన్స్ వచ్చినా గర్భిణి చెంతకు చేరే రోడ్డుమార్గం లేక 2 కి.మీ. దూరంలోనే నిలిచిపోయిన పరిస్థితి. దీంతో భర్త తన మిగతా 2వ పేజీలో ▶

ఫైపైకి పాతాళ గంగ..

- మేలో 10.07 మీటర్లు.. జూన్‌లో 9.47 మీటర్ల సగటు లోతుల్లో భూగర్భ జలాలు
- జూలైలో 8.37 మీటర్ల వద్దే జలాలు.. భారీ వర్షాలతో పెరుగుతున్న నీటిమట్టం
- హైదరాబాద్ జిల్లాలో 2.71 మీటర్ల వృద్ధి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వర్షాలకు భూగర్భ జలమట్టాలు గణనీయంగా వృద్ధిచెందాయి. భూగర్భ జలాల సగటు లోతు గత మేలో 10.07 మీటర్లకు పడిపోగా, వర్షాలు ప్రారంభం కావడంతో జూన్‌లో 9.47 మీటర్లకు.. జూలైలో 8.37 మీటర్లకు పెరిగాయి. మేతో పోలిస్తే జూన్‌లో భూగర్భ జలమట్టాల సగటు 0.6 మీటర్లు, జూలైలో 1.69 మీటర్ల మేర వృద్ధి చెందినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అయితే, 2024 జూలైతో పోలిస్తే 2025 జూలైలో మాత్రం 0.13 మీటర్ల మేర భూగర్భ జలాలు తగ్గిపోయాయి. 2024 జూలైలో రాష్ట్ర భూగర్భజలాల సగటు నీటిమట్టం 8.25 మీటర్లు మాత్రమే మిగతా 5వ పేజీలో ▶

దేవాదుల వద్ద డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి, ఉత్తమ్, కోమటిరెడ్డి, సీతక్క తదితరులు



రాయలసీమ ఎత్తిపోతలు ఆపండి

రోజుకు 11 టీఎంసీలు తరలిస్తే శ్రీశైలం 25 రోజుల్లోనే ఖాళీ

- నీటివాటాలు తేలాకనే బనకచర్లపై ముందుకెళ్లాలి..
- మా ప్రభుత్వానికి దేవాదుల అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టు
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్
- వైరా నదిపై జవహర్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన

సాక్షి ప్రతినిధి వరంగల్/ఏటూరునాగారం/మధిర: శ్రీశైలం ఎగువ భాగాన రోజుకు 11 టీఎంసీల నీటిని తరలించే రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని తక్షణమే నిలిపేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఏపీ సీఎం చంద్రబాబును డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా మధిర మండలం వంగవీడు సమీపంలో వైరా నదిపై రూ.600 కోట్లతో నిర్మించనున్న జవహర్ ఎత్తిపోతల పథకానికి మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి మిగతా 12వ పేజీలో ▶

ఇంజనీరింగ్‌లో మిగిలిపోయిన సీట్లు 11,638

- మొత్తంగా భర్తీ అయినవి 80,011 సీట్లు.. సివిల్, మెకానికల్‌లో 68 శాతమే భర్తీ
- 91% నిండిన కంప్యూటర్ కోర్సుల సీట్లు.. తుది విడత సీట్లు కేటాయించిన సాంకేతిక విద్యా విభాగం


- వివరాలు 3లో ▶

ఇదండీ సంగతి



ఇంకొన్ని ఫిర్యాదులొచ్చే వరకూ ఆగుదాం సార్!!

కృష్ణమ్మ జాలువారి



సాగర్ నుంచి కృష్ణమ్మ పరవళ్లు

సాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. 8 క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరదనీరు 5లో

గోదారి.. తడారి



పెద్దపల్లి జిల్లా గోదావరిఖని వద్ద గోదావరి నది ఎడారిగా మారింది. ఎగువ ప్రాంతం నుంచి వరద రాక పోగా.. కింది భాగంలో ఉన్న కాళేశ్వరం నుంచి అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు ఎత్తిపోతలు లేక బ్యాక్ వాటర్ రావడం లేదు. దీంతో గోదావరిఖని ఏరియాలోని గోదావరి నది ఎడారిని తలపిస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లకు బీటలు వారిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు ఎత్తిపోయడం లేదు. నీళ్లు లేకపోవడంతో ఈ ప్రాంతంలోని రైతులు సాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. గోదావరిఖని

నష్టాల్లో 81 విమానాశ్రయాలు!

దశాబ్ద కాలంలో రూ.10,000 కోట్లకుపైగా నష్టం

టాప్‌–10లో బేగంపేట, విజయవాడ, తిరుపతి

2లో

ఎనలేని పనిభారం.. జీవితం నిస్సారం

- నిరంతరం బిజీ జీవితంతో మానసిక, శారీరక అలసట
- ఉద్యోగుల ఉత్పాదకత, పనితీరుపై ప్రతికూల ప్రభావం
- వర్క్‌– లైఫ్ బ్యాలెన్స్‌లో విఫలం కావటమూ కారణమే

16లో

నష్టాల్లో 81 విమానాశ్రయాలు!



తెలుగు రాష్ట్రాల్లో మూడు.. మూతపడ్డ విమానాశ్రయాల్లో తెలంగాణ నుంచి నాదర్‌గుల్, వరంగల్; ఏపీ నుంచి దొనకొండ ఉన్నాయి.

భారతీయ విమానాశ్రయాల నుంచి ఏటా కోట్ల మంది దేశ, విదేశాలకు విమానయానం చేస్తున్నారు. ఎయిర్‌పోర్టులూ పెరిగాయి. ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. విమానాశ్రయాల్లో రెస్టారెంట్లు, షాపింగ్ కేంద్రాలు విస్తరించాయి. వీటి వ్యాపారం, ప్రయాణికుల రాకపోకలు, వాహనాల పార్కింగ్ ఫీజు, ఇతర ఆదాయాలతో విమానాశ్రయాలు లాభాల జడివానలో తడిసిపోతున్నాయి అనుకుంటే పొరపాటే. భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా–ఏఏఐ) నిర్వహణలో ఉన్న 81 విమానాశ్రయాలు నష్టాల్లో ఉన్నాయి. దశాబ్ద కాలంలో ఇవి రూ.10 వేల కోట్లకుపైగా నష్టాన్ని మూటగట్టుకోవడం గమనార్హం. వీటిలో 22 విమానాశ్రయాల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. నష్టాల జాబితాలో ఉన్న ఏఏఐ ఎయిర్‌పోర్టుల్లో తెలుగు రాష్ట్రాల నుంచి ఏడు ఉన్నాయి.

ఇటీవల కేంద్ర పౌర విమానయాన శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. 2015–2016 నుంచి 2024–2025 మధ్య దేశవ్యాప్తంగా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అధీనంలో ఉన్న 81 విమానాశ్రయాలు మొత్తం రూ.10,852.9 కోట్ల నష్టాన్ని చవిచూశాయి. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ విమానాశ్రయం అత్యధికంగా రూ.673.91 కోట్లు నష్టపోయింది. ఆ తర్వాతి స్థానాల్లో అగర్తల, బేగంపేట (హైదరాబాద్), డెహ్రాడూన్, విజయవాడ విమానాశ్రయాలు ఉన్నాయి. రూ.363 కోట్ల నష్టంతో తిరుపతి 8వ స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి రూ.339.16 కోట్లు, కడప రూ.103.39 కోట్లు, ప్రకాశం జిల్లాలోని దొనకొండ రూ.1.84 కోట్లు, తెలంగాణలోని వరంగల్ రూ.5.76 కోట్ల నష్టాన్ని నమోదుచేశాయి. సఫ్దర్‌జంగ్ విమానాశ్రయం నుంచి ప్రస్తుతం వాణిజ్య విమానాలు కార్యకలాపాలు సాగించడం లేదు. ఇక్కడి నుంచి ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వీవీఐపీలను తీసుకెళ్లడానికి మాత్రమే ఉపయోగిస్తున్నారు.

సాక్షి, స్పెషల్ డెస్క్

13 కోట్లకు పైచిలుకు..

ఏఏఐ ఖాతాలో దేశవ్యాప్తంగా మొత్తం 133 ఎయిర్‌పోర్టులు ఉన్నాయి. ఇందులో 35 విమానాశ్రయాల నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు నడుస్తున్నాయి. రెండు జాయింట్ వెంచర్, ఆరు పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విమానాశ్రయాలు మినహా.. మిగిలిన ఎయిర్‌పోర్టుల నుంచి 2023–24లో 13 కోట్లకుపైచిలుకు ప్రయాణికులు దేశ, విదేశాలకు రాకపోకలు సాగించారు. 6.88 లక్షల మెట్రిక్ టన్నుల సరుకు రవాణా అయింది.

బేగంపేటలో ఇలా..

ఇక బేగంపేట విమానాశ్రయం నుంచి వాణిజ్య విమానాలు నడపడం లేదు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌గానూ ఈ ఎయిర్‌పోర్ట్ సేవలు అందిస్తోంది. అలాగే ప్రైవేట్ విమాన సర్వీసులు ఇక్కడి నుంచి విరివిగా నడుస్తున్నాయి. 2008 మార్చి 23న శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమైన తర్వాత బేగంపేట ఎయిర్‌పోర్టు అన్ని వాణిజ్య కార్యకలాపాలను నిలిపివేసింది. అతిపెద్ద పౌర విమానయాన ప్రదర్శనకు రెండేళ్లకోసారి బేగంపేట విమానాశ్రయం వేదిక అవుతోంది.

- దశాబ్ద కాలంలో రూ.10,000 కోట్లకుపైగా నష్టం
- ఇవన్నీ ఏఏఐ నిర్వహణలో ఉన్న ఎయిర్‌పోర్టులే
- టాప్–10లో బేగంపేట, విజయవాడ, తిరుపతి
- ఏపీ, తెలంగాణలో నష్టాల్లో 7 ఎయిర్‌పోర్టులు

రూ.96 వేల కోట్ల వ్యయం

ప్రయాణికుల సంఖ్య ఏటా పెరుగుతున్న నేపథ్యంలో కొత్త ఎయిర్‌పోర్టులు, ఉన్న వాటి విస్తరణ, కొత్త టెర్మినళ్లు, ఇతర సౌకర్యాల కల్పన వంటి వాటికోసం 2019–20 నుంచి 2024–25 మధ్య ఏఏఐ, పీపీపీ భాగస్వాములు కలిపి రూ.96,000 కోట్ల మూలధన వ్యయం చేశాయి. ఇందులో ఏఏఐ వాటా రూ.25,000 కోట్లు.

ఉడాన్ పథకంతో..

దేశంలోని సేవలు లేని, తక్కువ సేవలు అందిస్తున్న విమానాశ్రయాల నుంచి ప్రాంతీయ విమాన కనెక్టివిటీని పెంచడానికి 2016 అక్టోబర్ 21న ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్ (ఆర్‌సీఎస్–ఉడాన్) పథకం ప్రారంభమైంది. నిర్వహణ ఖర్చులు, అంచనా ఆదాయాల మధ్య అంతరాన్ని తగ్గించడానికి విమానయాన సంస్థలకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌ను ఈ పథకం కింద ప్రభుత్వం అందిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, విమానాశ్రయ నిర్వాహకుల నుంచి విమానయాన సంస్థలకు ఆర్థిక ప్రోత్సాహకాలు, రాయితీలు లభిస్తాయి. తద్వారా నిర్వహణ ఖర్చులను తగ్గించి వారి కార్యకలాపాలను ప్రోత్సహించవచ్చన్నది ప్రభుత్వ భావన. 2025–2026 ఆర్థిక సంవత్సరానికి ఆర్‌సీఎస్–ఉడాన్ కోసం కేంద్రం రూ.300 కోట్ల బడ్జెట్ కేటాయించింది. 15 హెలిపోర్ట్‌లు, రెండు వాటర్ ఏరోడ్రోమ్స్ సహా మొత్తం 92 సేవలు లేని, తక్కువ సేవలు అందించే విమానాశ్రయాలను ఉడాన్ కింద పూర్తి స్థాయి వినియోగంలోకి తీసుకొచ్చారు.

విమానాశ్రయం..	నష్టం (రూ.కోట్లలో)
సఫ్దర్‌జంగ్	673.91
అగర్తల	605.23
బేగంపేట	564.97
డెహ్రాడూన్	488.01
విజయవాడ	483.69
భోపాల్	480.43
ఔరంగాబాద్	447.83
తిరుపతి	363.71
ఖజురహో	355.53
ఇంఫాల్	355.19

2018లో దేశంలో 100 విమానాశ్రయాలే ఉండేవి. ప్రస్తుతం 159కి పెరిగాయి.

2020 సంవత్సరం 126 ఎయిర్‌పోర్టులు

2021 - 130

2022 - 140

2023 - 149

2024 - 159

తెలంగాణలో బీసీ రిజర్వేషన్లకు అడ్డంకి ఎందుకు?

కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు అడ్డంకులు ఎందుకని కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. బిహార్‌లో గవర్నర్ ఆమోదంతో అక్కడ ఓబీసీ బిల్లు చట్టంగా మారిందని గుర్తుచేశారు. తెలంగాణ బిల్లు విషయంలో మాత్రం నాలుగు నెలలుగా రాష్ట్రపతి ఎందుకు జాప్యం చేస్తున్నారని నిలదీశారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రయత్నిస్తుంటే కేంద్రంలోని బీజేపీ సర్కార్ అడ్డంకులు సృష్టిస్తోందని ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా మండిపడ్డారు. 'బిహార్‌లో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఓబీసీలు, అత్యంత వెనుకబడిన వర్గాల(ఈబీసీ) రిజర్వేషన్లను 65 శాతానికి పెంచుతూ 2023 నవంబర్ 9న ఆ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తెలిపింది. 2023 నవంబర్ 10న కౌన్సిల్ కూడా ఆమోదించింది. గవర్నర్ సమ్మతితో ఆ బిల్లు 2023 నవంబర్ 21న చట్టంగా మారింది'అని ఆయన పేర్కొన్నారు. ఆ బిల్లు విషయంలో ఆలస్యం చేయించడం లేదా అడ్డుకోవడం బీజేపీకి సాధ్యం కాలేదని, ఫలితంగా బిల్లును రాష్ట్రపతి సమ్మతి కోసం పంపకుండానే గవర్నర్ ఆమోదించారని తెలిపారు.

కాంగ్రెస్ మోసాలపై ఇంటింటా క్యూఆర్‌కోడ్ స్కానర్




ముఖరా(కే)లో స్కానర్లతో జనం

ఇచ్చోడ: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మోసాలను ప్రజలు గుర్తించడానికి ఇంటింటా క్యూఆర్ కోడ్ స్కానర్‌లను ఏర్పాటు చేసినట్లు ముఖరాకే గ్రామ మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్‌లు తెలిపారు. ఆదివారం గ్రామంలో ప్రతి ఇంటికి స్కానర్‌ను అతికించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయకుండా తప్పించుకుంటోందని ఆరోపించారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ 20 నెలలు దాటుతున్న అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని వారు అన్నారు. అందుకని క్యూఆర్ కోడ్ స్కానర్‌ను ఇంటింటికి అతికించినట్లు తెలిపారు.

100 కేసులు.. 109 పరిష్కారం

- క్రిమినల్ కేసుల విచారణలో హైకోర్టు రికార్డు
- వేగవంతంగా విచారణ, పరిష్కారం
- సివిల్ కేసుల్లోనూ పరిష్కార రేటు 94 శాతం
- సౌకర్యాలు కల్పిస్తే మరింత వేగంగా పరిష్కారం



సాక్షి, హైదరాబాద్: క్రిమినల్ కేసుల్లో తెలంగాణ హైకోర్టు సత్వర పరిష్కారం చూపిస్తోంది. సగటున నమోదైన 100 కేసులకు పాత కేసులతో కలిపి 109 కేసులను పరిష్కరిస్తోంది. సివిల్ కేసుల్లో 94 శాతం పరిష్కారంతో కేసుల విచారణ సాగిస్తోంది. హైకోర్టులో ఇప్పటికి దాదాపు 2.35 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 30 శాతం న్యాయమూర్తుల స్థానాలు ఖాళీగా ఉన్నా.. పరిష్కారం శాతంలో దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది.

కౌంటర్ల జాప్యంతో పెరుగుతున్న పెండింగ్‌లు

కేసుల సత్వర విచారణకు న్యాయస్థానం తీవ్రంగా కృషి చేస్తున్నా.. జడ్జిల ఖాళీలు, సిబ్బంది లేమితోపాటు ప్రభుత్వం వేగంగా కౌంటర్లు వేయకపోవడంతో కొన్ని కేసులు విచారణ నత్తనడకను తలపిస్తోంది. సివిల్ కేసుల్లో ఏళ్లకేళ్లు కౌంటర్లు దాఖలు చేయకుండా సర్కార్ మీనమేషాలు లెక్కిస్తుండటం పెండింగ్ శాతం పెరగడానికి ప్రధాన కారణమని న్యాయమూర్తులే పలు సందర్భాల్లో వ్యాఖ్యానించడం గమనార్హం.

దేశంలోని హైకోర్టుల్లో 7 లక్షల క్రిమినల్ అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. హైకోర్టు న్యాయమూర్తుల నియామకాలకు పేర్లను కేంద్ర ప్రభుత్వం త్వరగా సిఫారసు చేయాలి. న్యాయమూర్తుల కొరతతో క్రిమినల్ అప్పీళ్లు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమస్యను అరికట్టాల్సి ఉంది.

\- సుప్రీంకోర్టు

కేసులు పెద్ద సంఖ్యలో పేరుకుపోవడం కోర్టు వ్యవస్థపై తీవ్ర భారం మోపుతుంది. ఒత్తిడి పెరగడంతో న్యాయమూర్తులు కేసులను సకాలంలో విచారించి నిర్ణయం తీసుకోవడం కష్టమవుతుంది. సుదీర్ఘ జాప్యం కారణంగా సాధారణ ప్రజల్లో న్యాయ వ్యవస్థపై నమ్మకం, విశ్వాసం కోల్పోయే ప్రమాదం ఉంది.

\- న్యాయ నిపుణులు

ప్రధాన సమస్యలు..

- న్యాయమూర్తుల ఖాళీలు, సిబ్బంది కొరత
- అంతంత మాత్రంగా మౌలిక సదుపాయాలు
- న్యాయ వ్యవస్థకు అరకొర నిధుల కేటాయింపు
- కౌంటర్ల దాఖలుకు సర్కార్ ఏళ్లకేళ్ల సమయం తీసుకోవడం
- చట్టంలోని లోటుపాట్లను కొందరు అనుకూలంగా మార్చుకోవడం
- సాంకేతికతపై న్యాయవాదులకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడం

అనుకూలతలు..

- కోవిడ్ తర్వాత వర్చువల్ విధానం అందుబాటులోకి రావడం
- లోక్ అదాలత్‌లపై ప్రజలను విస్తృత స్థాయిలో చైతన్యం చేయడం
- సివిల్ కేసుల్లో మధ్యవర్తిత్వాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించడం
- న్యాయమూర్తులు విచారణలను వేగవంతంగా చేపడుతుండటం
- ఆన్‌లైన్‌లోనూ న్యాయవాదులు విచారణకు హాజరవుతుండటం


ఇంకా ఏం చేయాలి..

- సాంకేతికతపై కక్షిదారులకు, న్యాయవాదులకు అవగాహన కల్పించడం
- ఒకే రకమైన కేసులను ఒకే చోట విచారణ చేపట్టడం
- చిన్నచిన్న విచారణలకు న్యాయవాదులకు గడువు నిర్దేశించడం
- బలమైన కారణాలుంటే తప్ప విచారణ వాయిదా వేయకుండా ఉంటడం
- స్వల్ప కేసుల్లో వెంటవెంటనే తీర్పులు వెల్లడించడం
- కౌంటర్ల దాఖలుకు సర్కార్‌కు గడువు విధించడం

వాయిదాలు తగ్గితేనే..

ప్రధానంగా సివిల్ కేసుల్లో వాయిదాలు తగ్గితేనే సత్వర పరిష్కారం సాధ్యమవడంతోపాటు పెండింగ్ భారం తగ్గుతుంది. కొన్ని కేసులు ఏళ్లకు ఏళ్లు వాయిదా పడుతూ పెండింగ్ జాబితా పేరుకుపోతోంది. క్రిమినల్‌తో పాటు సివిల్ కేసులను వంద శాతానికి మించి పరిష్కారం చేయాలి. రెండేళ్లుగా జడ్జీలు సత్వర పరిష్కారానికి ప్రయత్నం చేస్తున్నా.. అదనపు భారంతో తీవ్ర ఒత్తిడి ఉంటోంది. మంజూరైన మేరకు న్యాయమూర్తుల నియామకం, మౌలిక వసతులు చేపడితే ఈ భారాన్ని తగ్గిస్తూ రావొచ్చు.

\- సంజీవ్‌రెడ్డి జిల్లెల్ల, హెచ్‌సీఏఏ మాజీ కార్యదర్శి, హైకోర్టు న్యాయవాది





బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌వి దగాకోరు రాజకీయాలు

బీజేపీలో చేరిన అనంతరం మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

- పదవులు కోరుకోవట్లేదని.. ఓ సామాన్య కార్యకర్తగా కమలదళంలో పనిచేస్తానని వెల్లడి
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రాంచందర్‌రావు, కె. లక్ష్మణ్



కేంద్రమంత్రి బండి సంజయ్‌తో కరచాలనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్‌కు ఇటీవల రాజీనామా చేసిన అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీజేపీలో చేరారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి కమలదళంలోకి ఆహ్వానించారు. అనంతరం గువ్వల మాట్లాడుతూ బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు తెలంగాణ ప్రజలను వంచిస్తూ దగాకోరు రాజకీయాలతో ముందుకు సాగుతున్నాయని ఆరోపించారు. ఆయా పార్టీలకు వ్యతిరేకంగా ప్రతి బీజేపీ కార్యకర్త గొప్పగా పోరాడుతున్నారని పేర్కొన్నారు. తనను అవకాశవాది అని విమర్శించేవారికి ఒకటే విషయం చెప్పదలుచుకున్నానని.. మళ్లీ ఎమ్మెల్యేనో, ఎంపీనో కావాలని బీజేపీలో చేరలేదని గువ్వల వివరణ ఇచ్చారు. నామినేటెడ్ పదవులనూ కోరుకోవట్లేదన్నారు. ఓ సామాన్య కార్యకర్తగా కొత్త జీవితం ప్రారంభిస్తున్నానని.. పార్టీ పెద్దల సలహాలు, సూచనలతో దేశ రక్షణ కోసం, రాష్ట్రాన్ని కాపాడేందుకు ఒక నిబద్ధతగల కార్యకర్తగా పని చేస్తానని తెలిపారు. బీజేపీ ఓ సామాజిక వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తుందని గతంలో భావించే వాడినని.. కానీ ఆ పార్టీని దగ్గరి నుంచి చూశాక అది కరుడుగట్టిన దేశభక్తితో కూడుకున్న పార్టీ అని తెలుసుకున్నానన్నారు.

బీజేపీకి ప్రజలు అవకాశం ఇవ్వాలి: రాంచందర్‌రావు

కుటుంబ పాలన, అవినీతితో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను విసిగిస్తే హామీలు నెరవేర్చకుండా ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని రాంచందర్‌రావు ఆరోపించారు. అందుకే తమ పార్టీకి పాలన అవకాశం కల్పించాలని ప్రజలను కోరుతున్నట్టు పేర్కొన్నారు. ఆగస్టు 18 తర్వాత రెండో విడత తన పర్యటన ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పాల్వాయి హరీశ్‌బాబు, అంజిరెడ్డి, ప్రేమేందర్ రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

26న యుద్ధనౌకలు జాతికి అంకితం



ఐఎన్‌ఎస్ ఉదయగిరి



ఐఎన్‌ఎస్ హిమగిరి

సాక్షి, విశాఖపట్నం: మన దేశంలోని రెండు షిప్‌యార్డుల్లో రూపుదిద్దుకున్న రెండు యుద్ధనౌకలు ఈ నెల 26న భారత నౌకాదళంలో చేరనున్నాయి. అత్యాధునిక ఫ్రంట్‌లైన్ స్టీల్ ఫ్రిగేట్ యుద్ధనౌకలు రెండింటిని జాతికి అంకితం చేసే కార్యక్రమం విశాఖపట్నం వేదికగా జరగనుంది. ముంబైలోని మజ్‌గావ్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)లో ఐఎన్‌ఎస్ ఉదయగిరి, కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్‌ఎస్‌ఈ)లో ఐఎన్‌ఎస్ హిమగిరి యుద్ధనౌకల్ని పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేశారు. ప్రాజెక్ట్–17లో భాగంగా వీటిని అత్యాధునిక సాంకేతికతతో నిర్మించారు. ఐఎన్‌ఎస్ ఉదయగిరి.. నేవీ వార్‌షిప్ డిజైన్ బ్యూరో రూపొందించిన 100వ షిప్ కావడం మరో విశేషం. దాదాపు 6,700 టన్నుల బరువున్న ఈ యుద్ధనౌకలు శివాలిక్–క్లాస్ ఫ్రిగేట్స్ కంటే దాదాపు ఐదుశాతం పెద్దవి. ఈ రెండింటి ఆయుధాల భాగంలో సూపర్‌సోనిక్ సర్ఫేస్–టు–సర్ఫేస్ క్షిపణులు, మీడియం రేంజ్ సర్ఫేస్–టు–ఎయిర్ క్షిపణులు, 76ఎంఎం ఎంఆర్ గన్స్‌తో పాటు యాంటీ–సబ్‌మెరైన్/అండర్‌వాటర్ వెపన్ సిస్టమ్స్ ఉన్నాయి. భారతీయ నౌకాదళ పటిష్టత, సత్తాని ప్రపంచానికి చాటిచెప్పే ఈ కార్యక్రమాన్ని తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రమైన విశాఖలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నేవీ అధికారులు తెలిపారు.

వాట్సాప్ గ్రూపుల్లో మెరిసిన 52 క్యారెట్ల వజ్రం!

ఎన్టీఆర్ జిల్లాలో హల్‌చల్



కంచికచర్ల (నందిగామ): ఎన్టీఆర్ జిల్లా, కంచికచర్ల మండలం, పరిటాలలో 52 క్యారెట్ల వజ్రం దొరికిందన్న వార్త ఆదివారం వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేసింది. దీని ప్రకారం– పరిటాల చెరువు వద్ద వజ్రాల వేటకు వచ్చిన ఓ వ్యక్తికి ఈ భారీ వజ్రం దొరికిందట. దీని విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.4 కోట్లు ఉంటుందని, కానీ సదరు వ్యక్తి రూ.2.20 కోట్లకే అమ్మేశాడని ప్రచారం జరిగింది. స్వాతంత్య్రం రాకముందు ఈ ప్రాంతం నిజాం నవాబుల పాలనలో ఉండేదని, అప్పట్లో వజ్రాలు, వైఢూర్యాలు ఇక్కడ విరివిగా లభించేవని ఇక్కడ వినిపిస్తుంటుంది. అయితే, తాజాగా వజ్రం దొరికిందన్న వార్త పూర్తిగా కల్పితమని, తమకు ఎటువంటి సమాచారం లేదని గ్రామస్తులు స్పష్టం చేస్తున్నారు. చెరువు కూడా ప్రస్తుతం నీటితో నిండిపోయి ఉండడంతో, వజ్రాల వేట అసాధ్యమని వారు చెబుతున్నారు.

కాంగ్రెస్‌కు అవినీతి గనిగా సింగరేణి

- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మళ్లీ రాజకీయ అవినీతి పెరిగింది
- హెచ్‌ఎంఎస్‌తో కలసి సింగరేణి జాగృతి పనిచేస్తుంది
- కార్మికులకు 37 శాతం బోనస్ ప్రకటించాలి
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి అవినీతి గనిగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఉద్యోగ నియామకాలతో పాటు అన్నింట్లో కాంగ్రెస్ పార్టీ అవినీతికి పాల్పడుతోందని ఆరోపించారు. జైపూర్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ అంచనా వ్యయాలను రాత్రికి రాత్రే అమాంతం పెంచారని దుయ్యబట్టారు. సింగరేణిని కాపాడాలన్న ఉద్దేశంతో కేసీఆర్.. సంస్థలో రాజకీయ అవినీతిని అంతం చేశారని, కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ రాజకీయ అవినీతి పెరిగిందని దుయ్యబట్టారు. కార్మికులకు భరోసా ఇవ్వడానికి త్వరలో సింగరేణి యాత్ర చేపడతామని ప్రకటించారు. ఆదివారం బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ జాగృతి అనుబంధ సంస్థ అయిన సింగరేణి జాగృతి, హెచ్‌ఎంఎస్ సంఘం కలిసి పనిచేయాలని నిర్ణయించారు. అనంతరం కవిత విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత సింగరేణిని కాపాడుకోవాలన్న కృతనిశ్చయంతో కేసీఆర్ ఎంతో కృషి చేశారని, ఇప్పుడు దాదాపు 40 వేల మంది ఉద్యోగులతో సింగరేణి కలకళలాడుతోందని అన్నారు. సింగరేణిలో భూగర్భ గనులను తెరవాలని డిమాండ్ చేశారు.

ఇచ్చేది తక్కువ.. పైగా పన్ను: సింగరేణి కార్మికులకు ప్రభుత్వం ఇచ్చేది చాలా తక్కువగా ఉంటుందని, పైగా జీతంపై ప్రధాని మోదీ ఆదాయపు పన్ను కూడా విధిస్తున్నారని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. సింగరేణి ఉద్యోగులకు ఆదాయపు పన్ను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 22 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఉన్నతస్థాయి కమిటీ చేసిన సిఫారసుల మేరకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత బోనస్ విషయంలో కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం వంచనకు గురి చేసిందని, లాభాల్లో 33 శాతం వాటా బోనస్‌గా ఇస్తున్నామని చెప్పి అసలు లాభాలనే తక్కువ చేసి చూపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికులకు ఈ ఏడాది దసరా బోనస్‌గా లాభాల్లో 37 శాతం వాటా ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. హెచ్‌ఎంఎస్ కార్మిక సంఘంతో కలసి సింగరేణి జాగృతి పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఈ కలయిక భవిష్యత్తులో అన్ని వామపక్ష పార్టీల అనుబంధ సంఘాల ఐక్యతకు దారితీస్తుందని చెప్పారు. కాగా, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘానికి (టీబీజీకేఎస్) తాను గౌరవ అధ్యక్షురాలిగా ఉన్నానని, కాబట్టి క్షేత్రస్థాయిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న ప్రతీ ఒక్కరు కలసి పనిచేయాల్సిందేనని పేర్కొన్నారు.

నేతలు పట్టించుకోక.. మరో దారి లేక

▶ మొదటి పేజీ తరువాయి

భార్యను మోసుకెళ్తుండగా మార్గమధ్యలోనే ఆమెకు పురిటినొప్పులు ఎక్కువై చెట్టు కింద ప్రసవించింది. సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలం మున్యానాయక్ తండాలో ఆదివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. శాంతినగర్ తండా పంచాయతీ పరిధిలోని మున్యానాయక్ తండాకు చెందిన కౌసల్యాబాయి (26)కి నెలలు నిండటంతో పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో ఆమె కుటుంబ సభ్యులు 108కి ఫోన్‌లో సమాచారం ఇవ్వగా అంబులెన్స్ 2 కి.మీ. దూరంలోని గురుసింగ్ తండా వరకు వచ్చి ఆగిపోయింది. ముందుకు వెళ్లేందుకు రోడ్డు లేకపోవడంతో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) సంగ్‌శెట్టి, అంబులెన్స్ డ్రైవర్ కాలినడకన గర్భిణి కోసం ఎదురు వెళ్లారు. అప్పటికే తండా నుంచి భర్త వాసుదేవ్, ఇతర కుటుంబ సభ్యులు కౌసల్యాబాయిని మోసుకొస్తుండగా నొప్పులు అధికమై మార్గమధ్యలో చెట్టుకింద ప్రసవించి ఆడపిల్లకు జన్మనిచ్చింది. కౌసల్యాబాయికి ఇది మూడవ కాన్పు. ఇప్పటికే కూతురు, కుమారుడు ఉన్నారు. బాలింతను అంబులెన్స్ ఆగిన గురుసింగ్ తండా వరకు ఈఎంటీ సంగ్‌శెట్టి మోసుకొచ్చాడు. అనంతరం అంబులెన్స్‌లో కరస్‌గుత్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారు. గర్భిణిని ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు తమ తండాకు రోడ్డు సౌకర్యం లేకపోవడంపై గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో విన్నవించినా పట్టించుకోలేదన్నారు. రాజకీయ నాయకులు ఓట్ల కోసం వస్తున్నారు తప్ప తమ బాగోగులు చూడటం లేదని మండిపడ్డారు.



చెట్టు కింద పసిబిడ్డతో మహిళలు



బాలింతను మోసుకొస్తున్న ఈఎంటీ సంగ్‌శెట్టి


క్లుప్తంగా...



విఖనసాచార్యుల సన్నిధికి మలయప్పస్వామి

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి ఆదివారం ఉత్తర మాడ వీధిలో గల శ్రీ విఖనసాచార్యుల సన్నిధికి వేంచేపు చేశారు. శ్రావణ పౌర్ణమి రోజున శ్రీ విఖనస మహర్షి జయంతి జరిగింది. ఆ మరుసటి రోజు స్వామి, అమ్మవార్లు శ్రీ విఖనసాచార్యుల సన్నిధికి వేంచేపు చేయడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీవారి ఆలయంలో వైఖానస ఆగమం ప్రకారం నిత్యకైంకర్యాలు, సేవలు, ఉత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా అక్కడ ఆస్థానం నిర్వహించి నివేదన చేశారు.

రాఘవేంద్ర స్వామికి పట్టువస్త్రాల సమర్పణ



మంత్రాలయం: శ్రీరాఘవేంద్రుల పూర్వారాధన సందర్భంగా తమిళనాడులోని శ్రీరంగపట్నం రంగనాథస్వామి ఆలయాధికారులు ఆదివారం పట్టువస్త్రాలను సమర్పించారు. మంత్రాలయంలోని టీటీడీ కల్యాణ మండపం నుంచి రాఘవేంద్రుడు మేళతాళాలతో శ్రీమఠం వరకు ఊరేగింపుగా వచ్చారు. అక్కడ పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు పట్టువస్త్రాలను స్వీకరించి రాఘవేంద్రుల బృందావనంలో విశేష పూజలు చేశారు.

నేటితో పీజీ ప్రవేశ పరీక్షల ముగింపు

- 15న ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ: పీజీ ప్రవేశ పరీక్షలు 11వ తేదీతో ముగియనున్నాయి. ఫలితాలను ఈ నెల 15న విడుదల చేయనున్నట్లు టీజీ పీజీఈటీ–2025 కన్వీనర్ పాండు రంగారెడ్డి తెలిపారు. తొలుత ఐదేళ్ల పీజీ ఇంటిగ్రేటెడ్ కోర్సుల ఫలితాలను విడుదల చేసి కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అందుకు సంబంధించి 12 సబ్జెక్టుల ప్రాథమిక కీని విడుదల చేసినట్లు తెలిపారు. కొన్నేళ్లుగా ఆలస్యమవుతున్న పీజీ కోర్సుల విద్యా సంవత్సరాన్ని సరిచేసేందుకు.. త్వరితగతిన ఫలితాలను విడుదల చేసి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

9955 బీఈడీ సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: ఎడ్‌సెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా తొలి దశలో ఆదివారం 9955 బీఈడీ సీట్లను కేటాయించారు. మొత్తం 14295 సీట్లు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు ఇచ్చిన ఆప్షన్లను బట్టి సీట్లు కేటాయించారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 14లోగా రిపోర్టు చేయాలని సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి సూచించారు.

వేతన సవరణ చేయక భారీ నష్టం: సీఐటీయూ

సాక్షి, హైదరాబాద్: కార్మికుల కనీస వేతన సవరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో చేయకపోవడంతో నెలకు సగటున రూ.6 వేల కోట్లు నష్టపోతున్నారని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతన సవరణ సలహా బోర్డు ఇప్పటికే సిఫార్సులు చేసినప్పటికీ.. నిర్ణయం తీసుకోవడంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని విమర్శించారు. ఒకవైపు కనీస వేతన సలహా మండలి కొనసాగుతున్న క్రమంలోనే.. ప్రత్యేకంగా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయడమంటే రాజ్యాంగబద్ధమైన బోర్డును అవమానపర్చినట్లేనని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే కనీస వేతన సవరణ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రస్థాయిలో ఉద్యమాలు చేపట్టేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు.

టీఎల్‌సీఎంఏ కార్యవర్గం



ఎస్.రమేశ్



పి.రవీందర్ రావు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ న్యాయ కళాశాలల యాజమాన్య సంఘం (టీఎల్‌సీఎంఏ) రాష్ట్ర నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షునిగా డాక్టర్ ఎస్.రమేశ్ (ఆరోరా లీగల్ సైన్సెస్ అకాడమీ), ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ పి.రవీందర్ రావు (కిమ్స్ లా కాలేజీ), ఉపాధ్యక్షులుగా జి.గోవర్ధన్ రెడ్డి (మహాత్మా లా కాలేజీ), పడాల శ్రీనివాస్ రెడ్డి (పీఆర్ఆర్ లా కాలేజీ), ట్రెజరర్‌గా డాక్టర్ బి.ఆర్.రాజు (వినాయక లా కాలేజీ)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రధాన కార్యదర్శి ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

పదేపదే యాడ్స్.. విసిగిస్తున్నాయ్..!



టీవీ చూస్తున్నప్పుడు ప్రకటనలు రావడం సహజం. మనం చూస్తున్న ఛానల్‌లో కొన్ని యాడ్స్ పదేపదే ప్రత్యక్షం అవుతుంటాయి. ఇలా ఒకే ఛానల్‌లో ఎక్కువసార్లు ప్రసారం కావడంతో ప్రేక్షకులు విసిగిపోతారు. సింపుల్‌గా ఛానల్ మారుస్తారు. ప్రకటన ప్రభావమేకాదు యాడ్స్‌పట్ల వీక్షకుడికి శ్రద్ధ కూడా తగ్గిపోతుంది. ఒక అధ్యయనం ప్రకారం పదేపదే వచ్చే ప్రకటనల కారణంగా 70% మంది భారతీయ వినియోగదారులు విసిగిపోతున్నారట. ఇలా యాడ్స్‌తో విసుగు చెందుతున్న వారి సంఖ్య శాతం పరంగా భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో నిలిచింది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

తరచూ ప్రకటనలపై 70% మంది మాట	కేబుల్ టీవీ, ఓటీటీ యాడ్స్‌పైనే విశ్వాసం	బ్రాండ్స్‌పై అవగాహనకు ఇవే ప్రధానం

చూస్తున్న ఛానల్‌లో పదేపదే ఒకే యాడ్ వస్తే సహజంగానే ఎవరికైనా విసుగొస్తుంది. ఇలా విసుగుచెందుతున్న వారి అంతర్జాతీయ సగటు 68 శాతం ఉందని యాడ్స్ టెక్నాలజీ కంపెనీ 'ది ట్రేడ్ డెస్క్' ఇటీవల నిర్వహించిన సర్వే వెల్లడించింది. ఇలా అత్యధికంగా విసుగు చెందినవారితో ప్రపంచంలో యూఎస్, ఆస్ట్రేలియా ముందు వరుసలో ఉన్నాయి. ప్రకటనలపట్ల నిరాసక్తత పెరుగుతున్న నేపథ్యంలో బ్రాండ్స్ వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని వ్యూహాలు అమలు చేయాల్సిన ఆవశ్యకతను నివేదిక వివరించింది.

ఐదుకుపైగా ఛానళ్ల వీక్షణం

కేబుల్ టీవీ, ఓటీటీ.. వేదిక ఏదైనా సినిమాలు, వెబ్ సిరీస్, సంగీతం, వార్తలు, గేమింగ్.. ఇలా విభిన్న మాధ్యమాల కోసం సగటున ఒక్కో వ్యక్తి రోజుకు 5.4 మీడియా ఛానళ్లను వీక్షిస్తున్నారట. ఇందుకు 9 గంటలు సమయం వెచ్చిస్తున్నారు. ఆడియోతో స్వల్ప, దీర్ఘకాలంలో ప్రకటనలు గుర్తుండిపోతున్నాయి. వినియోగదారులకు మరింత ప్రభావశీలమైన అనుభవాన్ని అందించగలిగితే.. ప్రకటన పట్ల ఉన్న విసుగును 2.2 రెట్లు తగ్గించడంతోపాటు ఉత్పాదన కొనుగోలు చేసేలా ఒప్పించే ప్రభావం 1.5 రెట్లు పెరుగుతుందని నివేదిక తెలిపింది.

కేబుల్ టీవీ, ఓటీటీలతో..

- బ్రాండ్స్ గురించి తెలుసుకోవడానికి కేబుల్ టీవీ, ఓటీటీలు ప్రధాన మాధ్యమాలుగా నిలిచాయి. వీటిద్వారా బ్రాండ్స్‌ను తెలుసుకున్నామని 73 శాతం భారతీయులు చెప్పారు. ఈ విషయంలో ప్రపంచ సగటు 51 శాతం మాత్రమే.
- ప్రకటనలతో కూడిన స్ట్రీమింగ్ సేవలను మనదేశంలో 72% మంది సబ్‌స్క్రైబ్ చేశారు. ఈ విషయంలో ప్రపంచ సగటు 42%.
- భారత్‌లో 18–34 ఏళ్ల వయసువారిలో 55% మంది ఒకే ప్లాట్‌ఫామ్‌పై కాకుండా ప్రీమియంగా భావించి కేబుల్ టీవీ, ఓటీటీల్లో ప్రకటనలు చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఐదు ఛానళ్లలో ప్రకటనలు ఇవ్వడం ద్వారా పెట్టుబడిపై రాబడి 77% పెరిగింది.

2 ఛానళ్లు	11%
3 ఛానళ్లు	33%
5 ఛానళ్లు	77%

ఒక్కో ఛానల్ పెరిగే కొద్దీ ప్రకటనలకు అయ్యే వ్యయం సగటు 30% తగ్గింది.

4 ఛానళ్లు	-7%
5 ఛానళ్లు	-53%

మూడు ఛానళ్లలో ప్రకటనలు వీక్షించడం ద్వారా కస్టమర్లలో.. ఆ ప్రకటనకు సంబంధించిన ఉత్పత్తిని కొనుగోలు చేయాలన్న ఆలోచన 1.7 రెట్లు పెరిగింది.

ఛానళ్లు	కొనాలన్న ఆలోచన
1	1.2%
2	1.3%
3	2%

ప్రకటనలు గుర్తుపెట్టుకుంటున్నారు

- వీక్షిస్తున్నప్పుడు కొత్త బ్రాండ్స్, సేవలు, ఉత్పత్తులను **73%** మంది గుర్తించారు.
- ఇతర మాధ్యమాలతో పోలిస్తే **66%** మంది కేబుల్ టీవీ, ఓటీటీ ప్రకటనలను విశ్వసిస్తున్నారు.
- కేబుల్ టీవీ, ఓటీటీల్లో ప్రకటనల్లో కనపడిన ఉత్పత్తులను **69%** మంది గుర్తు చేసుకుంటున్నారు.
- **47%** మంది.. పోస్టర్లు, బిల్‌బోర్డులు లాంటి డిజిటల్ అవుట్ ఆఫ్ హోమ్ (డీఓఓహెచ్) మీడియాను గుర్తిస్తున్నట్టు, అవి తమకు గుర్తుంటున్నాయని చెప్పారు.
- ప్రకటనలు వింటున్న **86%** సందర్భాలలో కస్టమర్లు మమేకం అవుతున్నారు.
- జెన్ జీ (1997-2012 మధ్య పుట్టినవారు)లో **75%** మ్యూజిక్ స్ట్రీమింగ్ ఇష్టపడుతున్నారు.

ఆర్టీసీకి 503 కొత్త బస్సులు



తుక్కుగా కోల్పోయేవాటి స్థానంలో కొనాలని నిర్ణయం

- రూ.195 కోట్లతో త్వరలో కొనుగోలుకు టెండర్లు
- వాటిలో ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగులే అధికం
- పల్లె వెలుగులుగా మరో 300 పాత సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్‌లు

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని మరిన్ని బస్సులు సమకూర్చుకునేందుకు తెలంగాణ ఆర్టీసీ (టీఎస్ఆర్టీసీ) కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా కొత్తగా 503 బస్సులు కొనాలని నిర్ణయించింది. నిర్ధారిత కిలోమీటర్ల దూరం తిరిగిన తర్వాత కొన్ని బస్సులను ఆర్టీసీ తుక్కుగా మారుస్తుంది. అలా ఏటా 400 వరకు బస్సులను కోల్పోతోంది. వాటి స్థానంలో కొత్త వాటిని సమకూర్చుకుంటుంది. ఇలా ఈ ఆర్థిక సంవత్సరానికి 503 బస్సులు కొనుగోలు చేయాలని తాజాగా నిర్ణయించింది. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళల ఉచిత ప్రయాణానికి అవకాశం ఉన్న కేటగిరీ సర్వీసులే వీటిలో అధికంగా ఉండనున్నాయి. కొత్త బస్సుల్లో 35 సూపర్ లగ్జరీ, 35 డీలక్స్, 5 రాజధాని సర్వీసులుంటాయి. మిగతా 428 బస్సులు ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు సర్వీసులు. వీటిలో హైదరాబాద్‌లో తిరిగే 185 మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు, జిల్లాల కోసం 150 ఎక్స్‌ప్రెస్ బస్సులు, మిగతావి పల్లె వెలుగు బస్సులు ఉండనున్నాయి.

రూ.195 కోట్లు అవసరం..

కొత్తగా కొనే 503 బస్సులకు రూ.195 కోట్లు అవసరమని ఆర్టీసీ అధికారులు తేల్చారు. ఆ మొత్తాన్ని రుణంగా పొందేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే గౌలిగూడ పాత బస్టాండు స్థలాన్ని పూచీకత్తుగా ఉంచి రూ.400 కోట్ల రుణాన్ని పొందిన ఆర్టీసీ, మరో స్థలాన్ని తనఖా పెట్టి ఈ మొత్తాన్ని రుణంగా తీసుకునే ప్రయత్నంలో ఉంది. త్వరలో ఆ పని పూర్తి చేసి బస్సుల కొనుగోలుకు టెండర్లు పిలవనుంది. గతంలో దూర ప్రాంతాలకు గరుడ ప్లస్ కేటగిరీలో స్కానియా, బెంజ్, ఓల్వో లాంటి విదేశీ కంపెనీల బస్సులను వినియోగించింది. వాటి నిర్వహణ భారంగా మారటంతో ఇకపై విదేశీ కంపెనీ బస్సులను కొనొద్దని నిర్ణయించారు. గరుడ కేటగిరీలో కూడా స్వదేశీ కంపెనీల బస్సులనే ఆర్టీసీ కొంటోంది. ఇప్పుడు కొత్తగా కొనేవాటిల్లో ఆ కేటగిరీ సర్వీసులు లేనప్పటికీ, త్వరలో వాటిని కూడా సమకూర్చుకోవాలని భావిస్తోంది. అప్పుడు స్థానిక కంపెనీల బస్సులనే కొనాలని భావిస్తోంది.

పల్లె వెలుగులుగా పాత బస్సులు

ప్రస్తుత డిమాండ్‌కు పల్లె వెలుగు బస్సులు ఏమాత్రం సరిపోవటం లేదు. రెండేళ్ల క్రితం 1,200 కొత్త బస్సులకు ఆర్డర్ ఇవ్వగా, ఇప్పటికే 800 వరకు వచ్చాయి. వీటిలో సింహభాగం సూపర్ లగ్జరీ కాగా, పల్లె వెలుగు సర్వీసులు ఆ తర్వాతి స్థానంలో ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా కొనేవాటిలో కొన్ని పల్లె వెలుగు ఉండనున్నాయి. ప్రస్తుతం సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ సర్వీసులుగా ఉన్న వాటిలో బాగా పాతబడిన 300 బస్సులను పల్లె వెలుగు సర్వీసులుగా మార్చి నడుపనున్నారు. దీంతో ఆ కేటగిరీలో కొత్తగా 393 బస్సులు పెరగనున్నాయి.



ఆదివారం హైదరాబాద్‌లో లార్వెన్ యాప్‌ను ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్

వైద్యరంగంలో 'జన ఔషధి' విప్లవాన్ని సృష్టించింది: గవర్నర్

ఉప్పల్: ప్రధాన్ మంత్రి భారతీయ జన ఔషధి పరియోజన (పీఎంబీజేపీ) అనేది బ్రాండ్ మెడిసన్‌కు హెల్త్ కేర్ నీడ్స్‌కు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు తీసుకున్న విప్లవాత్మకమైన చర్య అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన పీఎంబీజేపీతో లక్షలాది మంది భారతీయులకు తక్కువ ధరకే ఔషధాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఆదివారం ఉప్పల్ పారిశ్రామిక వాడలో పీఎంబీఐ లార్వెన్ జన ఔషధి పంపిణీ, మార్కెటింగ్ వేర్ హౌజ్ ప్రారంభోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, అందరికీ ఔషధాలు సరసమైన ధరలతో పాటు అన్ని ప్రాంతాల్లో అందుబాటులో ఉండే విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యమే నిజమైన సంపద అని మహాత్మాగాంధీ చెప్పినట్లుగానే ప్రధాని పీఎంబీజేపీని అందుబాటులోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. జనరిక్ మందులతో పౌరులకు వేల కోట్ల రూపాయల ఖర్చు ఆదా అవుతుందన్నారు. రాష్ట్రంలో జనఔషధి మందుల పంపిణీ బాధ్యతను తీసుకున్నందుకు లార్వెన్ గ్రూప్ నిర్వాహకులను ఆయన అభినందించారు.

ప్రధానిది పెద్దన్న పాత్ర: కిషన్‌రెడ్డి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ పెద్దన్న పాత్ర పోషిస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకే కాకుండా అన్ని వర్గాల ప్రజలకు మేలుచేసే విధంగా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని తెలంగాణలో ప్రవేశపెట్టిందని చెప్పారు. ఆ పథకాన్ని ముందుకు తీసుకువెళ్లడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కాలయాపన చేసిందని విమర్శించారు. ప్రజలకు మేలు చేకూర్చే ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, పైడి రాకేశ్, వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈడీ ముందుకు రానా దగ్గుబాటి



సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ కేసులో నటుడు రానా దగ్గుబాటి సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ముందు విచారణకు హాజరు కానున్నారు. షెడ్యూల్ ప్రకారం జూలై 23న ఆయన ఈడీ విచారణకు హాజరు కావాల్సి ఉండగా, షూటింగ్స్ కారణంగా సమయం కావాలని కోరారు. దీంతో ఆగస్టు 11న హాజరు కావాలని ఈడీ అధికారులు సూచించారు. ఈ కేసులో ఇప్పటికే జూలై 30న ప్రకాశ్‌రాజ్, ఈ నెల 6న విజయ్ దేవరకొండ ఈడీ ముందు హాజరయ్యారు. కాగా, షెడ్యూల్ ప్రకారం ఈనెల 13న మంచు లక్ష్మి విచారణకు హాజరు కావాల్సి ఉంది. మొత్తం 29 మందిని ఈసీఐఆర్‌లో చేర్చారు. మంచు లక్ష్మి విచారణ అనంతరం మరికొంత మంది సెలబ్రిటీలను ప్రశ్నించేందుకు ఈడీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కేంద్రంలో బీజేపీని గద్దె దించాలి: జాన్ వెస్లీ



వలిగొండ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు చట్టబద్ధత కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బీజేపీని గద్దె దించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి. జహంగీర్, మల్లు లక్ష్మి, రాష్ట్ర నాయకుడు జి.రాములుతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా, తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన బీసీ రిజర్వేషన్ బిల్లుపై వ్యతిరేకంగా మాట్లాడడం.. బీసీల పట్ల ఆ పార్టీకి ఉన్న చిత్తశుద్ధికి అద్దం పడుతోందన్నారు. తెలంగాణలో బీజేపీ నుంచి గెలిచిన 8 మంది ఎంపీలు పార్లమెంట్‌లో నోరు మెదకపోవడం దుర్మార్గమని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేది లేదంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ ఇటీవల మాట్లాడటం సిగ్గుమాలిన చర్య అని, వెంటనే బీసీలకు బండి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఇంజనీరింగ్‌లో మిగిలిపోయిన సీట్లు 11,638

- మొత్తంగా భర్తీ అయినవి 80,011 సీట్లు
- సివిల్, మెకానికల్‌లో 68 శాతమే భర్తీ
- 91 శాతం నిండిన కంప్యూటర్ కోర్సుల సీట్లు
- తుది విడత సీట్లు కేటాయించిన సాంకేతిక విద్యా విభాగం

సాక్షి, హైదరాబాద్: తుది దశ కౌన్సెలింగ్ పూర్తయినా ఇంజనీరింగ్‌లో ఇంకా 11,638 కన్వీనర్ కోటా సీట్లు మిగిలిపోయాయి. ఎప్పటిలాగే కంప్యూటర్ కోర్సులకు డిమాండ్ పెరిగింది. సివిల్, మెకానికల్, ఈఈఈ కోర్సుల్లోనే సీట్లు ఎక్కువగా మిగిలాయి. అయితే, గ్రామీణ ప్రాంతాలు, నాణ్యత లేని కాలేజీల్లో కంప్యూటర్ బ్రాంచీల్లో సీట్లకు ఆప్షన్లు తగ్గాయి. దీంతో ఈ కాలేజీల్లో 5,261 సీట్లు మిగిలిపోయాయి. తుది దశ కౌన్సెలింగ్‌లో భాగంగా సాంకేతిక విద్యా విభాగం ఆదివారం సీట్లు కేటాయించింది. ఈ దశలో 40,837 మంది 16,86,699 ఆప్షన్లు ఇచ్చారు. కన్వీనర్ కోటా కింద ప్రభుత్వ, ప్రైవేటు రంగానికి చెందిన మొత్తం 180 కాలేజీలు కౌన్సెలింగ్‌లో పాల్గొన్నాయి. మొత్తం 91,649 సీట్లు అందుబాటులో ఉన్నాయి. తుది దశ ముగిసే నాటికి 80,011 (87.3 శాతం) సీట్లు కేటాయించారు. ఇంకా 11,638 సీట్లు మిగిలిపోయాయి. 46 ప్రైవేటు, 5 యూనివర్సిటీల పరిధిలోని 51 కాలేజీల్లో వంద శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఈడబ్ల్యూఎస్ కోటా కింద 6,085 సీట్లు వచ్చాయి. ఈ విడతలో కొత్తగా విద్యార్థులు 4,720 మంది సీట్లు పొందారు. 20,028 మంది బ్రాంచీలు మార్చుకున్నారు. సీట్లు పొందినవారు ఈ నెల 13లోగా కాలేజీల్లో రిపోర్టు చేయాలని అధికారులు సూచించారు. ఈ నెల 18, 19 తేదీల్లో ఆన్‌లైన్ స్లైడింగ్ నిర్వహిస్తారు. దీని ద్వారా కాలేజీల్లో అంతర్గతంగా బ్రాంచీలు మార్చుకునే వెసులుబాటు ఉంటుంది. కంప్యూటర్, దాని అనుబంధ ఎమర్జింగ్ కోర్సుల్లో 65,080 సీట్లు ఉంటే, 59,819 (91.92 శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. ఎలక్ట్రానిక్స్, దాని అనుబంధ బ్రాంచీల్లో 17,754 సీట్లు ఉంటే, 14,118 (79.52 శాతం) భర్తీ అయ్యాయి. సివిల్, మెకానికల్ వాటి అనుబంధ బ్రాంచీల్లో 7,675 సీట్లు ఉంటే, 5,236 (68.22 శాతం) నిండాయి.

ప్రధాన బ్రాంచీల్లో సీట్ల కేటాయింపు

బ్రాంచీ	మొత్తం సీట్లు	భర్తీ	మిగిలినవి	భర్తీ శాతం
సీఎస్ఈ	30,678	28,787	1,891	93.84
ఐటీ	4,143	3,704	439	89.40
డేటాసైన్స్	8,318	7,424	894	89.25
సైబర్ సెక్యూరిటీ	1,861	1,811	50	97.31
సీఎస్ఈ (ఏఐఎంఎల్)	15,189	14,167	1,022	93.27
ఈసీఈ	12,193	10,225	1,968	83.86
ఈఈఈ	4,990	3,349	1,641	67.11
మెకానికల్	3,457	2,150	1,307	62.19
సివిల్	3,718	2,613	1,105	70.28

ట్రిపుల్ ఐటీలో రిపోర్టింగ్ తేదీలు విడుదల

- విద్యార్థితోపాటు ఒక పేరెంట్ లేదా గార్డియన్‌కి క్యాంపస్‌లోకి ప్రవేశం
- బాసర ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ వెల్లడి



బాసర: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) బాసర, మహబూబ్‌నగర్ క్యాంపస్‌లలో 2025–26 విద్యాసంవత్సరానికి కొత్తగా ఎంపికైన పీయూసీఐ విద్యార్థుల రిపోర్టింగ్ తేదీలను వర్సిటీ ఆదివారం ప్రకటించింది. బాసర యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ మాట్లాడుతూ.. పీయూసీఐ కొత్త విద్యార్థులు ఆర్జీయూకేటీలో చేరడం ద్వారా ఒక విశిష్టమైన విద్యా ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారని తెలిపారు.

రిపోర్టింగ్ తేదీలు..

విద్యార్థులు రిపోర్టింగ్ రోజున మధ్యాహ్నం 3:00 గంటలలోపు సంబంధిత క్యాంపస్‌లో హాజరు కావాలి. విద్యార్థితోపాటు ఒక పేరెంట్ లేదా గార్డియన్‌కి క్యాంపస్‌లోకి ప్రవేశం ఉంటుంది. సాయంత్రం 5 గంటలలోపు పేరెంట్స్ క్యాంపస్‌ను విడిచిపెట్టాలి. విద్యార్థి క్యాంపస్‌లోకి రిపోర్ట్ చేసిన తర్వాత, తిరిగి పేరెంట్స్‌తో వెళ్లడానికి అనుమతి ఉండదు.

బాసర క్యాంపస్ రిపోర్టింగ్ షెడ్యూల్

➤ బాలికలు: ఆగస్టు 11, 12. ➤ బాలురు: ఆగస్టు 12

చిరునామా: ఆర్జీయూకేటీ బాసర క్యాంపస్, బాసర, నిర్మల్ జిల్లా, తెలంగాణ – 504107. **ఫోన్ నంబర్:** 94923 08856

మహబూబ్‌నగర్ క్యాంపస్ రిపోర్టింగ్ షెడ్యూల్

➤ బాలురు, బాలికలు: ఆగస్టు 17


చిరునామా: ఆర్జీయూకేటీ మహబూబ్‌నగర్ క్యాంపస్, నియర్ రాజా బహదూర్‌రెడ్డి కన్వర్షన్ సెంటర్, మహబూబ్‌నగర్ – 509001

ఫోన్ నంబర్: 8106777797

హాస్టల్ కేటాయింపు..

హాస్టల్ కేటాయింపు, ఇతర ముఖ్యమైన సూచనలు విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్ www.rgukt.ac.inలో అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు వెబ్‌సైట్‌ను సందర్శించి అవసరమైన సమాచారాన్ని పొందవచ్చు.

దివ్యాంగ ఉద్యోగుల సమస్యలకు త్వరలో పరిష్కారం: మంత్రి అడ్లూరి



సాక్షి, హైదరాబాద్: దివ్యాంగ ఉద్యోగుల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు. సాధారణ బదిలీలు, పరిపాలన సంబంధిత ఉద్యోగుల బదిలీల్లో దివ్యాంగులకు మినహాయింపు ఇస్తూ.. జీవో 34 జారీ చేయడంతో వారికి భారీ ఊరట లభించినట్లైందని మంత్రి వ్యాఖ్యానించారు. వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్యతో పాటు వికలాంగ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు హబీబ్, లక్ష్మయ్య తదితరులు ఆదివారం మంత్రి అడ్లూరితో సమావేశమయ్యారు. జీవో 34 జారీపై హర్షం వ్యక్తం చేస్తూ.. మంత్రిని గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ఈ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివరించిన వెంటనే జీవో 34 జారీకి ఆదేశించారని తెలిపారు. తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రోజే వికలాంగ స్వయం సహాయక సంఘాలకు రూ.3.55 కోట్లు విడుదల చేశానని చెప్పారు. అదేవిధంగా దివ్యాంగులకు రాయితీ రుణాల కింద రూ.5 కోట్లు విడుదల చేశామన్నారు. గత ప్రభుత్వం దివ్యాంగుల అభివృద్ధికి పైసా ఖర్చు చేయలేదని, ఆ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే దివ్యాంగులకు కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలు అందకుండా పోయాయని పేర్కొన్నారు. అనంతరం ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ ఈనెల 16న అన్ని వికలాంగుల సంఘాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని మంత్రి అడ్లూరిని ఆహ్వానించారు.

ట్రాన్స్‌జెండర్లకు ఉచితంగా డిగ్రీ కోర్సులు

- అంబేడ్కర్ వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి



బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో సమాన అవకాశాల కల్పన ప్రణాళికలో భాగంగా రాష్ట్రంలోని ట్రాన్స్‌జెండర్లందరికీ ఉచితంగా డిగ్రీ కోర్సులను అందించనున్నట్లు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ. ఘంటా చక్రపాణి వెల్లడించారు. సమ్మిళిత విద్యలో ఇది ఒక అద్భుతమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. ట్రాన్స్‌జెండర్లకు ఇలాంటి అవకాశం కల్పించిన మొదటి విశ్వవిద్యాలయంగా బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ నిలవనుందని ఆయన పేర్కొన్నారు. 2025–26 విద్యా సంవత్సరం నుంచి ఈ పథకం కింద, 10+2 (ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన) విద్యార్హత కలిగిన ఏ ట్రాన్స్‌జెండర్ అయినా యూనివర్సిటీ అందించే డిగ్రీ కోర్సుల్లో దేనిలోనైనా చేరవచ్చన్నారు. నామమాత్రపు రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 500 చెల్లిస్తే సరిపోతుందన్నారు. వీరికి అన్ని ట్యూషన్ ఫీజులను మినహాయించాలని విశ్వవిద్యాలయం నిర్ణయించిందని వెల్లడించారు. ట్రాన్స్‌జెండర్ విద్యార్థులకు ఉచితంగా కోర్సు మెటీరియల్‌ను కూడా అందించనున్నామని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా ఏ అధ్యయన కేంద్రంలో అయినా అడ్మిషన్ పొందొచ్చని పేర్కొన్నారు.



ఆకులు రాల్చు కాలములు, మరియు చిగురించు కాలములు, జీవితంలో వస్తూనే ఉంటాయి. మనసు క్రమము(సమత) తప్పకపోతే, అనంతమైన ఆనందాన్ని అనుభవిస్తారు.
- ఎస్.ఎన్. గోయెంకా

సాక్షి
సోమవారం, 11 ఆగస్టు 2025

ఇది దేనికి సంకేతం?

శకునాలను భావి పరిణామాలకు సంకేతాలుగా భావిస్తారు. శకునాల మీద నమ్మకాలు పురాతన కాలం నుంచి ఉన్నాయి. ఈ నమ్మకాలు ఏ ఒక్క దేశానికో, మతానికో పరిమితమైనవి కావు. ప్రకృతిలో అనుకోని ఉత్పాతాలు సంభవిస్తే, వాటిని దుశ్శకునాలుగా భావిస్తారు. ఎలాంటి శకునాలకు ఎలాంటి ఫలితాలు సంభవిస్తాయో చెప్పే శకున శాస్త్రాలు కూడా ఉన్నాయి. శకునాలకు వ్యాఖ్యానాలు చెప్పి, భవిష్యత్తును అంచనా వేసే జ్యోతిషులు, కాలజ్ఞానులు కూడా ప్రపంచంలో ఉన్నారు. శకునాల మీద నమ్మకాలు పురాతన సమాజంలో ఎంతగా ఉండేవో, శకునాలన్నీ ఉత్తవేనని కొట్టిపారేసే హేతువాదులు పురాతన కాలం నుంచి ఉన్నారు. 'దేశ ప్రయోజనాల కోసం కత్తి దూసే యోధుడు శకునాన్ని చూసుకోడు' అన్నాడు గ్రీకు తత్త్వవేత్త, కవి హోమర్. క్రీస్తు పూర్వం ఎనిమిదో శతాబ్దికి చెందిన ఆయన ఆనాటి హేతువాదానికి ప్రతినిధి. శకునాల మీద నమ్మకాలు బలంగా ఉన్న ప్రాచీన సమాజంలోనే హేతువాదం కూడా పురుడు పోసుకుందనేందుకు హోమర్ మాటలే ఉదాహరణ. ఆనాటికీ ఈనాటికీ కాలం ఎంతో మారింది. ఆధునికత పెరిగింది. అన్ని రంగాల్లోనూ కృత్రిమ మేధ శరవేగంగా కమ్ముకొస్తోంది. అయినా ఇప్పటికీ శకునాలను పట్టించుకోని హేతువాదుల కంటే శకునాలను నమ్మేవారి సంఖ్యే ఎక్కువగా ఉంటోంది.

మన పురాణాలను చూసుకుంటే, శకునాల వర్ణన దాదాపుగా ఒకే తీరులో కనిపిస్తుంది. లోకకంటకులైన దుర్మార్గులు భూమ్మీద పుట్టినప్పుడు ఆకాశంలోని చుక్కలు తెగి రాలిపడటం; నక్కలు ఊళలు పెట్టడం; కుక్కలు మొరగడం; గాడిదలు ఓండ్రపెట్టడం; సముద్రాలు ఘూర్ణిల్లడం; తుపానులు చెలరేగడం వంటి ఉత్పాతాలు సంభవించేవి. దుర్యోధనుడు పుట్టినప్పుడు ఇలాంటి దుశ్శకునాలే కనిపించాయట! ఆపదలు ఎదురయ్యే ముందు దుశ్శకునాలు గోచరిస్తాయని చాలామంది నమ్ముతారు. రామ రావణ యుద్ధంలో రావణుడి కొడుకు మేఘనాదుడు లక్ష్మణుడి చేతిలో హతమయ్యాడు. చివరకు రావణుడే స్వయంగా రణరంగానికి బయలుదేరాడు. అప్పుడు నక్కలు ఊళలు పెట్టడం; గద్దలు రథం మీద గిరికీలు కొడుతూ తిరగడం; గుడ్లగూబలు వికృత రావాలు చేయడం; రథం మీది గొడుగు విరిగిపోవడం వంటి దుశ్శకునాలు ఎదురయ్యాయట! చివరకు ఆ యుద్ధంలో రావణుడు హతమైపోయాడు. రామాయణ, మహాభారతాలు సహా అనేక పురాణాల్లో ఉన్న ఇలాంటి కథల మూలంగా శకునాల మీద నమ్మకాలు జనాల్లో తరతరాలుగా నాటుకుపోయాయి. పురాణ కాలంలోనే శకున శాస్త్రాన్ని గర్గ మహాముని రాశాడట!

'స్మృతౌ శాస్త్రే వైద్యే శకున కవితాగాన ఫణితౌ/ పురాణే మంత్రే వా స్తుతి హాస్యే ష్వచతురః/ కథం రాజ్ఞాం ప్రీతిర్భవతి మయి కోహం పశుపతే/ పశుం మాం సర్వజ్ఞ ప్రథిత కృపయా పాలయ విభో' అని 'శివానంద లహరి'లో ఆదిశంకరాచార్యుడు అన్నాడు. అంటే, 'శాస్త్ర పాండిత్యం లేదు. వైద్యం చేతగాదు. శకున శాస్త్రం రాదు. కవిత్వం చెప్పలేను. సంగీతం రాదు. పురాణం చెప్పలేను. మంత్రాలెరుగను. ఆటపాటలలో నేర్పు లేదు. హాస్యం చెప్పలేను. ఇలాంటి సామాన్యుడినైన నా మీద రాజులకు ఎలా దయ కలుగుతుంది? వారిచ్చే ఫలాలు నాకేల? సర్వజ్ఞా! నన్ను నేనే ఎరుగని పశువును. నువ్వు పశుపతివి కదా! నన్ను నువ్వే దయతో కాపాడు' అని పరమశివుడిని వేడుకున్నాడు. ఈ శ్లోకంలోని పారమార్థిక తాత్పర్యం ఎలా ఉన్నా, ఆదిశంకరాచార్యుని కాలంలో రాజాశ్రయం పొందడానికి అవసరమైన కీలక విద్యలలో శకునశాస్త్రం కూడా ఒకటని మనకు అర్థమవుతుంది.

తాజాగా గలిలీ సముద్రంలోని నీరు నెత్తుటిలా ఎర్రబడింది. బైబిల్‌లో ప్రస్తావించిన ఈ సముద్రం అకస్మాత్తుగా ఎర్రబడటంపై అక్కడి జనాలు ప్రపంచానికి ఏ ముప్పు ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఏసుక్రీస్తు గలిలీ సముద్రం మీద నడిచి, తుఫాను శాంతింపజేశాడని; ఆ సముద్రం ఒడ్డునే తన శిష్యులకు అనేక బోధలు చేశాడని; ఐదువేల మందికి రొట్టెలు, చేపలతో ఆహారం పెట్టాడని బైబిల్ కథనం. ఇదిలా ఉంటే, బానిసలుగా ఉన్న ఇజ్రాయెలీలను విముక్తులను చేసేందుకు ఈజిప్టు ఫారో అంగీకరించనందుకు ఆగ్రహించిన భగవంతుడు అందుకు హెచ్చరికగా నైలునదీ జలాలను నెత్తుటిలా ఎర్రగా మార్చేశాడని పాత నిబంధన గ్రంథం చెబుతోంది. ఆ కథనమే ఇప్పటి ఆందోళనకు కారణం.

మన దేశ పరిస్థితులను చూసుకుంటే, ఏడున్నర దశాబ్దాలకు పైబడిన స్వతంత్ర భారత చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దొంగ ఓట్ల వ్యవహారంలో ఎన్నికల కమిషన్ నిండా బురదలో మునిగింది. ఒక హైకోర్టు న్యాయమూర్తి ఇంట నోట్ల కట్టలు దొరికిన ఉదంతం సుప్రీంకోర్టుకు చేరింది. రాజ్యాంగ వ్యవస్థలు ఇలా కళంకితం కావడం దేశానికి ఒక రకంగా దుశ్శకునాలు. ఇవి ఎలాంటి దుష్పరిణామాలకు సంకేతాలో కాలమే చెప్పాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, తిథి: బ.విదియ ప.11.41 వరకు, తదుపరి తదియ. నక్షత్రం: శతభిషం ప.3.08 వరకు, తదుపరి పూర్వాభాద్ర. వర్జ్యం: రా.9.18 నుండి 10.50 వరకు, దుర్ముహూర్తం: ప.12.29 నుండి 1.19 వరకు, తదుపరి ప.3.00 నుండి 3.50 వరకు. అమృత ఘడియలు: ఉ.8.00 నుండి 9.36 వరకు.

సూర్యోదయం : 5.45
సూర్యాస్తమయం: 6.26
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

సోషల్ టాక్

సుంకాలకు టూరిజంతో చెక్



ఇండియాకు అత్యధిక విదేశీ సంపాదన టూరిజం నుంచి రావొచ్చు. దీనిమీద ట్రంప్ సుంకాలు లేవు. అంతర్జాతీయ యాత్రికుల్లో కేవలం 1.5 శాతం వాటానే ఇండియా కలిగి ఉంది. దీనికోసం గట్టిగా గ్లోబల్ బ్రాండింగ్, మార్కెటింగ్ చేసుకోవాలి. లేదంటే ఇండియన్ ఎయిర్‌లైన్స్ కొంటున్న 1,800 విమానాలతో భారతీయులనే సెలవుల్లో విదేశాలకు పంపుతుంటాం. మనం కచ్చితంగా ప్రపంచ యాత్రికులను ఆకర్షించాలి. వస్తువుల మీద ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలను వాళ్లు సమం చేయగలరు.

- అమితాభ్ కాంత్, నీతీ ఆయోగ్ మాజీ సీఈఓ

రష్యా తర్వాతి లక్ష్యం బల్గేరియా?



ఒకవేళ ఉక్రెయిన్ పడిపోతే, భౌగోళిక స్థానాన్ని బట్టి తర్వాతిది బల్గేరియా అవుతుంది. ఇది కీలకమైన 'గ్లోబల్ చోక్ పాయింట్' (ఇరుకైన జల మార్గం; దీన్ని ఆపేస్తే రవాణా నిలిచిపోతుంది) అయిన నల్ల సముద్రానికి దగ్గరగా ఉంది. ముఖ్యంగా భాష, ఆర్థోడాక్సీల ఆవిర్భావానికి సంబంధించి 'మూడో రోమ్'గా నిలవాలన్న రష్యా సామ్రాజ్య వాదపు ఎజెండాకు బల్గేరియా ప్రాతినిధ్యం వహిస్తోంది.

- వెలీనా త్చకరోవా, స్ట్రేటజిస్ట్

దైవ భాష



సంస్కృతం అనేది కేవలం మరో మానవ భాష కాదు. అది గొప్ప రుషులు, యోగుల మాంత్రిక భాష. అది మన అత్యున్నత చేతనను శక్తిమంతం చేసి - భౌతిక, స్థలకాలాల, జనన మరణాలకు ఆవలి లోకాలతో, దేవుళ్లతో అనుసంధానిస్తుంది. అది పరమాత్ముడి భాష.

- డేవిడ్ ఫ్రాలే, వేదాచార్యుడు

చర్యకు బదులు స్పందన



మనం పోటీపై దృష్టి పెట్టినప్పుడు ప్రతి చర్యకు దిగుతాం. మనల్ని మనం మెరుగుపరచుకోవడంపై దృష్టి పెట్టినప్పుడు, లాభదాయకంగా ఆలోచిస్తాం.

- సైమన్ సినిక్, మోటివేషనల్ స్పీకర్

నిరంతర సాధన



నా అతిపెద్ద ప్రేరణ? నన్ను నేను సవాలు చేసుకుంటూ ఉండటమే. జీవితాన్ని నేను ఎప్పుడూ పట్టా సాధించలేని ఒక సుదీర్ఘ విశ్వవిద్యాలయ విద్యలాగా చూస్తాను. రోజూ నేను కొత్తగా ఏదో ఒకటి నేర్చుకుంటాను.

- రిచర్డ్ బ్రాన్సన్, బిజినెస్ మేగ్నెట్

గాజాను గాలికి వదిలేయడమేనా?

సందర్భం



ప్రొ॥ చందన గౌడ

'మొత్తం గాజాను ఇజ్రాయెల్ తన అదుపులోకి తీసుకుంటుంది –నెతన్యాహు ప్రకటన', 'గాజా నగరం మొత్తాన్ని గుప్పిట్లోకి తీసుకోనున్న ఇజ్రాయెల్' – గత రెండు రోజుల్లో పత్రికల్లో కనిపించిన ఈ శీర్షికలు చూసిన ఎవరైనా అడగవలసిన ప్రశ్నలు కొన్ని ఉన్నాయి. అవి: ఆ మాట అనడానికి ఆయనకు ఎంత ధైర్యం? ఆ పని చేసేందుకు ఇజ్రాయెల్‌కు ఉన్న హక్కేమిటి? కానీ, ఈ ప్రశ్నలను ఎవరూ అడిగినట్లు లేదు. కానీ, నేడు ప్రపంచంలో రాజ్యమేలుతున్న నైతిక పరిస్థితులు అలాంటి ప్రశ్నలు లేవనెత్తగల పరిధిని కుంచించివేశాయి. దాదాపు రెండేళ్ళ నుంచి పాలస్తీనా పౌరుల్ని ఇజ్రాయెల్ భయంకర హింసకు గురి చేస్తున్నా, సైనికంగా, ఆర్థికంగా శక్తిమంతమైన పాశ్చాత్య దేశాలు నిరోధించలేదు. పరిస్థితులు ఇంతవరకు రావడానికి అవే ప్రధాన కారణం.

ఇజ్రాయెల్ చేతిలో 60,000 మందికి పైగా పాలస్తీనియన్లు హతమైనా, అంతకు రెండింతల కన్నా ఎక్కువ మంది గాయపడినా ఉదార ప్రజాస్వామిక ఆదర్శాలను వల్లెవేసే ఈ దేశాలు చోద్యం చూశాయి. లేదా ఇజ్రాయెల్ చర్యలను ప్రోత్సహించాయి. అంతర్జాతీయంగా దేశాలు నాగరిక ప్రవర్తనను గాలి కొదిలేస్తే, ఆ యా దేశాలలోని సమాజాలలో ప్రజాస్వామిక విలువలే దెబ్బతింటాయి.

గాజాపై సైనికచర్యలో వినియోగించడానికి అవకాశమున్న ఆయుధాలను ఇజ్రాయెల్‌కు ఇవ్వడాన్ని నిలిపివేస్తామని జర్మనీ ప్రకటించింది. ఈ ఘర్షణలో జోక్యం చేసుకోకూడదని అమెరికా నిర్ణయించుకుంది. గాజా నగరంపై దాడికి దిగాలన్న ఇజ్రాయెల్ నిర్ణయంపై వివిధ దేశాల, అంతర్జాతీయ ఏజెన్సీల స్పందనలు అలా రకరకాల స్థాయుల్లో వ్యక్తమయ్యాయి. సైనిక హింసను వెంటనే నిలువరించేందుకు ఒక జీ7 లానో, జీ20 మాదిరిగానో ఏర్పడకుండా ఈ దేశాలకు అడ్డుపడిన అంశం ఏమిటి? పాలస్తీనా ప్రయోజనాలకు ఇండియా కొన్ని దశాబ్దాలుగా మద్దతు ఇస్తూ వస్తోంది. కానీ, మన దేశం కూడా ఇప్పటికీ అధికారిక స్పందనను వెల్లడించలేదు.

హమాస్ 2023 అక్టోబర్‌లో ఇజ్రాయెల్ పై దాడులకు దిగింది. దానికి ప్రతీకారంగా ఇజ్రాయెల్ 15 నెలలపాటు ఏకధాటిన పాలస్తీనాను పిండి చేసిన తర్వాత అమెరికా, ఖతార్, ఈజిప్టుల మధ్యవర్తిత్వంతో మూడు దశల కాల్పుల విరమణకు జనవరిలో ఇజ్రాయెల్, హమాస్ అంగీకరించాయి. కానీ, రెండు నెలలు గడిచాయో లేదో గాజా నగరంపై రాత్రిపూట వైమానిక దాడులకు ఇజ్రాయెల్ తెగబడింది. వాటిలో 400 మంది పాలస్తీనియన్లు మరణించారు.



గాజాలో హింసకు తాత్కాలికంగానైనా అడ్డుకట్టపడుతుందనే ఆశను కాల్పుల విరమణ ఒప్పందం కల్పించింది. ఆరు వారాల మొదటి దశలో – బందీలుగా పట్టుకున్న ఇజ్రాయెలీలను హమాస్ వదిలేయాలి. ప్రతిగా ఇజ్రాయెల్ జైళ్ళలో ఉన్న పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ విడుదల చేయాలి. గాజా నుంచి ఇజ్రాయెల్ సేనల ఉపసంహరణ మొదలవ్వాలి. నానా అగచాట్లు పడుతున్న పాలస్తీనియన్లకు మానవతా సహాయం పెరగాలి. రెండవ దశలో– ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఆపడంతో యువ బందీలు, ఖైదీల మార్పిడి సాఫీగా సాగాలి. మూడవ దశలో– బందీలు, ఖైదీల మృతదేహాల అప్పగింత అమలవ్వాలి. గాజా స్ట్రిప్ నుంచి ఇజ్రాయెల్ సేనల ఉపసంహరణతోపాటు, గాజాలో పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టాలి.

కానీ, కాల్పుల విరమణ ఒప్పందాన్ని పక్కనపెట్టిన ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తూ, పాలస్తీనియన్లను చంపుతూనే ఉంది. గాజాకు ఆహారం, దుస్తులు, ఆస్పత్రి సామగ్రితో సహా మానవతా దృష్టితో సాగుతున్న అంతర్జాతీయ సాయానికీ అడ్డుపడింది. గాజా నగరాన్ని హస్తగతం చేసుకోవాలన్న ఇజ్రాయెల్ నిర్ణయాన్ని హమాస్ చేతిలో ఇప్పటికీ బందీలుగా ఉన్నవారి కుటుంబాల వారు వ్యతిరేకిస్తున్నారు. దాడికి సంబంధించి ఇజ్రాయెల్ సైనిక ప్రణాళికలను ఈ ప్రతిఘటన ఆపుతుందో లేదో రాబోయే రోజుల్లో చూడాలి.

- గాజాలో అమానుష యుద్ధం ఆపాలని దేశదేశాల నుంచి ఒత్తిడి వస్తుంటే, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ మాత్రం గాజా నగరాన్ని చేజిక్కించుకొనే పనిలో పడ్డారు. ఆయన క్యాబినెట్ దానికి తగ్గట్టు తాజాగా ఆర్మీకి ఆదేశాలిచ్చింది.
- అవినీతితో పాటు అధికార సంకీర్ణంలో తీవ్రవాదులకు లబ్ధి కూర్చినట్టు ఆరోపణలను ఎదుర్కొంటున్న నెతన్యాహూ దేశప్రయోజనాల కన్నా స్వార్థానికే పెద్దపీట వేస్తున్నారు. సైనిక ఛీఫ్‌ల సూచనకూ, బందీల కుటుంబాలు, మెజారిటీ ఇజ్రాయెలీల అభీష్టానికీ వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు.


ఇజ్రాయెల్ సైనిక దాడులు మొదలైన తొలి నెలల్లో లక్షలాది మంది పాలస్తీనియన్లు గాజాను విడిచి వెళ్ళిపోయారు. వివిధ ప్రాంతాల్లో నిస్సహాయ పరిస్థితుల్లో తలదాచుకున్న పాలస్తీనియన్లు కాల్పుల విరమణ తర్వాత తిరిగి వచ్చారు. అప్పటికే వారి గృహాలు, వాడలు చాలా వరకు ధ్వంసమయ్యాయి. గాజాలో నివసిస్తున్న పది లక్షల మంది పాలస్తీనియన్లను, రానున్న వారాల్లో ఇజ్రాయెల్ సేనలు తరిమేస్తే, ఆ తర్వాత వారు తిరిగి వచ్చేందుకు, ఆ మాత్రం నగరం కూడా మిగిలి ఉండదు. రఫాకు పట్టిన గతే గాజాకూ పడుతుంది. హమాస్ సేనలను పట్టుకునేందుకు రఫాలో ఉన్న పది లక్షల మంది పౌరులను ఇజ్రాయెల్ ఖాళీ చేయించేసింది. ఇపుడు రఫా ఏ మాత్రం నివాసయోగ్యం కాని విధంగా నేలమట్టమై ఉంది.

గాజాలో పాలస్తీనియన్లు ఎదుర్కొంటున్న భీతావహ పరిస్థితుల్ని ఊహించుకోవచ్చు. అస్తిత్వానికే ముప్పు ఎదురవుతున్న ఈ సమయంలో వారి పట్ల మనం సానుభూతితో వ్యవహరించాలి. జాతిని తుదముట్టించే ప్రణాళికలు నిర్వహించకుండా ఇజ్రాయెలీలను ఆపే బాధ్యతను శక్తిమంతమైన దేశాలు భుజానికెత్తుకుంటాయా? అలా చేస్తే, అంతర్జాతీయ వ్యవస్థపై మళ్ళీ నమ్మకం నెలకొంటుంది. తాత్కాలిక విధానాలతోనే అన్నింటిని సద్దుపుచ్చే తత్వం నేడు ప్రపంచమంతటా కనిపిస్తోంది. ఆ జాడ్యం నుంచి దూరం జరిగేందుకు కూడా అది తోడ్పడవచ్చునని ఓ చిగురాశ!

వ్యాసకర్త డీన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్, విద్యాశిల్ప్ యూనివర్సిటీ
('దక్కన్ హెరాల్డ్' సౌజన్యంతో)

పంచాయతీల ఆధ్వర్యంతోనే పరిష్కారం

అభిప్రాయం



పి. వేణుగోపాల్ రెడ్డి

ఇటీవలి కాలంలో రాయితీ ధరలలో ఆహార ధాన్యాలను అందించటం మొదలు, ఆర్థిక సహాయం చేయడం వరకూ అనేక సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయి. బీద వర్గాల ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి చేపట్టిన ఈ పథకాల లబ్ధి చేరవలసినవారికి చేరకపోవడం ఇప్పుడొక ప్రధాన సమస్య. దీనికి వ్యవస్థీకృత అవినీతి, అధికారుల అసమర్థత, మధ్యవర్తుల దోపిడీ వంటివి కారణాలుగా నిలుస్తున్నాయి. గ్రామ పంచాయతీలకు (గ్రామ సభలకు) అధికారం ఇవ్వడం ద్వారా లబ్ధిదారుల గుర్తింపు, పంపిణీ ప్రక్రియను వికేంద్రీకరించడం, ఈ సమస్యలకు ఒక ఆశాజనకమైన పరిష్కారంగా చెప్పవచ్చు.

చాలా వరకూ సంక్షేమ పథకాలు కేంద్రీకృత డాటా అయినటువంటి దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) ఉన్నవారి జాబితాలు లేదా సామాజిక – ఆర్థిక కులగణన (ఎస్ఈసీసీ) సమాచారంపై ఆధారపడి ఉంటాయి. ఈ జాబితాలు తరచుగా కాలం చెల్లినవే ఉంటాయి. నకిలీ లేదా అర్హత లేని లబ్ధిదారులు వనరులను దోచుకుంటారు. అదే సమయంలో నిజమైన అర్హులు ఈ పథకాలకు దూరంగా ఉండిపోతారు. మధ్యవర్తులు తరచుగా స్థానిక అధికారులతో కుమ్మక్కై – చట్టంలోని లొసుగులు ఉపయోగించుకుని నిధులను మళ్లిస్తుంటారు. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ ఇండియా (2022) అధ్యయనం కనుగొన్న దాని ప్రకారం దాదాపు 30–40% సంక్షేమ నిధులు, లబ్ధిదారులకు చేరక మునుపే అవినీతికి గురవుతున్నాయి.

స్థానిక పరిపాలనలో అత్యంత ప్రాథమిక విభాగంగా, సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో గ్రామ పంచాయతీలు అనేక అవకాశాలను కలిగి ఉన్నాయి:



- గ్రామ పంచాయతీలకు సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుర్తింపు, నిధుల పంపిణీ అధికారాలను అధికారికంగా కేటాయించడానికి చట్టాలను సవరించాలి. నగదు నిర్వహణను తగ్గించడానికి ఆధార్ అనుసంధానిత డీబీటీని ఉపయోగించాలి.

ఎక్కడో దూరంగా ఉండే అధికారుల్లా కాకుండా, గ్రామ పంచాయతీ సభ్యులు, స్థానిక ప్రజలతో పాటుగానే జీవిస్తుంటారు. పంచాయతీలు పంపిణీని నిర్వహించగలిగినట్లయితే, గ్రామస్థులు నేరుగా ఈ ప్రక్రియను పర్యవేక్షించగలరు. సామాజిక ఆడిట్లు, గ్రామ సభ సమావేశాలు వంటి వాటి ద్వారా లబ్ధిదారుల జాబితాను బహిరంగంగా ధ్రువీకరించుకోవచ్చు.

కేరళలో 'కుటుంబశ్రీ' కార్యక్రమం కింద సబ్సిడీ ధరలలో ఆహార పంపిణీ, పెన్షన్ చెల్లింపుల వంటి సంక్షేమ పథకాలను మహిళల నేతృత్వంలోని పంచాయతీలు విజయవంతంగా నిర్వహించాయి. స్థానిక ప్రజల భాగస్వామ్యం, డిజిటల్ ట్రాకింగ్ కారణంగా అవినీతి బాగా తగ్గింది. గృహనిర్మాణం, ఆహార పథకాల కోసం లబ్ధిదారుల జాబితాలను 'పల్లి సభలు' (గ్రామ సమావేశాలు) ఆమోదించాలని ఒడిశా ఆదేశించింది. ఇది లక్ష్యాలను మెరుగుపరచడమే కాక మోసపూరిత క్లెయిమ్స్‌ను తగ్గించింది. అలాగే కొన్ని మహారాష్ట్ర పంచాయతీలు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) దుకాణాలను తమ అధీనంలోకి తీసుకున్నాయి. రేషన్ కార్డులు స్థానికంగా ధ్రువీకరించబడ్డాయని నిర్ధారించటం ద్వారా బ్లాక్ మార్కెటింగ్‌ను నివారిస్తున్నాయి.

పంచాయతీల నేతృత్వంలో సంక్షేమ పథకాల పంపిణీని సమర్థంగా నిర్వహించటానికి కొన్ని చర్యలను చేపట్టాలి. గ్రామ పంచాయతీలకు లబ్ధిదారుల గుర్తింపు, నిధుల పంపిణీ అధికారాలను అధికారికంగా కేటాయించడానికి చట్టాలను సవరించాలి. నగదు నిర్వహణను తగ్గించడానికి ఆధార్ అనుసంధానిత డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్)ని ఉపయోగించాలి. నిధుల విడుదలకు ముందు లబ్ధిదారుల జాబితాలకు బహిరంగ ధ్రువీకరణ తప్పనిసరి చేయాలి. పంచాయతీ సభ్యులకు ఆర్థిక నిర్వహణ, పారదర్శకత సాధనాలలో శిక్షణ ఇవ్వాలి. ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడానికి స్థానిక అంబుడ్స్‌మన్ కమిటీలను ఏర్పాటు చేయాలి.

రాజకీయ పక్షపాతం, పాలనాపరమైన బలహీనతల వంటి సవాళ్లు ఉన్నప్పటికీ, స్వచ్ఛమైన పాలనకు వికేంద్రీకరణ అత్యుత్తమమైన ఆచరణాత్మక పరిష్కారంగా నిలుస్తుంది. సంక్షేమ పథకాల అమలులో గ్రామ పంచాయతీలకే అధికారం, బాధ్యతలు ఇవ్వడానికి ప్రభుత్వాలు నడుంకట్టాలి.

వ్యాసకర్త ఏకలవ్య ఫౌండేషన్ స్థాపకుడు
ఈ–మెయిల్: pvg2020@gmail.com

'వేగుజుక్క' వారసుడు

ఇన్ బాక్స్

వివిధ రంగాల్లో ప్రతిభా విశేషాలు అపారంగా ఉన్నప్పటికీ సమాజంలో తగినంత గుర్తింపు లేక చాలామంది విస్మృతికి గురవుతుంటారు. కళింగాంధ్ర నవలా రచయిత 'గంధవరపు వెంకటరావు' ఈ కోవకు చెందినవారే. విజయనగరం జిల్లా, రాజాం పట్టణంలో జన్మించిన ఈయన తన 93వ యేట ఈ ఏడాది జూలై 22న కన్నుమూశారు. రచయితగా, ముద్రణాలయ నిర్వాహకునిగా, సమాజ సేవకునిగా ఆయన విశేష సేవలు అందించారు.



గంధవరపు వెంకటరావు

ఒకప్పుడు సాహితీ సమాజంలో విశేషంగా పేరుగాంచిన 'వేగుజుక్క ముద్రణాలయా'న్ని అనంతర కాలంలో ఈయనే నిర్వహించారు. 1910లో ప్రముఖ సాహిత్యవేత్త దేవరాజు వేంకట కృష్ణారావు వేగుజుక్క ముద్రణాలయాన్ని బరంపురం పట్టణంలో స్థాపించారు. 1911లో తాపీ ధర్మారావుతో కలిసి 'వేగుజుక్క గ్రంథమాల' అనే సంస్థను నెలకొల్పారు. 1914లో అదే వేగుజుక్క పేరు మీద ఓ పత్రిక కూడా నడిచేది. ఈ సంస్థ ఐదు దశాబ్దాల పాటు బరంపురంలో సేవలందించింది. ఈ సంస్థ నుంచే వేంకట కృష్ణారావు గారి 'వాడే వీడు' అనే అపరాధ పరిశోధక నవల ప్రచురించబడింది. ఇది మొట్టమొదటి తెలుగు అపరాధ పరిశోధక నవల. ఈ నవల శ్రీశ్రీకి అత్యంత ప్రియమైనది. ఇతర కవుల, రచయితల గ్రంథాలను కూడా 'వేగుజుక్క' పెద్ద యెత్తున ప్రచురించింది.

వెంకటరావు ముద్రణ, యంత్రాల నిర్వహణలో నిపుణులు. అందుకే వేగుజుక్క ముద్రణాలయంలో వెంకట కృష్ణారావు ఆయనకు ఉద్యోగమిచ్చారు. వారిద్దరి మధ్య మంచి సంబంధాలు వెల్లివిరిశాయి. ఈ క్రమంలో 1962లో వేంకట కృష్ణారావు వయోభారం రీత్యా తన ప్రియశిష్యుడైన వెంకటరావుకు నామమాత్రపు మొత్తానికి వేగుజుక్క ముద్రణాలయాన్ని అమ్మివేశారు. ఈ క్రమంలో ఆ ముద్రణాలయం బరంపురం నుండి రాజాంకి తరలించబడింది. 1969లో రాజాం ప్రాంతంలో 'శారదా రచయితల సమితి' స్థాపించబడింది. అందులోని సుమారు 20 మంది దాకా కవులు, రచయితలతో పాటు ఇతరుల రచనలూ ఆయన ముద్రించారు. ఈ ప్రాంత గ్రంథాల ముద్రణలో 'వేగుజుక్క' పాత్ర ఎనలేనిది. ఆ యా గ్రంథాలను వెంకటరావు స్వల్ప ధరకు ముద్రించే ఏర్పాటు చేసేవారు.

ఆయన గొప్ప సమాజ సేవకుడు. ఎందరో అనాథలను అభాగ్యులను ఆదుకున్నారు. కోట్ల విలువైన స్థలాన్ని నిరుపేదలకు ఇళ్ల స్థలాలుగా ఇచ్చారు. ప్రింటింగ్ ప్రెస్ సాంకేతికతను ఎందరో శిష్యులకు నేర్పి వారి బతుకు తెరువుకు బాసటగా నిలిచారు.


– పిల్లా తిరుపతిరావు,
ఉపాధ్యాయుడు, విజయనగరం జిల్లా
(గంధవరపు వెంకటరావుకు నివాళిగా)

సాక్షి ఎడిటోరియల్ పేజీ ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

భారతీయుల చూపు సౌదీ వైపు!

డేటా పాయింట్

భారతీయులు గల్ఫ్, ఆగ్నేయాసియా వంటి దేశాలకు ఉపాధి, ఉద్యోగాల కోసం వెళ్తుంటారు. ఇలా వెళ్లేవారికి ఎమిగ్రేషన్ చెక్ తప్పనిసరి (ఈసీఆర్). ఈ ఈసీఆర్ కేటగిరీలో బహ్రెయిన్, ఇండోనేషియా, ఇరాక్, కువైట్, మలేషియా, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), థాయ్‌లాండ్, సూడాన్ వంటి 18 దేశాలు ఉన్నాయి. 2020 జనవరి నుంచి 2025 జూన్ 30 వరకు ఈ దేశాలకు వెళ్లేందుకు 16,06,964 మందికి ఎమిగ్రేషన్ క్లియరెన్స్ ఇష్యూ చేసింది కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ.



మంచి మాట

జ్యోతిర్మయం

జీవితంలో సారవంతమైన సమయాల కంటే, నీరసంగా గడిచే ఘట్టాలే ఎక్కువ. అందుకే జీవితాన్ని 'సంసార కటు వృక్షం' అన్నారు. ఇదొక చేదు ఫలాల చెట్టు. ఎక్కువ ఫలాలు చేదు. కొన్ని మాత్రమే మధురం. జీవితంలో చేదు తగ్గించుకోవాలంటే, క్రోధం, ఈర్ష్య, నిస్సంతోషం, అసంతృప్తి, క్రూరత్వం లాంటి భావనలూ, భావోద్రేకాల రూపంలో ఉండే చేదు ఫలాలను వీలయినంతవరకూ ఏరి పారేసి, దూరంగా ఉంచాలి. లేకపోతే జీవితమంతా చేదవుతుంది. వీలయినంతవరకూ రుచికరమైన మధుర ఫలాలను కోసుకొని, భద్రపరచుకొని తనివారా ఆస్వాదించాలి.

ఈ సంసార విషవృక్షంలో శ్రమపడి వెతికితే అందరికీ అమృతతుల్యమైన మధుర ఫలాలు రెండు లభిస్తాయట. ఒకటి – సుభాషిత రసాస్వాదం, రెండు – సజ్జనులతో సాంగత్యం. మంచి మాటల తీయని రుచి చవిచూడ గలగటం, మనసుకు ప్రశాంతిని చేకూర్చగల మంచి మనుషుల సాహచర్యం చేయటం. పెద్దలు అనుభవంతో, మన మేలు కోరి చెప్పే సత్యాలూ, నీతులూ, మార్గదర్శకమైన మంచి మాటలూ విన్నప్పుడు ఆనందాన్నిస్తాయి. మననం చేసుకొంటే మదిని చల్లబరుస్తాయి. పట్టుదలతో, పూనికతో పాటించి చూస్తే, జీవితాన్ని చక్కదిద్ది సుఖమయం చేస్తాయి.

అలాగే, జీవితంలో మంచి మనుషుల సాహచర్యం, సాంగత్యం లభిస్తే, అంతకు మించిన అదృష్టం మరొకటి ఉండదు. సజ్జనుల సాంగత్యంలో, వాళ్ళ స్వభావమూ, నడతా, భావజాలమూ సాటివారిని ప్రభావితం చేసి, చక్కని వ్యక్తిత్వాన్ని వికసింపజేస్తాయి.

'కాపీ' పుస్తకంలో కుదురుగా ఉన్న దస్తూరీని అనుకరించటం అభ్యాసం చేస్తే, అభ్యాసం చేసిన వాళ్ళ చేతిరాత మెరుగయినట్టు, సజ్జనుల సాంగత్యంలో, వారి నీడలో నడిచే వారి నడత తిన్ననవుతుంది. అందుకే 'నీ స్నేహితులెవరో నాకు చెప్పు, నువ్వెలాంటి వాడివో నేను చెప్తాను' అన్న పాత సామెత ఎంతో అర్థవంతమైంది.

– ఎం. మారుతి శాస్త్రి

క్లుప్తంగా...

ఎస్‌పీఎఫ్ సిబ్బందికి పెట్రోలింగ్ వాహనాలు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులకు.. రాత్రి సమయంలో సైతం భద్రత కల్పించేందుకు ఎస్‌పీఎఫ్ సిబ్బందికి పెట్రోలింగ్ వాహనాలను ఏర్పాటు చేయనున్నట్లు ఈవో వెంకట్రావ్ తెలిపారు. యాదగిరి కొండపైన ప్రధాన కార్యాలయంలో ఆదివారం వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేవస్థానం పరిసర ప్రాంతాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాట్లు చేసేందుకు సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆలయ భద్రత సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించేందుకు అర్హత కలిగిన ఏజెన్సీల నుంచి టెండర్లు పిలవాలని సూచించారు. లీగల్ అండ్ లీజెస్ విభాగానికి సంబంధించి పలు టెండర్లపై చర్యలు తీసుకోవాలన్నారు.

డెంగ్యూతో బాలిక మృతి


యశస్విని

జోగిపేట(అందోల్): డెంగ్యూ వ్యాధితో బాలిక మృతి చెందింది. సంగారెడ్డి జిల్లా జోగిపేటలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. టెలికం శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగి కుమ్మరి భాస్కర్, మధుమతిల కూతురు యశస్విని (12).. జోగిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. బాలికకు 6 రోజుల క్రితం జ్వరం రాగా మూడు రోజుల పాటు.. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేయించారు. తగ్గక పోవడంతో సంగారెడ్డిలోని జిల్లా కేంద్రం ఆస్పత్రికి తరలించారు. డెంగ్యూ వ్యాధి తో బాధపడుతున్న యశస్విని పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం 4 గంటల సమయంలో మృతి చెందింది.

పురుగు మందు పిచికారీతో ఒకరి మృతి!

- మరొకరి పరిస్థితి విషమం


సిద్ధూ

గుండాల: పత్తి చేనులో పురుగుల మందు పిచికారీ చేసిన ఇద్దరు వ్యక్తులు అస్వస్థతకు గురయ్యారు. ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో ఆదివారం ఈ ఘటన జరిగింది. ఆళ్లపల్లి పోలీసుల కథనం ప్రకారం.. గుండాల మండలం కాచనపల్లి గ్రామానికి చెందిన సంపంగి సిద్ధూ (17) ఈనెల 8వ తేదీన రైతు ఓర్స మహేశ్ పత్తి చేనులో పురుగుల మందు పిచికారీ చేసేందుకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చాక సిద్ధూ వాంతులు చేసుకోగా స్థానిక ఆర్‌ఎంపీ వద్ద ప్రథమ చికిత్స అందించారు. శనివారం మళ్లీ వాంతులు కావడంతో ఇల్లెందు తరలించి మరో ఆర్‌ఎంపీ వద్ద వైద్యం అందించారు. అప్పటికే మహేశ్ సైతం వాంతులు చేసుకున్నాడు. అతనికి కూడా అక్కడే వైద్యం అందించారు. ఆదివారం తెల్లవారు జామున సిద్ధూ ఆరోగ్యం క్షీణించడంతో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మహేశ్‌ను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అతని పరిస్థితి విషమంగానే ఉంది. అయితే పురుగుల మందు పిచికారీ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో అస్వస్థతకు గురై చనిపోయాడా? ఇల్లెందు ఆర్‌ఎంపీ సరైన వైద్యం అందించక చనిపోయాడా..అని మృతుడి తండ్రి చిన్న వెంకన్న అనుమానం వ్యక్తం చేశాడు. ఆళ్లపల్లి ఎస్సై సోమేశ్వర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆమెకు 30.. అతనికి 19!

- జూన్‌లో ప్రేమ వివాహం
- భర్త వేధింపులతో ఆత్మహత్య

కాటారం: ఆమె వయసు 30.. అతని వయసు 19. ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నారు. ఇంతలోనే భర్తతో పాటు అతని కుటుంబ సభ్యుల వేధింపులు తాళలేక ఆమె ఆత్మహత్య చేసుకుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో జరిగిన ఈ సంఘటనపై ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం అంగరాజ్‌పల్లికి చెందిన దుర్గం సరళ (30).. అదే గ్రామానికి చెందిన 19 ఏళ్ల జాడి రాజేశ్ గత జూన్‌లో ప్రేమ వివాహం చేసుకున్నారు. బతుకుదెరువు నిమిత్తం కాటారం మండల కేంద్రానికి వచ్చి ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. రాజేశ్ తల్లిదండ్రులు జాడి లక్ష్మి, శంకర్, కుటుంబ సభ్యులు తిరుపతి, గౌరుకు ఈ వివాహం ఇష్టం లేదు. ఈక్రమంలో రాజేశ్‌ను కుటుంబ సభ్యులు ఉసిగొల్పడంతో.. సరళను మానసికంగా, శారీరకంగా హింసించడం మొదలుపెట్టాడు. భర్త వేధింపులు తట్టుకోలేక సరళ శనివారం అర్ధరాత్రి ఉరే సుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుడు దుర్గం లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మన ఆదాయం పెరిగింది!

సగానికి తగ్గిన అల్ప ఆదాయ దేశాల సంఖ్య

రెండింతలకుపైగా పెరిగిన సంపన్న దేశాలు

- వెల్లడించిన ప్రపంచ బ్యాంక్ 1987–2024 లెక్కలు
- 2007లో 'దిగువ మధ్య ఆదాయ దేశం'గా భారత్
- అంతవరకు 'అల్పాదాయ దేశాల' జాబితాలో..

కాలం వేగంగా పరుగెడుతోంది. అందుకు తగ్గట్టుగా సాంకేతికంగానే కాదు, ఆర్థికంగానూ మార్పులను చూస్తున్నాం. ప్రజల జీవన ప్రమాణాలు చాలా మెరుగయ్యాయి. సగటు ఆదాయాలూ పెరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 1987లో అల్పాదాయ దేశాలు 49 ఉంటే.. 2024 నాటికి ఈ సంఖ్య దాదాపు సగానికి వచ్చిందంటే అభివృద్ధి దిశగా ఏ స్థాయిలో మార్పులొచ్చాయో అర్థం చేసుకోవచ్చు.

– సాక్షి, స్పెషల్ డెస్క్



మనదేశం గత 20 ఏళ్ల కాలంలో విశేష పురోగతి సాధించింది. ప్రపంచ బ్యాంకు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. ఒకప్పుడు అల్పాదాయ దేశాల జాబితాలో ఉన్న మనదేశం.. 2007లోనే దిగువ మధ్య ఆదాయ దేశంగా అవతరించడం విశేషం. 1987లో అల్పాదాయ దేశాల జాబితాలో ఉన్న దక్షిణాసియాలోని ఆరు దేశాల్లో 2024 నాటికి అయిదు దేశాలు దిగువ మధ్య దేశాల జాబితాలోకి, ఒకటి ఎగువ మధ్య దేశాల జాబితాలోకీ చేరాయి. 37 ఏళ్లలో అల్పాదాయ దేశాల సంఖ్య సగానికి పడిపోవడం ప్రజల ఆదాయాల పెరుగుదల తీరుతెన్నులకు అద్దం పడుతోంది. ఇక ఎగువ మధ్య తరగతి దేశాలు 28 నుంచి 54కు చేరాయి. అధిక ఆదాయ దేశాల సంఖ్య 41 నుంచి రెండింతలకుపైగా దూసుకెళ్లి 87 అయ్యాయి.


తగ్గిన పేదలు..: 2004–24 మధ్య ఎగువ మధ్య ఆదాయ గ్రూప్ దేశాల జనాభా 8.9 నుంచి 34.7%కి ఎగబాకడం గమనార్హం. 2004లో అల్పాదాయ గ్రూప్ దేశాల్లో నివసించిన జనాభా 37.4% ఉండగా.. రెండు దశాబ్దాల్లో ఇది 7.6%కి దిగొచ్చింది. అయితే యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలు ఆదాయాల్లో ఒక మెట్టు దిగేలా చేస్తాయనడానికి సిరియా, యెమెన్ ఉదాహరణ. 2017లో తక్కువ–మధ్య ఆదాయ గ్రూప్ నుంచి ఇవి అల్పాదాయ గ్రూప్‌నకు వచ్చాయి.

నాలుగు గ్రూపులుగా..: ప్రపంచంలోని దేశాలను.. ప్రపంచ బ్యాంకు ఏటా తలసరి స్థూల జాతీయ ఆదాయం (జీఎన్‌ఐ) ఆధారంగా అల్ప, దిగువ–మధ్య, ఎగువ–మధ్య, అధిక–ఆదాయ దేశాలుగా వర్గీకరిస్తోంది. 2025–26 (2025 జూలై–2026 జూన్) సంవత్సరానికిగాను ప్రపంచవ్యాప్తంగా 216 దేశాల జాబితా విడుదల చేసింది. తలసరి జీఎన్‌ఐ అనేది విదేశీ సంపాదనతో సహా ఏదైనా దేశంలోని జనాభా సగటు ఆదాయానికి కొలమానం. రాయితీ రుణాలకు ఏ దేశాలు అర్హమైనవో నిర్ణయించడానికి సగటు ఆదాయాలను ప్రపంచ బ్యాంకు పరిగణనలోకి తీసుకుంటోంది.

గ్రూప్	వ్యక్తుల తలసరి ఆదాయం (డాలర్లలో)
అల్పాదాయం	1,135 లోపు
దిగువ మధ్య	1,136-4,495
ఎగువ మధ్య	4,496-13,935
అధిక ఆదాయం	13,936 ఆపైన

1987తో పోలిస్తే 2024 నాటికి గ్రూప్‌వారీగా మారిన దేశాల సంఖ్య

గ్రూప్	1987	2024
అల్పాదాయం	49	25
దిగువ మధ్య	45	50
ఎగువ మధ్య	28	54
అధిక ఆదాయం	41	87



యూరప్, మధ్య ఆసియా: 1987–2024 మధ్య తక్కువ ఆదాయ దేశం ఒక్కటీ లేదు. అధిక ఆదాయ దేశాల శాతం 71 నుంచి 69కి తగ్గింది.

తూర్పు ఆసియా, పసిఫిక్: 1987లో 26% దేశాలు తక్కువ ఆదాయ గ్రూప్‌లో ఉండగా.. 2024 నాటికి కేవలం 3%కి తగ్గాయి.

లాటిన్ అమెరికా, కరేబియన్: తక్కువ ఆదాయ దేశాలు 2 నుండి సున్నాకి వచ్చాయి. అధిక ఆదాయ దేశాలు 9% నుంచి 46%కి పెరిగాయి.

మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా: తక్కువ ఆదాయ దేశాలు 2 నుండి 3కి పెరిగాయి. అధిక ఆదాయ దేశాలు 35%కి చేరాయి.

సబ్–సహారన్ ఆఫ్రికా: తక్కువ ఆదాయ దేశాలు 75% నుండి 45%కి తగ్గాయి. ఒక దేశం అధిక ఆదాయ గ్రూప్‌లో చేరింది.

ఖనిజాల వేలం కాసులు రాల్చేనా?

- తొలి దశలో మైనర్ మినరల్స్ ద్వారా రూ.56 కోట్ల ఆదాయం
- రెండో విడతలో 34 బ్లాకుల కోసం కొనసాగుతున్న వేలం ప్రక్రియ
- మొదటి దశలో వేలానికి ముందే అటవీ, పర్యావరణ అనుమతులు
- రెండో దశలో బ్లాకులు దక్కించుకున్న వారిపైనే అనుమతుల భారం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 34 చిన్న తరహా ఖనిజాల బ్లాకుల కోసం క్వారీ లీజులు మంజూరు చేసేందుకు గనులు, భూగర్భ వనరుల శాఖ రెండోవిడత వేలానికి సిద్ధమవుతోంది. ఈ బ్లాకులకు సంబంధించి గత నెల 17న నోటిఫికేషన్ విడుదల కాగా, ఈ నెల 14 నుంచి 22వ తేదీల నడుమ వేలం వేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈనెల 25 నాటికి ఖనిజ బ్లాకుల క్వారీల వేలం పూర్తవుతుందని గనులు, భూగర్భ శాఖ ప్రకటించింది. బిల్డింగ్ స్టోన్స్, రోడ్ మెటల్, రఫ్ స్టోన్స్, మెటల్, గ్రావెల్, లేటరైట్, బ్లాక్ గ్రానైట్, కలర్ గ్రానైట్, మొజాయిక్ చిప్ బ్లాకులు వేలం వేయనున్నారు. 2015 ఖనిజ వేలం నియమావళిని అనుసరించి తొలివిడతలో ఈ ఏడాది ఏప్రిల్‌లో గనులు, భూగర్భ శాఖ సుమారు 75 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న 256 మినరల్ బ్లాక్‌లకు వేలం వేసింది. 19 బ్లాక్‌ల ద్వారా రాష్ట్ర ఖజానాకు రూ.56 కోట్లు ఆదాయం సమకూరింది. ప్రస్తుతం రెండో దశలో 34 మినరల్ బ్లాకుల వేలం జరగనుండటంతో ప్రభుత్వ ఖజానాకు సమకూరే ఆదాయంపై ఆసక్తి నెలకొంది. అయితే తొలి విడతతో పోలిస్తే రెండో విడతలో బ్లాకుల వేలానికి పెద్దగా స్పందన వచ్చే అవకాశం లేదని గనుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

పర్యావరణ అనుమతులే కీలకం

తొలివిడత ఖనిజ బ్లాకుల వేలానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని అటవీ, పర్యావరణ అనుమతులు సాధించి తెచ్చింది. రెండో విడతలో 34 చిన్న తరహా ఖనిజ బ్లాకులు వేలం ద్వారా పొందే లీజుదారులు అటవీ, పర్యావరణ అనుమతులు సొంతంగా సాధించుకోవాల్సి ఉంటుంది. అనుమతుల భారం లీజుదారులపైనే ఉండటంతో వేలంలో పాల్గొనేందుకు ఔత్సాహికులు వెనుకంజ వేస్తున్నట్టు గనుల శాఖ వర్గాలు చెబుతున్నాయి. 5 హెక్టార్లకు పైబడిన విస్తీర్ణంలో ఉన్న బ్లాకులను వేలం ద్వారా పొందేవారు రాష్ట్ర అటవీ శాఖ అనుమతులు పొందాలనే టెండరు నిబంధన విధించారు. అనుమతుల కోసం వెళ్లే లీజుదారులకు పర్యావరణ, అటవీ శాఖల నుంచి అనేక అభ్యంతరాలు, సవాళ్లు ఎదురవుతున్నాయి. మరోవైపు ఖనిజాల మైనింగ్‌ను వ్యతిరేకిస్తున్న పర్యావరణ పరిరక్షణ సంస్థలు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వంటి సంస్థలను ఆశ్రయిస్తే వేలంలో బ్లాకులను దక్కించుకున్నా ముందుకు సాగే అవకాశముండదనే అభిప్రాయం ఔత్సాహికుల్లో నెలకొంది. ప్రభుత్వమే చొరవ తీసుకొని అటవీ, పర్యావరణ అనుమతులు ఇప్పిస్తేనే వేలంలో పాల్గొంటామని చెబుతున్నారు.

సున్నపురాయి గనుల్లోనూ..!

సూర్యాపేట జిల్లా పసుపుల బోడులో సున్నపురాయి గనుల తవ్వకానికి లీజు మంజూరు కోసం గత ఏడాది అక్టోబర్‌లో మూడు బ్లాక్‌లను గనుల శాఖ వేలం వేసింది. వేలంలో ఈ బ్లాకులను దక్కించుకున్న లీజు దారులు కూడా పర్యావరణ, అటవీ అనుమతులు సాధించడంలో అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నట్లు మైనింగ్ అధికారులు చెబుతున్నారు. పసుపులబోడు గనుల లీజు పొందిన వారికి పూర్తిస్థాయిలో అనుమతులు వచ్చేందుకు ఐదు నుంచి ఏడేళ్ల కాలం పట్టే అవకాశముందని అంచనా వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వమే అన్ని అనుమతులు సాధించిన తర్వాత ఖనిజ బ్లాకుల వేలం ప్రక్రియను కొనసాగించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

సాగర్ 8 గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు

నాగార్జునసాగర్: సాగర్ జలాశయం గరిష్ఠ స్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువన ఉన్న జలాశయాలన్నీ నిండుకుండలా ఉన్నాయి. దీంతో అదనంగా వచ్చే నీటిని వచ్చినట్లే దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువనగల శ్రీశైలం జలాశయానికి 1,97,188 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం గరిష్ఠ స్థాయి నీటి మట్టం 885.00 అడుగులు (215.8070 టీఎంసీలు). ప్రస్తుతం ఇక్కడ 880.60 అడుగుల (191.2118 టీఎంసీలు) నీటి మట్టం ఉంది. సాగర్ జలాశయం గరిష్ఠ స్థాయి నీటిమట్టం 590.00 అడుగులుకాగా, ఆదివారం ఉదయం 5 గంటలకు 590 అడుగులకు చేరడంతో తొలుత రెండు గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 16,200 క్యూసెక్కుల నీటిని దిగువ కృష్ణానదిలోకి విడుదల చేశారు. విద్యుదుత్పాదనతో కలిపి 44,985 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇటీవల స్థానికంగా కురిసిన వర్షాలకు వాగులు, వంకల ద్వారా జలాశయంలోకి భారీగా నీరు చేరి, మధ్యాహ్నం ఒంటి గంటకు నీటిమట్టం గరిష్ఠ స్థాయిని మించి పెరుగుతుండటంతో నాలుగు గేట్లు ఎత్తి స్పిల్‌వేమీదుగా దిగువ కృష్ణానదిలోకి 32,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. విద్యుదుత్పాదనతో కలిసి 77,250 క్యూసెక్కులు వదిలారు. ఆ తర్వాత కూడా జలాశయం నీటిమట్టం అంతకంతకు పెరుగుతుండటంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు 8 రేడియల్ క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువ కృష్ణానదిలోకి స్పిల్‌వే మీదుగా 64,800 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా 29,070 క్యూసెక్కులు మొత్తం 93,870 క్యూసెక్కులను దిగువ కృష్ణానదిలోకి విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ, వరదకాల్వలు, ఏఎమ్మార్పీ కాల్వలకు 15,082 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

సాగర్ కాల్వకు భారీ గండి


సాగర్ కాలువకు పడిన గండి

వేంసూరు: నాగార్జునసాగర్ కెనాల్‌కు భారీ గండి పడటంతో.. 20 ఎకరాల్లోని పంటలు నీట మునిగాయి. ఖమ్మం జిల్లా వేంసూరు మండల పరిధిలోని కుంచపర్తి హెడ్ రెగ్యులేటర్ వద్ద ఎగువ నుంచి సాగర్ జలాలు వస్తున్నా.. ఐబీ అధికారులు గేట్లు తెరవకపోవడంతో 15 మీటర్ల మేర గండి పడింది. ఆదివారం తెల్లవారుజామున పొలాల వద్దకు వెళ్లిన రైతులు గండిని చూసి ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. ఆ తర్వాత చేరుకున్న అధికారులు కల్లూరు, లంకాసాగర్ వద్ద గేట్లను మూసివేసి.. నీరు దిగువకు రాకుండా చర్యలు చేపట్టారు. ఎగువ నుంచి నీటి ఉధృతి తగ్గడంతో పాటు ఏపీకి వెళ్లే గేట్లు తెరవడంతో.. మునిగిన పంటల నుంచి నీరు సాగర్ కెనాల్‌కు చేరుతోంది.

పైపైకి పాతాళ గంగ..

▶ మొదటి పేజీ తరువాయి

కావడం గమనార్హం. రాష్ట్ర భూగర్భ జలవనరుల శాఖ జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో భూగర్భ జలాల స్థితిగతులను పరిశీలించి తాజాగా రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడించింది. భూగర్భ జలవనరుల శాఖ రాష్ట్రంలోని 33 జిల్లాల పరిధిలోని అన్ని మండలాల్లో ఏర్పాటు చేసిన 1,771 పీజోమీటర్ల ద్వారా భూగర్భ జలాల స్థితిగతులను ప్రతి నెలా సమీక్షించి, తర్వాతి నెలలో నివేదికలను విడుదల చేస్తూ ఉంటుంది.

మెదక్ జిల్లాలో 14.16 మీటర్ల లోతుకు..

ఈ సీజన్‌లో కృష్ణానది పరీవాహకంలో విస్తారంగా వర్షాలు కురవడంతో జలవనరుల్లో పుష్కలంగా నీరు చేరింది. దీంతో పరీవాహకం పరిధిలోని ప్రాంతాల్లో భూగర్భ జలాలు గణనీయంగా వృద్ధి చెందాయి. మరోవైపు గోదావరి పరీవాహకంలో వర్షాభావం నెలకొని ఉండటంతో అక్కడి కొన్ని జిల్లాల్లో భూగర్భ జలాలు జూన్‌తో పోలిస్తే జూలైలో మరింతగా దిగజారాయి. గోదావరి పరీవాహక పరిధిలోని మెదక్ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా 14.16 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. కాగా, ఖమ్మం జిల్లాలో 3.87 మీటర్ల లోతులోనే భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలోని జిల్లాలను సగటు భూగర్భ జలమట్టం 0–5 మీటర్లు, 5–10 మీటర్లు, 10 మీటర్లపైన లోతు.. అనే మూడు కేటగిరీలుగా వర్గీకరిస్తారు. భూగర్భ జలాలు 0– 5 మీటర్లలోపు లోతులో ఉంటే సురక్షిత స్థాయిలో ఉన్నట్టు భావిస్తారు. రాష్ట్రంలో మొత్తం 33 జిల్లాలుండగా, 4 జిల్లాల్లో 0–5 మీటర్ల లోతులోనే భూగర్భ జలమట్టం ఉందని గుర్తించారు. 19 జిల్లాల్లో 5–10 మీటర్ల లోతులో, 10 జిల్లాల్లో 10–15 మీటర్ల లోతులో భూగర్భ జలాలున్నట్టు తేలింది. 10 మీటర్లకన్నా లోతుకు భూగర్భ జలాలు పడిపోయిన జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టుగా భావిస్తారు.



431 మండలాల్లో మెరుగుదల

రాష్ట్రంలో మొత్తం 621 మండలాలు ఉండగా, దశాబ్దకాల సగటుతో పోలిస్తే.. గత జూన్ నెలలో 431 మండలాల్లో (79శాతం) 0.1 నుంచి 16.37 మీటర్ల వరకు భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. మిగిలిన 190 మండలాల్లో (21శాతం) 0.02 నుంచి 18 మీటర్ల వరకు భూగర్భ జలమట్టం పతనం అయిందని గణాంకాలు చెపుతున్నాయి.

సాధారణంతో పోలిస్తే వర్షపాతం తక్కువే..

జూలైలో రాష్ట్ర వార్షిక సగటు వర్షపాతం 358 మి.మీ.లు కాగా, 2025 జూన్‌లో 342 మి.మీ.ల సగటు వర్షపాతమే నమోదైంది. అంటే సాధారణం కంటే 4 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని స్పష్టమవుతోంది.

హైదరాబాద్‌లో భారీగా వృద్ధి..

హైదరాబాద్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో భారీగా భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. 2024 జూన్‌తో పోలిస్తే 2025 జూన్‌లో రాష్ట్రంలోని 15 జిల్లాల్లో భూగర్భ జలమట్టాల్లో వృద్ధి నమోదు కాగా, మరో 18 జిల్లాల్లో క్షీణత కనిపించింది. గత ఏడాది జూలైలో రాష్ట్ర సగటు భూగర్భ జలాల లోతు 8.25 మీటర్లుకాగా.. ఈ ఏడాది జూలైలో 8.37 మీటర్లుగా నమోదైంది. అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో 2.71 మీటర్లు, అత్యల్పంగా మెదక్ జిల్లాలో 0.03 మీటర్ల వృద్ధి నమోదైంది.

మూడో యూనిట్ పునరుద్ధరణ

- జూరాల హైడల్ పవర్ ప్రాజెక్టులో మూసుకుపోయిన బ్లాక్‌లు
- కర్ణాటక నుంచి భారీ క్రేన్లు రప్పించి మరమ్మతులు


జూరాల డ్యాంపై 3వ యూనిట్ బ్లాక్‌ను క్రేన్‌తో సరిచేస్తున్న అధికారులు

అమరచింత: ప్రియదర్శిని జూరాల హైడల్ పవర్ ప్రాజెక్టులో రెండేళ్ల క్రితం మరమ్మతులకు గురైన మూడో యూనిట్‌ను అధికారులు ఆదివారం పునరుద్ధరించారు. మూడో యూనిట్ మరమ్మతులు పూర్తవడంతో.. జల విద్యుదుత్పత్తి చేపట్టేందుకు సిద్ధమయ్యారు. మూడో యూనిట్ బ్లాక్‌లను ఎత్తే సమయంలో బ్లాక్‌లు బురదలో కూరుకుపోవడంతో.. జెన్‌కో అధికారులు కర్ణాటక రాష్ట్రం నుంచి హైస్పీడ్ పవర్ గల రెండు భారీ క్రేన్లను రప్పించారు. ఈ క్రమంలోనే ప్రాజెక్టు రహదారిపై రాకపోకలను నిలిపివేసి తెల్లవారుజామున 5 గంటలకు క్రేన్ల సహాయంతో మూసుకుపోయిన బ్లాక్‌లను పైకి ఎత్తి యథాతథ స్థానంలో అమర్చారు. ఈ క్రమంలో ఉదయం 8 గంటల వరకు మరమ్మతులు పూర్తయ్యాయి. అప్పటి వరకు రాకపోకలు నిలిపివేయడంతో భారీగా వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఈ విషయమై జెన్‌కో డీఈ పవన్‌కుమార్ స్పందిస్తూ.. రెండేళ్ల క్రితం పాడైన 3వ యూనిట్ మరమ్మతులు పూర్తి చేసి పునరుద్ధరించామన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల గోల్‌మాల్

- ఒకరి పేరుతో వచ్చిన చెక్కులు మరొకరికి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు
- ముగ్గురిని అరెస్టు చేసిన కోదాడ పోలీసులు

కోదాడ: కొద్దిరోజుల కిందట సూర్యాపేట జిల్లా కోదాడ కేంద్రంగా కల్యాణలక్ష్మి చెక్కుల కుంభకోణం బయటపడగా తాజాగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల కుంభకోణం వెలుగు చూసింది. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను కొంత మంది ముఠాగా ఏర్పడి పక్కదారి పట్టించారు. గత ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న ఈ వ్యవహారం తాజాగా వెలుగు చూసింది. ఈ వ్యవహారంలో నాటి ప్రజాప్రతినిధికి వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసిన వ్యక్తితో పాటు మునగాల మండలానికి చెందిన మరో వ్యక్తి, రాష్ట్ర సచివాలయంలో పని చేస్తున్న మరో ఉద్యోగి ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. బాధితులు కోదాడ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని కొంత మందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో తెలంగాణకు చెందిన వ్యక్తికి మంజూరైన ఓ చెక్కును ఆంధ్రాప్రాంతానికి చెందిన వ్యక్తి మార్చుకున్నట్లు వెల్లడైంది. ప్రస్తుతం ఒక బాధితుడికి మంజూరైన లక్షా యాభైవేల రూపాయల చెక్కు వ్యవహారం బయట పడగా ఇలాంటి చెక్కులు దాదాపు 50 వరకు ఉంటాయని, దాదాపు కోటిరూపాయలు పక్కదారి పట్టించి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఏమి జరిగిందంటే..

కోదాడ నియోజకవర్గ పరిధిలోని వాయిలసింగారం గ్రామానికి చెందిన గడ్డె వెంకటేశ్వరరావు అనారోగ్యానికి గురయ్యారు. ఆయన హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని.. నిరుపేద కావడంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు 2023లో దరఖాస్తు చేసుకున్నారు. ఆయనకు లక్షా యాభైవేల రూపాయలు మంజూరయ్యాయి. చెక్కును కూడా ప్రభుత్వం అప్పటి ఎమ్మెల్యే కార్యాలయానికి పంపింది. కానీ ఎమ్మెల్యే కార్యాలయంలో పని చేస్తున్న వ్యక్తిగత కార్యదర్శి బాధితుడికి ఈ చెక్కును ఇవ్వకుండా గడ్డం వెంకటేశ్వరరావు అనే మరో వ్యక్తికి ఇచ్చి దానిని ఏపీలోని జగ్గయ్యపేటలో మార్చుకున్నారు. అనంతరం ఆ డబ్బును ముఠాగా ఏర్పడిన వ్యక్తులు పంచుకున్నట్లు సమాచారం. తాను దరఖాస్తు చేసుకున్నప్పటికీ చెక్కు రాకపోవడంతో అనుమానం వచ్చిన బాధితుడు దీనిపై విచారణ చేయగా చెక్కును జగ్గయ్యపేటలో మార్చుకున్నట్లు తేలడంతో కోదాడ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కుంభకోణం ఎలా చేశారంటే..

బాధితులు సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే ముఠా సభ్యులు అదే పేరుతో ఉన్న వ్యక్తులను స్థానికంగా వెతికి పట్టుకునేవారు. చెక్కులపై ఇంటిపేరు పూర్తిగా కాకుండా ఇంగ్లిష్ అక్షరాల్లో వస్తుండటంతో నిందితులు దీన్ని తమకు అనుకూలంగా మార్చుకున్నట్లు తెలిసింది. చెక్కుల మీద బ్యాంక్ అకౌంట్ నంబర్ బాధితులది కాకుండా తాము ఎంపిక చేసిన వ్యక్తుల అకౌంట్ నంబర్ వచ్చే విధంగా హైదరాబాద్ సచివాలయంలో పనిచేసే వ్యక్తి సాయంతో తారుమారు చేసేవారని సమాచారం. కాగా, దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి కూడా ఆదేశించారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కోదాడ పట్టణ సీఐ కె.శివశంకర్ తెలిపారు.

తల్లి మందలిస్తుందేమోనని..

- పురుగు మందు తాగిన కూతురు

రామారెడ్డి: తల్లి మందలిస్తుందేమోనన్న భయంతో ఆమె కుమార్తె ఆత్మహత్యాయత్నం చేసింది. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం స్కూల్ తండా పంచాయతీ పరిధిలోని వాసురాం తండాలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. రాట్ల అవంతి స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. ఆమె తండ్రి రెడ్డి గతేడాది అనారోగ్యంతో మరణించాడు. తండ్రి ఫొటోను ఇంట్లో పెట్టుకొని రోజూ దీపం వెలిగిస్తుంటారు. ఆదివారం కూడా దీపం వెలిగించారు. కాగా, దీపాన్ని అవంతి కొద్దిగా ఎక్కువ చేయడంతో.. మంట ఎక్కువై తండ్రి ఫొటో కాలిపోయింది. తల్లి వచ్చి మందలిస్తుందేమోనని భయపడిన అవంతి.. ఇంట్లోని పురుగు మందును తాగింది. కింద పడిపోయిన అవంతిని ఇరుగుపొరుగు వారు చూసి కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడినుంచి నిజామాబాద్‌కు తరలించారు.

మృతప్రాయ ఆర్థిక వ్యవస్థ కాదు.. మూడో స్థానానికి ఎదుగుతున్నాం

- 11 ఏళ్లలో పదో స్థానం నుంచి ఐదో స్థానానికి చేరుకున్నాం
- మూడో స్థానానికి చేరడం ఇక ఎంతోదూరంలో లేదు
- స్పష్టమైన ఉద్దేశాలు, నిజాయితీగల ప్రయత్నాలతో ముందుకెళ్తున్నాం
- బెంగళూరు పర్యటనలో ప్రధాని స్పష్టీకరణ
- డొనాల్డ్ ట్రంప్ 'డెడ్ ఎకానమీ' వ్యాఖ్యలను తిప్పికొట్టిన మోదీ



సాక్షి, బెంగళూరు: భారతదేశ ఆర్థిక వ్యవస్థ మృతప్రాయంగా మారిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ప్రధాని నరేంద్ర మోదీ గట్టిగా తిప్పికొట్టారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారే దిశగా భారత్ పరుగులు తీస్తోందని తేల్చిచెప్పారు. స్పష్టమైన ఉద్దేశాలు, నిజాయితీగల ప్రయత్నాలతో ముందుకెళ్తున్నామని వివరించారు. మన ఆర్థిక వ్యవస్థలో వేగానికి 'సంస్కరణ, పనితీరు, మార్పు' చోదక శక్తిగా పని చేస్తున్నాయని వెల్లడించారు. 11 ఏళ్ల క్రితం ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ పదో స్థానంలో ఉండేదని, ఇప్పుడు ఐదో స్థానానికి చేరుకుందని గుర్తుచేశారు. మూడో స్థానానికి ఎగబాకడం ఇక ఎంతో దూరంలో లేదన్నారు. ప్రధాని మోదీ ఆదివారం కర్ణాటక రాజధాని బెంగళూరులో పర్యటించారు. బెంగళూరు మెట్రోరైలు నెట్‌వర్క్‌కు సంబంధించిన 'ఎల్లో లైన్'ను ప్రారంభించారు. ఆర్.వి.రోడ్ నుంచి ఎల్రక్టానిక్ సిటీ వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సంభాషించారు. బెంగళూరు మెట్రోరైల్ ప్రాజెక్టు మూడో దశకు(ఆరెంజ్ లైన్) మోదీ శంకుస్థాపన చేశారు. అలాగే మూడు వందే భారత్ రైళ్లను పచ్చజెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు. 2014లో ఇండియాలో మెట్రో రైలు వ్యవస్థ కేవలం ఐదు నగరాల్లోనే ఉండేదని, ప్రస్తుతం 24 నగరాల్లో అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. ఈ వ్యవస్థ వెయ్యి కిలోమీటర్లకు విస్తరించిందని తెలియజేశారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద మెట్రో రైలు నెట్‌వర్క్ మన దేశంలోనే ఉందన్నారు. ప్రధానమంత్రి ఇంకా ఏం మాట్లాడారంటే...

పట్టణ ప్రణాళిక అత్యంత కీలకం

''దేశంలో 2014 కంటే ముందు కేవలం 20 వేల కిలోమీటర్ల రైలు మార్గం విద్యుదీకరణ జరిగింది. గత 11 ఏళ్లలో 40 వేల కిలోమీటర్లకు పైగా విద్యుదీకరణ పూర్తిచేశాం. 2014లో దేశంలో కేవలం 74 ఎయిర్‌పోర్టులు ఉండేవి, ఇప్పుడు వాటి సంఖ్య 160కి చేరింది. 2014లో జాతీయ జలరహదారులు కేవలం మూడు ఉండగా, ప్రస్తుతం అవి 30కి చేరుకున్నాయి. మన నగరాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెంది, ప్రభావంతంగా మారితేనే మన దేశం ప్రగతి పథంలో సాగుతుంది, ప్రజలకు మేలు జరుగుతుంది. అందుకే నగరాల్లో అధునిక మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. 21వ శతాబ్దంలో పట్టణ ప్రణాళిక, పట్టణ మౌలిక సదుపాయాలు అత్యంత కీలకం. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మన నగరాలు, పట్టణాలను తీర్చిదిద్దుకోవాలి. నవ భారత్ ఎదుగుదలకు బెంగళూరు ఒక ప్రతీక. ఆధ్యాత్మిక జ్ఞానం, సాంకేతిక విజ్ఞానం బెంగళూరు ఆత్మలో మిళితమయ్యాయి.



వందే భారత్ రైలులో చిన్నారితో ప్రధాని మోదీ ముచ్చట్లు

'సిందూర్' విజయం వెనుక సాంకేతికత 'మేక్ ఇన్ ఇండియా'

ఆపరేషన్ సిందూర్ విజయం వెనుక భారతీయ సాంకేతికత, 'మేక్ ఇన్ ఇండియా' ఉన్నాయి. మన దేశంపైకి ఉగ్రవాదులను ఏగదోసిన పాకిస్తాన్‌ను కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే మోకాళ్లపై నిల్చోబెట్టాం. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారతదేశంలో కొత్త ముఖాన్ని ప్రపంచం తొలిసారిగా దర్శించింది. పాకిస్తాన్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి ఉగ్రవాద శిక్షణ శిబిరాలను, వైమానిక స్థావరాలను ధ్వంసం చేశాం, మన శక్తి సామర్థ్యాలను ప్రదర్శించాం. దేశీయ సాంకేతిక పరిజ్ఞానంతోపాటు 'మేక్ ఇన్ ఇండియా' బలం మనకు విజయం చేకూర్చిపెట్టాయి. ఆపరేషన్ సిందూర్‌లో బెంగళూరుతోపాటు ఇక్కడి యువత కీలక పాత్ర పోషించారు. ప్రపంచంలో అతిపెద్ద నగరాల్లో ఒకటిగా బెంగళూరు గుర్తింపు పొందడం సంతోషంగా ఉంది. మనదేశం ప్రపంచంతో పోటీ పడడమే కాకుండా, ప్రపంచాన్ని స్వయంగా ముందుకు నడిపిస్తోంది'' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

పాక్‌కు చెక్ పెట్టాం

'సిందూరం'తో చదరంగం ఆడాం

- ప్రత్యర్థి తదుపరి అడుగు తెలియదు కదా!
- ఇది సంప్రదాయ ఆపరేషన్ కాదు
- ముప్పు తొలగిపోయినట్లు ఇప్పుడే నిర్ణయానికి రావొద్దు
- శత్రువు ఈసారి ఒంటరిగా రాకపోవచ్చు
- అన్నింటికీ సన్నద్ధంగా ఉండాల్సిందే
- ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది


సాక్షి, చెన్నై: పాకిస్తాన్‌పై భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది సంప్రదాయ ఆపరేషన్ కాదని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను చందరంగంతో పోల్చారు. చందరంగం ఆటలో ప్రత్యర్థి వేయబోయే తదుపరి అడుగు మనకు తెలియదని చెప్పారు. ఎక్కువ రోజులు జరగాల్సిన టెస్టు మ్యాచ్ కొన్నిసార్లు నాలుగు రోజుల్లోనే ముగిసిపోతుందని వ్యాఖ్యానించారు. విజయం గురించి ప్రజలకు అర్థమయ్యేలా చెప్పగల సామర్థ్యం కూడా ముఖ్యమేనని తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో విజయం ఎవరిది? అని పాకిస్తాన్‌ను అడిగితే సమాధానం మరోలా వస్తుందన్నారు. తామే గెలిచామని, అందుకే అసిమ్ మునీర్ ఫీల్డ్ మార్షల్‌గా పదోన్నతి పొందాడని పాకిస్తాన్ అధికారులు చెబుతారని వ్యాఖ్యానించారు. విజయమో, అపజయమో పాకిస్తాన్ మనస్సాక్షికే తెలుసన్నారు. ఈ నెల 4వ తేదీన ఐఐటీ–మద్రాసులో జరిగిన ఓ కార్యక్రమంలో జనరల్ ఉపేంద్ర ద్వివేది ప్రసంగించారు. తాజాగా ఈ వీడియోను సైనిక వర్గాలు సోషల్ మీడియాలో షేర్ చేశాయి. ఉపేంద్ర ద్వివేది ప్రసంగం ఆయన మాటల్లోనే...

ఇది ఆరంభం మాత్రమే

''ముప్పు తొలగిపోయినట్లు ఇప్పుడే నిర్ణయానికి రావొద్దు. మరోసారి దాడి జరిగితే దాని తీవ్రత అధికంగా ఉండొచ్చు. శత్రుదేశం మనపై ఒంటరిగా దాడి చేయొచ్చు లేక మరొకరి సాయం తీసుకోవచ్చు. ఏం జరుగుతుందో మనకు తెలియదు. శత్రువు ఒంటరిగా మనపై యుద్ధానికి వస్తుందని అనుకోవడం లేదు. అందుకే మనం చాలా అప్రమత్తంగా ఉండాలి. ఆపరేషన్ సిందూర్ అనేది ప్రారంభం మాత్రమే. వేగవంతమైన, నిరంతరం మార్పు చెందుతున్న కాలంలో మనం జీవిస్తున్నాం.శాంతి కోసం మనమంతా కలసికట్టుగా ప్రయాణం చేయాలి.

1400 రోజులు కూడా జరగొచ్చు

గ్రే జోన్ ఎప్పటికీ ఉంటుందన్న సంగతి గుర్తుంచుకోవాలి. త్వరలోనే మరో యుద్ధం జరగొచ్చు. అందుకు తగ్గట్టుగా మనం సిద్ధం కావాలి. శత్రువు ఒక్కడే వస్తాడని అనుకోవద్దు. గుంపుగానూ రావొచ్చు. యుద్ధం చేసే బాధ్యత సైన్యానికే వదిలేయొద్దు. ప్రజలంతా ఇందులో పాలుపంచుకోవాలి. పలుదేశాలతో మనకు సరిహద్దు వివాదాలున్నాయి. ఆ దేశాలన్నీ ఒక్కటై మనపై యుద్ధానికి రాలేవని చెప్పలేం. ఆపరేషన్ సిందూర్ టెస్టు మ్యాచ్ నాలుగు రోజుల్లో ముగిసిపోయింది. ఈసారి 14 రోజులు లేదా 140 రోజులు లేదా 1400 రోజులు కూడా జరగొచ్చు. ఎన్నిరోజులు జరిగినా ఎదుర్కొనేందుకు మనం సర్వసన్నద్ధం కావాల్సిందే.



జనరల్ ద్వివేది

సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ


ఆపరేషన్ సిందూర్ విషయంలో ప్రభుత్వం మాకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది. ఏప్రిల్ 22వ తేదీన పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఓపిక నశించిందని, ఈ ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా ఏదో ఒకటి చేసి తీరాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదేశించారు. మీరే నిర్ణయం తీసుకోండి అంటూ మాకు పూర్తి అధికారాలు అప్పగించారు. దాంతో స్వతంత్రంగా వ్యవహరించాం. పాకిస్తాన్ ముష్కర మూకలను చావుదెబ్బ కొట్టాం. ప్రభుత్వం ఇచ్చిన భరోసా త్రివిధ దళాలకు మనోధైర్యాన్ని కలిగించింది. పక్కా వ్యూహరచనతో పాకిస్తాన్ ఉగ్ర స్థావరాలపై విరుచుకుపడ్డాం. పాకిస్తాన్ భూభాగంలోకి ప్రవేశించి, అత్యంత కచ్చితత్వంతో కూడిన దాడులు చేశాం. తొమ్మిది స్థావరాలను నేలమట్టం చేశాం. ఉగ్రవాదులను హతమార్చాం. ప్రభుత్వం ఈ రకమైన విశ్వాసం ఇవ్వడం, రాజకీయ స్పష్టత, దిశానిర్దేశం మొదటిసారి చూశాం. ఎలాంటి ఆంక్షలు లేకపోవడం మన సైనిక దళాల ఆత్మస్థైర్యాన్ని పెంచింది. ఆపరేషన్ సింధూర్ అనే పేరు దేశాన్ని ఏకం చేసింది. ఆపరేషన్ సిందూర్ ద్వారా అనుకున్న లక్ష్యాన్ని సాధించాం'' అని జనరల్ ఉపేంద్ర ద్వివేది స్పష్టంచేశారు.

గట్టిగా బుద్ధి చెప్పాం

ఆపరేషన్ సిందూర్‌తో చదరంగం ఆడాం. ప్రత్యర్థి ఏం చేస్తాడో, మనం ఏం చేస్తామో ఎవరూ ఊహించలేరు. ఈ పరిణామాన్ని గ్రే జోన్ అంటారు. సంప్రదాయ ఆపరేషన్‌కు భిన్నమైనదే గ్రే జోన్. ఇందులో ఎప్పుడైనా ఏదైనా జరగొచ్చు. గ్రే జోన్ గురించి ఆపరేషన్ సిందూర్ మనకు ఎన్నో విషయాలు నేర్పింది. చెస్‌లో మనం ప్రత్యర్థికి చెక్ పెట్టొచ్చు లేదా ప్రత్యర్థే మనకు చెక్ పెట్టొచ్చు. జీవితం అంటే అంతే కదా! ఆటలో నెగ్గొచ్చు లేదా ఓడిపోవచ్చు. ఏదైనా జరగొచ్చు. ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌కు చెక్ పెట్టాం. పాక్ భూభాగంలోకి ప్రవేశించి మరీ గట్టిగా బుద్ధి చెప్పాం.

భారత్‌ను ఏ శక్తీ ఆపలేదు

- 'అందరికీ బాస్' అనుకునే అమెరికాకు ఇది నచ్చడం లేదు
- ట్రంప్ సుంకాల బెదిరింపులపై రాజ్‌నాథ్ సింగ్ విమర్శలు



రాయ్‌సేన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల బెదిరింపులను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా ఖండించారు. తమ దేశమే అందరికీ బాస్ అనుకునే ఆయన భారత్ ఎదుగుదలను స్వాగతించలేకపోతున్నారని విమర్శించారు. 'భారత్ అభివృద్ధి చెందుతున్న వేగం పట్ల కొందరు సంతోషంగా లేరు. వారికిది నచ్చడం లేదు. అందరికీ బాస్ మనమైతే... భారత్ ఇంత వేగంగా ఎలా అభివృద్ధి చెందుతోందని జీర్ణించుకోలేకపోతున్నారు. భారత్‌లో తయారైన ఉత్పత్తులు, ఇతర దేశాల్లో వస్తువుల కంటే ఖరీదైనవిగా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ధరలు పెరిగితే ప్రపంచం మన వస్తువులను కొనడం మానేస్తుందని భావిస్తున్నారు. కానీ భారత్ చాలా వేగంగా అభివృద్ధి చెందుతోంది. నేను పూర్తి నమ్మకంతో చెబుతున్నా. భారత్ ప్రధాన శక్తిగా ఎదగడం ప్రపంచంలోని ఏ శక్తీ ఆపలేదు' అని మంత్రి ఉద్ఘాటించారు. డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులు రక్షణ ఎగుమతులను ప్రభావితం చేయలేదని, అవి నిరంతరం పెరుగుతూనే ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లోని రాయ్‌సేన్ జిల్లాలో భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్) రైలు కోచ్ తయారీ యూనిట్ భూమి పూజ అనంతరం రాజ్‌నాథ్ మాట్లాడారు. 2014లో 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్.. ప్రస్తుతం నాలుగో స్థాయికి ఎదిగిందని, ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్‌ది మాత్రమేనని ఆయన నత్నారు. గతంలో రక్షణ ఉత్పత్తికి సంబంధించిన వస్తువులను విదేశీయులు తయారు చేస్తే భారత్ కొనుగోలు చేసేదని, కానీ నేడు భారత గడ్డపై, భారతీయుల చేతుల మీదుగా తయారవుతున్నాయని చెప్పారు. అవి మన అవసరాలను తీర్చడమేకాదు.. ప్రపంచంలోని ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేయగలుగుతున్నామని మంత్రి చెప్పుకొచ్చారు. ట్రంప్ సుంకాల బెదిరింపుల తరువాత కూడా రష్యాతో ఇంధన సంబంధాలను భారత్ సమర్థించింది. భారత్‌లోని 140 కోట్ల మంది పౌరుల ఇంధన భద్రతను కల్పించడం తమ లక్ష్యమని పేర్కొంది. ఇందుకు భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చినా సరే.. జాతీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తామని ప్రధాని మోదీ ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో తెలిపారు. అమెరికా విధించిన అధిక సుంకాలను ఎదుర్కొని దేశం నిలబడుతుందని ఆయన స్పష్టం చేశారు. భారత్–అమెరికా వాణిజ్య చర్చల్లో వ్యవసాయం, పాడి పరిశ్రమ కీలకమైన అంశాలుగా ఉన్నాయి. వాషింగ్టన్ తమ సరుకులకు మార్కెట్ ఓపెన్ చేయాలని ఒత్తిడి చేస్తుండగా మనదేశం అందుకు ససేమిరా అంటోంది. దీనికి తోడు రష్యా చమురు దిగుమతులను నిలిపేయడానికి భారత్ నిరాకరించడంతో ఈ వాణిజ్య చర్చలు నిలిచిపోయాయి.

త్వరలో 6,500 కిలోల బరువైన అమెరికా శాటిలైట్ ప్రయోగం

ఇస్రో చైర్మన్ నారాయణన్ వెల్లడి

చెన్నై: అమెరికాలో నిర్మించిన 6,500 కిలోల బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని మరో రెండు నెలల్లో ప్రయోగించనున్నామని ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. సానా–ఇస్రోలు కలిసి జూలై 30వ తేదీన నైసార్ మిషన్ ప్రయోగం చేపట్టడం తెల్సిందే. ఇస్రో చైర్మన్ ఆదివారం చెన్నైలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఇస్రో 1963లో ఏర్పాటు కాగా అదే ఏడాది అమెరికా బహుమతిగా అందజేసిన చిన్నపాటి రాకెట్‌తో భారత అంతరిక్ష యాత్ర మొదలైందని ఈ సందర్భంగా నారాయణన్ గుర్తు చేశారు. ఇస్రో ప్రస్థానంలో ఈ జూలై 30వ తేదీ చరిత్రలో నిలిచిపోనుందని పేర్కొన్నారు. మనం ప్రయోగించిన నైసర్ ఇప్పటివరకు నిర్మించిన అత్యంత ఖరీదైన శాటిలైట్ అని వివరించారు. మరో రెండు నెలల్లో అమెరికా నిర్మించిన 6,400కిలోల భారీ ఉపగ్రహాన్ని సొంత నేలపై నుంచి ప్రయోగించనుండటం మనం సాధించిన ఘనతకు ఉదాహరణ' అని తెలిపారు. సొంత ఉపగ్రహ టెక్నాలజీయేలేని ఇస్రో 50 ఏళ్లలోనే 34 దేశాలకు చెందిన 433 శాటిలైట్లను ప్రయోగించిన స్థాయికి ఎదిగిందని వివరించారు. దేశాభివృద్ధి కోసం బ్రాడ్ కాస్టింగ్, టెలికమ్యూనికేషన్, డిజాస్టర్ వార్నింగ్, వాటర్ సెక్యూరిటీ తదితర 55 రకాల అప్లికేషన్లను ఇస్రో అందజేస్తోందన్నారు.

అలస్కా చర్చల్లో జెలెన్‌స్కీకీ చోటు?

- ట్రంప్–పుతిన్‌తోపాటు ఉక్రెయిన్ అధ్యక్షుడు
- అవకాశాలను కొట్టిపారేయని వైట్‌హౌస్

వాషింగ్టన్: ఈ నెల 15వ తేదీన అలస్కాలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ ఉంటుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన దౌత్యపరమైన విభేదాలకు తెరతీసింది. ఈ సమావేశంలో కుదరబోయే ఒప్పందంపై ఉప్పందుకున్న యూరప్ దేశాల నేతలు ఉక్రెయిన్ భవిష్యత్తును నిర్ణయించే భేటీలో అధ్యక్షుడు జెలెన్‌స్కీకి చోటు కల్పించకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో సమావేశమైన యూరప్ దేశాల ఉన్నతాధికారులు..ట్రంప్ దౌత్య ప్రయత్నాలకు మద్దతు పలికారు. అదే సమయంలో, ట్రంప్–పుతిన్ చర్చల తర్వాత ముందుగా కాల్పుల విరమణ అమల్లోకి రావాలని, ఉక్రెయిన్‌కు సైతం ఒప్పందంలో భాగస్వామి అయ్యే అవకాశమివ్వాలని జేడీ వాన్స్‌ను కోరారు. అలస్కాలో శుక్రవారం పుతిన్–ట్రంప్ మధ్య జరిగే శిఖరాగ్రంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేరు లేదు. అయితే, జెలెన్‌స్కీ పాల్గొనే అవకాశాలను పూర్తిగా కొట్టిపారేయలేమని వైట్ హౌస్ వర్గాలు అంటున్నాయి. ట్రంప్–పుతిన్‌ల సమావేశం తర్వాత మాత్రమే జెలెన్‌స్కీకి చాన్సుంటుందని చెబుతున్నారు. వేగంగా చోటుచేసుకున్న పరిణామాల నడుమ అలస్కా శిఖరాగ్రంపై నిర్ణయం వెలువడింది. శిఖరాగ్రం వేదికను ఇంకా ఖరారు చేయలేదు. అంతేకాదు, ఇద్దరు నేతల మధ్య చర్చకు రావాల్సిన అంశాలపైనా స్పష్టత రాలేదని చెబుతున్నారు. అధ్యక్షుడు ట్రంప్ ఇద్దరు నేతలతో కలిసి త్రైపాక్షిక చర్చలకు సైతం సిద్ధంగా ఉన్నా, పుతిన్ వినతి మేరకు ద్వైపాక్షిక చర్చలకు అవసరమైన ఏర్పాట్లు మాత్రమే చేస్తున్నామని వైట్ హౌస్ అధికారి ఒకరు తెలిపారు.

యూరప్ నేతల డిమాండ్లివీ..

అలస్కాలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అవనున్నట్లు ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్..ఇందులో జెలెన్‌స్కీ పాల్గొనేదీ లేనిదీ మాత్రం స్పష్టం చేయలేదు. యుద్ధానికి ముగింపు పలికే విషయంలో ఉక్రెయిన్‌ను కూడా భాగస్వామిగా చేర్చుకోవాలని జెలెన్‌స్కీతోపాటు యూరప్ దేశాల నేతలు కోరుతున్నారు. ట్రంప్ ప్రకటనను స్వాగతించిన జెలెన్‌స్కీ, తమ భూభాగాన్ని రష్యాకు ధారాదత్తం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను తోసిపుచ్చారు. పుతిన్–ట్రంప్ చర్చల్లో ప్రస్తావనకు వచ్చే అంశాలేమిటి, కుదరనున్న ఒప్పందం వివరాలేమిటి? అంటూ జేడీ వాన్స్‌తో సమావేశమైన యూరప్ దేశాల ఉన్నతాధికారులు కూపీ లాగారు. అమెరికా ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్‌కు పుతిన్ బుధవారం అందించిన పత్రాల్లో ఏముందంటూ ఆరా తీశారు. 'ఈ చర్చల్లో ఉక్రెయిన్‌కు భాగస్వామ్యం ఉండాలి. చర్చల అనంతరం ముందుగా కాల్పుల విరమణ అమల్లోకి రావాలి. ఆ తర్వాతే మిగతా అంశాల అమలు విషయం తేల్చాలి. ఉక్రెయిన్ కొంత భూభాగాన్ని కోల్పోవాల్సి వస్తే..ప్రస్తుతం రష్యా ఆక్రమించుకున్న భూభాగాలను వెనక్కి ఇచ్చేయాలి...'వంటి షరతులను వారు జేడీ వాన్స్‌కు వినిపించారు. ఇందుకు సంబంధించిన ప్రకటనపై ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, పోలండ్, యూకే, ఈయూ, ఫిన్లాండ్ దేశాల నేతలు సంతకాలు చేశారు. ఉక్రెయిన్ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతలకూ గ్యారెంటీ ఇవ్వాలని కోరారు. తమ ప్రతినిధి విట్కాఫ్ మాస్కోలో పుతిన్‌తో జరిపిన సమావేశంలో కుదిరిన ఒప్పందంపై మీడియా అడిగిన ప్రశ్నకు ట్రంప్.. కొన్ని భూభాగాలను వదులుకోవడం వంటి అంశాలున్నాయని చెప్పడం యూరప్ దేశాలతోపాటు జెలెన్‌స్కీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పుతిన్ అందజేసిన పత్రంలో తాము పాక్షికంగా ఆక్రమించుకున్న ప్రాంతాలతోపాటు డోన్‌బాస్ ప్రాంతం పూర్తిగా స్వాధీనం చేయాలనే అంశం ఉన్నట్లు యూరప్ దేశాలంటున్నాయి. ఖెర్సన్, జపొరిజియాల్లోనూ రష్యా ఆర్మీ తిష్టవేసింది. వీటి విషయం తేల్చలేదు. అమెరికా ఇచ్చే భద్రతాపరమైన గ్యారంటీల విషయం సైతం అస్పష్టంగా ఉంది. దీనిపై వైట్ హౌస్ అధికారులను ఈయూ నేతలు పదేపదే ప్రశ్నిస్తున్నా స్పందనలేదు.



జెలెన్‌స్కీ

రెండుసార్లు ఓటేసిన మహిళ ఆధారాలివ్వండి

రాహుల్‌కు కర్ణాటక సీఈవో లేఖ

బెంగళూరు: గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఓ మహిళ రెండుసార్లు ఓటేసిందంటూ చేసిన ఆరోపణలకు ఆధారాలను అందజేయాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి కర్ణాటక చీఫ్ ఎలక్టోరల్ అధికారి(సీఈవో) లేఖ రాశారు. షకున్ రాణి అనే మహిళ రెండుసార్లు ఓటేసినట్లు పోలింగ్ అధికారి ఇచ్చిన రికార్డులు చెబుతున్నాయని రాహుల్ కొన్ని పత్రాలను ప్రదర్శించారు. ఓటరు ఐడీ కార్డును ఆమె రెండు సార్లు ఉపయోగించుకున్నారు. పోలింగ్ బూత్ టిక్ మార్కు వేశారు'అని అందులో ఉందని రాహుల్ ఆరోపించారు. అయితే, తమ దర్యాప్తుపై షకున్ రాణి ఒక్కసారి ఓటేసినట్లు వెల్లడైందని సీఈవో తెలిపారు. టిక్ మార్కు పెట్టినట్లుగా రాహుల్ గాంధీ చూపిన ఓటరు జాబితా పోలింగ్ అధికారి అందజేసిందని కాదని సీఈవో స్పష్టం చేశారు. 'షకున్ రాణి లేదా మరొకరు రెండు సార్లు ఓటేశారని ఆరోపిస్తూ మీరు చూపిన పత్రాలను మాకు అందజేయండి. పూర్తిస్థాయి దర్యాప్తు చేపడతాం'అని రాహుల్‌కు రాసిన లేఖలో సీఈవో కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, కర్ణాటకలో మహదేవపురం అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలోని ఓటరు జాబితాలో దొంగ ఓట్లు నమోదయ్యా యని రాహుల్ ఈసీ లక్ష్యంగా ఆరోపణలు చేయడం తెల్సిందే.

ప్రజల ముంగిటకే న్యాయం

- న్యాయవ్యవస్థ, చట్టసభలు, యంత్రాంగం లక్ష్యం అదే
- సీజేఐ బీఆర్ గవాయ్



ఇటానగర్: ప్రజలకు సేవ చేసేందుకు, అతి తక్కువ ఖర్చుతో సత్వరమే వారికి న్యాయం అందించేందుకు మాత్రమే న్యాయవ్యవస్థ, చట్టసభలు, అధికార యంత్రాంగం ఉన్నాయని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బీఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు. అధికార వికేంద్రీకరణకు తన మద్దతు ఎప్పుడూ ఉంటుందంటూ ఆయన ప్రజల గుమ్మం వద్దకే న్యాయం చేరాలన్నారు. ఆదివారం ఆయన ఇటానగర్‌లో గౌహతి హైకోర్టు ఇటానగర్ శాశ్వత ధర్మాసనం నూతన భవనాన్ని ప్రారంభించిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. 'కోర్టులు, న్యాయవ్యవస్థ, చట్ట సభలు ఉన్నది గొప్పవారికి, న్యాయమూర్తులకు, అధికారులకు చేసే చేసేందుకు కాదు. మనమందరం ప్రజలకు న్యాయం అందించేందుకే ఉన్నాం'అని ఆయన పేర్కొన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌లో భిన్నత్వంలో ఏకత్వం మేళవించి ఉందని, రాష్ట్రంలో 26 ప్రధాన గిరిజన తెగలు, 100కు పైగా ఉప గిరిజన తెగలున్నాయని వివరించారు. ప్రతి గిరిజన తెగ సంస్కృతీసంప్రదాయాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఆయన ప్రశంసించారు. ప్రగతితోపాటు సంప్రదాయాలు, సంస్కృతీ పరిరక్షణ కూడా ముఖ్యమైనవేనని, ప్రాథమిక విధుల్లో ఇవి కూడా ఒకటని తెలిపారు. అశాంతి నెలకొన్న మణిపూర్‌లో ఇటీవల పర్యటన సమయంలో జరిగిన ఘటనను ఆయన గుర్తు చేసుకున్నారు. 'షెల్టర్ హోంలో ఆశ్రయం పొందుతున్న ఓ మహిళ మీ ఇంటికి వచ్చిన మీకు స్వాగతం అని నాతో అంది. ఆమె మాటలు నన్నెంతో ఆకట్టుకున్నాయి. మనది ఒకటే భారతదేశం. మనందరం భారతీయులం. భారత్ మన నివాసం'అని సీజేఐ వ్యాఖ్యానించారు. ప్రతి భారతీయుడికీ రాజ్యాంగమే అత్యున్నత గ్రంథం. ప్రతి ఒక్కరూ చదవి తీరాలని పిలుపునిచ్చారు.

అంతరిక్షం నుంచి తిరిగొచ్చిన లద్దాఖ్ విత్తనాలు

ల్యాబ్‌లో తదుపరి పరీక్షలు చేయనున్న సైంటిస్టులు

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని లద్దాఖ్ నుంచి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్) పంపించిన రెండు రకాల పంటల విత్తనాలను అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ(నాసా) సైంటిస్టులు విజయవంతంగా మళ్లీ భూమిపైకి చేర్చారు. వీటిని కొన్నాళ్లు పరీక్షించి, పొలంలో నాటబోతున్నారు. లద్దాఖ్‌లో చలి ప్రాంతంలో సాగయ్యే పౌష్టికాహార పంటలైన సీబక్‌థోర్న్, హిమాలయన్ బక్‌వీట్ అనే పంటల విత్తనాలను ఈ నెల 1వ తేదీన నాసా క్రూ–11 మిషన్ ద్వారా ఐఎస్ఎస్‌కు చేర్చారు. ఈ విత్తనాలు సరిగ్గా వారం రోజులపాటు ఐఎస్ఎస్‌లోనే ఉన్నాయి. క్రూ–10 మిషన్ ద్వారా ఈ నెల 9వ తేదీన భూమిపైకి తిరిగి తీసుకొచ్చారు. 'ఎమర్జింగ్ స్పేస్ నేషన్స్ స్పేస్ ఫర్ అగ్రికల్చర్, అగ్రికల్చర్ ఫర్ స్పేస్' అనే ప్రయోగంలో భాగంగా ఈ ప్రక్రియ నిర్వహించారు. అంతరిక్షంలోని ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో విత్తనాలు ఎలాంటి మార్పులకు లోనవుతాయి? అనేది పరీక్షించడమే దీని ప్రధాన ఉద్దేశం. అంతరిక్షంలో భూమ్యాకర్షణ శక్తి ఉండదు. రేడియేషన్ అధికం. ఒత్తిడితో కూడిన వాతావరణం ఉంటుంది. ఉష్ణోగ్రతలు తరచుగా మారిపోతుంటాయి. సీబక్‌థోర్న్, హిమాలయన్ బక్‌వీట్ లద్దాఖ్‌లో సంప్రదాయ పంటలు. పోషకాలు పుష్కలం. వైద్య అవసరాలకు కూడా ఉపయోగిస్తుంటారు. బాగా చల్లగా ఉండే వాతావరణంలో సాగవుతాయి. అంతరిక్ష వాతావరణాన్ని తట్టుకొనే పంటల పరీక్ష కోసం వీటినే ఎంపిక చేశారు. లద్దాఖ్ నుంచి అంతరిక్షంలోకి వెళ్లొచ్చిన మొదటి పంటలుగా రికార్డుకెక్కాయి. ఇక ఈ విత్తనాలను ల్యాబ్‌లో విశ్లేషించబోతున్నారు. వాటిలో జన్యుపరమైన మార్పులేమైనా జరిగాయా? అనేది గుర్తిస్తారు. అవి ఎంతమేరకు ఉత్పత్తిని ఇస్తాయి అనేది పరీక్షిస్తారు. అంతరిక్ష వాతావరణాన్ని ఇవి తట్టుకోగలవని తేలితే భవిష్యత్తులో అంతరిక్షంలో ఈ పంటలను సాగు చేసే అవకాశం ఉందని, తద్వారా వ్యోమగాములు ఆహార అవసరాలు తీరుతాయని సైంటిస్టులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ అంతరిక్ష–వ్యవసాయ రంగంలో భారతదేశ ప్రాధాన్యతను సీబక్‌థోర్న్, హిమాలయన్ బక్‌వీట్ విత్తనాలు చాటిచెబుతున్నాయి. ఐఎస్ఎస్ నుంచి వచ్చిన కొన్ని విత్తనాలను తదుపరి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపిస్తుండగా, మరికొన్నింటిని లద్దాఖ్ ప్రభుత్వానికి బహుమతిగా ఇస్తామని ప్రోటోప్లానెట్ సంస్థ డైరెక్టర్ సిద్ధార్థ్ పాండే చెప్పారు.

ఉప రాష్ట్రపతి అభ్యర్థిపై కాంగ్రెస్ కసరత్తు

- భాగస్వామ్య పక్షాలతో కాంగ్రెస్ చీఫ్ ఖర్గే సంప్రదింపులు
- అభ్యర్థి పేరుపై ఏకాభిప్రాయం కోసం మంతనాలు
- నేడు హోటల్ తాజ్‌లో ఇండియా కూటమి ఎంపీలకు ఖర్గే విందు

సాక్షి, న్యూఢిల్లీ: త్వరలో జరగనున్న ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ కసరత్తు ప్రారంభించింది. విపక్షాలకు చెందిన 'ఇండియా'కూటమి తరఫున ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆయా పార్టీల నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ మేరకు గత గురువారం కూటమి నేతలతో ఈ విషయంపై చర్చించినట్లు సమాచారం. ఉమ్మడి అభ్యర్థి విషయంలో ఏకాభిప్రాయం కోసం నేతలతో విస్తృతం చర్చలు కొనసాగిస్తున్నారు. కాగా, నేడు సోమవారం రాత్రి ఢిల్లీలోని హోటల్ తాజ్‌లో కూటమి పార్టీల పార్లమెంటు సభ్యులకు ఖర్గే విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికపై చర్చించి వారి అభిప్రాయాలను తీసుకుంటారు. అయితే, ఎన్డీఏ తన అభ్యర్థిని ప్రకటించిన తర్వాతే విపక్షాల అభర్థిని ప్రకటించాలని ఇండియా కూటమిలోని ఒక వర్గం ఇప్పటికే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకు ఉభయసభల్లో 422 మంది, విపక్ష (ఇండియా) కూటమికి 313 మంది అనుకూలంగా ఉన్నారు. ఎన్డీఏ అభ్యర్థి విజయం ఖాయమని స్పష్టంగా తెలుస్తోంది. అయినా ఉభయ సభల్లో మెజారిటీ లేనప్పటికీ ఉప రాష్ట్రపతి ఎన్నికలో పోటీ చేయాని, బలం లేకున్నా బరిలో ఉండాలని ఇండియా కూటమి నిర్ణయించింది. ఫలితంతో సంబంధం లేకుండా బలమైన సందేశాన్ని పంపే ఉద్దేశంతోనే ఇండియా కూటమి పోటీ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఉమ్మడి అభర్థిని నిలబెట్టడంపై సమష్టి నిర్ణయం కోసం ప్రయత్నా లు జరుగుతున్నాయని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

తుర్కియేలో శక్తివంతమైన భూకంపం

ఇస్తాంబుల్: తుర్కియే పశ్చిమప్రాంతాన్ని శక్తివంతమైన భూకంపం సంభవించింది. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో సంభవించిన భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.0గా నమోదైంది. ఇస్తాంబుల్‌కు 206 కిలోమీటర్ల దూరంలో భూమిలో సుమారు 11 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉంది. ఇస్తాంబుల్, చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు ప్రముఖ పర్యాటక ప్రాంతం ఇజ్మిర్‌లోనూ దీని ప్రభావంతో ప్రకంపనలు సంభవించాయి. షిండిర్గిలో ఒక భవనం కూలినట్లు సమాచారం. ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉంది. తుర్కియే తరచూ భూకంపాల ప్రభావానికి గురవుతోంది.

ఈక్వెడార్ నైట్ క్లబ్‌లో కాల్పులు..8 మంది మృతి

శాంటా లుకా: దక్షిణ అమెరికా దేశం ఈక్వెడార్‌లోని ఓ నైట్ క్లబ్‌లో ఆదివారం చోటు చేసుకున్న కాల్పుల ఘటనలో 8 మంది ప్రాణాలు కోల్పోగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. తీరప్రాంత గుయాస్ ప్రావిన్స్‌లోని శాంటా లుకాలో ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితులంతా 20–40 ఏళ్ల వారేనని పోలీసులు తెలిపారు. దేశంలో అత్యంత ప్రమాదకరమైన ప్రాంతంలో ఒకటిగా దీనికి పేరుంది. రెండు మోటారు సైకిళ్లపై వచ్చిన సాయుధులైన దుండగులు కాల్పులకు తెగబడ్డారని పోలీసులు వెల్లడించారు. కారణాలు తెలియాల్సి ఉందన్నారు.



వరద నీటిలో కలిపేద్దాం
పారిశ్రామిక ప్రాంతాల పరిధిలోని నీటి వనరులు ప్రమాదకరంగా మారుతున్నాయి. భూగర్భ జలాలు సైతం కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి. -10లో



'సోమ'రి'వారం
విద్యార్థుల నుంచి కార్పొరేట్ ఉద్యోగుల దాకా.. సోమవారం ముంచుకొచ్చే బద్ధకం.. మండే అంటే ఒళ్లు మండేలా చేస్తోంది. ఇదే మండే బ్లూస్‌కి కారణమవుతోంది. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
30.0/22.0

వాతావరణం
నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 30, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.





జనంతో మమేకమై..
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం నగరంలోని అమీర్‌పేట్, ఎస్సార్ నగర్‌ల్లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న వరద సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన జనంతో మమేకమయ్యారు. వారితో కలిసి ఆయా బస్తీలు, కాలనీలను పరిశీలించారు. సీఎంకు ఓ మహిళ రాఖీ కట్టింది. మహిళా పారిశుద్ధ్య కార్మికులు రేవంత్‌రెడ్డికి నమస్కరించగా.. ఆయన ప్రతి నమస్కారం చేశారు.

మైక్రో క్యాచ్‌మెంట్‌తో
ముంపునకు చెక్!

ముఖ్యమంత్రి ఆదేశాలతో రంగంలోకి దిగిన హైడ్రా

- అమీర్‌పేట- ఎస్సార్‌నగర్ ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా..
- షార్ట్, మీడియం, లాంగ్‌టర్మ్ స్ట్రాటజీలతో ముందుకు

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలో ముంపు ముప్పు తప్పించడానికి అవసరమైన సమగ్ర ప్రణాళికలు రూపొందించి, చర్యలు తీసుకోవాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాలతో హైడ్రా రంగంలోకి దిగింది. ఆదివారం అమీర్‌పేట, ఎస్సార్ నగర్ ప్రాంతాల్లో పర్యటించిన సీఎం ఈ మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. ఆ ప్రాంతాలను మైక్రో క్యాచ్‌మెంట్ ఏరియాలుగా తీసుకుని, జీహెచ్‌ఎంసీ, జలమండలి సహకారంతో షార్ట్, మీడియం, లాంగ్ టర్మ్ స్ట్రాటజీలు సిద్ధం చేయాలని నిర్ణయించారు.



ఆకస్మిక పర్యటనలో సీఎంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్

లోటుపాట్లు వెలుగులోకి..

నగరంలో వర్షం కురిసినప్పుడు అనేక ప్రాంతాలు మునిగిపోవడం ఏళ్లుగా జరుగుతోంది. ఇప్పటి వరకు యంత్రాంగాలు తీసుకుంటున్న చర్యలు ఫలితాలను ఇవ్వట్లేదు. ఈ ముంపు సమస్యకు పూర్తి పరిష్కారం చూపకుండా కేవలం ఓ చోట ఉన్న నీటిని చోటికి పంపిస్తున్నారు. ఈ కారణంగా నీట మునిగే ప్రాంతాలు మారుతున్నా.. సమస్యలు మాత్రం తీరట్లేదు. దీనికి తోడు కొన్ని ప్రాంతాల్లో గ్రావిటీకి వ్యతిరేకంగా డ్రైనేజీ, వరద కాలువల నిర్మాణం, డిజైనింగ్, ఇంజినీరింగ్ లోపాలు ఉండటంతో ఇవి మరింత తీవ్రతరమవుతున్నాయి. ఇలాంటి అనేక కారణాల నేపథ్యంలోనే అమీర్‌పేట, ఎస్సార్‌నగర్‌ల్లో అనేక బస్తీలు, కాలనీలు చిన్నపాటి వర్షానికీ నీట మునుగుతున్నాయి. సీఎం పర్యటన నేపథ్యంలో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇలాంటి పరిస్థితి నగరంలోని అనేక ప్రాంతాల్లో ఉంది.

ఉపశమనంతో పాటు శాశ్వత పరిష్కారం..

వర్షాలు కురిసినప్పుడు నగరాన్ని ముంచెత్తుతున్న ముంపు సమస్యను పరిష్కరించడానికి హైడ్రా వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. షార్ట్, మీడియం, లాంగ్ టర్మ్ విధానాలను అమలు చేయడం ద్వారా తాత్కాలిక ఉపశమనంతో పాటు శాశ్వత పరిష్కారాలకు కృషి చేయనుంది. జీహెచ్‌ఎంసీ, జల మండలి అధికారులతో కలిసి పశ్చిమ మండలాన్ని రోల్ మోడల్‌గా చూపించడానికి వెంగళరావు నగర్ నుంచి అమీర్‌పేట వరకు వివిధ ప్రాంతాలను అధ్యయనం చేయనుంది. ఇప్పటికే హైడ్రా నగరంలోని వివిధ ప్రాంతాల్లోని ఆరు చెరువులను అభివృద్ధి చేసి, పునరుజ్జీవం కల్పిస్తోంది. ఇటీవల వర్షాలు కురిసినప్పుడు పరిస్థితుల్ని అధ్యయనం చేయగా... వీటి చుట్టుపక్కల ప్రాంతాల్లో గతం కంటే ముంపు తగ్గినట్లు తేలింది. ఆయా చెరువుల వద్ద తీసుకున్న చర్యలను అధ్యయనం చేసి ఇతర ప్రాంతాల్లో అమలుకు అనువుగా మార్పుచేర్పులతో ఓ విధానాన్ని రూపొందించనున్నారు.

ఎగువ నుంచి దిగువకు అధ్యయనం..

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ అంశంపై దృష్టి పెట్టాలని నిర్ణయించిన హైడ్రా పశ్చిమ మండలంలోని ఎగువ నుంచి దిగువ ప్రాంతాల వరకు అధ్యయనం చేయనుంది. దీన్ని ఓ మైక్రో క్యాచ్‌మెంట్ ఏరియాగా తీసుకుని కురిసే వర్షం, నీటి ప్రవాహ తీరుతెన్నులు, వరద వెళ్లే దిశ, నిలిచే ప్రాంతాలను సాంకేతికంగా గుర్తించనుంది. ఆయా ప్రాంతాల్లో ఉన్న డ్రైనేజీలు, నాలాల తీరుతెన్నుల్ని పరిగణనలోకి తీసుకుంటుంది. అక్కడ ఉండాల్సిన కుంటలు, చెరువులు.. ప్రస్తుతం ఉన్న వాటిలో వరద నిర్వహణ చర్యలను అధ్యయనం చేస్తుంది. పార్కులుగా మారిపోయిన చెరువుల్లో ఇన్‌లెట్, ఔట్‌లెట్స్‌తో పాటు గేట్ల నిర్వహణను పరిగణనలోకి తీసుకుంటుంది. దీనికోసం అవసరమైతే ప్రైవేట్ కన్సల్టెన్సీల సహాయం తీసుకోవాలని హైడ్రా నిర్ణయించింది.

ట్రాఫిక్ సమస్య తాత్కాలికమే

- ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా.. ప్రజల సహకారం కూడా అవసరమే
- వర్షాలు, వరద పరిస్థితులపై సమీక్షలో మంత్రి పొన్నం



లక్డీకాపూల్: నగరంలో వర్షం పడినప్పుడు తాత్కాలిక ట్రాఫిక్ సమస్య తప్ప ఎక్కడా ఎలాంటి ఇతర ఇబ్బందులు తలెత్తలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. వాస్తవానికి ఇది ఇప్పటి సమస్య కాదన్నారు. వర్షాలు, నగరంలోని వరద పరిస్థితులపై ఆదివారం ఆయన జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. నగరంలో అక్రమ నిర్మాణాల కారణంగా వరద నీరు రోడ్లపైకి వస్తోందని.. అందుకే రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ప్రవేశపెట్టిందన్నారు. ఆకస్మికంగా తక్కువ సమయంలో ఎక్కువ వర్షం కురవడంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ముందస్తు సమాచారం ఇచ్చినా కూడా ప్రజలు రోడ్లపైకి వస్తున్నారని... ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజల సహకారం కూడా అవసరమన్నారు. ప్రభుత్వం తరఫున సాంకేతిక పరిజ్ఞానంతో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నప్పటికీ అనుకున్న దానికన్నా ఎక్కువ వర్షం రావడంతో సమస్య తలెత్తుతోందని మంత్రి స్పష్టం చేశారు. ఎండా కాలంలో నీరు లేక ట్యాంకర్లు బుక్ చేసుకుంటున్నాం.. ఇంత వర్షం పడుతున్నా నీటిని ఇంకడానికి అవకాశం లేకుండాపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రజలు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. వర్షాల వేళ అన్ని విభాగాల సిబ్బందికి సెలవులు రద్దు చేయాలని అధికారులను మంత్రి పొన్నం ఆదేశించారు.

ఒక్క రోజులో సాధ్యం కాదు..

నగరం ఎదుర్కొంటున్న వరద సమస్యను ఒక్క రోజులో పరిష్కరించడం సాధ్యం కాదని మంత్రి పొన్నం పేర్కొన్నారు. ప్రజలు సహకరిస్తే.. తొందరలోనే సమస్యలు రాకుండా చర్యలు చేపడతామన్నారు. శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. వర్షాల నేపథ్యంలో నగర ప్రజలు ప్రజారవాణాను ఎక్కువగా ఉపయోగించుకుంటే మంచిదన్నారు. వర్షం తగ్గాక అందరూ ఒకేసారి కాకుండా కొంత సమయం తీసుకొని రోడ్లమీదకు రావాలని సూచించారు. సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తదితరులు పాల్గొన్నారు.

నాలాలే మూలం!

- ఇప్పటికీ సిటీలోని అనేకచోట్ల ఆక్రమణలు
- వీటి క్లియరెన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిన హైడ్రా
- వర్షాకాలం ముగిసిన తర్వాత కొనసాగించాలి

చెరువు నీటిని మూసీకి తరలించేవి అవే..



సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల కురుస్తున్న వర్షాలు నగర జనజీవితాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. రోడ్లు, కాలనీలు మునిగిపోయి నరకం చూపిస్తున్నాయి. ఈ పరిణామాలతో ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రంగంలోకి దిగారు. రెండు రోజుల క్రితం విస్తృత స్థాయిలో సమీక్ష నిర్వహించగా... ఆదివారం ఆయన అమీర్‌పేట చుట్టుపక్కల అనేక ప్రాంతాల్లో పర్యటించారు. ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో అధికారులతో భేటీ అయ్యారు. వీరి లక్ష్యం రాజధానిని ముంపు బారి నుంచి కాపాడటం. చెరువుల అలుగు పారిన తర్వాత ఆ నీటిని మూసీ వరకు చేర్చే నాలాలు కబ్జా కోరల్లో ఉన్నాయి. అనేక ప్రాంతాల్లో ముంపునకు ఇదే కారణంగా నిలుస్తోంది. ఆక్రమణల తొలగింపు, విస్తరణ ద్వారా సమస్యను పరిష్కరిస్తే తప్ప ముంపు ముప్పు తప్పే పరిస్థితి కనిపించట్లేదని నిపుణులు చెబుతున్నారు. గడిచిన ఏడాది కాలంలో హైడ్రా 20 ప్రాంతాల్లోని నాలాల్లో ఉన్న ఆక్రమణలను తొలగించి ఎనిమిది ఎకరాలను పునరుద్ధరించింది. ఈ వేగం మరింత పెరగాల్సిన అవసరం ఉంది.

నగరంలో నాలా ప్రభావిత ప్రాంతాలకు ఉదాహరణ..

- జల్‌పల్లి చెరువు–కొత్త చెరువు–పల్లె చెరువుల నుంచి నాలాల ద్వారా ప్రవహించే నీరు ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట, డబీర్‌పురా మీదుగా ప్రవహించి మలక్‌పేట వద్ద మూసీలో కలుస్తుంది. పెద్ద వర్షం వచ్చిన ప్రతిసారీ ఈ మార్గంలోని ఆయిల్ మిల్, పారిశ్రామిక వాడ, ఫలక్‌నుమా, క్రాంతినగర్ తదితర ప్రాంతాలు ప్రభావితం అవుతుంటాయి.
- నాచారం పెద్ద చెరువు–నల్ల చెరువుల నుంచి నాలాల ద్వారా ప్రవహించే నీరు ఉప్పల్, పీర్జాదీగూడ మీదుగా ప్రవహించి పీర్జాదీగూడ వద్దే మూసీలో కలుస్తుంది. ఈ నాలాల కబ్జా వల్ల రాఘవేంద్రనగర్, ధర్మపురి కాలనీ, కావేరినగర్, న్యూ భరత్‌నగర్‌లతో పాటు ఆ చుట్టుపక్కల ప్రాంతాలు మునిగిపోతున్నాయి.
- రామంతాపూర్ చెరువు నుంచి బయటకు వచ్చే నీరు ఇందిరానగర్, నేతాజీనగర్, శాంతినగర్ నాలాల్లో ప్రవహించి కేసీఆర్ నగర్ వద్ద మూసీలో కలుస్తుంది. ఆయా చోట్ల నాలాలు పక్కాగా లేని కారణంగా మధురానగర్, మహేశ్వరి నగర్, సాయి చిత్ర నగర్, రవీంద్రనగర్ చుట్టుపక్కల ప్రాంతాలు మునిగిపోతున్నాయి.
- జిల్లెలగూడ చెరువు–సరూర్‌నగర్ చెరువుల నుంచి బయటకు వచ్చిన నీరు చంపాపేట్, కర్మన్‌ఘాట్, తపోవన్ కాలనీ, చింతలబస్తీ కాలనీ, దిల్‌సుఖ్‌నగర్ వద్ద మూసీలో కలుస్తుంది. నాలాల సమస్య కారణంగా ఈ మార్గంలో ఉన్న మిథిలా నగర్, సత్యసాయినగర్, శ్రీధర్ కాలనీ, కోదండరామ్‌నగర్, వీవీ నగర్ తదితర ప్రాంతాలు నీట మునుగుతున్నాయి.
- రంగనాదముని చెరువు నుంచి బయటకు వచ్చే నీరు మూసాపేట, కూకట్‌పల్లి, ముంబై జాతీయ రహదారి మీదుగా ఫతేనగర్ నాలా నుంచి హుస్సేన్‌సాగర్‌కు చేరుతాయి. ఆక్రమణల కారణంగా నాలాలు కుంచించుకుపోయి జయ భారతి గార్డెన్, పవర్‌నగర్, శ్రీహరినగర్, స్వాండ్ లేక్, కూకట్‌పల్లి డిపో తదితర ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి.
- మైసమ్మ చెవురు నుంచి బయటకు వచ్చే నీరు భరత్‌నగర్, ప్రభాకర్‌రెడ్డి ప్రవహించి ఫతేనగర్ నాలాలో కలుస్తుంది. పరికి చెరువు బయటకు వచ్చే నీరు ఆల్విన్ కాలనీ, ధరణి నగర్, షిరిడీ నగర్ మీదుగా వచ్చే ఫతేనగర్ నాలా, గోపి చెరువు నుంచి బయటకు వచ్చే నీరు ఆర్సీపురం, చందానగర్ మీదుగా లింగంపల్లి నాలాలో కలుస్తుంది. ఈ నీరు పటాన్ చెరువు నక్కవాగుకు చేరుతుంది. ఈ మార్గాల్లో నాలాల కబ్జాతో అనేక ప్రాంతాలు మునిగిపోతున్నాయి.

చర్యలు కొనసాగితేనే ఫలితాలు...

- హైడ్రా ఆవిర్భావం నుంచీ చెరువులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణపై దృష్టి పెట్టింది. వర్షాకాలం సమీపిస్తున్న తరుణం నుంచి నాలాల కబ్జాలను పరిగణనలోకి తీసుకుంది. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో ఆక్రమణల తొలగింపుతో పాటు నాలాల్లోని చెత్తను తొలగిస్తోంది. గతంలో జీహెచ్‌ఎంసీ సైతం వర్షాకాలం నేపథ్యంలో ఇలాంటి చర్యలు తీసుకున్నా వర్షాలు ఆగడంతోనే వారి ప్రాధాన్యం మారిపోయేది. హైడ్రా సైతం నాలాల విషయంలో ఇదే పంథా అనుసరిస్తే మరికొన్ని ఏళ్లు అయినా రాజధానికి ముంపు ముప్పు తీరదు. కనీసం కొన్నేళ్ల పాటు నాలాలపై ఉన్న ఆక్రమణల తొలగింపునకు అన్ని సమయాల్లోనూ సమ ప్రాధాన్యం ఇస్తూ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.
- జలమండలి అధికారులు సైతం అవసరమైన ప్రాంతాల్లో కొత్త వరద కాల్వల నిర్మాణం, ఉన్న వాటి విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు. బండ్లగూడ చెరువు నుంచి నీరు కో–ఆపరేటివ్ బ్యాంక్ కాలనీ, మమత నగర్, నాగోల్ మీదుగా నాలాల్లో ప్రవహించి నాగోల్ వద్దే మూసీలో కలుస్తుంది. తరచూ ముంపునకు గురయ్యే ఇక్కడి ప్రాంతాల్లో స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాంతో (ఎస్‌ఎన్‌డీపీ) చేపట్టిన పనులు ఫలితాలు ఇచ్చాయి. బండ్లగూడ, కో–ఆపరేటివ్ బ్యాంక్ కాలనీ, మమత నగర్, వెంకటరమణ కాలనీ తదితరాలకు వరదముప్పు తప్పిందిని వివరిస్తున్నారు. నగర వ్యాప్తంగా చెరువులతో పాటు నాలా ఆక్రమణల తొలగింపు, విస్తరణ తదితరాలు కొనసాగాలని స్పష్టం చేస్తున్నారు.

కుప్పకూలిన నాలా ప్రహరీ.. అధికారులేరీ?

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్‌నెం.1లోని ధోబీఘాట్ బస్తీని ఆనుకొని ఉన్న నాలా ప్రహరీ వరుసగా కురుస్తున్న వర్షాలకు కుప్పకూలింది. సుమారు 100 అడుగులకు పైగా పొడవులో ఈ గోడ కూలిపోయింది.. గోడ కూలిపోయిందని నాలాలో నుంచి వరద నీరు బస్తీని ముంచెత్తుతున్నదని జీహెచ్‌ఎంసీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని బస్తీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్తీలో సుమారు 200 మందికి పైగా నివాసాలు ఉన్నాయని వర్షం వచ్చినప్రతీసారి ఈ నాలా నుంచి వరద నీరు బస్తీని ముంచెత్తుతూ నడుముల్లోతు నీరు నివాసాల్లోకి వస్తోందని బస్తీవాసులు ఆవేదన చెందుతున్నారు.



మెట్రో రైలులో పయనించిన మంత్రి జూపల్లి
మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం నగరంలో మెట్రో రైలులో పయనించారు. ఓ వివాహ వేడుకకు హాజరయ్యేందుకు ఆయన ఎల్బీనగర్ నుంచి కేపీహెచ్‌బీ వరకు మెట్రో రైలులో వెళ్లారు. ఆయనతో పాటు ఎమ్మెల్సీ గోరటి వెంకన్న కూడా ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి పలువురు ప్రయాణికులతో, చిన్నారులతో ముచ్చటించారు. –సాక్షి, సిటీబ్యూరో

మెట్రో ఆటోమేటెడ్ పార్కింగ్ రెడీ

- మొత్తం 10 పార్కింగ్ అంతస్తులు, సినిమా థియేటర్లు
- దేశంలోనే తొలి ఆటోమేటెడ్ పార్కింగ్ కాంప్లెక్స్
- ప్రభుత్వ శాఖల అనుమతి లభించగానే ప్రారంభం
- మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మెట్రోరైల్ నిర్మించిన ప్రతిష్టాత్మకమైన ఆటోమేటెడ్ బహుళ అంతస్తుల పార్కింగ్ కాంప్లెక్ ప్రారంభానికి సిద్ధమైంది. దేశంలోనే ఈ తరహా పార్కింగ్ ప్రాజెక్ట్ తొలిసారిగా హైదరాబాద్‌లో నిర్మాణం కావడం విశేషం. త్వరలో ఈ పార్కింగ్ కాంప్లెక్స్ ప్రారంభం కానుంది. ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుకుంటోందని, వివిధ ప్రభుత్వ శాఖల నుంచి అనుమతి లభించిన వెంటనే అందుబాటులోకి తేనున్నట్లు హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన నాంపల్లిలోని మెట్రో పార్కింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. నగరంలో పార్కింగ్ కష్టాలను తీర్చే ఒక అద్భుతమైన ప్రాజెక్టుగా ఇది వినియోగంలోకి రానుంది. ప్రపంచంలోనే ఇలాంటి పూర్తిస్థాయి ఆటోమేటెడ్ పార్కింగ్ కాంప్లెక్స్‌లు ఎంతో అరుదుగా ఉన్నట్లు ఎన్వీఎస్ వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, ఈ ప్రాజెక్టును అత్యంత ఆకర్షణీయంగా రూపొందిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలకనుగుణంగా ఈ ప్రాజెక్టును నిర్మించామన్నారు.

పార్కింగ్ ప్రత్యేకతలివీ..

- హైదరాబాద్ మెట్రోరైల్ ఈ ప్రాజెక్టును పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) పద్ధతిలో చేపట్టింది. 'నోవమ్' అనే సంస్థ ఈ ప్రాజెక్టును నిర్మించింది. ఇది జర్మనీకి చెందిన అత్యాధునిక 'పాలిస్' సాంకేతికతతో పూర్తి ఆటోమేటెడ్ పజిల్ పార్కింగ్ సిస్టమ్‌గా నిర్మితమైంది. ఈ ప్రాజెక్టు కోసం హెచ్‌ఎంఆర్‌ఎల్ 2000 చ.గ స్థలాన్ని 50 సంవత్సరాల కన్సెషన్‌కు ఇచ్చింది. ఈ ప్రాజెక్టు డెవలపర్లు డాక్టర్ హరికిషన్ రెడ్డి, భావనారెడ్డిలు రూ.102 కోట్లతో నిర్మించారని ఎన్వీఎస్ తెలిపారు.
- ఈ కాంప్లెక్స్‌లో మొత్తం 15 అంతస్తులు ఉంటాయి. ఇందులో 3 బేస్‌మెంట్లు, 7 పైఅంతస్తులు కలిపి మొత్తం 10 అంతస్థుల్లో పార్కింగ్ సదుపాయం ఉంటుంది. మరో 5 అంతస్తులను వాణిజ్య కార్యకలాపాలకు కేటాయించారు.



మెట్రో ఆటోమేటెడ్ పార్కింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎన్వీఎస్ రెడ్డి

- ఈ పార్కింగ్ కాంప్లెక్స్‌లో అన్నిరకాల సదుపాయాలు కలిగిన రెండు సినీ థియేటర్లను కూడా ఏర్పాటు చేశారు. 11వ అంతస్తులో నగర వీక్షణ కోసం గ్యాలరీని ఏర్పాటు చేశారు.
- మొత్తం 10 పార్కింగ్ అంతస్తుల్లో 250 కార్లు, 200 ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేయవచ్చని, ఈ ప్రాజెక్టు ద్వారా నగర ప్రజలకు ప్రపంచ స్థాయి పార్కింగ్ అనుభవం అందించనున్నామని ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు.

లోటు నుంచి పైపైకి..

- నగరంలో సాధారణ వర్షపాతాన్ని మించి..
- ఇప్పటి వరకు 22 శాతం అత్యధికం
- మరో వారం రోజులు భారీ వర్షాలు
- భూగర్భ జలాల పెంపుపై ఆశలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ముందస్తు వర్షాలు ప్రారంభమైనా.. ఈ సీజన్‌లో గత వారం వరకు లోటుగా కొనసాగిన వర్షం పాతం నమోదు .. తాజాగా కురుస్తున్న భారీ వర్షాలతో సాధారణ వర్షపాతాన్ని మించి సగటున 22 శాతం అత్యధికంగా నమోదైంది. ఈ సీజన్‌లో గత రెండు నెలల్లో అప్పుడప్పుడు కుండపోత వర్షాలు కురిసినా.. సాధారణ వర్షపాతం నమోదు కాలేదు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు సీజన్‌కు జీవం పోసింది. రోజువారీగా కేవలం రెండు, మూడు గంటల పాటు మాత్రమే వర్షం కురుసున్నా.. సగటున 11 నుంచి 15 సెంటీమీటర్లకు పైగా నమోదవుతూ వస్తోంది. నగరంలోని అర్బన్ (జీహెచ్‌ఎంసీ) పరిధిలో వర్షాకాల సీజన్‌లో (జూన్ 1 నుంచి ఆగస్టు 10 వరకు) సాధారణంగా 341.5 మి.మీ వర్షపాతం కురవాల్సి ఉండగా 418.9 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక రెవెన్యూ జిల్లాల వారిగా పరిశీలిస్తే..

- హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా సాధారణంగా 343 మి.మీ వర్షపాతం కురవాల్సి ఉండగా 439.4 మి.మీ వర్షం కురిసింది. ఇప్పటి వరకు సాధారణం కంటే 28 శాతం అదనపు వర్షపాతం నమోదైంది.
- రంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు 292.2 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 401.7మి.మీ కురిసింది. సాధారణం కంటే ఇది 37 శాతం అధికం.
- మేడ్చల్- మల్కాజిగిరిలో జిల్లాలో ఇప్పటివరకు 331.0 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 342.2 మి.మీ నమోదైంది. సాధారణం కంటే 3 శాతం మాత్రమే మించింది. ఈ నెలలో వారం రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించడంతో మరింత వర్షపాత నమోదు మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

వ్యాపారాన్ని దెబ్బ తీశాడని
వ్యక్తి దారుణ హత్య


శ్రీనివాస్ (ఫైల్)

మియాపూర్: ఎక్కడో నుంచి ఇక్కడికి వచ్చి మన వ్యాపారాన్ని దెబ్బ తీశాడనే అసూయతో నలుగురు వ్యక్తులు కలిసి ఓ వ్యక్తిని హత్యచేసి ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శివ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా జంగమయ్యపల్లికి చెందిన శ్రీనివాస్ (37) మియాపూర్‌లోని హాఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ సమీపంలో మంజీరా రోడ్డులో అయిదేళ్లుగా కర్రల వ్యాపారం చేస్తున్నాడు. ఇదే ప్రాంతంలో భార్య సోనీ, కుమార్తెలు రాధ, శివలీలతో నివసిస్తున్నాడు. ఈ క్రమంలో కొంతకాలంగా శ్రీనివాస్ కట్టెల వ్యాపారం వృద్ధిలోకి వచ్చింది. సమీపంలోనే వ్యాపారం చేస్తున్న సోహెల్‌తో పాటు మరో ముగ్గురు శ్రీనివాస్‌పై కక్ష పెంచుకున్నారు. శ్రీనివాస్ వ్యాపారం మంచిగా నడుస్తోందనే అసూయతో సోహెల్‌తో పాటు మరో ముగ్గురు ఆదివారం గొడవ పడ్డారు. ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ వ్యాపారం నడిపిస్తున్నాడనే కోపంతో అతడిని కత్తితో పొడిచి కర్రల దుకాణం వద్ద పడేసి పరారయ్యారు. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో అపస్మారకస్థితిలో పడి ఉన్న శ్రీనివాస్‌ను నిందితుల్లో ఒకడు సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి పరారయ్యాడు. వైద్యులు చికిత్స చేస్తున్న క్రమంలో శ్రీనివాస్ మృతి చెందాడు. సోహెల్‌తో పాటు మరో ముగ్గురు నిందితులను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం.

కంప్యూటర్ ఇంజినీరింగ్‌పై అవగాహన

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్ పూర్తయిన విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన కల్పించడం కోసం క్వాలిటీ థాట్, అరోరా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఉప్పల్‌లోని అరోరా డీమ్డ్ యూనివర్సిటీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అభ్యర్థులకు మెరిట్ టెస్ట్ నిర్వహించి స్కాలర్‌షిప్ అవకాశాలను కూడా కల్పించారు. మొదట బీటెక్ కోర్సుల ఎంపిక విధానం, ప్రాధాన్యత అంశాలు, కీలక రంగాలపై ఏఐ ప్రభావం తదితరాలపై కూలంకుశంగా వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోయిన విద్యార్థుల కోసం ఆగస్టు 17న రెండో విడత స్కాలర్‌షిప్ టెస్టు నిర్వహిస్తామని నిర్వాహకులు ప్రకటించారు.

'రియల్' డీలా!

ఆర్థిక మాంద్యం, హైడ్రా ఎఫెక్ట్
- పడిపోయిన భూముల క్రయవిక్రయాలు
- భారీగా తగ్గిన ఆస్తుల రిజిస్ట్రేషన్లు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: రియల్ భూం జిల్లాలో పడిపోయింది.అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక సంక్షోభా నికి తోడు పెరిగిన భూముల ధరలు.. హైడ్రా కూల్చి వేతలతో ఆస్తుల క్రయవిక్రయాలపై తీవ్ర ప్రభావం చూపాయి.రెండేళ్లతో పోలిస్తే ప్రస్తుతం ఆస్తుల రిజిస్ట్రే షన్ల సంఖ్య భారీగా తగ్గింది. 2023 జన వరి నుంచి జూలై వరకు జిల్లావ్యాప్తంగా 1,47,091 ఆస్తులకు రిజిస్ట్రేషన్లు కాగా వీటి ద్వారా రూ.2,157.60 కోట్ల ఆదాయం సమకూరింది. 2024 జనవరి నుంచి జూలై ఆఖరి వరకు 1,50,247 రిజిస్ట్రేషన్లు కాగా, వీటి ద్వారా రూ. 2,481.58 కోట్లు రాగా.. తాజాగా ఏడు నెలల్లో 1,47,236 డాక్యుమెంట్ల ద్వారా రూ.2,518. 98 కోట్లు వచ్చాయి. గత ఏడాది తొలి ఏడు నెలలతో పోలిస్తే ఈసారి ఆస్తుల రిజిస్ట్రేషన్ల సంఖ్య భారీగా తగ్గినప్పటికీ ఆదాయం పెరగడం కొసమెరుపు.

కోవిడ్ సంక్షోభం తర్వాత

కోవిడ్ సంక్షోభం తర్వాత రియల్ భూం ఒక్కసారిగా ఆకాశాన్నంటింది. నగరానికి ఆనుకుని ఉన్న కోకాపేట, నార్సింగి, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, శంకర్‌పల్లి, మొయినాబాద్, రాజేంద్రనగర్, శంషాబాద్, సరూర్‌నగర్, ఎల్బీనగర్, పెద్ద అంబర్‌పేట్, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మణికొండ, తుక్కుగూడ, ఆది బట్ల, కొత్తూరు, మహేశ్వరం తదితర ప్రాంతాల్లో ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. కోకాపేటలో ఎకరం ఏకంగా రూ.100 కోట్లకుపైగా పలికింది. ఓఆర్‌ఆర్‌కు అటు ఇటుగా కొత్తగా అనేక గేటెడ్ కమ్యూనిటీలు, విల్లా ప్రాజెక్టులు, హైరేంజ్ అపార్ట్‌మెంట్లు వెలిశాయి. వీటిలోని ప్లాట్లు, ఇళ్లు, ఖాళీ స్థలాలు కొనుగోలు చేసేందుకు నగర వాసులే కాకుండా దేశవిదేశాల్లో స్థిరపడిన ఎన్‌ఆర్‌ఐలు, బహుళ జాతి కంపెనీలు ఆసక్తి చూపాయి. ఫలితంగా రోజుకు సగటున 750 నుంచి 1000 ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరిగేవి. రిజిస్ట్రేషన్ చార్జీల రూపంలో ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం సమకూరేది.

రోడ్డున పడ్డ కమీషన్ ఏజెంట్లు

అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక సంక్షోభానికి తోడు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో వెలసిన అక్రమ నిర్మాణాల కూల్చివేతలతో ఆస్తుల అమ్మకాలు మందగించాయి. రిజిస్ట్రేషన్ల సంఖ్య గణనీయంగా తగ్గి ఆ శాఖ ద్వారా ప్రభుత్వానికి సమకూరాల్సిన ఆదాయం ఆశించిన స్థాయిలో రావడం లేదు. భవిష్యత్తుపై ఆశతో భూములపై భారీగా పెట్టుబడి పెట్టిన చిరు వ్యాపారులు తమ వెంచర్లలోని ఖాళీ స్థలాలు అమ్ముడుపోక ఆర్థికంగా చితికిపోతున్నారు. అప్పటి వరకు రియాల్టీపై ఆధారపడిన కమీషన్ ఏజెంట్లు ప్రస్తుతం విలవిల్లాడిపోతున్నారు. ఒకప్పుడు ఖరీదైన కార్లు, విలాసవంతమైన జీవితాన్ని గడిపిన వారు ప్రస్తుతం రోజువారీ ఖర్చుల కోసం తమ వద్ద ఉన్న ఆస్తులు, బంగారు ఆభరణాలు బ్యాంకుల్లో తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి తలెత్తింది. ఉపాధి లేకపోవడంతో కొంతమంది ప్రత్యామ్నాయ మార్గం ఎంచుకోగా, మరి కొంత మంది జీవితాలు రోడ్డునపడ్డాయి.

జిల్లాలో భూముల రిజిస్ట్రేషన్లు ఇలా..

మాసం	2023	2024	2025
జనవరి	18,942	18,818	18,174
ఫిబ్రవరి	20,477	22,272	18,880
మార్చి	23,253	21,451	23,552
ఏప్రిల్	19,025	18,426	22,508
మే	23,184	19,448	22,144
జూన్	21,121	21,103	20,116
జూలై	21,089	28,729	21,862

ప్రభుత్వానికి సమకూరిన ఆదాయం (రూ.కోట్లలో)

మాసం	2023	2024	2025
జనవరి	306.25	274.32	259.91
ఫిబ్రవరి	273.41	397.27	335.53
మార్చి	331.27	406.85	359.17
ఏప్రిల్	325.00	319.30	383.82
మే	338.55	290.91	379.57
జూన్	326.30	332.99	440.57
జూలై	256.82	459.94	360.61

చోరీకి పాల్పడిన వాచ్‌మెన్ అరెస్ట్

మియాపూర్: వాచ్‌మెన్‌గా పనిచేస్తూ అపార్ట్‌మెంట్‌లోని ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. డీఐ రమేష్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం..మియాపూర్‌లోని మయూరినగర్ కాలనీ కౌస్తుభం రెసిడెన్సీలోని ఫ్లాట్ నంబర్ -101లో నాగేశ్వర్‌రావు కుటుంబ సభ్యులతో ఉంటూ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 2వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి సొంతూరుకు వెళ్లాడు. 5వ తేదీన రాత్రి తిరిగి వచ్చి చూడగా ఇంటి తలుపులు, తాళం విరిగిపోయి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగులగొట్టి దాదాపు 20 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.30 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. దీనిపై నాగేశ్వర్‌రావు మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. అపార్ట్‌మెంట్‌లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రసాద్ అనే వ్యక్తిపై అనుమానం కలిగి..విచారించగా చోరీకి పాల్పడింది తానేనని అంగీకరించాడు. దీంతో ప్రసాద్‌ను అరెస్ట్ చేసి అతని వద్దనుండి బంగారు ఆభరణాలు, రూ.15 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

వేధింపులపై ప్రశ్నించినందుకు..

మూసాపేట: పరిచయస్తురాలిని ఎందుకు వేధిస్తున్నావని అడిగినందుకు ఓ వ్యక్తి బ్లేడ్‌తో గొంతుకోసిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బతువల్ బర్ధన్ అలియాస్ రాహుల్ మూసాపేట, జనతానగర్‌లో నివాసం ఉంటూ వెల్డింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. జనతానగర్‌లోని ఒక ప్రార్థనా మందిరంలో పరిచయస్తురాలైన ఓ అమ్మాయిని మూసాపేటలో నివాసముంటున్న బోసు అలియాస్ భాస్కర్ (22) గతంలో వేధిస్తూ ఉండగా బర్ధన్ చూసి ఎందుకు వేధిస్తున్నావని ప్రశ్నించాడు. దీనిపై కక్షబూనిన భాస్కర్ ఆదివారం బర్ధన్ ప్రార్థనా మందిరానికి వెళ్లి వస్తుండగా దాడిచేసి బ్లేడ్‌తో గొంతుకోసి పరారయ్యాడు. స్థానికులు బర్ధన్‌ను రామ్‌దేవ్‌రావు ఆసుపత్రిలో చేర్పించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విజేతలకు బహుమతులు

కందుకూరు: మండల పరిధిలోని రాచులూరులో ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల్లో ఆదివారం సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేశారు. జస్వంత్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో ప్రథమ స్థానంలో నిలిచిన ముంబై ఇండియన్ జట్టుకు రూ.14వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన పంజాబ్ జట్టుకు రూ.7వేలతో పాటు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పి.కృష్ణగౌడ్, బి.రాంరెడ్డి, ఇ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్క దాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు

నల్లకుంట: బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చిన ఓ వృద్ధురాలిపై వీధికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరచగా నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఆసుపత్రి వర్గాల కథనం ప్రకారం..గజ్వేల్ జగదేవ్‌పూర్‌కు చెందిన డి.సిద్ధమ్మ శనివారం కుటుంబ సభ్యులతో కలిసి యాప్రాల్ బాలాజీ నగర్‌లో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చింది. మధ్యాహ్నం సమయంలో ఆమె చేతికర్ర పట్టుకొని వీధి వైపు వెళ్లగా ఓ వీధికుక్క దాడి చేసి కాలును కరిచి గాయపర్చింది. లోతైన గాయంతో రక్తమోడుతున్న వృద్ధురాలిని వెంటనే స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం ఆమెను శనివారం సాయంత్రం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి తీసుకు వచ్చారు. కుక్క కాటు గాయాన్ని శుభ్రం చేసిన వైద్యులు ఏఆర్వీ, టీటీ ఇంజక్షన్‌తో పాటు రిగ్ వ్యాక్సిన్ ఇచ్చారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు వృద్ధురాలిని గాంధీ ఆసుపత్రికి తీసుకువెళ్లారు.

ఫార్మా భూముల్లో హెలికాప్టర్ చక్కర్లు

ఆసక్తిగా గమనించిన స్థానికులు



యాచారం: ఫార్మాసిటీకి సేకరించిన యాచారం, కందుకూరు మండలాల్లోని భూములపై ఆదివారం సాయంత్రం హెలికాప్టర్ చక్కర్లు కొట్టింది. యాచారం మండల పరిధిలోని కుర్మిద్ద, తాడిపర్తి, నానక్‌నగర్, నక్కర్తమేడిపల్లి, కందుకూరు మండల పరిధిలోని మీరాఖాన్‌పేట, ముచ్చర్ల, సాయిరెడ్డిగూడ గ్రామాల్లో ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో హెలికాప్టర్ అతి దగ్గరగా చక్కర్లు కొట్టడం స్థానికులు ఆసక్తిగా గమనించారు. కొన్ని నెలలుగా రెవెన్యూ, టీజీఐఐసీ, పోలీస్ అధికారులు ఫార్మాసిటీకి సేకరించిన భూముల సర్వే చేసి, ఫెన్సింగ్ వేశారు. వారం రోజులుగా పరిహారం ఇచ్చి సేకరించిన సర్వే నంబర్లలోని రైతుల వారీగా కబ్జా భూములను సర్వే చేస్తున్నారు.

లారీ- కారు ఢీ ఒకరికి గాయాలు

మొయినాబాద్: అతివేగంతో వేగంతో వెళ్తున్న కారు అదుపుతప్పి లారీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధి అజీజ్‌నగర్‌కు చెందిన డప్పు కిరణ్ ప్రభుత్వ ఉద్యోగి. శనివారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో.. సదరు వ్యక్తి తన కారులో మొయినాబాద్ వైపు నుంచి అజీజ్‌నగర్ వెళ్తుండగా హిమాయత్‌నగర్ చౌరస్తా సమీపంలో స్వామినారాయణ్ గురుకుల్ పాఠశాల వద్ద కారు అదుపుతప్పి, ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న కిరణ్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్సకోసం క్షతగాత్రుడిని నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రాణం తీసిన ట్రాన్స్‌ఫార్మర్

- షటిల్ కాక్ తీసేందుకు ప్రయత్నించి..
- విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి


విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన బాలుడు విజయ్ కార్తీక్

కేపీహెచ్‌బీకాలనీ: సరదాగా ఇంటి ఆవరణలో ఇద్దరు బాలురు షటిల్ ఆడుతుండగా..షటిల్ కాక్ వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. ఓ బాలుడు షటిల్ బ్యాట్‌తో కాక్‌ను తీసే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని బాపట్లకు ప్రాంతానికి చెందిన కొత్తూరు ప్రేమ్ కుమార్ భగత్‌సింగ్ నగర్‌లోని పయనీర్ ప్రివిలేజ్ అపార్టుమెంట్‌లో నివాసం ఉండే తన బావ ఇంటికి వచ్చాడు. ప్రేమ్‌కుమార్ కుమారుడు విజయ్ కార్తీక్ (14), ప్రేమ్‌కుమార్ బావ కుమారుడితో కలిసి అపార్టుమెంట్ ప్రహరీ లోపల సరదాగా షటిల్ ఆడుకుంటున్నారు. ఇదే క్రమంలో షటిల్ కాక్ వెళ్లి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. దీంతో విజయ్ కార్తీక్ తన చేతిలో ఉన్న షటిల్ బ్యాట్‌తో కాక్‌ను తీసేందుకు యత్నించగా పెద్ద శబ్దంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడిని వెంటనే స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. దీంతో ప్రేమ్ కుమార్ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం: సీఎం సహాయ నిధి పేదలకు వరంలాంటిదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామానికి చెందిన డప్పు భాగ్యమ్మ, ఎర్ర తొంట హరికృష్ణ(మున్నా) అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందగా.. వారికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను ఆదివారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, అమీర్‌పేట్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాయప్ప, పెద్ద కురుమ పెద్దలు కడల సామయ్య, ఇమ్మడి పాండయ్య, మాజీ వార్డు సభ్యులు సంభ మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

చెక్కుల అందజేత

కందుకూరు: సీఎం రిలీఫ్ ఫండ్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ సూచించారు. కందుకూరుకు చెందిన ఎస్.స్వాతి, మానుక భాగ్యమ్మ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందగా.. ఖర్చులకు సంబంధించి సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.60 వేల చొప్పున మంజూరయ్యాయి. ఆ చెక్కులను ఆదివారం వారి కుటుంబ సభ్యులకు కేఎల్‌ఆర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా తమవంతు కృషి చేస్తున్నామన్నారు. అందరూ పార్టీలకతీతంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బి.ప్రశాంత్‌కుమార్, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెరువుకు జలకళ

- భారీ వర్షాలతో అలుగు పోస్తున్న మాసబ్ చెరువు
- ఇళ్ల మధ్య ప్రవహిస్తున్న వరద

తుర్కయంజాల్: వరుస భారీ వర్షాలతో తుర్కయంజాల్ మాసబ్ చెరువుకు జలకళ సంతరించుకుంది. వరద పోటెత్తడంతో అలుగు పారుతోంది. శనివారం సాయంత్రం కురిసిన వానతో చెరువు నుంచి పెద్ద మొత్తంలో నీరు బయటకు ప్రవహిస్తోంది. దీంతో సాగర్ రహదారిపై నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు.. ప్రవాహాన్ని చూసి హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి 8 గంటల నుంచి ఇంజాపూర్‌లోని ఆపిల్ అవెన్యూ కాలనీలో ఇళ్ల మధ్యలో వాగుపై నిర్మించిన రోడ్డుపై అడుగున్నర మేర నీరు ప్రవహించింది. ఈ కాలనీలో గతంలో వెంచర్ నిర్వాహకులు.. వాగును కబ్జా చేసి దానిపై మూడు అడుగుల నాలాను నిర్మించిన విషయం తెలిసిందే. భారీ వర్షాలు కురిసి.. చెరువు అలుగు పారినప్పుడు నీరు, కృత్రిమంగా నిర్మించిన నాలా పొంగి, ఇలా ఇళ్ల మధ్య నుంచి ప్రవహిస్తుంటుంది. ఇళ్లనుముంచెత్తుతుంది. ఆదివారం మధ్యాహ్నం వరకు వరద కొంత తగ్గుముఖం పట్టింది. దీంతో స్థానికులు చేపలను పట్టేందుకు ఉత్సాహం చూపారు. ఇంజాపూర్‌లోని ఇందిరమ్మ కాలనీ, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల చుట్టూ వరద చేరింది. దిలావర్‌ఖాన్ చెరువు నీరు ఉధృతంగా పరుగులు తీస్తోంది.


ఆపిల్ అవెన్యూ కాలనీలో నాలా పొంగి, ఇళ్ల మధ్య పారుతున్న వరద


మిథులానగర్‌కాలనీలోకి చేరిన వరదనీరు


వరదనీటి కారణంగా మిథులానగర్‌లో ఇంటికే పరిమితమైన ఓ కుటుంబం

కాలనీలను ముంచేశారు..!

- చెరువులోకి వెళ్లాల్సిన వరదనీటిని ట్రంక్‌లైన్‌లోకి మళ్లింపు
- ఓవర్ ఫ్లోతో పూర్తిగా జలమయమైన మిథులానగర్, సత్యసాయినగర్
- రాజకీయ ఒత్తిళ్లతో ప్రతీసారి ముంపునకు గురవుతున్నామంటూ కాలనీవాసుల ఆవేదన


వీధులను ముంచెత్తిన వరదనీరు

మీర్‌పేట: పైనున్న కాలనీల కోసం కిందున్న కాలనీలను ముంచేశారు..! వర్షాకాలం వచ్చిందంటే మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మిథులానగర్, సత్యసాయినగర్ కాలనీలను వరదనీరు ముంచెత్తడం షరా మామూలే.. ఎన్నో ఏళ్లుగా ముంపునకు గురవుతున్నా... శాశ్వత పరిష్కారం కోసం చేపట్టిన చర్యలేవి ముంపు నుంచి విముక్తి కల్పించడం లేదన్నది వాస్తవమే. భారీ వర్షాలు రావడం.. ఇళ్లను, వీధులను ముంచెత్తడం ప్రతీసారి జరిగే పరిణామమే తప్పా సమస్య పరిష్కారానికి మాత్రం నోచుకోవడం లేదని ముంపు ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి ఆయా కాలనీలు పూర్తిగా ముంపునకు గురవడంతో చేసేది లేక రాత్రి నుంచి ఉదయం వరకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఉదయమైనా వరద ప్రవాహం తగ్గకపోవడంతో సాయంత్రం వరకు ఇళ్లలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

24 గంటలు ముంపులోనే..

మీర్‌పేట కార్పొరేషన్‌లో ముంపు సమస్య పరిష్కారం కోసం గతంలో గొలుసు కట్టు చెరువులకు అనుసంధానం చేస్తూ ఎస్‌ఎన్‌డీపీ నాలా, డ్రైనేజీ నీరు వేరుగా వెళ్లేందుకు ట్రంక్‌లైన్ నిర్మాణం చేపట్టారు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎగువన ఉన్న బడంగ్‌పేట కార్పొరేషన్ నుంచి పెద్దఎత్తున వరదనీరు వస్తుండడంతో పెద్ద చెరువులోకి వెళ్లాల్సిన నీటిని ట్రంక్‌లైన్‌లోకి మళ్లించడంతో ఓవర్‌ఫ్లో అయి మిథులానగర్, సత్యసాయి నగర్‌లను ముంచెత్తింది. చెరువులోకి నీటిని మళ్లిస్తే ఎక్కడ బ్యాక్ వాటర్ తమ కాలనీలను ముంచెత్తుతుందోనని, ట్రంక్‌లైన్‌లోకి మళ్లించి తమ కాలనీలను ముంచెత్తారని మిథులానగర్ వాసులు పేర్కొంటున్నారు. ఇదంతా తెలిసినా మీర్‌పేట అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరించడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే అనుమానాన్ని మిథులానగర్ వాసులు వ్యక్తం చేస్తున్నారు. ప్రతీసారి ఇదే పునరావృతం అవుతోందని, పైనున్న కాలనీలను రక్షించేందుకు కిందున్న కాలనీలను ముంపునకు బలి చేయడం సరైంది కాదని, 24 గంటలు తాము ముంపులోనే ఉన్నామని, నిత్యావసర వస్తువులు కూడా తెచ్చుకోలేని పరిస్థితి ఏర్పడిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బంచ్ కేబుల్ ఏర్పాటు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 11లోని ఉదయ్‌నగర్ బస్తీలో ఇటీవల టీజీఎస్ పీడీసీఎల్ బంజారాహిల్స్ సెక్షన్ అధికారులు బస్తీబాట చేపట్టి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఉదయ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మహ్మద్ నజీర్ బస్తీలో ఎదుర్కొంటున్న కరెంటు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా స్పందించిన ఏఈ రమేష్ బస్తీలో కట్ట మైసమ్మ గల్లి, రామకృష్ణ గల్లిలతో పాటు మరో గల్లీలో బంచ్ కేబుల్ ఏర్పాటు చేశారు. ఇటీవల కరెంటు వైర్లతో షాక్ వస్తున్న నేపథ్యంలో ఈ మూడు వీధుల్లో బంచ్ కేబుల్ ఏర్పాటు చేశారు. ప్రధాన రోడ్లతో పాటు మరికొన్ని రోడ్లలో కూడా బంచ్ కేబుల్ వేయనున్నారు. అలాగే ప్రమాదకరంగా ఉన్న మూడు విద్యుత్ స్తంభాలను మారుస్తామని అధికారులు హామీ ఇచ్చారని చెప్పిన కొద్ది రోజుల్లోనే సమస్యలు పరిష్కరిస్తున్న అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీకి గుణపాఠం తప్పదు

లిబర్టీ: బీసీలకు రిజర్వేషన్లు కల్పించ తీరకపోతే బీజేపీ ప్రభుత్వం తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తోందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుంద్రు కుమారస్వామి హెచ్చరించారు. బీసీలతో పెట్టుకుంటే ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదని గుర్తుచేశారు. దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యమం ఊపిరిగా పోరాటమే ధ్యేయంగా బీసీలు గడిచిన కొన్ని సంవత్సరాలుగా పోరాటాలు సాగిస్తున్న కేంద్రంలోని బీజేపీ సర్కార్ తమ డిమాండ్‌ను పెడచెవిన పెడుతోందని విమర్శించారు. బీసీలతో పెట్టుకుంటే ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ముమ్మాటికీ బీసీల వ్యతిరేక ప్రభుత్వమేనని ఏ ఎన్నికలు జరిగిన బీసీలు కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు.

జీఓ.34 విడుదల హర్షణీయం

హిమాయత్‌నగర్: దివ్యాంగ ఉద్యోగులకు.. 70 శాతం పైగా అంగవైకల్యం ఉన్న వారికి ట్రాన్స్‌ఫర్లలో మినహాయింపు ఇస్తూ జీవో నం.34ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల పట్ల డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మకు అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

దాడిచేసిన నలుగురిపై కేసు

వెంగళరావునగర్: కార్యాలయంలో దొంగతనం చేయడమే కాకుండా అకారంగా సినిమా ప్రొడ్యూసర్‌పై దాడి చేసిన సంఘటనలో నలుగురిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం కె.వెంకటనారాయణరెడ్డి మధురానగర్‌లో ఉంటూ నిర్మాతగా సినిమాలు చేస్తుంటాడు. ఆయనను కలవడానికి వచ్చిన ఆదూరి ఉమామహేశ్వర్‌రెడ్డి గతంలో వారు తీసిన ఫిల్మ్ ప్రాజెక్ట్ గురించి మాట్లాడుకున్నారు. అనంతరం కథలు అసంతృప్తి కరంగా ఉన్నందున ఇరువురు విడిగా ఉండాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఈనెల 8న మధ్యాహ్నం ఆదూరి ఉమామహేశ్వర్‌రెడ్డి తన సన్నిహితులైన టి.నవీన్‌కుమార్‌రెడ్డి, సాయి, నవీన్‌రెడ్డి మధురానగర్‌లోని వెంకట నారాయణరెడ్డి కార్యాలయానికి వచ్చి వ్యాపార డేటా దొంగిలించారు. దాంతో వెంకట నారాయణరెడ్డి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం మాయం

వెంగళరావునగర్: ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం యూసుఫ్‌గూడ బస్తీకి చెందిన ఎస్.శ్రీనివాసరావు ఈనెల 8న తన ఇంటి ఎదుట ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి ఇంట్లోకి వెళ్లారు. ఉదయం వచ్చి చూసేసరికి అతని వాహనం కనిపించలేదు. బాధితుడు ఇదే విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. కాగా శ్రీకృష్ణానగర్‌లో నివసించే వై.మల్లేష్ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఈనెల 8వ తేదీనాడు రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని శ్రీకృష్ణనగర్‌లోని తన ఇంటి వద్ద పార్కింగ్ చేసి ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. దీంతో బాధితులు ఇరువురూ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నారు.

సినిముంటే మస్తురా మామా..
లేకుంటే పస్తురా..!


తెలుగు సినీ ఫెడరేషన్ కార్యాలయం ఎదుట ఆదివారం ధర్నా చేస్తున్న సినీ కార్మికులు

ఎనిమిది రోజులుగా సినీ కార్మికుల ఆకలి డప్పులు

- పట్టించుకోని సినీ పెద్దలు
- రోజురోజుకు ముదురుతున్న సమ్మె
- అప్పుల పాలవుతున్న జూనియర్ ఆర్టిస్ట్‌లు

బంజారాహిల్స్: రెక్కాడితేగాని డొక్కాడని సినీ కార్మికుల బతుకు చిత్రాలు దశాబ్దాలు గడుస్తున్నా... ఏ మాత్రం మారడం లేదు. కార్మికులంతా షూటింగ్‌లపైనే ఆధారపడుతూ బతుకులను నెట్టుకొస్తుండగా వీరికి వేతనాల విషయంలో మాత్రం ఎప్పటికప్పుడు నిరాశే మిగులుతోంది. నిబంధనల ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సినీ కార్మికుల వేతనాలు 30 శాతం పెరగాల్సి ఉంది. గత 30వ తేదీనాటికే ఈ గడువు ముగిసినా ఇంత వరకు వేతనాల పెంపు జరగకపోవడంతో కార్మికులంతా సమ్మె బాటపట్టారు. గత ఎనిమిది రోజుల నుంచి తెలుగు సినీ కార్మికులు సుమారుగా 24 వేల మంది సమ్మెలో పాల్గొంటున్నారు. షూటింగ్‌లు లేకపోవడంతో వీరంతా రోజు గడవడానికి అప్పులు చేయాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి.

◆ మూడు రోజుల్లోనే నెలకు 10 నుంచి 15 రోజులు మాత్రమే వీరికి షూటింగ్ దొరుకుతోంది. ఆ వచ్చిన వేతనాలతోనే నెలంతా గడపాల్సి ఉంటుంది. ఇప్పుడు ఏకంగా ఎనిమిది రోజుల నుంచి షూటింగ్‌లు లేకపోవడంతో కార్మికుల ఆకలి డప్పులు ఎవరికీ పట్టడం లేదు. సినీ కార్మికులు అంటేనే చిన్న చూపు చూడాల్సిన పరిస్థితి సినీ పరిశ్రమలో ఎప్పటి నుంచో ఉండగా వీరంతా ఇప్పుడు సమ్మె చేస్తున్నా వీరిపైన దయ చూపిని పాపాన పోవడం లేదు.

◆ ఫిలిం ఫెడరేషన్ పరిధిలోని జూనియర్ ఆర్టిస్టులు, డ్యాన్సర్లు, ఫైటర్లు, మేకప్‌మెన్లు, ఇలా 24 విభాగాలకకు సంబంధించిన కార్మికులంతా వేతనాలు పెంచండి మహా ప్రభో అంటూ రోజూ రోడ్డెక్కుతున్నా కనికరించే నాథుడే కరువయ్యాడు. కోట్లకోట్ల రూపాయలు రెమ్యునరేషన్ తీసుకునే హీరోలు సైతం తమ కోసం చెమటోడ్చే కార్మికుల విషయంలో ఏ మాత్రం స్పందించడం లేదు. రోజు గడవడమే కష్టంగా ఉన్న సినీ కార్మికులకు తాజా సమ్మె పుండుమీద కారం చల్లినట్లుగా తయారైంది.

జూనియర్ ఆర్టిస్ట్‌లకు ఎప్పుడూ మోసమే..

◆ ప్రతి షూటింగ్‌లోనే జూనియర్ ఆర్టిస్టులది కీలక పాత్ర. చాలా దృశ్యాలకు వీరు లేకపోతే షూటింగ్ ముందుకు సాగని పరిస్థితి నెలకొంటుంది. అయితే వీరి విషయంలో అటు సినీ జూనియర్ ఆర్టిస్ట యూనియన్, ఇటు ఏజెంట్ యూనియన్ నాయకులు ఎప్పుడూ నిర్లక్ష్యమే కనబరుస్తున్నారు. తమ పబ్బం గడిస్తే చాలు జూనియర్ ఆర్టిస్టులు ఎక్కడికి పోతే తమకేంటి అంటూ గాలికి వదిలేస్తున్నారు. తాజాగా ఎనిమిది రోజుల నుంచి సమ్మె వీరిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది.

◆ జూనియర్ ఆర్టిస్టులు ఒక్కరోజు షూటింగ్‌కు వెళ్తే కన్వినియన్స్ రూపంలో రూ.100, షూటింగ్ పేమెంట్ కింద రూ.630ఇస్తుంటారు. అయితే క్లాస్ వేషాలు వేస్తే రూ.900 ఇవ్వాల్సి ఉండగా, ఇవి మాత్రం ఇవ్వకుండా అన్ని మాస్ పేమెంట్లు రూ.600 చేతిలో పెట్టి చేతులు దులుపుకుంటున్నారు.

◆ టీవీ సీరియల్స్ అయితే కన్వినియన్స్ పేమెంట్ కలుపుకొని రూ. 700 చేతిలో పెడుతున్నారు. ఏజెంట్లు మాత్రం నిర్మాతల నుంచి ఒక్కో జూనియర్ ఆర్టిస్ట్‌కు 900 వరకు వసూలు చేస్తూ అందులో 650 జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్‌కు చెల్లిస్తున్నారు. జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ నాయకులు ఒక్కో ఆర్టిస్ట్ నుంచి రూ.20 కట్ చేసుకొని 630 చేతిలో పెడుతున్నారు. ఇలా అడుగడుగునా ఆర్టిస్టులు దగాకు గురవుతున్నారు.

వచ్చే డబ్బులు సరిపోవడం లేదు



నేనే జూనియర్ ఆర్టిస్ట్‌గా 30 ఏళ్లుగా పని చేస్తున్నా. ఇప్పుడు రూ.740 ఇస్తున్నారు. పని చేయగానే రావు. ఎన్నో రోజుల తర్వాత కానీ మా చేతికి ఆ పైసలు రావు. ఇప్పుడ మార్కెట్లో ఉన్న ధరలను తట్టుకోవాలంటే మాకు ఇస్తున్న డబ్బులకు అదనంగా 30 శాతం మేర పెంచాల్సిందే. రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు మావి.

– కె. నాగేశ్వరమ్మ, జూనియర్ ఆర్టిస్ట్

నెలలో 15 రోజులే పని..



అందరూ అనుకుంటున్నట్లు నెలంతా మాకు పని ఉండదు. ఉండేది 15 రోజులు. అందులోనూ తక్కువ వేతనాలు ఇస్తే మా కుటుంబాలు ఎలా బతకాలి. ప్రస్తుతం ఇస్తున్న మా పేమెంట్‌కు 30 శాతం పెంచితేనే మా పిల్లల ఖర్చులకు, అద్దెలకు, బతకడానికి సరిపోతుంది. పెద్దలు ఓసారి ఆలోచించాలి.

– గోపాల్, లైట్‌మెన్

30 శాతం పెంచాల్సిందే..



ప్రస్తుతం మాకు 1020 ఇస్తున్నారు. మేము అడిగినట్లు 30 శాతం పెంచాల్సిందే. ప్రొడ్యూసర్‌లు 25 శాతం ఇస్తామంటున్నారు. ఇంకో అయిదు శాతం కూడా కలుపుకొని 30 శాతం ఇస్తేనే ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లు మా జీవితాలు ముందుకు సాగుతాయి.

– చంద్రకళ, ప్రొడక్షన్ మహిళా వర్కర్

బూత్ కమిటీలతోనే విజయం సుసాధ్యం

శ్రీనగర్‌కాలనీ: బూత్ కమిటీలతోనే విజయం సుసాధ్యని ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం షేక్‌పేట డివిజన్‌లో బూత్ కమిటీలతో ఏఐసీసీ సెక్రటరీ, మాజీ ఎంపీ పి.విశ్వనాథన్‌తో కలిసి సమావేశమయ్యారు. డివిజన్‌లోని పలు బూత్‌లను తిరిగి అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్‌తో కలిసి పలు అంశాలపై చర్చించారు. రానున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికల్లో బూత్ కమిటీలు బలంగా పనిచేయాలని కోరారు. డివిజన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, అసద్, అఫ్రోజ్, జ్యోతి, ముజీబ్ బాలు, రఘు, మక్బూల్ పాల్గొన్నారు.


బూత్ కమిటీతో సమావేశమైన ఎంపీ అనిల్ కుమార్‌యాదవ్, ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్



రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసి, ప్రతిపక్ష పార్టీలకు బుద్ధి చెప్పాలని మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ పిలుపు నిచ్చారు.రహమత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్‌లలో ఆయన ఆదివారం పర్యటించి కాంగ్రెస్ నాయకులతో సమావేశాల్లో ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికార కాంగ్రెస్ పార్టీ ద్వారానే జూబ్లీహిల్స్ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అందుకే కాంగ్రెస్ అభ్యర్థిని గెలపించాలని కోరారు. ఎంపీగా తాను జూబ్లీహిల్స్ నియోజ వర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టానని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రాన్ని పదేళ్లుగా పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం చేసింది ఎమీ లేదని విమర్శించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ చైర్మన్ మోసిన్ ఖురైష, నగర కాంగ్రెస్ నాయకురాలు మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ సతిమణి హబీబా సుల్తానా, ఎర్రగడ్డ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్ర కృష్ణమోహన్, ఆకాష్, గణేష్ యాదవ్, షఫీ, యాదయ్య, మహేష్, బాలరాజ్, దేవేందర్, సుధాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపఎన్నికలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు బుద్ధి చెప్పాలి


యూసుఫ్‌గూడలో జరిగిన సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

వెంగళరావునగర్: త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీజేపీ జెండాను ఎగురవేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. యూసుఫ్‌గూడలోని సవేరా ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం రాత్రి బీజేపీ నాయకులతో ప్రత్యేక సమావేశం జరిగింది. అనంతరం బీజేపీ నాయకుడు రాగుల సాయికృష్ణ ఆధ్వర్యంలో దాదాపు 100 మంది యువతీ యువకులు కేంద్రమంత్రి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. వారికి మంత్రి తమ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. గత ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి కల్యాణలక్ష్మికి చెక్కుతో పాటుగా తులం బంగారం ఇస్తానని హామీ ఇచ్చి నేటి వరకు అమలు చేయలేదని తెలియజేశారు. అందుకే కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు గౌతంరావు, ప్రేమ్‌కుమార్, అట్లూరి రామకృష్ణ, కిలారి మనోహర్, అమీర్‌పేట కార్పొరేటర్ సరళ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ విజయం ఖాయం

మాజీ కార్పొరేటర్ గుర్రం మురళీగౌడ్

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలే ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తాయని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కార్పొరేటర్ గుర్రం మురళీగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని బీసీలు, బడుగు బలహీనవర్గాలు, మైనార్టీలు కాంగ్రెస్‌తోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని నమ్ముతూ పార్టీతోనే ఉన్నారన్నారు. కోట్లాది రూపాయాలతో జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల్లో కాకుండా చేతల్లో చేసిచూపెట్టే పార్టీ అని అన్నారు. ప్రజలు కష్టాల్లో ఉంటే నేనున్నానని వారికి భరోసా ఇస్తూ సీఎం రేవంత్ రెడ్డి అమీర్‌పేట పర్యటనే ఇందుకు ఉదాహరణ అని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తిగా తెలంగాణాలో ఎదిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మహావృక్షాన్ని చూసి బీఆర్ఎస్, బీజేపీ కోటలు బీటలు వారాయని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్‌లో పార్టీనే క్యాండెట్ అని, అధిష్టాన నిర్ణయం నియోజకవర్గ ప్రజలను

వాసవీ సేవా కేంద్రం సేవలు ఎనలేనివి

మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్


పేదలకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న టీజీ వెంకటేష్ తదితరులు

ఖైరతాబాద్: వాసవీ సేవా కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తూరు సీతయ్య గుప్తా 114వ జయంతి వేడుకలను ఆదివారం ఖైరతాబాద్‌లోని వాసవీ సేవాకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 500 వందల మంది పేదలకు పెన్షన్లు, 125 మందికి 10కిలోల బియ్యం, సైకిళ్లు, గ్రైండర్లు, కుట్టు మెషిన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడారు. కొత్తూరు సీతయ్య గుప్తా దూరదృష్టితో ఏర్పాటు చేసిన సేవా కేంద్రం ఎంతో మందికి ఉపాది కల్పిస్తోందన్నారు. సంస్థ ఆధ్వర్యంలో 52 సంవత్సరాలుగా చేస్తున్న సేవలను అభినందించారు. కొండ్లె మల్లికార్జున్ నేతృత్వంలో తిరుపతిలో ప్రారంభించే సేవాకార్యక్రమాలకు తనవంతు సహకారం ఉంటుందని టీజీ వెంకటేష్ తెలిపారు.

◆ ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ మాట్లాడుతూ... సేవా కేంద్రం చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రతి సంవత్సరం విస్తరించుకుంటూ పోవడం అభినందనీయమన్నారు. స్వయం ఉపాది కింద 81 కుట్టు మెషిన్లను స్పాన్సర్ చేసిన సీల్‌వెల్ కార్పొరేషన్ అధినేత బండారు సుబ్బారావు మాట్లాడుతూ.. సమాజం కోసం చేసే ప్రతి కార్యక్రమంలో తన వంతు సహకారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన మందులు ఉచితంగా అందజేశారు. వాసవీ సేవాకేంద్రం అధ్యక్షుడు కోల్పూరు రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు చీకట్ మర్ల అశోక్ కుమార్, కొండ్లె మల్లికార్జున్, ఆలంపల్లి రవి కుమార్, కాసనగొట్టు రాజశేఖర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి నాచం ప్రభాకర్, కోశాధికారి ఇల్లూరి నరేంద్ర కుమార్, కన్వీనర్ రాజేష్ కోలావర్, కూర జయరాములు గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు భారీ బందోబస్తు


కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం వద్ద భారీ బందోబస్తు

బంజారాహిల్స్: బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్, టాలీవుడ్ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్, ప్రముఖ బాలీవుడ నటి కియారా అద్వానీ నటించిన వార్–2 సినిమా ప్రీ రిలీజ్ వేడుకలు ఆదివారం సాయంత్రం యూసుఫ్‌గూడ బెటాలియన్‌లోని కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగాయి. వీరితో పాటు ప్రముఖ నిర్మాత ఆదిత్య చోప్రా, సినిమా డైరెక్టర్ అయాన్ ముఖర్జి కూడా ఈ వేడుకకు హాజరయ్యారు. ఈ వేడుకలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తొక్కిసలాట జరగకుండా జూబ్లీహిల్స్ పోలీసులు, వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. గత మూడు రోజుల నుంచి ఈ బందోబస్తుకు సంబంధించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. బందోబస్తులో భాగంగా 300 మంది బౌన్సర్లను నియమించారు. చుట్టూ 60 కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆరు మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేశారు. ఫైర్ స్టేషన్ ఆఫీసర్‌తో పాటు సిబ్బంది కూడా విధుల్లో ఉన్నారు. వీరికి తోడు అయిదు ఉమెన్ ప్లటూన్లు, తొమ్మిది మెన్ ప్లటూన్లతో పాటు సిటీ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కూడా బందోబస్తులో పాల్పంచుకున్నాయి. ట్రాఫిక్ ఇబ్బదులు తలెత్తకుండా వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరి ప్రసాద్ ఉదయం నుంచే ఇక్కడ పరిస్థితిని పర్యవేక్షించారు. అర్ధరాత్రి దాకా పోలీసులు ఇక్కడే ఉండి అభిమానులు వెళ్లే దాకా పరిస్థితులను సమీక్షించారు.

ఖైరతాబాద్ మారుతి నగర్‌లో ఆలయం ముందు వరద నీటిని తరలించే ప్రయత్నం చేస్తున్న హైడ్రా సిబ్బంది..



వదలని వరద..!

భారీ వర్షాలకు బస్తీలు అతలాకుతలం అవుతున్నాయి. శనివారం రాత్రి కురిసిన భారీ వానకు ఖైరతాబాద్ నియోజకవర్గంలోని బస్తీలు ఇంకా కూడా కొన్ని నీట మునిగే ఉన్నాయి. ఖైరతాబాద్‌లోని మారుతీనగర్ బస్తీలో ఆలయం ముందు పెద్ద ఎత్తున వరద నిలిచిపోవడంతో దాన్ని పంపింగ్ చేసే పనుల్లో హైడ్రా సిబ్బంది శ్రమిస్తున్నారు. పంజగుట్ట హిందూ శ్మశానవాటికలో వరద నీరు నిలిచిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సోమాజిగూడలోని కత్రియా హోటల్ సమీపంలోని కాలనీలో పదుల సంఖ్యలో అపార్ట్‌మెంట్ సెల్లార్లలో నీళ్లు నిండిపోయి అపార్ట్‌మెంట్‌వాసులు తీవ్ర **ఇబ్బందులు** పడుతున్నారు. ఎంఎస్ మక్తా, ఫిలింనగర్ **ప్రాంతాల్లో** వరదధాటికి ఎగువ ప్రాంతాల నుంచి పెద్ద **ఎత్తున బురద** వచ్చి రోడ్లపై నిలిచిపోవడంతో రోడ్డంతా **బురదగా** మారిపోయింది. రోడ్లపై కొట్టుకొచ్చిన **వ్యర్థాలను** జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగిస్తున్నారు.

– బంజారాహిల్స్




సోమాజిగూడ కత్రియా హోటల్ సమీపంలోని ఓ కాలనీలో అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో వరద నీరు..


జోర్ లగాకే హైస్సా..


వరదలో ఆగిన ప్రైవేట్ బస్సును నెడుతున్న హైడ్రా సిబ్బంది

బంజారాహిల్స్: పంజగుట్ట నుంచి అమీర్‌పేట ముందు మైత్రివనం మెట్రోస్టేషన్ వరకు శనివారం రాత్రి అంతా నడుముల్లోత వరద నిలిచిపోయి వాహనాలు ముందుకు వెళ్లడమే గగనంగా మారింది. గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీనికి తోడు మైత్రివనం మెట్రోస్టేషన్ కింద భారీ వరదలో ప్రైవేట్ బస్సు మొరాయించింది. దీంతో హైడ్రా డీఆర్‌ఎఫ్ సిబ్బంది రంగంలోకి దిగి వరదలోకి చిక్కుకున్న బస్సును ముందుకు నెట్టాల్సి వచ్చింది. ఇందుకోసం గంటపాటు కష్టపడాల్సి వచ్చింది. దీని వల్ల వెనుకాల ట్రాఫిక్ మొత్తం నిలిచిపోయింది. వరదకు తోడు ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు ఆగమాగం అయ్యారు. ఇదే ప్రాంతాన్ని ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు.

ప్రతిసారీ సెల్లార్ మునగాల్సిందే..

బంజారాహిల్స్: పదేళ్లుగా తమ అపార్ట్‌మెంట్లోకి మురుగు నీరు వస్తున్నాయని, వర్షం వచ్చిన ప్రతీసారి నరకం చూస్తున్నామని చెబుతున్నా సంబంధిత శాఖ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదంటూ అపార్ట్‌మెంట్‌వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బంజారాహిల్స్‌రోడ్ నెం. 12లోని మినిస్టర్ క్వార్టర్స్ ఎదురుగా ఉన్న భద్రుకా ఎన్‌క్లేవ్‌లో పది సంవత్సరాలుగా మురుగు సమస్య వారిని వేధిస్తోంది. వర్షం వచ్చిన ప్రతీసారి మినిస్టర్ క్వార్టర్స్ వైపు నుంచి ప్రధాన రోడ్డు నుంచి మ్యాన్‌హోళ్ళు పొంగడంతో పాటు మురుగు నీటి పైప్‌లైన్ల నుంచి మురుగు వెనక్కి తన్నుకొస్తూ అపార్ట్‌మెంట్ సెల్లార్ మొత్తం నిండిపోతున్నదని అపార్ట్‌మెంట్ నివాసం రోశయ్య ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మురుగు నీటి వల్ల దోమల వ్యాప్తి పెరగడంతో పాటు విష జ్వరాలు వస్తున్నాయని జలమండలి ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.


బంజారాహిల్స్ రోడ్ నం.12లోని భద్రుకా ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో మురుగు నీరు..

పీసీకైనా.. అధికారికైనా తప్పదు..

అర్ధరాత్రి ట్రాఫిక్ క్లియర్ చేసిన జోయల్ డేవిస్

బంజారాహిల్స్: కుండపోత వర్షంతో శనివారం రాత్రి రహదారులన్నీ వరద నీటితో అతలాకుతలం అయ్యాయి. భారీగా వరద నీరు నిలిచిపోవడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు నగర ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ శనివారం అర్ధరాత్రి ఖైరతాబాద్, లక్డికాపూల్, పంజగుట్ట, బంజారాహిల్స్ ప్రాంతాల్లో పర్యటించి వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. బంజారాహిల్స్ రోడ్ నెం.3లోని పంజగుట్ట హిందూ శ్మశానవాటిక ముందు భారీగా వరద నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. జోయల్ డేవిస్ అరగంట పాటు ఇక్కడే ఉండి ట్రాఫిక్‌ను పరిశీలించారు. వాహనాలు సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు.


పంజగుట్ట శ్మశానవాటిక ఎదుట ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్న ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్

సాక్షి సోమవారం, 11, ఆగస్టు, 2025

నగరంలో నేడు

- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్ ప్లాజాలో చేనేత ఎగ్జిబిషన్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు..
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సిల్క్ ఎక్స్‌పో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ..
- మాసాబ్ ట్యాంక్‌లోని జేఎన్‌ఏఎఫ్ఏయు కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో ల్యాండ్ స్కేప్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందు బాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో సిల్క్ ఎక్స్‌పో ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు..
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు..
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు..

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

వరద నీటిలో కలిపేద్దాం..!

చెరువులు, కుంటల్లోకి పరిశ్రమల వ్యర్థజలాలు

- పారిశ్రామిక ప్రాంతాల్లో నిత్యం ఇదే పరిస్థితి
- మృతి చెందుతున్న జీవాలు



సాక్షి, సిటీబ్యూరో: పారిశ్రామిక ప్రాంతాల పరిధిలోని చెరువులు, కుంటలు, నీటి వనరులు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఆయా పరిసర ప్రాంతాల్లోని భూగర్భ జలాలు సైతం కాలుష్యకోరల్లో చిక్కుకుంటున్నాయి. తాగడానికే కాదు ఇతర అవసరాలకు సైతం వినియోగించడం మంచిది కాదని ప్రజారోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్ని చెరువుల్లోని నీటిలో ఆక్సిజన్ స్థాయి ''0''గా నమోదవుతోందన్న విషయం ఆందోళన కలిగిస్తోంది. తేలిక పాటి వర్షం కురిసినా పరిశ్రమల నుంచి విడుదలయ్యే రసాయన వ్యర్థ జలాలను వరద నీటిలో కలిపి విడిచిపెట్టడమే దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

◆ నగర పరిధిలో సుమారు 400లకుపైగా బల్క్ డ్రగ్స్, కెమికల్ తయారీ ప్లాంట్లు ఉన్నాయి. పటాన్‌చెరు, పాశమైలారం, బొల్లారం, కూకట్‌పల్లి, జీడిమెట్ల, కాటేదాన్, బాలానగర్, తదితర ప్రాంతాల్లో కాలుష్యకారక పరిశ్రమలు పెద్దసంఖ్యలో ఉన్నాయి. దీంతో తరచూ ఆయా ప్రాంతాల్లో గాలి, నీరు, భూమి కాలుష్యంపై ప్రజల నుంచి పీసీబీ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. తాజాగా కురుస్తున్న వర్షాలతో పలు పరిశ్రమలు వ్యర్థజలాలను నేరుగా వర్షపు వరద నీటిలో కలిపేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలితంగా తీవ్రమైన పరిణామాలను ఎదుర్కొనాల్సి ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గతంలో అమీన్‌పూర్ చెరువులో చేపలు, ఇతర జలచరాలు చనిపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం సుమారు పదేళ్ల క్రితం జీవ వైవిధ్య వారసత్వ ప్రదేశంగా ప్రకటించినప్పటికి ఆ చెరువులో కాలుష్య సమస్య తగ్గలేదన్నది పీసీబీ నివేది కల్లో తేలింది.

పారిశ్రామిక ప్రాంతాల్లోని కాలుష్యంపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై పీసీబీ అధికారులు స్పందిస్తున్నారు. ఇటీవల కాలంలో రెండు పరిశ్రమలు నేరుగా మురుగు కాల్వలోకి వ్యర్థ జలాలను విడిచిపెడుతున్నాయని నిర్ధారించి, మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఏదైనా సంఘటన జరిగినపుడు, స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చినపుడు పీసీబీ అధికారులు స్పందిస్తున్నారని, మిగతా సమయాల్లో కాస్త చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాలుష్యకారక పరిశ్రమలను ఔటర్ దాటించాలని ఆయా ప్రాంతాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఫిర్యాదులపై స్పందిస్తున్నారు..

◆ మాదాపూర్‌లోని సున్నం చెరువు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు సైతం రసాయన జలాలతో కలుషితమయ్యాయని, వాటిని మానవ అవసరాలకు వినియోగించవద్దని పీసీబీ హెచ్చరిస్తోంది. సీసం, కాడ్మియం, నికెల్ వంటి విషపదార్థాలు అధిక మోతాదులో ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. పలు చెరువుల్లో ఆక్సిజన్ స్థాయిలు పూర్తిగా పడిపోయాయని పీసీబీ గుర్తించింది. నీటిలో ఆక్సిజన్ స్థాయి 5 కంటే తక్కువ ఉంటే జలచరాలు బతకడం కష్టం. అది సున్నాకు చేరితే చనిపోతాయని, నగరంలోని రెండు నుంచి మూడు చెరువుల్లో ఇదే పరిస్థితి కనిపిస్తుందని పీసీబీ అధికారి ఒకరు తెలిపారు.

◆ బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ నిత్యం పెరుగుదల కనిపిస్తోంది. దీనికి ప్రధాన కారణం శుద్ధిచేయని జలాలను నేరుగా విడిచిపెట్టడమేనని అధికారులు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో మురుగు నీటిలోనూ కోలిఫాం బ్యాక్టీరియా స్థిరంగా కనిపిస్తోంది. మురుగు కాల్వలు నేరుగా నీటి వనరుల్లోకి రావడంతో కాలుష్య తీవ్ర పెరుగుతోంది. కాలుష్యకారక ప్రాంతాల్లో జరిపిన పరిశోధనల్లో మహేశ్వరం, ఎల్‌బీ నగర్, మౌలాలీ, గండ్లపోచంపల్లిలో క్రోమియం, సీసం, నికెల్ వంటి భారీ లోహాలు ఉన్నట్లు గుర్తించారు. పలు ప్రాంతాల్లో స్టీల్, ఐరన్ పరిశ్రమల నుంచి విడుదలయ్యే వ్యర్థాల్లో లోహాలు పెద్దమొత్తంలో ఉంటున్నాయి. విషపూరిత నీటిని తాగడం, వినియోగించడం వల్ల నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. పలు రకాల కేన్సర్లకు కారణమవుతుందని, పునరుత్పత్తి సమస్యలు, చర్మ రోగాలు ప్రబలుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సికింద్రాబాద్‌లో 16న శ్రీకృష్ణ జయంత్యుత్సవాలు



శ్రీకృష్ణ జయంత్యోత్సవాలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఆహ్వానిస్తున్న చక్రధర్‌యాదవ్ తదితరులు

సనత్‌నగర్: రాష్ట్ర యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 16న శ్రీకృష్ణ జయంత్యుత్సవాలను సికింద్రాబాద్ ఆర్పీరోడ్డులోని మహబూబ్ కళాశాలలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షులు యల్లావుల చక్రధర్‌యాదవ్ తెలిపారు. సనత్‌నగర్‌లోని జెక్‌కాలనీలో ఆదివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మహాసభ ప్రధాన కార్యదర్శి నాగెల్లి అంజన్‌యాదవ్, కార్యదర్శి జంగిటి ప్రవీణ్‌యాదవ్‌లతో కలిసి వేడుకల బ్రోచర్‌ను విడుదల చేశారు. అనంతరం ఉత్సవాల వివరాలను వెల్లడించారు. సాయంత్రం 7 గంటల నుంచి అర్ధరాత్రి 12.30 గంటల వరకు జరిగే కార్యక్రమాల్లో భాగంగా జెండా వందనం, గోపూజ నిర్వహిస్తామన్నారు. శ్రీకృష్ణుని పూజ, డోలాహరణం, ఊరేగింపు ఉంటుందన్నారు. వేడుకలకు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తదితరులు హాజరవుతారన్నారు.

నేటి స్కూల్‌లో.. నాటి విద్యార్థులు



పూర్వ విద్యార్థులతో తరగతి గదిలో నాటి టీచర్ హైమావతి...

పంజగుట్ట: ఆత్మీయ ఆలింగనాలు... ఆనాటి ముచ్చట్లతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా సాగింది. ఇర్రమంజిల్‌లోని ప్రభుత్వ పాఠశాల 1975 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం పాఠశాల ఆవరణలో ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమంలో ఆ ఈ విద్యార్థులకు తెలుగు పాఠాలు చెప్పిన టీచరమ్మ హైమావతి హాజరై పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఆనాటి విద్యార్థులందరినీ తరగతి గదిలో కూర్చొబెట్టి మరోసారి పాఠాలు చెప్తూ అందరినీ నవ్వించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆనాటి పరిస్థితులు ఎలా ఉండేవో, నేడు ఏం చేస్తున్నారంటో ఒకరికొకరు చెప్పుకుంటూ సంతోషంగా గడిపారు. అనంతరం ఫొటోలు, సెల్ఫీలు దిగి సామూహిక భోజనాలు చేస్తూ కబుర్లు పెట్టుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ప్రతినిధులు కె బాలాజీ, పి. శంకర్, శేషాద్రి, జీకే కుమార్, వేను గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరల్డ్ లయన్స్ డే

బహదూర్‌పురా: సింహాలు పర్యావరణ సమతుల్యాన్ని కాపాడడంలో ముఖ్యపాత్ర వహిస్తాయని జూ వెటర్నరీ డాక్టర్లు, అసిస్టెంట్ క్యూరేటర్లు, అనిమల్ కీపర్ల అన్నారు. నెహ్రూ జూలాజికల్ పార్క్ లో ప్రపంచ సింహాల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా 374 మంది విద్యార్థులకు పజిల్స్, క్రాస్ వర్డ్స్ తో పాటు ఇతర పోటీలను నిర్వహించారు, కార్యక్రమంలో జూ పార్కు వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ అసిస్టెంట్ క్యూరేటర్ లక్ష్మణ్, పిఆర్‌ఓ హనీఫుల్లా, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మాధవి లత అనిమల్ కీపర్ ఆయుబ్ కౌసర్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



బంజారాహిల్స్: తెలుగు టెలివిజన్ అండ్ డిజిటల్ మీడియా డబ్బింగ్ ఆర్టిస్ట్స్ యూనియన్ ఎన్నికలు ఆదివారం బంజారాహిల్స్ రోడ్ నెం2లోని ఇందిరానగర్‌లోని యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు. ఎన్నికల్లో మనగళం-మన బలం ప్యానల్ విజయం సాధించింది. ప్రెసిడెంట్‌గా చంద్రశేఖర్‌వర్మ, వైస్ ప్రెసిడెంట్‌గా లలితారాజ్, జనరల్ సెక్రటరీగా నాగేంద్రగౌతమ్, ట్రెజరర్‌గా వినోద్‌కుమార్‌రాజు, జాయింట్ సెక్రటరీగా సాహితి గుళ్ళపల్లి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్యాం సుందర్‌రెడ్డి చిల్లా, ఈసీ మెంబర్స్‌గా అనురాధ, అడప సాయిప్రసాద్, అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు.

తొర్రూర్‌లో గజం భూమి రూ.67,500

- రూ. 105 కోట్ల మేర ఆదాయం
- ప్లాట్ల కొనుగోలుకు పోటాపోటీ

సాక్షి,సిటీ బ్యూరో: నగర శివార్లలో అవుటర్ రింగ్ రోడ్ సమీపంలోని తొర్రూర్ లో చదరపు గజం భూమి రూ.67,500 పలికింది. ఆదివారం రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 300 నుంచి 450 చదరపు గజాల విస్తీర్ణంలోని 100 ప్లాట వేలం పాట అబ్దుల్లాపూర్ మెట్ లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లోజరిగింది. 240 మంది బిడ్డర్లు ఈ ప్రక్రియలో పాల్గొన్నారు. ఇక్కడ చదరపు గజానికి కనీస ధరగా రూ. 25,000 నిర్ణయించగా, కార్నర్ ప్లాట్ ఒకదానిని దక్కించుకోడానికి పోటాపోటీ జరిగింది. చివరకు దీనిని రూ.67,500 కు కొనుగోలు చేశారు. లే అవుట్ లో దాదాపు 24 కార్నర్ ప్లాట్లు ఉండగా మరో ప్లాట్ చదరపు గజం ధర రూ.62 వేల ధర పలికింది. వంద ప్లాట్లకు సంబంధించి సగటున గజం ధర రూ 33000 పలికింది. వేలం ద్వారా కార్పొరేషన్ కు సుమారు రూ.105 కోట్ల మేర ఆదాయం వచ్చింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య, రెవెన్యూ, రాజీవ్ స్వగృహ, హెచ్‌ఎండీఏ అధికారుల సమక్షంలో ఉదయం నుంచీ రాత్రి వరకు వేలం ప్రక్రియను నిర్వహించారు.

గోర్‌బోలి బంజారా భాషను గుర్తించాలి



నిరసన తెలుపున్న అమర్ సింగ్ తిలావత్, వెంకటేశ్ చౌహాన్

హిమాయత్‌నగర్ : బంజారా భాషా గోర్‌బోలిని గుర్తించాలని కోరుతూ గిరిజన శక్తి, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్, గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెంకటేష్ చౌహాన్ ఆధ్వర్యంలో చేపట్టారు. బంజారాల అస్తిత్వానికి ఆత్మగౌరానికి ప్రతీక గోర్ బోలి భాషను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి పంపించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నాన్చివేత ధోరణి బాధాకరం అన్నారు. గత మూడు రోజులుగా అన్ని పార్టీల ఎంపీలను కలిసి అనేక ఏళ్లుగా వివిధ రాష్ట్రాల్లోని కోట్ల మంది బంజారాలు మాట్లాడే ఈ భాష చరిత్రను గొప్పతనాన్ని సింధు నాగరికత నుంచి భాష మూలాల గురించి వివరించి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. తమ భాషను విస్మరిస్తే రాబోయే స్థానిక ఎన్నికల్లో బంజారా తండాల్లో తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లప్పతి నాయక్, గిరిజన విద్యార్థి సమితి రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ నాయక్, నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్ పవర్ పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ కాంటెస్ట్‌కు ఎంట్రీల ఆహ్వానం

నాంపల్లి: ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా తెలంగాణ టూరిజం ఫొటోగ్రఫీ కాంటెస్ట్-2025 ఎంట్రీలను ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టిసిసిఐ) డైరెక్టర్ పి.సంగీత ఒక ప్రకటనలో తెలిపారు. పర్యాటక రంగంలోని వైవిధ్యం, అందం, సాంస్కృతిక సంపదను ప్రతిబింబించే విధంగా ఓపెన్ ఫొటో కాంటెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'తెలంగాణ పర్యాటక ఆత్మను అన్వేషించండి - అనుభవించండి - ఆవిష్కరించండి' అనే థీమ్‌తో తెలంగాణ సాంస్కృతిక వారసత్వం, భూ దృశ్యాలు, శిల్పకళా ఉత్సవాలు, వన్యప్రాణులు, వంటకాలు, సంపద, ప్రజల జీవితాల సారాన్ని అందంగా బంధించడానికి అన్ని వర్గాల ఫొటోగ్రఫీ అభిమానులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ కాంటెస్ట్‌లో పాల్గొనడానికి వయసు, ప్రొఫెషనల్ పరిమితులు లేవని, అందరూ ఆహ్వానితులేనని తెలిపారు. ఎంట్రీ ఫీజు కూడా లేదని, ఎన్ని ఫొటోలైనా పంపవచ్చన్నారు. మొదటి బహుమతి రూ.10వేలు, రెండవ బహుమతి రూ.7వేల ఐదు వందలు, మూడవ బహుమతి రూ.5వేలు ఉంటుందని తెలిపారు. ఎంట్రీలకు ఫొటోలను ఆగస్టు 17వ తేదీ లోగా పంపాలన్నారు. వివరాలకు 9121000199 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

గాయకుడు రోహిత్‌కు ఆత్మీయ సత్కారం



సాక్షి, సిటీబ్యూరో: బాల్యంనుంచి ఎంతో అంకితభావంతో, కృషితో, పట్టుదలతో అంచెలంచెలుగా ఎదిగి జాతీయ పురస్కారం సాధించిన గాయకుడు రోహిత్ యువకులందరికీ ఆదర్శప్రాయుడని సన్మానసభలో వక్తలు ప్రశంసించారు. ఆయన నివసిస్తున్న విద్యానగర్‌లోని వైదేహి నివాస్ గోల్డెన్ పామ్స్ కమ్యూనిటీవాసులు ఆదివారం రోహిత్‌ను ఘనంగా సత్కరించి సన్మానం చేశారు. రోహిత్‌లో విద్య నేర్పిన గురువులపట్ల వినయవిధేయతలూ, సంగీతంపట్ల అంకితస్వభావం ఉన్నందువల్లే ఆయన ఇంత ఎత్తుకు ఎదిగారని వైదేహి నివాస్ పాలకవర్గం అధ్యక్షుడు ఎం. రామాంజనేయులు ప్రశంసించారు. ఆయన సంగీతంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యదర్శి ఎ. కరుణాకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ చరిత్ర కాంగ్రెస్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఆదివారం విద్యానగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జరిగిన 8వ వార్షిక సమావేశంలో వివిధ అంశాల పై చర్చించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షురాలిగా ప్రొ.సుధారాణి (అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ), ప్రధాన కార్యదర్శిగా డా.అంకం జయప్రకాష్ (కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ), ఉపాధ్యక్షురాలిగా ప్రొ.లావణ్య (ఓయూ), ప్రొ.వడ్డాణం శ్రీనివాస్ (అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ), సంయుక్త కార్యదర్శులుగా ప్రొ.దయాకర్ (అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ), డా.రాజ్‌కుమార్ (కేయూ), కోశాధికారిగా ప్రొ.బండి శ్రీనివాస్ (ఓయూ)ను నూతన కర్యవర్గంగా ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ కాలేజీలకు చెందిన చరిత్ర అధ్యాపకులు పాల్గొన్నారు

కుక్కపిల్లను దత్తత తీసుకోండి


జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 17న దత్తత మేళా

లక్డీకాపూల్ : జీహెచ్ఎంసీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రేమతో నిండిన ఒక చిన్న ప్రాణానికి మీరు ఓ ఇల్లు ఇస్తారా? అంటూ కుక్కపిల్లల దత్తతకు జీహెచ్ఎంసి ఆహ్వానం పలుకుతుంది. బంజారాహిల్స్, రోడ్ నెం1లోని జలగం వెంగళరావు పార్కులో ఈ నెల 17 న ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు ఇండీ కుక్కపిల్లల ప్రత్యేక దత్తత మేళా జీహెచ్ఎంసీ నిర్వహిస్తోంది. డీవార్మింగ్ చేసి, టీకాలు వేసిన, ఆరోగ్యంగా ఉన్న కుక్కపిల్లలను మేళాలో ప్రదర్శనగా ఉంచుతారు.

సెల్లార్ తవ్వకాలతో కూలిన ప్రహరీ

ఉప్పల్: ఉప్పల్ భగాయత్‌లో ఓ అపార్ట్‌మెంట్ కాపౌండ్ వాల్ పక్కన భారీఎత్తున సెల్లార్ తవ్వకాలు ప్రారంభించారు. సెల్లార్ గుంత పెద్దగా తీయడంతో అపార్టుమెంట్ కాంపౌండ్ వాల్ కూలి సెల్లార్‌లోకి పడింది. దీంతో అపార్టుమెంట్ వాసులు తీవ్ర భయాందోళనకు గురైనారు. అదృష్ట వశాత్తు కూలినప్పుడు కార్మికులు ఎవ్వరు లేనందున భారీ ప్రమాదం తప్పింది.

ఉత్సాహంగా కవి సమ్మేళనం



'నా తెలంగాణ', 'అమ్మకు అమ్మనై' పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నిజాంపేట్ : ప్రగతినగర్‌లోని సుందరయ్య భవనంలో ఆదివారం కవి సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి, ధర్మకేతనం కళాపీఠం అధ్యక్షులు విశ్రాంత అటవీ శాఖాధికారి ఎస్.వి.రఘువీర్ ప్రతాప్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైరాగ్య ప్రభాకర్ సంపాదకత్వంలో వెలవడిన 'నా తెలంగాణ', 'అమ్మకు అమ్మనై' పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంకలనాల ప్రచురణలతో ఎందరో కొత్త కవులను సాహిత్య రంగానికి పరిచయం చేస్తున్న వైరాగ్యం ప్రభాకర్ సాహిత్య సేవ ఎన్నదగినదని అన్నారు. అస్తిత్వం, విశిష్టతలపై ప్రచురించిన నా తెలంగాణ భవిష్యత్ తరాల వారికి మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కవి, నటుడు సాదనాల వెంకటస్వామి నాయుడు, ప్రముఖ కవి సాహిత్య కళావిభూణ చౌదూరి నరసింహరావు, వెల్మల జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

'భార్గవ స్వరాలు.. అమృత మధురాలు' పుస్తకం ఆవిష్కరణ



చిక్కడపల్లి: పావని మెమోరియల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి త్యాగరాయ గానసభలో ఆనంద నృత్య హేల, శృతిలయ గానలీల, ఆనంద తండవమాడే శివుడు శీర్షికతో నిర్వహించిన కార్యక్రమం ప్రేక్షకరంజకంగా సాగింది. ఈ సందర్భంగా కొండపల్లి భార్గవ రచించిన భార్గవ స్వరాలు అమృత మధురాలు పుస్తకాన్ని లంకా లక్ష్మినారాయణ ముఖ్యఅతిథిగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు వంశీ రామరాజు, బ్రిం, దైవజ్ఞ శర్మ, వెంకటరమణ, లక్ష్మీ సుందరి, వెంకటేష్, సూర్యకుమారి, సాయికిరణ్, అరుణప్రియ తదితరులు పాల్గొన్నారు.

టీ అల్ మేవా రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీని సన్మానిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ మూస

హిమాయత్‌నగర్ : గతంలో ఉన్న అన్ని కమిటీలను రద్దు చేస్తున్నట్లు టీ అల్ మేవా రాష్ట్ర నూతన కమిటీ అధ్యక్షులు మహమ్మద్ మూస ప్రకటించారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జరిగిన టీ అల్ మేవా రాష్ట్ర కమిటీ రిజిస్టర్ సొసైటీ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణతో పాటు నూతన అడ్‌హక్ కమిటీని ఆయన ప్రకటించి మాట్లాడారు. కరోనా మహమ్మారి ప్రభావంతో పాటు కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గులాం ఖాజా మోయినుద్దీన్ మరణం తర్వాత రాష్ట్ర కమిటీ స్తబ్దుగా ఉండిపోయిందని అన్నారు. భవిష్యత్‌లో అన్ని రకాల మైనారిటీ ఉద్యోగుల హక్కులను కాపాడటంతో పాటు వారి యోగక్షేమాల నిమిత్తం వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నూతన అడహక్ కమిటీ అన్ని అధికారాలు కలిగి ఉంటుందని తీర్మానించారు. కమిటీ ద్వారా ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందన్నారు. ఉపాధ్యక్షులుగా గులాం దస్తగిర్, జావీద్, మహమ్మద్ మహబూబ్ అలీ, మహమ్మద్ ఉస్మాన్, సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శులుగా మహమ్మద్ తాహెర్, అదనపు ప్రధాన కార్యదర్శులుగా మహమ్మద్ ఇస్మాయిల్, కోశాధికారి మీర్ మునవర్ అలీ, సంయుక్త కార్యదర్శులుగా మహమ్మద్ హనీఫ్, మొమ్మద్ ఇలియాస్, మహమ్మద్ సిరాజుద్దీన్ ఖాన్, మహమ్మద్ అల్తాఫ్, ఎస్.వి జయుడు, మహిళా కార్యదర్శిగా పర్వీన్ సుల్తానా, సలహాదారులుగా వరకుమార్(రిటైర్డ్ ఎంఈఓ), అనిల్ కుమార్(రిటైర్డ్ జిహెచ్ఎం), తాజుద్దీన్ ఎన్నికయ్యారు.

నగర ప్రజలను పట్టి పీడిస్తున్న సమస్యలు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ముషీరాబాద్: హైదరాబాద్ నగరంలో ప్రజలను పలు సమస్యలు పట్టి పీడిస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.ముషీరాబాద్ నియోజకవర్గం సాగర్‌లాల్ ఆసుపత్రి చౌరస్తా నుంచి దాయరం మార్కెట్ వరకు రూ.1.60 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం చాలా పెద్దదని.. అభివృద్ధి పనులకు నిధులు లేమి వల్ల అనేక సమస్యలు ప్రజలు పట్టి పీడిస్తున్నాయన్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి నిధుల కోరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల స్థానికంగా ఉన్న రోడ్లు దెబ్బతిన్నాయని వాటిని వెంటనే ఆధునీకరించాలన్నారు.

అవసరమైన ప్రతి చోటా కొత్త రోడ్లు : మంత్రి పొన్నం

నగరంలో అవసరమైన ప్రతి చోటా వెంటనే ఆధునిక రోడ్లు వేస్తున్నామని రాష్ట్ర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లను ఆధునీకరించేందుకు యుద్ధ ప్రతిపాదికన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్లపై వర్షం నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. వరద నీటి నాలాల వల్ల ఇబ్బందులు తలెతత్తకుండా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా అభివృద్ధి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీలు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ కె.రవిచారి పాల్గొన్నారు.

నినాదాలతో గందరగోళం

కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలుసుకున్న బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. మూడు పార్టీల కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో వేదిక వద్ద గందరగోళంగా మారింది. చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్, ఇన్స్పెక్టర్ రమేష్‌బాబులు సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. దీంతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌లు కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో వారు వెంటనే వేదిక వద్దనుంచి హడావిడిగా వెళ్లిపోయారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్



నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు

చదువులో భాగంగా హ్యాకథాన్



సాక్షి, సిటీబ్యూరో: చదువులో భాగంగా హ్యాకథాన్‌లను చేర్చే సరికొత్త ప్రాజెక్ట్‌ను కెఎల్ డీమ్డ్ టూ బి యూనివర్సిటీ రూపొందించింది. దీనిని నగరంలోని తమ ఆధ్వర్యంలోని పలు కళాశాలల్లో ప్రారంభించింది. ఈ వినూత్న ప్రాజెక్టును 'స్కిల్ పాలావర్'గా నిర్ణయించారు. హ్యాకథాన్‌లను విద్యా చక్రంలో సజావుగా అనుసంధానిస్తుందని, తరగతి గది అభ్యాసానికి, వాస్తవ-ప్రపంచ అవసరాలకు మధ్య అంతరాన్ని తగ్గించడానికి వీలుగా నైపుణ్య కోర్సులపై దృష్టి పెడుతుందనీ వర్సిటీ నిర్వాహకులు కొండాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. సమావేశంలో వర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ శ్రీనాథ్, ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ టి. రామకృష్ణారావు పాల్గొని మాట్లాడారు.





ఉదయాన్నే నిద్రలేవడం, ఉత్సాహంగా రొటీన్ వర్క్‌లోకి దూకేయడం... ప్రతిరోజూ ఏమోగానీ, సోమవారం మాత్రం అంత వీజీ కాదు. విద్యార్థుల నుంచి కార్పొరేట్ ఉద్యోగుల దాకా... సోమవారం ముంచుకొచ్చే బద్ధకం.. మండే అంటే ఒళ్లు మండేలా చేస్తోంది. ఇదే మండే బ్లూస్‌కి కారణమవుతోంది.

- సాక్షి, సిటీబ్యూరో

సోమరివారం

సర్వసాధారణంగా మారిన 'మండే బ్లూస్'

- కొందరు నగరవాసుల్లో కనిపిస్తున్న ధోరణి
- సాదాసీదా మానసిక సమస్య నుంచి మార్పు
- సీరియస్ అనారోగ్యాల వైపు దారితీస్తున్న వైనం
- వెల్లడించిన వైస్ తాజా అధ్యయనం..

'మండే బ్లూస్ అనే పదం సాధారణంగా సోమవారం రోజు పని లేదా చదువులను మొదలు పెట్టాల్సిన తప్పనిసరి అవసరం వల్ల కలిగే అలసట, నిరుత్సాహం వంటి భావాలకు అద్దం పడుతోంది. కొంతకాలంగా లెక్కలేనన్ని మీమ్స్, ట్వీట్లు కాఫీ మగ్ నినాదాలకు 'మండే బ్లూస్'అనేది ఒక పంచ్‌లైన్.

ఆ పాపం వీకెండ్ దే...

వారాంతంలో 2 రోజులపాటు సెలవులు అనే కార్పొరేట్ కల్చర్ విస్తృతంగా వ్యాపించడం ఈ మండే బ్లూస్‌కి ప్రధాన కారణమవుతోంది. వారంలో ఐదురోజుల పని ముగుస్తుండగానే శుక్రవారం సాయంత్రానికే వీకెండ్ ఉత్సాహం పుంజుకుంటుండగా, శనివారం, ఆదివారం సెలవులు పూర్తయ్యాక సోమవారం మళ్లీ రొటీన్ వర్క్ లేదా స్కూల్/కాలేజీకు వెళ్లాల్సిన పరిస్థితి మండే బ్లూస్‌ని సృష్టిస్తోంది. సాధారణంగా సోమవారం ఆలస్యంగా లేచే అలవాటు చాలామందిలో ఉంటుంది. దీనికి కారణం వీకెండ్ రోజుల్లో ఆలస్యంగా నిద్రలేవడమే. పని మొదలుపెట్టే రోజు కాబట్టి సోమవారం పట్ల మానసిక విరక్తి, పని పట్ల ప్రతికూల భావన ఏర్పడుతోంది.

ఒత్తిడి స్థాయిలు పెరుగుతున్నాయ్...

వారంలో తొలి నిరుత్సాహకర ప్రారంభం అనేది కేవలం మన ఆలోచనలపై మాత్రమే ప్రభావం చూపడం లేదని, అది మన శారీరక ధర్మాలను కూడా ప్రభావితం చేస్తోందని వైస్ (వీఐసీఇ) రిపోర్ట్ పేరిట జర్నల్ ఆఫ్ ఎఫెక్టివ్ డిజార్డర్స్‌లో ప్రచురించిన తాజా అధ్యయనం వెల్లడిస్తోంది. దీని ప్రకారం.. ఒత్తిడిని అనుభవిస్తున్న వ్యక్తుల్లో కార్టిసాల్ స్థాయిలు ఇతర ఏ రోజు ఒత్తిడిని నివేదించిన వారి కంటే సోమవారాల్లో 23 శాతం వరకు ఎక్కువగా ఉన్నాయి. డాక్టర్ తరణి చందోలా నేతృత్వంలో 3,500 మందిపై నిర్వహించిన ఈ అధ్యయనం ప్రాథమిక ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్ 'సోమవారం వ్యక్తుల'లో గణనీయంగా పెరిగినట్టు కనిపెట్టింది.



పరిష్కారం.. సైకాలజిస్ట్‌ల కొన్ని సూచనలు..

- ప్రణాళికాబద్ధంగా పనిని విభజించుకోవడం అనేది అలవాటు చేసుకోవాలి.
- వారాంతపు రోజుల్లో ఆహారపు అలవాట్లలో అతి మార్పు చేర్పులు చేయవద్దు.
- శుక్రవారం రోజే సోమవారం నాటి పనులను పకడ్బందీగా ప్లాన్ చేసుకోవడం వర్క్ ప్రెషర్‌ను దూరం చేస్తుంది.
- ప్రతీ సోమవారం ఏదైనా కొత్త రకం వ్యాయామం, కొత్త రూట్‌లో వాకింగ్ వంటివి ప్లాన్ చేయడం ద్వారా కొత్త ఉత్సాహం వస్తుంది.

మానసికమే కాదు, అంతకు మించి...

కార్టిసాల్ దీర్ఘకాలిక ఒత్తిడికి గురి కావడానికి కీలకమైన బయోమార్కర్ అని పరిశోధకులు వెల్లడించారు. మెదడుకు ముప్పు లేదా ప్రమాదాన్ని గ్రహించినప్పుడు కలిగే ప్రతిస్పందన ఈ హార్మోన్. అంతేకాదు కార్టిసాల్ స్థాయిల్లో హెచ్చుతగ్గులు హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదం, బలహీనమైన రోగనిరోధక శక్తి, రక్తపోటు, మధుమేహం వంటి వాటికి కూడా దారితీస్తున్నాయి. సంక్షిప్తంగా చెప్పాలంటే సోమవారం భయం మానసిక స్థితిని దెబ్బతీయడం కంటే మరింత ఎక్కువ హాని కలిగిస్తుంది. అది వ్యక్తుల ఆరోగ్యాన్ని నిశ్శబ్దంగా దెబ్బతీస్తుంది.

మరోవైపు.. సోమవారాల్లో గుండె సంబంధిత సంఘటనలు పెరగడాన్ని వైద్యులు చాలాకాలంగా గమనిస్తున్నారు. దీన్ని ''మండే ఎఫెక్ట్''అని పిలుస్తారు. వారంలోని మొదటి రోజున గుండె పోటు, ఆకస్మిక గుండె సంబంధిత మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయని గణాంకాల పరంగా గుర్తించారు. ఈ ధోరణికి తరచూ వారాంతపు విశ్రాంతి నుంచి ఆకస్మిక పని వైపు మళ్లిన ఆలోచనలే కారణమని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో వైద్యుల సలహాలను అనుసరించి ఈ సమస్య నుంచి వీలైనంత త్వరగా బయటపడటం అవసరం.

ఐఎస్‌బీ బంధన్

ఆటాపాటలతో సందడి చేయనున్న పాఠశాలల విద్యార్థులు

ప్రతి యేటా పంద్రాగస్టు నాడు నిర్వహణ



రాయదుర్గం: 'పంద్రాగస్టు' వచ్చిందంటే చాలు.. ఆ క్యాంపస్‌లో చిన్నారుల సందడే సందడి.. కనువిందు చేసే నృత్యాలు.. ఆకట్టుకునే ఆటపాటలు.. అబ్బురపరిచే సన్నివేశాలు.. చూడముచ్చటగా ఉంటాయి. ఈ దృశ్యాలు గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)లో ఆగస్టు 15న బంధన్ అనే కార్యక్రమంలో దర్శనమిస్తాయి. ఐఎస్‌బీ విద్యార్థులు ప్రత్యేకంగా రూపొందించి అమలు చేసే వార్షిక కార్యక్రమమే 'బంధన్'. ఐఎస్‌బీ విద్యార్థులు ఏర్పాటు చేసుకున్న 'నెట్ ఇంపాక్ట్ క్లబ్'ఆధ్వర్యంలో సమాజానికి ఎంతోకొంత తిరిగి ఇవ్వాలనే లక్ష్యంతో ప్రతియేటా కార్యక్రమాన్ని హైదరాబాద్, మొహాలి క్యాంపస్‌ల్లో నిర్వహిస్తున్నారు. ఎన్జీఓ సంస్థలు నడిపే విద్యాసంస్థలు, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులతో ఐఎస్‌బీ విద్యార్థులు రోజంతా సరదాగా ఆడుతూ, పాడుతూ, నృత్యాలు చేస్తూ సంతోషంతో జీవితంలో మరుపురాని విధంగా మారేలా చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశం. చిన్నారులకు డ్రాయింగ్, ఇతర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ఇస్తుంటారు. విలువలు, సంస్కృతి, సంప్రదాయాల గురించే కాకుండా చదువు ప్రాధాన్యతను చిన్నారులకు వివరించి భవిష్యత్తులో మరింతగా కష్టపడి, ఇష్టపడి చదివేలా ప్రోత్సహిస్తుంటారు. ఈ నేపథ్యంలో 'బంధన్-2025'ను ఈ స్వాతంత్ర దినోత్సవాన నిర్వహించేందుకు ఐఎస్‌బీ విద్యార్థులు ఏర్పాట్లు చేశారు.

కూచిపూడి అలా.. భరతనాట్యం భళా..





మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామం ఆదివారం నృత్య ప్రదర్శనలతో కోలాహలంగా మారింది. బెంగుళూరుకు చెందిన సురేష్ భరతనాట్య ప్రదర్శనతో అలరించారు. ఇందులో పుష్పాంజలి, కృతి, దేవికృతి, తోడయా, మంగళం, భజన తదితర అంశాలను ప్రదర్శించారు. కళానృత్యానికేతన్ గురువు బిందుమాధవి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో ఆహుతులను ఆకట్టుకుంది. కళాకారులు శిఖర, కీర్తి, శాన్వి, అదితి, అనగా, భావన ధన్యతోపాటు 85 మంది కళాకారులు ఈ నృత్య ప్రదర్శన చేశారు.



ఉత్సాహం ఉరిమేలా.. వ్యాధిని తరిమేలా..!

'రన్ ఫర్ ఎస్ఎంఏ-2025



గచ్చిబౌలి: రయ్ రయ్ మంటూ వచ్చారు.. రన్ రన్‌లో ఉరికారు.. ఉత్సాహం ఉరిమేలా కదిలివచ్చారు.. వ్యాధులను తరిమికొట్టేలా.. అవగాహన కల్పించేలా.. సాగారు. ఆ ప్రాంతంలో ర్యాలీలే ర్యాలీలు. ఆదివారం గచ్చిబౌలి స్టేడియం ఉత్సాహవంతులతో సందడిగా మారింది. జన్యుపరమైన లోపాలతో వచ్చే స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ(ఎస్ఎంఏ) వ్యాధి పట్ల అవగాహన కల్పించేందుకు 'రన్ ఫర్ ఎస్ఎంఏ-2025'నిర్వహించారు. నేషనల్ టర్మరిక్ బోర్డు సెక్రెటరీ భవానిశ్రీతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జయేష్ రంజన్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. 21కే, 10కే, 5కే టైమ్డ్, 5కే నాన్‌టైమ్డ్ విభాగాల్లో రన్ నిర్వహించారు. గచ్చిబౌలి స్టేడియం నుంచి ట్రిపుల్ ఐటీ, ఐఎస్‌బీ, విప్రో సర్కిల్ నుంచి తిరిగి స్టేడియం వరకు రన్‌లు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధులపట్ల ఎప్పటికప్పుడు ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. క్యూర్ ఎస్ఎంఏ సహ వ్యవస్థాపకురాలు శ్రీలక్ష్మీ నలం మాట్లాడుతూ స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ బారిన పడ్డ చిన్నారుల్లో కండర శక్తి, కదలిక సామర్థ్యం ప్రభావితం అవుతుందన్నారు. దేశంలో ఈ వ్యాధి బారినపడ్డ రోగులకు చేయూతనిచ్చేందుకు కార్పొరేట్, ప్రభుత్వ రంగ సంస్థల మధ్య సమన్వయం అవసరమన్నారు. కార్యక్రమంలో పీడియాట్రిస్ట్, రెయిబో చిల్డ్రన్స్ హాస్పిటల్ ప్రతినిధి డాక్టర్ రాధా రమాదేవి, నిర్మాణ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు, గ్లోబల్ సీఈఓ మయూర్ పట్నాల, తెలంగాణ గ్రూపు సోషల్ ఇంపాక్ట్ డైరెక్టర్ అర్చన సురేష్, సోమిరెడ్డి సత్తి, విజయ్ వావిలాల, సత్య వేమూరి, నైపర్‌డీన్ డాక్టర్ శ్రీనివాస్ నందూరి, డాక్టర్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.



తారలు దిగివచ్చిన వేళ..

సందడిగా ఫిలింఫేర్ గ్లామర్ అండ్ స్టైల్ అవార్డ్స్ ఈవెంట్



నాని



సిద్ధార్థ్, ఆదితి రావ్ హైదరీ



అడివి శేష్

సాక్షి, సిటీబ్యూరో: ప్రతిష్టాత్మక 'ఫిలింఫేర్' సంస్థ ఆధ్వర్యంలో తొలిసారి పలువురు సినీతారలకు 'యూజెనిక్స్ ఫిలింఫేర్ గ్లామర్ అండ్ స్టైల్ సౌత్-2025' అవార్డులను అందించారు. నగరంలోని పార్క్ హయత్ వేదికగా శనివారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమంలో సినీ నటులు నాని, అడివి శేష్, సిద్ధార్థ్, ఆదితి రావ్ హైదరీ, అల్లు శిరీష్, మంచు లక్ష్మి తదితరులు సందడి చేశారు. మొదటి ఎడిషన్‌లో భాగంగా అందించిన ఈ అవార్డుల కార్యక్రమంలో హాటెస్ట్ స్టార్ ఆఫ్ ది ఇయర్ (మేల్)తో పాటు మ్యాన్ ఆఫ్ స్టైల్ అండ్ సబ్‌స్టాన్స్ అవార్డును హీరో నాని అందుకున్నారు. మోస్ట్ గ్లామరస్ యూత్ ఐకాన్ (ఫీమేల్), స్టైల్ ఐకాన్ (ఫీమేల్)గా హీరోయిన్ రాశీ ఖన్నా నిలిచారు. హాట్ స్టెప్పర్ ఆఫ్ ది ఇయర్ (మేల్)గా అడివి శేష్, హాట్ స్టెప్పర్ ఆఫ్ ది ఇయర్ (ఫీమేల్)తో పాటు హాటెస్ట్ స్టార్ ఆఫ్ ది ఇయర్ (ఫీమేల్)గా మాళవిక మోహనన్ ఎంపికయ్యారు. సిద్ధార్థ్-ఆదితి రావు హైదరిలకు మోస్ట్ ఫ్యాషన్ స్టార్ కపుల్ అవార్డు లభించింది. సుధీర్ బాబు మోస్ట్ గ్లామరస్ స్టార్‌గా ఎంపిక కాగా అనిల్ రావిపూడి మోస్ట్ స్టైలిష్ డైరెక్టర్‌గా నిలిచారు. దేవిశ్రీ ప్రసాద్ అల్టిమేట్ మావెరిక్ మ్యూజిక్ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు.



రాశీ ఖన్నా

వీ స్కిల్.. వీ ఎనేబుల్

యూత్ స్కిల్లింగ్ అంబాసిడర్లుగా విద్యార్థులు

యువ నైపుణ్య వారోత్సవాల్లో 'వీ స్కిల్ 2025'

వీ హబ్ ఆధ్వర్యంలో నిర్వహణ

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థులే అంబాసిడర్లుగా మారితే.. మార్పు కోసం తాము సైతం అంటే... అది సమాజహితం అవుతుంది. అది యువత నైపుణ్యాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది.. సరిగ్గా అలాంటిదే వీ హబ్‌లోని వీ-ఎనేబుల్ ప్రోగ్రామ్. ఈ ప్రోగ్రామ్‌కు యువతులు, విద్యార్థినులే సారథులు. మహిళా పారిశ్రామికవేత్తల సాధికారత కోసం స్థాపించిన వీ హబ్ ఆధ్వర్యంలో వీ స్కిల్ 2025-యువ నైపుణ్య వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గత నెలలో పది రోజుల ప్రాజెక్టుగా వీ స్కిల్ యువ నైపుణ్య ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. హైటెక్స్ వేదికగా ప్రతిష్టాత్మకంగా జరిగిన ఆగస్టు ఫెస్ట్ కార్పొరేట్ స్టేజ్‌పై ఘనంగా ముగిశాయి. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని వీ-ఎనేబుల్ ప్రోగ్రామ్‌లోని యువతులు, విద్యార్థినులే ముందుండి నడిపించారు. ప్రభుత్వ విద్యాసంస్థలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థుల్లో నైపుణ్యాలు, నాయకత్వం, సమానత్వం, సమగ్ర అభివృద్ధి పట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు.





వర్క్‌షాప్‌లు.. కమ్యూనిటీ స్కిల్లింగ్ సెషన్లు..

వీ-ఎనేబుల్ విద్యార్థులు యూత్ స్కిల్లింగ్ అంబాసిడర్లుగా మారి, సహవిద్యార్థులకు నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. హైదరాబాద్‌లోని పాఠశాలలు, కళాశాలలు, అనాథాశ్రమాలు, కమ్యూనిటీ కేంద్రాల్లో పది రోజులపాటు కమ్యూనికేషన్, నాయకత్వం, స్టోరీ టెల్లింగ్, స్వీయ బ్రాండింగ్ వంటి ముఖ్య నైపుణ్యాలపై సెషన్లు నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా 21 బృందాలు, 87 మంది సభ్యులు కలిసి 750పైగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. 80 గంటలకుపైగా బోధన సమయం కేటాయించి, 25 కంటే ఎక్కువ ప్రభుత్వ పాఠశాలలు, ఆర్థికంగా వెనుకబడిన సంఘాలను చేరుకున్నారు. పలు వర్క్‌షాప్‌లు, కమ్యూనిటీ స్కిల్లింగ్ సెషన్లు నిర్వహించారు. భారతదేశంలో మొదటి కాంపిటేటివ్ ఎగ్జామ్స్ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ అయిన లేస్ (ఎల్ఏసీఈ) ఈ కార్యక్రమానికి స్పాన్సరర్‌గా వ్యవహరించింది. ఫెస్టులో విభిన్న రంగాలకు చెందిన ప్రముఖులతో వీ-ఎనేబుల్ విద్యార్థులు సన్మానాన్ని అందుకున్నారు.



వరదను కట్టడి చేద్దాం .. ట్రంక్ లైన్ గీద్దాం

▶ మొదటి పేజీ తరువాయి

మార్పు చేర్పులపై జీహెచ్ఎంసీ అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. కాగా గంగూబాయి కుంట ప్రాంతంలో 25 ఏళ్ల క్రితం చెరువు ఉండేదని, అక్కడ బతుకమ్మ ఆడేవారమని స్థానికులు ముఖ్యమంత్రికి వివరించారు. ఆ కుంటను కొంతమంది పూడ్చేసి ప్రైమ్ ఆసుపత్రికి వచ్చే వాహనాల పార్కింగ్ కోసం వినియోగిస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి ఆ కుంట పూర్వాపరాలను పరిశీలించి చర్యలు చేపట్టాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు సూచించారు.

బాలుడి భుజంపై చేయి వేసి నడుస్తూ..

బౌద్ధనగర్‌లో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డికి ఏడో తరగతి బాలుడు జశ్వంత్ వరద సమస్యను వివరించాడు. బస్తీలో మహిళలతో కలిసి నిలబడి ఉన్న జశ్వంత్‌ను పిలిచిన రేవంత్‌రెడ్డి వరద పరిస్థితిపై ఆరా తీశారు. ఆ బాలుడి భుజంపై చేయి వేసి కాలనీలో నడుచుకుంటూ వివరాలను తెలుసుకున్నారు. తాను ఏడో తరగతి చదువుతున్నానని, వర్షాకాలంలో చదువులకు దూరం అవుతున్నానని బాలుడు సీఎంకు తెలిపాడు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరద నీరు ఇంట్లోకి వచ్చి పుస్తకాలు తడిసిపోయాయని చెప్పాడు. దీంతో భవిష్యత్తులో వరద పరిస్థితులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపిస్తామని బాలుడికి సీఎం హామీ ఇచ్చారు. మరోవైపు వరద నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని అమీర్‌పేట కార్పొరేటర్ కేతినేని సరళ.. సీఎంను కోరారు. స్థానిక డ్రైనేజీ వ్యవస్థ వివరాలను ఆమె వెల్లడించారు. ఎర్రగడ్డ, యూసుఫ్‌గూడ ప్రాంతం నుంచి వరద నీరు పెద్ద ఎత్తున వస్తోందని, లెవలింగ్ సరిగా లేకపోవడంతో వరద నీరు నాలాల్లోకి వెళ్లక కొన్ని బస్తీలు ముంపునకు గురవుతున్నాయని వివరించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, జీహెచ్ఎంసీ, జల మండలి అధికారులు సీఎం వెంట ఉన్నారు.


జశ్వంత్‌తో కలిసి కాలనీలో తిరుగుతున్న సీఎం రేవంత్

ట్రంక్ లైన్ అంటే ఏమిటి?

హైదరాబాద్ మహానగర మురుగునీటి వ్యవస్థలో సుమారు 612 కిలోమీటర్ల మేర ప్రధాన సీవరేజీ ట్రంక్ లైన్ ఉండగా వాటికి అనుబంధంగా సుమారు 9,769 కిలోమీటర్ల వరకు మురుగు నీటి పైప్‌లైన్ విస్తరించి ఉంది. ఈ మొత్తం వ్యవస్థలో ట్రంక్ లైన్ కీలకం. చిన్న చిన్న పైపుల ద్వారా వచ్చే మురుగునీటిని భారీ పైపుల్లోకి మళ్ళించి వ్యర్థ జలాల శుద్ధి కేంద్రానికి లేదా మురుగు నీటిని వదిలే ప్రదేశానికి పంపించడాన్ని ట్రంక్ లైన్ వ్యవస్థగా పిలుస్తున్నారు. ట్రంక్ లైన్లు సాధారణంగా పెద్ద వ్యాసం (600 డయా (2.5 మీటర్లు)తో కూడిన పైపులను కలిగి ఉంటాయి. పెద్ద మొత్తంలో మురుగు నీటిని ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి తరలించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

మంచిగా చదువుకో అన్నారు..!

మా కాలనీలో నన్ను చూసిన ముఖ్యమంత్రి..'బాబు ఇక్కడ రా' అని పిలిచారు. 'నిన్న మీ ఇంటి దగ్గరకు వాటర్ వచ్చాయి కదా? ఎంత వచ్చాయి?' అని అడిగారు. నేను మునిగిపోయేంత వచ్చాయని చెప్పా. మీకు ఇంటికి ఏమైనా మరమ్మతులు కావాలా? అని అడిగితే..అవును సార్..గేట్లు పెట్టియ్యాలె సార్ అని అన్నా. పెట్టిస్తానన్న సీఎం.. పుస్తకాలు తడిచాయా? అంటూ ఆరా తీశారు. 'మంచిగా చదువుకో.. మళ్లీ వాటర్ వస్తే నాకు ఫిర్యాదు చెయ్యి కవర్ చేసేస్తా..' అని హామీ ఇచ్చారు.

– జశ్వంత్, ఏడో తరగతి విద్యార్థి, బౌద్ధనగర్

రాయలసీమ ఎత్తిపోతలు ఆపండి

▶ మొదటి పేజీ తరువాయి

శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరితో కలిసి భట్టి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ద్వారా రోజుకు ఒక టీఎంసీ విడుదల చేస్తేనే లక్షల ఎకరాల భూమి సాగవుతోందని, పోతిరెడ్డిపాడు ద్వారా రోజుకు 11 టీఎంసీలు తరలిస్తే ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. శ్రీశైలం ప్రాజెక్టు సైతం 25 రోజుల్లోనే ఖాళీ అవుతుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వల్లనే ఏపీలో బనకచర్ల, శ్రీశైలం లిఫ్ట్ ఆగిపోయాయని వెల్లడించారు.

బీజేపీ, బీఆర్ఎస్ వల్లే నష్టం..

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని బీఆర్ఎస్ సర్కారు కలిసి దొంగచాటుగా ఆర్డినెన్స్ తెచ్చి భద్రాచలం డివిజన్‌లోని ఏడు మండలాలను ఏపీలో కలిపి, గిరిజనులకు చెందిన 2 లక్షల ఎకరాలు పోలవరానికి ధారాదత్తం చేశారని భట్టి విక్రమార్క ఆరోపించారు. గిరిజనులపై ఏ మాత్రం ప్రేమ ఉన్నా పోలవరం ఎత్తు తగ్గించి రెండు లక్షల ఎకరాలను కాపాడాలని ఏపీ సీఎంను డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాజెక్టులు పూర్తయ్యాక నికర జలాలు, వరద జలాల వాటా తేలాకనే బనకచర్ల ప్రస్తావన తీసుకురావాలని స్పష్టంచేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మధిర నియోజకవర్గంలోని 30 గ్రామాలను నాగార్జునసాగర్ రెండో జోన్‌లోకి మార్చి, రూ.600 కోట్లతో జవహర్ ఎత్తిపోతల పథకానికి అనుమతులు ఇచ్చిందని తెలిపారు.

అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టు దేవాదుల

రాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన ప్రాజెక్టు దేవాదుల అని భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ములుగు జిల్లా దేవాదుల చొక్కారావు ఎత్తిపోతల పథకం, సమ్మక్క–సాగర్ బరాజ్‌ను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వాకిటి శ్రీహరితో కలిసి వారు ఆదివారం పరిశీలించారు. ముందుగా 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రానికి శంకుస్థాపన చేశారు. అనంతరం దేవాదుల పంప్ హౌస్ వద్ద సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి, ఉత్తమ్ మాట్లాడుతూ.. దేవాదుల ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూమి సేకరణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 28 వేల ఎకరాల భూ సేకరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భూ నిర్వాసితులకు చెల్లించేందుకు రూ.67 కోట్లు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మరింత భూ సేకరణ కోసం రూ.179 కోట్ల వరకు అవసరమని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్‌ను కూల్చింది బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతేనని ఆరోపించారు. ఇచ్చంపల్లి తుమ్మిడిహెట్టి బరాజ్‌ను రూ.38 వేల కోట్లతో కట్టి తీరుతామని భట్టి, ఉత్తమ్ స్పష్టం చేశారు. కాగా, దేవాదుల నుంచి వేరే ప్రాంతాలకు నీళ్లు తీసుకుపోతున్నారని, తన నియోజకవర్గానికి నీళ్లు ఇవ్వాలని మంత్రి సీతక్క కోరారు. రామప్ప– లక్నవరంను అనుసంధానిస్తూ కెనాల్ నిర్మించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, కడియం శ్రీహరి, నాగరాజు, మురళీనాయక్, ఇరిగేషన్ కమిషనర్ ప్రశాంత్ పాటిల్ పాల్గొన్నారు.


జవహర్ ఎత్తిపోతల పథకం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి, ఉత్తమ్, వాకిటి శ్రీహరి తదితరులు

అప్రజాస్వామిక, అరాచకవాది చంద్రబాబు

రౌడీ రాజకీయాలు తప్ప ప్రజల అభిమానాన్ని, మనసును గెలుచుకోలేరు

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపాటు

అడ్డగోలుగా పోలింగ్ బూత్‌ల మార్పిడి ఇలా..

పోలింగ్ స్టేషన్ నెంబరు	ఓటర్లు	ప్రస్తుత పోలింగ్ స్టేషన్	మార్చిన పోలింగ్ స్టేషన్	పెరిగే దూరం
6	1-834	ఎర్రబెల్లి, ఎంపీ ఎలిమెంటరీ స్కూల్	నల్లపురెడ్డిపల్లి, జెడ్పీహెచ్ స్కూల్	2 కిలోమీటర్లు
7	835-1,668	ఎర్రబెల్లి, ఎంపీ ఎలిమెంటరీ స్కూల్	నల్లపురెడ్డిపల్లి, జెడ్పీహెచ్ స్కూల్	2 కిలోమీటర్లు
8	1,669-2,224	నల్లగొండువారిపల్లి, ఎంపీ ఎలిమెంటరీ స్కూల్	నల్లపురెడ్డిపల్లి, జెడ్పీహెచ్ స్కూల్	4 కిలోమీటర్లు
9	2,225-2,780	నల్లపురెడ్డిపల్లి, జెడ్పీహెచ్ స్కూల్	ఎర్రబెల్లి, ఎంపీ ఎలిమెంటరీ స్కూల్	2 కిలోమీటర్లు
10	2,781-3,336	నల్లపురెడ్డిపల్లి, జెడ్పీహెచ్ స్కూల్	ఎర్రబెల్లి, ఎంపీ ఎలిమెంటరీ స్కూల్	2 కిలోమీటర్లు
11	3,337-3,901	నల్లపురెడ్డిపల్లి, జెడ్పీహెచ్ స్కూల్	నల్లగొండువారిపల్లి, ఎంపీ ఎలిమెంటరీ స్కూల్	4 కిలోమీటర్లు



సాక్షి, అమరావతి: చంద్రబాబు అనే వ్యక్తి ఒక అప్రజాస్వామిక, అరాచక వాది అని.. రౌడీ రాజకీయాలు తప్ప ప్రజల అభిమానాన్ని, ప్రజల మనసును గెలుచుకుని రాజకీయాలు చేయరని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కుట్రలు చేసి, దాడులు, దౌర్జన్యాలు చేసి, అబద్ధాలు చెప్పి, మోసాలు చేసి, వెన్నుపోట్లు పొడిచి కుర్చీని లాక్కోవాలని చూస్తున్నారనడానికి మరోమారు మన కళ్లెదుటే రుజువులు కనిపిస్తున్నాయంటూ దెప్పి పొడిచారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యానికి పాతర వేస్తూ ఆయన చేస్తున్న నిస్సిగ్గు, బరితెగింపు రాజకీయాలే దీనికి సాక్ష్యాలు అంటూ ఎత్తిచూపారు. ముఖ్యమంత్రిగా తనకున్న అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగనీయకుండా, కుట్ర పూరితంగా, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు, ఆయన అడుగులకు మడుగులొత్తే కొంత మంది అధికారులు, టీడీపీ అరాచక గ్యాంగులు, ఈ గ్యాంగులకు కొమ్ముకాసే మరికొంత మంది పోలీసులు.. వీరంతా ఒక ముఠాగా ఏర్పడి అక్కడి ఎన్నికను హైజాక్ చేయడానికి దుర్మార్గాలు, దారుణాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల ఉప ఎన్నికల్లో చంద్రబాబు అమలు చేస్తున్న కుట్రపూరిత పన్నాగాన్ని సాక్ష్యాధారాలతో వివరిస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

- పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చింది మొదలు పోలీసుల అరాచకాలు పెరిగిపోయాయి. వందల మంది వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను బైండోవర్ చేశారు. తమ జీవితంలో ఎప్పుడూ పోలీస్‌స్టేషన్ గడప తొక్కని వారిని, ఎలాంటి కేసులు లేని వారిని కూడా బైండోవర్ చేసి, వైఎస్సార్‌సీపీ తరఫున పని చేస్తున్న వారిని, ప్రచారం చేస్తున్న వారిని పోలీసులను ఉపయోగించుకుంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇది ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.
- ఎన్నికల్లో భయాన్ని నింపడానికి ఆగస్టు 5న పులివెందులలో ఓ వివాహానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ గ్యాంగులు దాడి చేశాయి. ఈ ఘటనలో అమరేష్‌రెడ్డి, సైదాపురం సురేష్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. అడ్డుకోబోయిన పెళ్లి వారిని, శ్రీకాంత్, నాగేశ్, తన్మోహన్ రెడ్డి తదితరులపైనా దాడికి దిగారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున పని చేస్తే ఇలానే దాడులు చేస్తామంటూ హెచ్చరికగా దీనికి పాల్పడ్డారు.
- ఆగస్టు6న ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వేల్పుల రామలింగారెడ్డిలను హత్య చేయడమే లక్ష్యంగా నల్లగొండువారిపల్లె వద్ద వారు ప్రయాణిస్తున్న కారుపై టీడీపీ గ్యాంగులు కర్రలు, రాళ్లు, రాడ్లతో దాడి చేసి, వీరిని తీవ్రంగా గాయపరిచారు. కారుని బద్దలు కొట్టారు. పెట్రోల్ పోసి ఆ కారుకు నిప్పంటించే ప్రయత్నం కూడా చేశారు. రమేష్ యాదవ్‌కు గాయాలుకాగా, తీవ్ర గాయాలతో రక్తం ఓడుతున్న వేల్పుల రామలింగారెడ్డిని ఆస్పత్రిలో చేర్పించారు. లా అండ్ ఆర్డర్ కాపాడాల్సిన పోలీసులు పూర్తిగా ప్రేక్షక పాత్ర వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులెవ్వరినీ పల్లెల్లో తిరగనీయకూడదని, ఒకవేళ అలా చేస్తే ఈ రకంగా దాడులు చేస్తామన్న సంకేతాలు ఇవ్వడానికే టీడీపీ గ్యాంగులతో ఈ దారుణాలకు ఒడిగట్టారు.
- తప్పు చేసిన వారిని అరెస్టులు చేయాల్సింది పోయి, ఆగస్టు 6వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు వైఎస్సార్‌సీపీ నాయకులపైనే తప్పుడు కేసు పెట్టారు. ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేల్పుల రామలింగారెడ్డిపై దాడి చేసిన వారిలో ఒక్కరిని కూడా పోలీసులు అరెస్టు చేయకపోగా, జరగని ఘటనను జరిగినట్టుగా ఒక తప్పుడు ఫిర్యాదును సృష్టించి, దాని ఆధారంగా బాధితుడైన వేల్పుల రాము సహా మరో 50 మందిని నిందితులుగా పేర్కొంటూ ఎస్సీ, ఎస్టీ, హత్యాయత్నం కేసు పెట్టారు. ఈ తప్పుడు కేసును వాడుకుని, ఇప్పటికే పలు అరెస్టులు చేశారు. పోలింగ్ రోజున మరింత మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను నిర్బంధించే కుట్రను అమలు చేస్తున్నారు.
- ఆగస్టు 8న వైఎస్సార్‌సీపీకి చెందిన ఒక నాయకుడిని బెదిరించి, భయపెట్టి, ప్రలోభపెట్టి, తమ వైపునకు లాక్కుని, అలా పార్టీ మారిన వ్యక్తి నుంచి తప్పుడు ఫిర్యాదు తీసుకుని.. తప్పుడు కేసుపెట్టి, దాని ఆధారంగా వైఎస్సార్‌సీపీకి చెందిన రాఘవరెడ్డి, గంగాధరరెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకరరెడ్డిలకు నోటీసులు జారీ చేశారు.
- అధికార పార్టీతో చేతులు కలిపిన అధికారులు.. ఆగస్టు 8న వైఎస్సార్‌సీపీ ఓట్లను తగ్గించేందుకు పల్లెల పోలింగ్ బూత్‌లను ఆ గ్రామాల్లో కాకుండా పక్క గ్రామాలకు మార్చారు. ఓటు వేయాలంటే రెండు గ్రామాల ప్రజలు 2 కి.మీ, మరో రెండు గ్రామాల ప్రజలు 4 కి.మీ దూరం వెళ్లాల్సి ఉంటుంది. పులివెందుల జెడ్పీటీసీలో 10,601 ఓట్లు ఉంటే అందులో దాదాపు 4 వేల మంది ఓటర్లను, పక్కా వైఎస్సార్‌సీపీకి చెందిన గ్రామాలకు చెందిన వారిని ఈ రకంగా ఇబ్బంది పెడుతున్నారు. వీళ్లు ఓటేయడానికి వెళ్లకుండా బెదిరించడం, భయపెట్టడం, భౌతిక దాడులకు దిగడం, ఓటు వేయనీయకుండా అడ్డుకుని, తద్వారా ఓటింగ్‌ను తగ్గించడం, బూత్‌లను ఆక్రమించుకుని రిగ్గింగ్‌కు పాల్పడటం.. ఈ మాదిరి చంద్రబాబు కుట్ర చేస్తున్నారు. (పోలింగ్ బూత్‌లను అడ్డగోలుగా ఎలా మార్చారన్నది టేబుల్‌లో పరిశీలించగలరు.)
- నల్లగొండువారిపల్లె వద్ద టీడీపీ గ్యాంగుల దాడిలో గాయపడ్డ వేల్పుల రామలింగారెడ్డిపైనే ఆగస్టు 8వ తేదీ రాత్రి ఎస్సీ, ఎస్టీ తప్పుడు కేసు పెట్టిన ఘటనలో 12 మందిని అరెస్టు చేశారు. ఇందులో కొంత మంది, ఆ ఘటన జరిగినట్టుగా పోలీసులు చెబుతున్న సమయంలో బైండోవర్ ప్రక్రియలో భాగంగా అదే పోలీస్‌స్టేషన్లో, పోలీసుల సమక్షంలోనే ఉన్నారు. అయినా వారి మీద కూడా ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టారు. సాక్ష్యాలు, రుజువులు చూపించడంతో తప్పని పరిస్థితుల్లో పోలీసులు వీరిని వదిలి పెట్టాల్సి వచ్చింది. మిగిలిన 8 మందిని ఈ తప్పుడు కేసులో రిమాండ్‌కు తరలించారు. ఈ తప్పుడు కేసులోనే టీడీపీ వాళ్లు ఎవరు కోరితే వారిని నిర్బంధించే పనిలో పోలీసులు ఉన్నారు. విచిత్రం ఏంటంటే, టీడీపీ కండువా కప్పుకోగానే ఒకర్ని ఈ కేసులో నిందితుల జాబితా నుంచి తప్పించారు.
- ఎన్నికల పోలింగ్ రోజున ఓటింగ్ శాతం తగ్గించేందుకు, తాము చేసే దాడులు, దౌర్జన్యాలు, బూత్ ఆక్రమణలు, రిగ్గింగ్‌లు కనిపించకుండా ఉండేందుకు, అక్కడ వాస్తవాలేమీ బయటకు తెలియనీయకుండా ఉండేందుకు మీడియాను కట్టడి చేస్తున్నారు. వారిపైనా దాడులకు సిద్ధమవుతున్నారు. లైవ్ వాహనాలను, వాటికి సంబంధించిన కిట్లను ధ్వంసం చేయడానికి టీడీపీ గ్యాంగులు ఇప్పటికే తిరుగుతున్నాయి.

అసలు ఇవి ప్రజాస్వామ్య ఎన్నికలు అని చెప్పుకునేందుకు సిగ్గుపడాలి. అయినా దేవుడి మీద, ప్రజల మీద నమ్మకం ఉంది. అంతిమంగా ధర్మమే గెలుస్తుంది.

14 నెలలుగా పట్టలేదు..

ఒక్క ఇల్లూ కట్టలేదు

పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పనపై కూటమి ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యం

పునరావాస కాలనీల్లో ఇప్పటికీ ప్రారంభం కాని 16,170 ఇళ్ల నిర్మాణం

2024, మే నాటికి పూర్తయిన 3,114 ఇళ్లనూ ఇవ్వని సర్కారు

అప్పటికే దాదాపు పూర్తికావొచ్చిన 2,279 ఇళ్లను పట్టించుకోని ప్రభుత్వం

రెండు విడతలుగా రూ.5,052.71 కోట్లు అడ్వాన్సుగా ఇచ్చిన కేంద్ర జల్‌శక్తి శాఖ

వాటిని పోలవరం పనులు, పునరావాసం కల్పనకే వినియోగించాలంటూ షరతు

అయినా రూ.2,135.35 కోట్ల అడ్వాన్సు నిధులు మళ్లింపు

పునరావాసం కల్పించకపోవడంతో నిర్వాసితుల తీవ్ర ఇబ్బందులు

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సామరస్య మార్గమే సరి..

- నేతల మధ్య వివాదాలపై కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ నిర్ణయం
- గాంధీభవన్‌లో రెండు గంటలకుపైగా సమావేశం
- వరంగల్ నేతల గొడవకు పరిష్కారం..
- అనిరుధ్‌రెడ్డి వ్యవహారమూ ఓ కొలిక్కి
- అందరితో కలిసి పనిచేస్తాం: కొండా మురళి
- చర్చకు రాని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వ్యవహారం

సాక్షి, హైదరాబాద్: పార్టీలోని అంతర్గత విభేదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించే దిశగా టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ముందుకెళుతోంది. నేతల మధ్య ఉన్న అభిప్రాయభేదాలతోపాటు పార్టీ లైన్‌ను దాటి మాట్లాడారని వచ్చిన ఫిర్యాదులను రాజీ మార్గంలో పరిష్కరిస్తోంది. అందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నేతల మధ్య ఉన్న పంచాయితీని ఓ కొలిక్కి తెచ్చింది. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో పార్టీ లైన్ దాటి మాట్లాడారని ఆరోపణలు ఎదుర్కొంటున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వ్యవహారానికి కూడా ముగింపు పలికింది.

రెండు గంటలకు పైగా భేటీ

టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఆదివారం గాంధీభవన్‌లో సమావేశమైంది. చైర్మన్ మల్లు రవి అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో సభ్యులు అనంతుల శ్యాంమోహన్, కమలాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా నేతల పంచాయితీపై చాలాసేపు చర్చించారు. మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి కూడా సమావేశానికి వచ్చి మరోమారు తన వాదనలు వినిపించారు. వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి తదితరులు ఇప్పటికే ఇచ్చిన సమాచారాన్ని కూడా కమిటీ పరిశీలించింది. దాదాపు రెండు గంటలపాటు ఇదే అంశంపై చర్చించి పరిష్కారాన్ని నిర్ణయించింది. జిల్లాలోని ఎమ్మెల్యేలతోపాటు పార్టీలోని ఇతర నాయకులందరితో కలిసి పనిచేస్తామని, తాను కానీ, తన సతీమణి సురేఖ కానీ వివాదాల జోలికి వెళ్లబోమని మురళి నుంచి లిఖితపూర్వక హామీ తీసుకున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి

వీడియో పంపిన అనిరుధ్‌రెడ్డి

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి గతంలో బనకచర్ల ప్రాజెక్టు గురించి పార్టీలైన్ దాటి మాట్లాడారని వచ్చిన ఫిర్యాదుపై కూడా క్రమశిక్షణ కమిటీ చర్చించింది. గాంధీభవన్‌కు వచ్చి వెళ్లాలని అనిరుధ్‌రెడ్డిని కమిటీ కోరగా, ఆయన అందుబాటులో లేనని కమిటీకి సందేశం పంపారు. ఆయన మాట్లాడిన వీడియోను కూడా కమిటీకి పంపారు. ఈ వీడియోను పరిశీలించిన కమిటీ అనిరుధ్‌రెడ్డిపై ఫిర్యాదును కూడా కొట్టివేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఇక, సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కమిటీలో ఎలాంటి చర్చ జరగలేదు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన చోట్ల ఉన్న ఫిర్యాదులు, గజ్వేల్, గద్వాల లాంటి నియోజకవర్గాల్లో నెలకొన్న పరిణామాలపై అందరినీ పిలిపించి మాట్లాడి సమస్యలు పరిష్కరించాలనే భావనలో క్రమశిక్షణ కమిటీ ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

పార్టీ ఆదేశాలు పాటిస్తాం: కొండా మురళి

క్రమశిక్షణ కమిటీతో సమావేశం ముగిసిన అనంతరం కొండా మురళి విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ ఆదేశాలను పాటిస్తామని చెప్పారు. జిల్లాలోని పార్టీ నేతలందరితో సమన్వయంతో ముందుకెళ్తామని తెలిపారు. తాము కాంగ్రెస్ పార్టీలోనే ఉంటామని, ఇతర ఏ పార్టీలోనూ ఇమడలేమన్నారు. భేటీ అనంతరం మల్లురవి మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా నేతల మధ్య ఉన్న విభేదాల సమస్యను ఓ కొలిక్కి తెచ్చామని తెలిపారు. అనిరుధ్‌రెడ్డి వ్యవహారంపై తమ నిర్ణయాన్ని పీసీసీ దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు.

పులివెందులలో అరాచకంపై చర్యలు తీసుకోండి

ఎస్ఈసీకి వైఎస్సార్‌సీపీ ప్రతినిధి బృందం విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో టీడీపీ అరాచకాలు, ప్రభుత్వ అధికార దుర్వినియోగం, నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ కేంద్రాల మార్పు, ఏకపక్షంగా వ్యవహరిస్తున్న పోలీస్ యంత్రాంగం తదితర అంశాలపై వెంటనే దృష్టి సారించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నికి ఆదివారం వైఎస్సార్‌సీపీ ప్రతినిధి బృందం ఫిర్యాదు చేసింది. ఈ అంశాలపై విచారణ జరిపి, తప్పు చేస్తున్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరింది. పులివెందులలో నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించి, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని విజ్ఞప్తి చేసింది. హైకోర్టు న్యాయవాదులు కొమ్మసాని శ్రీనివాస్‌రెడ్డి, సానేపల్లి రామలక్ష్మణ్‌రెడ్డి తదితరులు ఈ మేరకు ఆదివారం విజయవాడలో ఎన్నికల కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మీడియాకు వెల్లడించారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఖాయం

సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకల్లో మంత్రి పొన్నం

- సర్దార్ పాపన్న గొప్ప పోరాట యోధుడు: టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్
- బీసీలకోసం అనేక పథకాలు అమలు చేశాం: ఏపీ నేతలు జోగి రమేశ్, మార్గాని భరత్


అభివాదం చేస్తున్న మహేశ్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మార్గాని భరత్, పొన్నం ప్రభాకర్, జోగి రమేశ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం బీసీల అభ్యున్నతికి కృషి చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో జై గౌడ్ ఉద్యమం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం ఖాయమన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కేవలం ఒక వర్గానికి చెందిన వ్యక్తి కాదని, అన్ని వర్గాలకు చెందిన వ్యక్తి అని కొనియాడారు. ఏపీ మాజీ మంత్రి జోగి రమేశ్, మాజీ ఎంపీ మార్గాని భరత్‌లు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో బీసీ వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టినట్లు గుర్తుచేశారు. ప్రస్తుత ఏపీ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. సర్వాయి పాపన్న గౌడ్‌ను స్ఫూర్తిగా తీసుకుని బడుగు, బలహీన వర్గాల ప్రజలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న బలహీన వర్గాలను ఏకం చేసి పాలించిన గొప్ప పోరాట యోధుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, కర్ణాటక ఎమ్మెల్సీ జయదేవ్ గుత్తా, ఉద్యమ కమిటీ జాతీయ అధ్యక్షుడు రామారావు గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు గుండ్ర నారాయణ గౌడ్, కమిటీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు చిట్టి బొమ్మకిశోర్ గౌడ్ పాల్గొన్నారు.



ఆదర్శం అంటే...

మంచిమాట

''ఇది చేయాలనుకొంటున్నాను, అది చేయాలనుకొంటున్నాను.'' అని అంటూ ఉంటారు చాలా మంది. ఒక సారి చేసిన తరవాత చేయాలి అనుకోటానికి అవకాశం కానీ, అవసరం కాని ఏముంది? జీవితంలో ఫలానాది సాధించటం నా ఆదర్శం, ఎప్పటికైనా నేను ఆ విధంగా అవాలి అనుకుంటున్నాను – ఇటువంటి మాటలు యువత నుండి తరచుగా వినపడుతూ ఉంటాయి. అంటే, ఆ విధంగా ఉండటం వారికి ఇష్టం. కాని, ఉండే ప్రయత్నం మాత్రం చేయరు. వారికి ఏదైనా కావాలి అంటే మాత్రం వెంటనే వచ్చేయాలి. దానికి శ్రమ పడేది తాము కాదు కదా! అమ్మనో, నాన్ననో సతాయించి సాధించుకుంటారు. తాము చేయవలసిన వాటిని వంక చెప్పే ప్రబుద్ధులు కూడా ఉన్నారు.

అద్దాన్ని ఆదర్శం అంటారు. ఆదర్శాలు అద్దం లాంటివి. దానిలో ప్రతి బింబాలు మాత్రమే కనపడతాయి. బింబం కాదు. అయితే, ప్రతిబింబం బింబాన్ని సరిచేయటానికి పనికి వస్తుంది. చెదిరిన బొట్టు దిద్దుకోటానికో, చెరిగిన జుట్టుని సద్దుకోటానికో అద్దంలోని ప్రతి బింబం సహాయం చేస్తుంది. అందులో చూసి ముఖాన్ని సరి చేసుకోవచ్చు. ప్రతిబింబంలో సరి చేయటం కుదరదు. అద్దంలో ప్రతిబింబానికి బొట్టు పెడితే ముఖం మీదకి రాదు కదా! రాసి పెట్టుకున్న ఆదర్శాలు అద్దంలో ప్రతిబింబాల వంటివి. ఆచరణ ముఖం లాంటిది. అక్కడ చూస్తూ ఇక్కడ తగిన మార్పులు చేసుకుంటూ ఉండాలి. ఆదర్శాలని గుర్తు చేసుకుంటూ ప్రేరణ పొందాలి. ఆదర్శం వ్యక్తులు అయితే వారి వలె ఉండటం అలవాటు చేసుకోవాలి. ఆ స్థాయికి రావటానికి వారు ఏవిధంగా శ్రమించారో దానిని ఆదర్శంగా తీసుకోవాలి కాని, ఇప్పుడు వారు అనుభవిస్తున్న సుఖాన్ని, వైభవాన్ని కాదు. దురదృష్టవశాత్తు చాలామంది రెండవ దానినే ఆదర్శంగా తీసుకోవటం జరుగుతోంది. ఆదర్శం ఆచరణగా పరిణమించాలి.

ఆదర్శం పేరిట గోడ మీద రాస్తారు ''రేపు'' అని. ఆ రేపు ఎప్పటికీ రాదు. వెళ్ళిపోయింది నిన్న. వచ్చి మనకి అందుబాటులో ఉన్నది ఈ రోజు. ఆచరించాలి, లేదా ప్రయత్నం చేయాలి, లేదా మొదలు పెట్టాలి అంటే – ఇప్పుడే, ఈ క్షణమే సరి అయింది. పరిస్థితులు అనుకూలించినప్పుడు, నాకు వీలైనప్పుడు అనుకుంటే కుదరదు. ఎందుకంటే బద్ధకించే వారికి వాయిదా వేయటానికి ఏదో ఒక వంక దొరుకుతుంది. అలలు తగ్గాక సముద్రంలో స్నానం చేస్తాను అని ఒడ్డున కూర్చొన్నట్టు ఉంటుంది.

అంటే ఆదర్శాలు ఉండకూడదా? అనే ప్రశ్న వస్తుంది. ఉండాలి. చిన్న పిల్లవాడికి ఐఏఎస్ అవాలన్నది ఆదర్శం. ఈ క్షణాన అవలేడు కదా! దానికి ఒక సమయాన్ని నిర్దేశించుకోవాలి. దాని కోసం ఇప్పటి నుండి ప్రయత్నం చేయాలి. ఆ దిశగా శిక్షణ తీసుకోవాలి. ఇప్పటినుండి ఎందుకు? డిగ్రీ అయినాక చూద్దాం, అనుకుంటే కుదరదు కదా! ఆదర్శం వాస్తవంగా మారటానికి తగిన కృషి చేయాలి.

ఉన్నతమైన ఆదర్శాలు ఉండటం మంచిదే. నిజానికి ఉండాలి కూడా. ఆదర్శాలు వల్లెవేయటానికి బాగుంటాయి కాని, అవి ఆకాశ హర్మ్యాలు కాకూడదు. తన శక్తి సామర్థ్యాలకు తగినట్టు ఉండాలి. మృత్యువును జయించటం, బొందితో స్వర్గానికి వెళ్ళటం వంటి అసాధ్యమైనవి సాధించటం నా ఆదర్శం అనటం హాస్యాస్పదం. అవి సాధించటం కుదరదు కనుక ప్రయత్నం చేయటం వృథా అని మానేయటానికి ఒక

ఆదర్శాలను వాస్తవాలుగా పరిణమింప చేసుకోటానికి శక్తి మేరకు కృషి చేయాలి. ఒక వేళ అది ఫలించక పోయినా పరవా లేదు. ప్రయత్నం ప్రధానం. తన ఆదర్శాన్ని సాకారం చేయటానికి జీవితమంతా వెచ్చించారనే ఖ్యాతి మిగులుతుంది.

– డా.ఎన్. అనంతలక్ష్మి

ఆత్మదర్శిని

అదే నీ నిజ తత్త్వం

ఆత్మ చాలా బలమైనది. ఆత్మ సహకారంతో ఉన్నప్పుడు నిన్ను నువ్వు అర్థం చేసుకుంటావు. వ్యక్తి అనే ముసుగు నుండి, అహంకారపూరితమైన మనస్సు నుండి అతీతంగా ఎదగడం సులభమవుతుంది. అప్పుడు నీవు నీ ఆలోచనలతో, నమ్మకాలతో విడిపడతావు. నీ స్వస్థలమైన ఆత్మను చేరుకుంటావు.

ఒక చేపలమ్ముకునే ఆమె పూలమ్ముకునే వాళ్ళ ఇంట్లో బస చేయాల్సివస్తుంది. ఆమె చేపలవాసనకు అలవాటుపడి ఉండటం వల్ల ఆ ఇంట్లోని పూలవాసనకు నిద్ర పట్టదు. అప్పుడామె తాను అమ్ముకోవడానికి తెచ్చుకున్న ఎండుచేపల మీద నీరు చల్లి, అప్పుడు వచ్చిన వాసనను పీల్చుకుంటూ నిద్రపోతుంది. అంటే మనం అలవాటుకు బానిసలం కావడం వల్ల అది తప్పు అని తెలిసినా మానుకోము. అందులోనే కూరుకుపోతాం. అందువల్లే మనిషి దుఃఖం నుండి బయటపడలేక పోతున్నాడు. ఆత్మ వెదజల్లే పరిమళాన్ని కాదని మనస్సుకు బందీయై జీవితమంతా గడిపేస్తున్నాడు.

గత జ్ఞాపకాలను అన్నింటినీ అధిగమించేయాలి. అది ధ్యానం ద్వారానే సులభమవుతుంది. భవిష్యత్తు లేదు, ఊహలు లేవు, లక్ష్యాలు లేవు, సమస్యలు లేవు.... కేవలం ఈ క్షణంలో ఉంటావు. ఆ ప్రస్తుత క్షణానికి ఏ రూపమూ లేదు. అందరికీ ఒకలాగే ఉంటుంది. ఆత్మానుభవం జరుగుతుంది. అదే నీ నిజతత్వం. అక్కడ వ్యక్తిగా ఉండవు.





కొన్ని లక్షల, కోట్ల జన్మల క్రితం ఆత్మ ఎలా ఉండిందో ఇప్పుడూ అలాగే ఉంది. ఇంకో కోటి జన్మల తర్వాత కూడా అలాగే ఉంటుంది. సష్టి కూడా అలాగే ఉంటుంది. అది కాలానికి అతీతమన్నమాట. అది–అంతం లేవు. ఆ ఆత్మ తత్వంలో నీవు ఉన్నప్పుడు పుస్తక జ్ఞానమే అవసరం లేదు. నీవు చెప్పిందే జ్ఞానమవుతుంది.


– స్వామి మైత్రేయ, ఆధ్యాత్మిక బోధకులు

ఆధ్యాత్మికకథ

నమ్మినోల్లకు నమ్మినంత

అదొక పల్లెటూరు. ఊరి వెనుక ఒక పెద్ద గుట్ట ఉంది. ఊర్లోని ఒక భక్తుడికి ఆ గుట్టపైన గుడి కట్టాలనిపించింది.ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి గుడి నిర్మాణం పూర్తి చేశాడు.గుడి పక్కనే ఒక చిన్న పెంకుటిల్లు కట్టుకుని తల్లితో పాటు అక్కడే నివాసం ఉండే వాడు.

గుడి, ఊరికి దూరంగా ఉండటంతోను, కష్టపడి గుట్ట ఎక్కాల్సి రావడంతోనూ గ్రామస్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చేవారు కాదు. ఆ భక్తుడిలో బాధ, భయం మొదలయ్యాయి. కొండంత భారం మోయలేకపోతున్నానని తల్లితో చెప్పుకుని ఏడ్చాడు. అతడి బాధ చూసి ఆమె 'కష్టాలు కలకాలం కాపురముండవు. మనకూ మంచి రోజులు వస్తాయి. నమ్మినవాళ్ళని భగవంతుడు ఎన్నటికీ విడిచి పెట్టడు' అని ధైర్యం చెప్పేది.



పైకి గంభీరంగా ఉన్నా ఆమెలో కూడా బాధ లేకపోలేదు. హారతిపళ్ళెంలో పడే పైసలు చమురు ఖర్చులకే రావడం లేదని లోలోపలే ఆందోళన చెందేది. 'అయినా ఇది దైవసేవ. దేవుడే మనకు దారి చూపుతాడు' అని గట్టిగా నమ్మేది.

ఒకరోజు ఆమె గుడిపూజ సామానులు శుభ్రంగా కడిగి ఎత్తిపెడుతున్న సమయంలో హారతి పళ్ళెం గుట్ట బండరాయి మీద పడింది. పళ్ళెం పడిన చోట ఒక వీనుల విందైన రాగం ఆమెకు వినిపించింది.

'ఇంతలో అయ్యో... పళ్ళెం సొట్టబోయిందే..' అని బాధపడుతూ వచ్చాడు కొడుకు. కానీ ఆమె అలాగే బండరాయి మీద కూర్చుని చిన్న రాయి తీసుకుని కొట్టసాగింది.

ఉన్న పళ్ళెం సొట్ట పోయిందని బాధపడుతూ ఉంటే నువ్వేమి చేస్తున్నావని అడిగాడు. ఆమె చిన్నగా నవ్వింది. గుడి చుట్టూ ఉన్న బండరాళ్ళను రాతితో కొట్టి చూడసాగింది. తల్లి చేష్టలను వింతగా చూడసాగాడు కొడుకు.

ఆమె గట్టిగా ''మన కష్టాలు తీరిపోయాయి. గుడి పోషణ ఇక సులభం'' అని చెప్పింది. ఆశ్చర్యపోతూ ఆమె దగ్గరికి వెళ్ళి 'ఎలా?'' అని అడిగాడు. ''ఈ బండ రాళ్ళను కొట్టి చూస్తే, సరిగమపదనిసలు పలుకుతున్నాయి. వెంటనే శిల్పకళ గురువు స్థపతిని పిలిపించు. సప్తస్వరాల్లోని ఒక్కో రాగం పలికే బండను ఎంపిక చేసి వరుసగా పెట్టించాలి. ఆ రాగాలను పలికించడానికి ఒక రాయిని అందుబాటులో ఉంచాలి. వచ్చిన భక్తులు ఆసక్తిగా వీటిని కొట్టి సంతోషపడతారు'' అని చెప్పింది. మారుమాట్లాడకుండా తల్లి చెప్పినట్లే చేశాడు.

ఆ విషయం ఆ నోటా ఈ నోటా పాకి చుట్టూ ఉన్న గ్రామాలకు చేరింది. మొదట పిల్లలు, ఆ తర్వాత యువకులు, చిన్నగా ఊరిజనం, చుట్టుపక్కల గ్రామస్తులూ గుట్ట ఎక్కడం ప్రారంభించారు. దైవదర్శనం చేసుకుని సరిగమలు పలికిస్తూ సంతోషపడసాగారు. గుడి ఆదాయం చిన్నచిన్నగా పెరగసాగింది. తల్లీకొడుకు దేవుడికి నమస్కరిస్తూ 'నమ్మినోల్లకు నమ్మినంత' అనుకున్నారు.

– ఆర్.సి.కృష్ణస్వామి రాజు

ధర్మ జిజ్ఞాస

విష్ణువు రాముడిగా... కృష్ణుడిగా... ఇంకా అనేక రూపాలలో భూమిపై అవతరించాడని అంటారు కదా... మరి ఆ రూపాలలో ఆయన భూమిపై ఉన్నప్పుడు వైకుంఠంలో విష్ణువు ఉన్నట్లా? లేనట్లా?



'రామునిగా.. కృష్ణునిగా.. నారసింహుడిగా విష్ణువు భూమిపై అవతరించినప్పుడు ఆయా అవతారాలు పరిసమాప్తి అయ్యేంత వరకు వైకుంఠంలో విష్ణువు ఉన్నట్లా? లేనట్లా?' అనే విషయం తెలుసుకొనే ముందు ఒక ఉదాహరణ పరిశీలిద్దాం...

ఒకేలా ఉండే పది ప్రమిదలలో ఒకేవిధమైన వత్తులు వేసి, నూనె పోసి ముందు ఒక ప్రమిదను వెలిగించి, ఆ ప్రమిదతో మిగిలిన ప్రమిదలు వెలిగించి ఆ ప్రమిదల వరుసలలో పెట్టి; వేరే ఎవరినైనా ఈ ప్రమిదల వరుసలోని ఏ ప్రమిదతో నేను దీపం వెలిగించానో చెప్పగలవా అంటే ఆ వ్యక్తే కాదు ఎవరూ చెప్పలేరు; కారణం మిగిలిన ప్రమిదలను వెలిగించిన తొలి ప్రమిద వెలుగు తగ్గదు. మిగిలిన ప్రమిదల్లాగే ప్రకాశిస్తుంది...

అలాగే భగవంతుడు ఎన్ని అవతారాలు ఒకేసారి ఎత్తినా; విడివిడిగా ఎత్తినా తన అస్తిత్వాన్ని కోల్పోకుండా తన అసలు రూపంతో దర్శనమిస్తూనే ఉంటాడు... విష్ణువు నుంచి ఉద్భవించిన ఈ అవతారాలు తమ అవతార పరిసమాప్తి చెందిన తరువాత తమ మూల అవతారమైన శ్రీమన్నారాయణుడిలో ఐక్యమొందుతాయి... ఒకసారి ఐక్యమొందినా కూడా భక్తుల కోరిక మేరకు మరల, మరల అవే రూపాలతో అవసరమైనప్పుడు దర్శనమిస్తూనే ఉంటాయి.

ఈ విధంగా అమ్మవారు అంటే లక్ష్మీదేవి కూడా భూలోకంపై అవతరించారు; అవతరిస్తారు.

అలాగే శివ పార్వతులు, మిగిలిన దేవతలు సందర్భాన్ని బట్టి భూలోకంపై అవతరిస్తూ ఉంటారు.

– డి.వి.ఆర్.

సాక్షి సినిమా

రెండేళ్లల్లో ఆరు సినిమాలు



● శశి దేవిరెడ్డి, విజయ్ చిల్లా

'భలే మంచిరోజు' (2015) చిత్రంతో 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఆరంభించి, తొలి చిత్రంతోనే అభిరుచి గల నిర్మాతలు అనిపించుకున్నారు విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి. ఆ తర్వాత 'ఆనందో బ్రహ్మ' (2017), 'యాత్ర' (2019), 'శ్రీదేవి సోడా సెంటర్' (2021) వంటి చిత్రాలను నిర్మించారు. ఇప్పుడు ఒకేసారి ఆరు చిత్రాలకు శ్రీకారం చుట్టారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి మాట్లాడుతూ – ''మేం ఎప్పుడూ క్వాలిటీ కంటెంట్‌కే ప్రాధాన్యం ఇస్తాం. ఈ ఆరు సినిమాలకూ అదే ఫాలో అవుతున్నాం. వేరువేరు జానర్స్‌లో ఈ సినిమాలు ఉంటాయి. వచ్చే రెండేళ్లలో ఈ ఆరు సినిమాలను వరుసగా రూపొందించి, విడుదల చేస్తాం. ఇతర వివరాలు త్వరలో ప్రకటిస్తాం'' అని పేర్కొన్నారు.

అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తాం

– వల్లభనేని అనిల్‌కుమార్

వేతనాలు పెంచాలంటూ తెలుగు సినీ కార్మికులు కదం తొక్కారు. ఫిల్మ్ ఫెడరేషన్ అనుబంధ 24 క్రాఫ్టులకు చెందిన సుమారు 2 వేల మంది కార్మికులు జూబ్లీ హిల్స్ వెంకటగిరిలోని తెలుగు సినీ కార్మికుల సంఘం కార్యాలయం ముందు బైటాయించి, 30 శాతం వేతనాలు పెంచాలంటూ నినాదాలు చేశారు. వేతనాలు పెంచేవరకు షూటింగ్‌లకు హాజరయ్యేది లేదని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం ప్రతీ మూడేళ్లకోసారి 30 శాతం వేతనాలు పెంచాల్సి ఉంటుందని, గత జూన్ 30వ తేదీకి ఈ గడువు ముగిసిందని ఇప్పటిదాకా పెంచకపోవడమే కాకుండా 15 శాతం వేతనాలు పెంచుతామని ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ స్పష్టం చేయడాన్ని కార్మికులు వ్యతిరేకించారు. పెంచుతామన్న 15 శాతం వేతనాలు కూడా డ్యాన్సర్లు, ఫైటర్లు, టెక్నీషియన్లు (కెమెరా)కు పెంచేది లేదంటూ ఫిల్మ్ చాంబర్ చెప్పడాన్ని తప్పుబట్టారు. ఫిల్మ్ ఫెడరేషన్ 24 క్రాఫ్టులకు సమానంగా వేతనాలు పెంచాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలుగు సినీ కార్మికులు సంఘం అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ మాట్లాడుతూ– ''30 శాతం వేతనాలు ఇచ్చేవారికే పని చేస్తున్నాం. మేం గొంతెమ్మ కోరికలు కోరడం లేదు. ఫైటర్లు, డ్యాన్సర్లు, టెక్నీషియన్లకు కూడా పర్సంటేజీ పెంచాలి. కడుపు కాలితే వారే దారికి వస్తారన్న చందంగా నిర్మాతల చర్యలు ఉన్నాయి. విశ్వప్రసాద్ నోటీసులపై లీగల్‌గా వెళ్తాం. మాకు విశ్వప్రసాద్ నుంచి రూ. 90 లక్షలు బకాయిలు రావాల్సి ఉంది. చిరంజీవి ఎప్పటికప్పుడు మా వివరాలు తెలుసుకుంటున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కార్మికుల పక్షాన నిలబడినందుకు ధన్యవాదాలు. త్వరలో వారిని కలుస్తాం. 24 వేల మంది కార్మికులు ఉన్నారు. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తాం. 30 శాతం వేతనాలు పెంచాలన్నదే మా ప్రధాన డిమాండ్' అన్నారు.

– సాక్షి, బంజారా హిల్స్ ప్రతినిధి



● నాగవంశీ, ఎన్టీఆర్, అయాన్ ముఖర్జీ, హృతిక్ రోషన్, అక్షయ్ విధానీ, త్రివిక్రమ్, 'దిల్' రాజు

ఇంతకుమించి నాకు ఏ శక్తీ అవసరం లేదు – హీరో ఎన్టీఆర్

''మా నాన్నగారితో 'మీరు నాకు జన్మనిచ్చారు. కానీ ఈ జీవితం వాళ్లకే (ఫ్యాన్స్) అంకితం' అని చెప్పాను. ఇంతకంటే శక్తి నాకు ఏదీ అవసరం లేదు. నా ఆనందం, నా బాధల్లో తోడుగా ఉంటూ, నా కోసం దేవుళ్లకి మీరు చేసిన ప్రార్థనలకి ఎన్ని జన్మలెత్తినా మీ రుణం తీర్చుకోలేను. మీకు శిరస్సు వంచి, పాదాభివందనం చేస్తున్నా. ప్రతిసారీ ఒక కాలరే ఎగరేస్తాను. 'వార్ 2'కి డబుల్ కాలర్స్ ఎగరేస్తున్నాను. ఎవరు ఎన్ని మాట్లాడుకున్నా... బొమ్మ అదిరిపోయింది'' అంటూ ఎన్టీఆర్ ఎమోషనల్‌గా మాట్లాడారు.

హృతిక్ రోషన్, ఎన్టీఆర్ హీరోలుగా, కియారా అద్వానీ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'వార్ 2'. యశ్ రాజ్ ఫిల్మ్స్ పై ఆదిత్య చోప్రా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది. తెలుగులో నాగవంశీ రిలీజ్ చేస్తున్నారు.

ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఇంకా **ఎన్టీఆర్ మాట్లాడుతూ–** ''పాతికేళ్ల క్రితం 'నిన్ను చూడాలని' చిత్రంతో నా కెరీర్ మొదలైంది. ఆ సినిమా ప్రారంభోత్సవంలో నా పక్కన మా అమ్మ, నాన్నగారు తప్ప ఎవరూ లేరు. ఆ తర్వాత నా ఆఫీస్ దగ్గరకి ముజీబ్ అనే ఫ్యాన్ వచ్చాడు. ఎవరండీ మీరు అని అడిగితే, బాబు.. ఫ్యాన్ అన్నాడు. ఒక్క సినిమా కూడా రిలీజ్ కాలేదు... అప్పుడే ఏంటి? అంటే, మీరంటే పడి సచ్చిపోతాను... మీ వెంటే ఉంటానన్నాడు. ముజీబ్ తర్వాత మెల్లిగా ఒక్కొక్కరు ఒక్కొక్కరుగా ఈ పాతికేళ్లల్లో చాలామంది నాతో వచ్చారు. ఇందుకు కారణమైన మా నాన్నగారు కీర్తి శేషులు నందమూరి హరికృష్ణగారికి మొట్ట మొదటిగా శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నాను. మా అమ్మ షాలినిగారికి, మా అమ్మ లక్ష్మీ (కల్యాణ్ రామ్ తల్లి)గారికి కూడా. మా అన్న కీర్తిశేషులు జానకిరామ్‌గారికి, మా ఇంకో అన్న నందమూరి కల్యాణ్‌రామ్‌గారికి... వాళ్ల ఆశీస్సులు నాతో ఉన్నందుకు నా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అలాగే నాతో ప్రయాణం చేసిన దర్శక–నిర్మాతలకు నా శిరస్సు వంచి పాదాభివందనాలు చేసుకుంటున్నాను. నేను షూటింగ్‌లు, సినిమాలు చేస్తుంటే నాకు రత్నాల్లాంటి ఇద్దరు పిల్లల్నిచ్చిన నా భార్య ప్రణతికి, నా పెద్ద కొడుకు అభయ్, నా చిన్న కొడుకు భార్గవ్‌కి... అందరికీ హగ్స్.

హృతిక్‌గారి, నా జర్నీ ఒకే సమయంలో మొదలైంది. అందుకే ఇద్దరం 25 ఇయర్స్ జర్నీని సెలబ్రేట్ చేసుకుంటున్నాం. డ్యాన్స్‌లో నాకు మైఖేల్ జాక్సన్ తప్ప ఎవరూ ఆనేవాళ్ళు కాదు. కానీ నేను హృతిక్‌గారి డ్యాన్స్ చూసి, ఆశ్చర్యపోయా. హృతిక్ రోషన్ ఈజ్ గ్రేటెస్ట్ డ్యాన్సర్ ఆఫ్ అవర్ కంట్రీ అని చెబుతాను. సాంగ్ ('సలామ్ అనాలి' పాటను ఉద్దేశించి..) విషయంలో పోటీ లేదు. అయితే సోషల్ మీడియాలో తప్పుగా చెబుతున్నారు. ఇది సాంగ్ వర్సెస్ సాంగ్ కాదు. ఇద్దరు డ్యాన్సర్స్ చేసిన కాంప్లిమెంట్ సాంగ్. హృతిక్ రోషన్‌గారు ఆయనలో నన్ను చూసుకున్నానని చెప్పారు. అలాగే నాలో కూడా ఆయన్ను చూసుకున్నాను. అందరూ చెబుతున్నట్లుగా 'వార్ 2' అనేది ఎన్టీఆర్ హిందీ చిత్రపరిశ్రమకు వెళ్తున్నట్లుగానే కాదు... తెలుగు చిత్రపరిశ్రమకు హృతిక్ వస్తున్న సినిమా కూడా. ఇక్కడ నా అభిమానులందరూ నన్ను ఆదరించినట్లే మిమ్మల్ని ప్రేమిస్తారు... ఇది నా ప్రామిస్ సార్. మీ అభిమానులు గర్వపడేలా 'వార్ 2' ఉంటుందని చెప్పి, ఈ సినిమాలో నన్ను భాగస్వామ్యం చేసిన ఆదిత్య చోప్రాగారికి థ్యాంక్స్. 'వార్ 2' సినిమాను అయాన్ ముఖర్జీ మాత్రమే డైరెక్ట్ చేయగలడు. ఇద్దరు పెద్ద స్టార్స్ ఉన్న సినిమా చేయడం సులభం కాదు. ఈ సినిమా కోసం అయాన్ ముఖర్జీ ఎంత కష్టపడ్డాడో నాకు తెలుసు. ఈ సినిమాకి పనిచేసిన ప్రతి టెక్నీషియన్‌కు ధన్యవాదాలు.


పన్నెండేళ్ల క్రితం 'బాద్‌షా' ఫంక్షన్ అప్పుడు వరంగల్ ఫ్యాన్ ఒకరు తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోవడం జరిగింది. అప్పట్నుంచి పబ్లిక్ ఈవెంట్స్‌కు కాస్త దూరంగా ఉన్నాను. కానీ 25 ఏళ్ల పూర్తి కావడంతో మిమ్మల్నందరినీ కలుసుకోవాలనే తాయత్రయం ఉంది. ఈ వేడుకకు రావాలని వంశీ నన్ను ఫోర్స్ చేసినందుకు, వంశీ నన్ను ఫోర్స్ చేసేలా మీరందరూ వంశీని ఫోర్స్ చేసినందుకు థ్యాంక్స్'' అని చెప్పారు.

హృతిక్ రోషన్ మాట్లాడుతూ– ''తారక్ (ఎన్టీఆర్) మీకు (ఫ్యాన్స్) అన్న. నాకు తమ్ముడు. 'వార్ 2' కోసం కో స్టార్స్‌లా మా ప్రయాణం మొదలైంది. రియల్ లైఫ్‌లో బ్రదర్స్‌లా ముగిసింది. 'కహో నా ప్యార్ హై, క్రిష్, ధూమ్ 2' వంటి సినిమాలప్పుడు నాకు ప్రేక్షకుల నుంచి లభించిన ప్రేమ, 'వార్ 1' సినిమా సమయంలోనూ లభించింది. నేను ఆ సినిమాలో పోషించిన కబీర్ పాత్రను ఆడియన్స్ బాగా ఇష్టపడ్డారు. మళ్లీ కబీర్‌గా 'వార్ 2' సినిమాతో వస్తున్నాను. ఇప్పటివరకు నా కెరీర్‌లోని టాప్ మూవీగా 'వార్ 2'ను చెబుతాను. పైగా తారక్‌తో కలిసి నటించిన సినిమా ఇది. కొన్ని సందర్భాల్లో తారక్‌ను చూసి, యాక్టర్‌గా స్ఫూర్తి పొందాను. తారక్‌లో నన్ను నేను చూశాను. ఎంతో కొంత తారక్‌లో నేను కూడా ఉండి ఉంటాను. వన్ టేక్ స్టార్ తారక్. తను అమేజింగ్ చెఫ్ కూడా. మనం మరో సినిమా చేస్తామో లేదో కానీ... నీ బిర్యానీని నేనెప్పుడూ రుచి చూస్తూనే ఉండాలి. ప్రామిస్'' అంటుండగా, 'ప్రామిస్' అన్నారు ఎన్టీఆర్.

అయాన్ ముఖర్జీ మాట్లాడుతూ– ''హృతిక్, ఎన్టీఆర్ వంటి పెద్ద స్టార్స్‌ని డైరెక్ట్ చేయడాన్ని గొప్ప బాధ్యతగా ఫీలయ్యాను. ఈ సినిమా ప్రయాణంలో కాస్త ఒత్తిడికి గురయ్యా. 'వార్ 2' అనేది ఇద్దరు హీరోల సినిమా'' అని అన్నారు.

''హృతిక్‌ని తెలుగు ఇండస్ట్రీలోకి గ్రాండ్‌గా వెల్‌కమ్ చేస్తున్నాం. తారక్ అన్నను తెలుగు దర్శకులు ఇప్పటివరకు చూపించిన దానికంటే అయాన్‌గారు బాగా చూపించారని తెలుగు ప్రేక్షకులు గర్వపడతారు'' అని అన్నారు **నాగవంశీ.**


సస్పెన్స్... థ్రిల్



● లక్ష్మీ కోటేశ్వరరావు, జంపన్న, వివేక్ కూచిభొట్ల, కశికా, గగన్, సాహు గారపాటి

గగన్ బాబు, కశికా కపూర్ హీరో హీరోయిన్లుగా ఏకే జంపన్న దర్శకత్వంలో ఓ సినిమా రానుంది. తోట లక్ష్మీ కోటేశ్వరరావు నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత వివేక్ కూచిభొట్ల కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత సాహు గారపాటి క్లాప్ ఇచ్చారు. దర్శకుడు వీరశంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. తోట లక్ష్మీ కోటేశ్వరరావు ఈ సినిమా స్క్రిప్ట్‌ని జంపన్నకి అందించారు. అనంతరం గగన్ బాబు మాట్లాడుతూ– ''నా క్యారెక్టర్‌లో అద్భుతమైన భావోద్వేగాలు ఉన్నాయి. క్లైమాక్స్ అద్భుతంగా ఉంటుంది'' అని తెలిపారు. ''దర్శకుడు ఈ సినిమా కథ చెప్పగానే, గోల్డెన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌ను ఆరంభించి ఈ సినిమా తీస్తున్నాను. దేశం అంతా మాట్లాడుకునేలా ఈ సినిమా ఉంటుంది'' అని చెప్పారు లక్ష్మీ కోటేశ్వరరావు. ''ఈ సినిమా కథలో చాలా లేయర్స్ ఉన్నాయి'' అన్నారు జంపన్న. ఈ సినిమాకు సంగీతం: అనూప్ రూబెన్స్, కెమెరా: వీకే రామరాజు.

సీ–మంతం షురూ




● శ్రేయ భర్తీ

వజ్రయోగి, శ్రేయ భర్తీ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'సీ–మంతం'. సుధాకర్ పాణి దర్శకత్వంలో ప్రశాంత్ టాటా నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రం గ్లింప్స్‌ను విడుదల చేశారు. చేతులు వెనక్కి కట్టేసిన ఓ గర్భవతి, రక్తపు మడుగులతో ఈ గ్లింప్స్ సంగీత దర్శకుడు ఎస్. సుహాస్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో సాగుతుంది. ''సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందించిన చిత్రం ఇది'' అని నిర్మాత పేర్కొన్నారు.


ఎవరే నువ్వు...

సాత్విక్ వర్మ, ప్రీతి నేహా జంటగా నటించిన చిత్రం 'ప్రేమిస్తున్నా'. భాను దర్శకత్వంలో వరలక్ష్మీ పప్పుల సమర్పణలో కనకదుర్గారావు పప్పుల నిర్మించారు. ఈ చిత్రంలో 'ఎవరే నువ్వు...' అంటూ సాగే రెండో పాటను నటుడు విజయ్ సేతుపతి రిలీజ్ చేసి, ఈ ప్రేమకథా చిత్రం విజయం సాధించాలనే ఆకాంక్షను వ్యక్తపరిచారు. సిద్ధార్థ్ సాలూర్ స్వరపరచిన ఈ పాటకు పూర్ణచంద్ర సాహిత్యం అందించారు. ''మంచి మ్యూజికల్ లవ్ స్టోరీగా రూపొందించాం'' అన్నారు భాను.



● సాత్విక్, ప్రీతి

మరొక్కసారి ప్రేమ



● సంజన, నరేశ్

నరేశ్ అగస్త్య, సంజనా సారథి నటించిన చిత్రం 'మరొక్క సారి'. నితిన్ లింగుట్ల దర్శకత్వంలో బి. చంద్రకాంత్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ''ఆహ్లాదకరమైన ప్రేమకథతో రూపొందించిన ఈ చిత్రానికి భరత్ మాంచి రాజు మంచి పాటలు ఇచ్చారు. ఛాయాగ్రాహకుడు రోహిత్ బచు విజువల్స్ కనువిందుగా ఉంటాయి'' అని నిర్మాత పేర్కొన్నారు.

ముస్కాన్, నిషా, రాహుల్‌లకు స్వర్ణ పతకాలు

బ్యాంకాక్: ఆసియా అండర్–19 బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు అదరగొట్టారు. మూడు స్వర్ణాలు, ఏడు రజతాలు, నాలుగు కాంస్య పతకాలతో కలిపి మొత్తం 14 పతకాలను సొంతం చేసుకున్నారు. ఇందులో మహిళా బాక్సర్లవే తొమ్మిది పతకాలు ఉండటం విశేషం. ముస్కాన్ (57 కేజీలు), నిషా (54 కేజీలు) పసిడి పతకాలు నెగ్గగా... ఆర్తి కుమారి (75 కేజీలు), కృతిక వాసన్ (80 కేజీలు), ప్రాచీ టోకస్ (ప్లస్ 80 కేజీలు), విని (60 కేజీలు), నిషా (65 కేజీలు) రజత పతకాలు గెలిచారు. యశిక (51 కేజీలు), ఆకాంక్ష (70 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు. ఫైనల్స్‌లో ముస్కాన్ 3:2తో అయజాన్ ఎర్మెక్ (కజకిస్తాన్)పై, నిషా 4:1తో సిరుయ్ యాంగ్ (చైనా)పై నెగ్గారు. పురుషుల 65 కేజీల విభాగంలో రాహుల్ కుందు బంగారు పతకాన్ని సాధించాడు. ఫైనల్లో రాహుల్ 4:1తో యాకుబోవెక్ (ఉజ్బెకిస్తాన్)పై గెలిచాడు. ఫైనల్లో ఓడిన మౌజమ్ సుహాగ్ (65 కేజీలు), హేమంత్ సాంగ్వాన్ (90 కేజీలు) రజత పతకాలతో సరిపెట్టుకున్నారు. శివమ్ (55 కేజీలు), గౌరవ్ (85 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు.



ముస్కాన్ నిషా రాహుల్



‘స్టంప్డ్’ స్ఫూర్తిదాయకం

కిర్మాణీ ఆటోబయోగ్రఫీని ఆవిష్కరించిన సిరాజ్

సాక్షి, హైదరాబాద్: భారత మాజీ క్రికెటర్, 1983 వన్డే వరల్డ్ కప్ గెలిచిన టీమిండియా వికెట్ కీపర్ సయ్యద్ కిర్మాణీ జీవిత కథ ‘స్టంప్డ్’ను భారత జట్టు పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ ఆదివారం హైదరాబాద్‌లో ఆవిష్కరించాడు. ఈ సందర్భంగా సిరాజ్ మాట్లాడుతూ ‘1983లో భారత జట్టు వన్డే వరల్డ్‌కప్ గెలిచిన సమయంలో నేనింకా పుట్టనే లేదు. మీ వికెట్ కీపింగ్ అద్భుతంగా ఉండేదని ఎంతో మంది చెప్పేవారు. మీ ప్రదర్శన ఎందరికో స్ఫూర్తిదాయకం’ అని సిరాజ్ వ్యాఖ్యానించాడు. కిర్మాణీ మాట్లాడుతూ... ‘నాకు హైదరాబాద్‌తో మంచి అనుబంధం ఉంది. నా విద్యాభ్యాసం ఇక్కడే జరిగింది. అలాంటి ప్రదేశంలో పుస్తకావిష్కరణ జరగడం ఆనందంగా ఉంది. ఇందులో అప్పటి క్రికెట్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలు ఉన్నాయి’ అని అన్నారు. ఇటీవల ఇంగ్లండ్‌తో సిరీస్‌లో అద్వితీయ ప్రదర్శన కనబర్చిన సిరాజ్‌పై కిర్మాణీ ప్రశంసలు కురిపించారు. ఇంగ్లండ్ టూర్‌లో సిరాజ్ దమ్ము చూపాడని ... తొలి మ్యాచ్ నుంచి ఆఖరి వరకు ఒకే తీవ్రత కొనసాగించాడని కొనియాడారు. కిర్మాణీ అసలు సిసలు జెంటిల్‌మెన్ అని 1983 వన్డే వరల్డ్‌కప్ నెగ్గిన భారత జట్టు సభ్యుడు మొహిందర్ అమర్‌నాథ్ ప్రశంసించగా... అతడు జట్టు మనిషి అని మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ వీడియో సందేశంలో పేర్కొన్నారు. టీమిండియా మాజీ సారథి అజహరుద్దీన్ మాట్లాడుతూ... ‘కిర్మాణీ నుంచి ఎంతో నేర్చుకున్నాం. ఆయన నడవడిక యువతరానికి స్ఫూర్తిదాయకం’ అని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. క్రీడా పాలసీతో తెలంగాణ ఆటల దశ మారనుందని పేర్కొన్నారు.

చరిత్ర పుటల్లో రమేశ్

- ఆసియా సర్ఫింగ్ చాంపియన్‌షిప్‌లో పతకం నెగ్గిన తొలి భారత క్రీడాకారుడిగా ఘనత
- ఓపెన్ పురుషుల విభాగంలో కాంస్య పతకం సొంతం





చెన్నై: ఆసియా సర్ఫింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ సర్ఫర్ రమేశ్ బుధియాల్ కాంస్య పతకంతో మెరిశాడు. పురుషుల ఓపెన్ విభాగంలో ఫైనల్‌కు చేరిన తొలి భారత సర్ఫర్‌గా చరిత్ర సృష్టించిన రమేశ్ కాంస్య పతకం ఖాతాలో వేసుకున్నాడు. ఈ టోర్నమెంట్‌లో భారత జట్టుకు ఇదే తొలి పతకం కావడం విశేషం. ఆదివారం జరిగిన ఓపెన్ పురుషుల కేటగిరీ ఫైనల్లో రమేశ్ 12.60 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. కొరియాకు చెందిన కనోవా హీజే 15.17 పాయింట్లతో పసిడి పతకం గెలుచుకోగా... పజార్ అరియానా (14.57 పాయింట్లు; ఇండోనేసియా) రజతం దక్కించుకున్నాడు. మహిళల ఓపెన్ విభాగంలో జపాన్‌కు చెందిన అని మసునో (14.90 పాయింట్లు) స్వర్ణం గెలుచుకోగా... సుమోమో సటో (13.70 పాయింట్లు; జపాన్), ఇసాబెల్ హిగ్స్ (11.76 పాయింట్లు; థాయ్‌లాండ్) వరుసగా రజత, కాంస్యాలు ఖాతాలో వేసుకున్నారు.

ఐదేళ్ల ప్రాయం నుంచే...

కేరళలోని కోవలంకు చెందిన 24 ఏళ్ల రమేశ్ బుధియాల్... ఐదేళ్ల ప్రాయం నుంచే అలలపై తేలియాడే క్రీడలో ఆరితేరాలని నిర్ణయించుకున్నాడు. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితులు అందుకు అనుకూలించకపోగా... ఓ స్వచ్ఛంద సంస్థ సాయంతో ముందడుగు వేశాడు. ప్రాణాంతక క్రీడ కావడంతో కుటుంబ సభ్యులు ప్రోత్సాహించకపోగా... తన నైపుణ్యంపై విశ్వాసమున్న రమేశ్ ఎనిమిదో తరగతిలో చదువుకు స్వస్తి చెప్పి సర్ఫింగ్‌నే సర్వస్వంగా సాధన ప్రారంభించాడు. అతడి కష్టానికి తాజాగా ఆసియా సర్ఫింగ్ చాంపియన్‌షిప్‌లో ఫలితం దక్కింది. ఈ టోర్నమెంట్ ఫైనల్‌కు చేరిన తొలి భారతీయుడిగా నిలిచిన అనంతరం రమేశ్ మాట్లాడుతూ... ‘నా కెరీర్‌లో ఇదే అతిపెద్ద ఘనత. ఆసియా క్రీడలకు ముందు ఇది నాలో ఆత్మవిశ్వాసం నింపింది. ఈ టోర్నీ భారత్‌లో జరగడంతో మరింత మెరుగైన ప్రదర్శన చేయగలిగా. భవిష్యత్తులోనూ దీన్ని కొనసాగిస్తా’ అని పేర్కొన్నాడు. రమేశ్ తండ్రి మృతిచెందగా... తల్లి కోవలం తీరప్రాంతంలో ఓ చిన్న హస్తకళల దుకాణం నిర్వహిస్తోంది.

రాణించిన నిత్య

రెండు విభాగాల్లో టాప్‌-3లో నిలిచిన తెలంగాణ అథ్లెట్



భువనేశ్వర్: వరల్డ్ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ బ్రాంజ్ లెవెల్ మీట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ అమ్మాయి నిత్య గంధె ఆకట్టుకుంది. మహిళల 100 మీటర్ల విభాగంలో మూడో స్థానంలో నిలిచిన నిత్య... 200 మీటర్ల విభాగంలో రెండో స్థానాన్ని దక్కించుకుంది. 100 మీటర్ల ఫైనల్ రేసును నిత్య 11.70 సెకన్లలో ముగించింది. అభినయ (భారత్) 11.57 సెకన్లతో అగ్రస్థానంలో నిలువగా... స్నేహ (భారత్) 11.70 సెకన్లతో రెండో స్థానాన్ని సంపాదించింది. నిత్య, స్నేహ ఒకే సమయం నమోదు చేసినా ఫొటో ఫినిష్ ద్వారా స్నేహకు రెండో స్థానాన్ని ఖరారు చేశారు. 200 మీటర్ల ఫైనల్ రేసును నిత్య 24.11 సెకన్లలో పూర్తి చేసింది. ఏంజెల్ సిల్వియా (భారత్; 23.95 సెకన్లు) తొలి స్థానంలో, ఉన్నతి అయ్యప్ప (భారత్) 24.56 సెకన్లు మూడో స్థానంలో నిలిచారు. కాంటినెంటల్ టూర్ మీట్‌లలో విజేతలకు పతకాలకు బదులుగా ప్రైజ్‌మనీ చెక్‌లు అందజేశారు. తొలి స్థానం పొందిన వారికి 800 డాలర్లు (రూ. 70 వేలు), రెండో స్థానం దక్కించుకున్న వారికి 400 డాలర్లు (రూ. 35 వేలు), మూడో స్థానంలో నిలిచిన వారికి 300 డాలర్లు (రూ. 26 వేలు), నాలుగో స్థానం సంపాదించిన వారికి 200 డాలర్ల (రూ.17 వేలు) చొప్పున ప్రదానం చేశారు.

పురుషుల 200 మీటర్లలో అనికుశ్ కుజుర్ (భారత్; 20.77 సెకన్లు)... లాంగ్‌జంప్‌లో మురళీ శ్రీశంకర్ (భారత్; 8.13 మీటర్లు), ట్రిపుల్ జంప్‌లో అబుబాకర్ (భారత్; 16.53 మీటర్లు).. మహిళల జావెలిన్ త్రోలో అన్ను రాణి (భారత్; 62.01 మీటర్లు)... లాంగ్‌జంప్‌లో శైలి సింగ్ (భారత్; 6.28 మీటర్లు) అగ్రస్థానాన్ని దక్కించుకున్నారు.

మళ్లీ ఓడిన భారత మహిళల ‘ఎ’ జట్టు

టి20 సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన ఆస్ట్రేలియా మహిళల ‘ఎ’ జట్టు



షఫాలీ

మెకే: భారత ‘ఎ’ మహిళల జట్టు వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఓడింది. ఇదివరకే అనధికారిక టి20 సిరీస్‌ను చేజార్చుకున్న అమ్మాయిల జట్టు ఆఖరి పోరులో గెలుపు తీరానికి చేరువై చివరకు 4 పరుగుల తేడాతో ఓడిపోయింది. దీంతో అనధికారిక టి20 సిరీస్‌లో ఆస్ట్రేలియా ‘ఎ’ 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. స్పిన్ ద్వయం రాధా యాదవ్ (3/31), ప్రేమ రావత్ (3/24)ల మాయాజాలానికి ఆసీస్ ఇన్నింగ్స్ తడబడింది. మేడ్‌లైన్ (32 బంతుల్లో 39; 3 ఫోర్లు, 1 సిక్స్), అలీసా హీలీ (21 బంతుల్లో 27; 3 ఫోర్లు, 1 సిక్స్), అనిక (17 బంతుల్లో 22; 1 ఫోర్, 1 సిక్స్) ధాటిగా ఆడారు. అయితే వరుస విరామాల్లో రాధ, ప్రేమ లిద్దరు వికెట్లు పడగొట్టడంతో ఆసీస్ జోరుకు అడ్డుకట్ట పడింది. తర్వాత ఛేదించదగిన లక్ష్యమే అయినా... టాపార్డర్, మిడిలార్డర్ బ్యాటర్ల నిర్లక్ష్యంతో భారత్ ‘ఎ’ అమ్మాయిలు ఓటమి పాలయ్యారు. 20 ఓవర్లలో 8 వికెట్లకు 140 పరుగులే చేశారు. ఓపెనర్ వృంద (4), ఉమా ఛెత్రి (3) నిరాశపరిచారు. షఫాలీ వర్మ (25 బంతుల్లో 41; 6 ఫోర్లు, 1 సిక్స్) మాత్రమే బాధ్యతగా ఆడింది. రాఘ్వి బిస్త్ (25 బంతుల్లో 25; 2 ఫోర్లు), మిన్ను మణి (29 బంతుల్లో 30; 4 ఫోర్లు)ల పోరాటంతో గెలుపు దారిలో పడిన భారత్‌ను 19వ ఓవర్ దెబ్బ కొట్టింది. 12 బంతుల్లో 18 పరుగుల సమీకరణం టి20ల్లో ఏమాత్రం కష్టం కాదు. కానీ 19వ ఓవర్ వేసిన సియానా జింజర్ (4/16) తొలి బంతికి సజన (3), ఐదో బంతికి రాధ (9)ను అవుట్ చేయడంతో భారత్ విజయానికి దూరమైంది. ఆఖరి ఓవర్లో ప్రేమ రావత్ (8 బంతుల్లో 12 నాటౌట్; 1 ఫోర్) ధాటిగా ఆడే ప్రయత్నం చేసినా... ఇంకా 4 పరుగుల దూరంలోనే ఉండిపోయింది. మూడు అనధికారిక వన్డేల సిరీస్ బ్రిస్బేన్‌లో 13న జరిగే తొలి మ్యాచ్‌తో మొదలవుతుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

అర్జున్‌కు తొలి పరాజయం



చెన్నై: క్వాంట్‌బాక్స్ చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీ మాస్టర్స్ కేటగిరీలో ప్రపంచ ఐదో ర్యాంకర్, భారత గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్‌కు తొలి పరాజయం ఎదురైంది. ఆదివారం జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌లో అర్జున్ 70 ఎత్తుల్లో భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ నిహాల్ సరీన్ చేతిలో ఓడిపోయాడు. మరో గేమ్‌లో కార్తికేయన్ మురళీ (భారత్) 46 ఎత్తుల్లో జోర్డాన్ వాన్ ఫారీస్ట్ (నెదర్లాండ్స్)పై గెలుపొందాడు. రే రాబ్సన్ (అమెరికా) –అవండర్ లియాంగ్ (అమెరికా) గేమ్ 26 ఎత్తుల్లో ... విదిత్ (భారత్)–ప్రణవ్ (భారత్) గేమ్ 86 ఎత్తుల్లో... అనీశ్ గిరి (నెదర్లాండ్స్)–విన్సెంట్ కీమెర్ (జర్మనీ) గేమ్ 28 ఎత్తుల్లో ‘డ్రా’గా ముగిశాయి.

ఇదే టోర్నమెంట్ చాలెంజర్స్ కేటగిరీలో భారత గ్రాండ్‌మాస్టర్, హైదరాబాద్ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక మూడో ఓటమిని చవిచూసింది. భారత్‌కే చెందిన లియోన్ ల్యూక్‌తో జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌లో హారిక 59 ఎత్తుల్లో ఓడిపోయింది. ఆధిబన్ (భారత్)–ప్రాణేశ్ (భారత్) గేమ్ 36 ఎత్తుల్లో ‘డ్రా’గా ముగిసింది. ఇతర గేముల్లో దీప్తాయన్ ఘోష్ (భారత్) 76 ఎత్తుల్లో హర్షవర్ధన్ (భారత్)పై, ఇనియన్ (భారత్) 45 ఎత్తుల్లో ఆర్యన్ చోప్రా (భారత్)పై, అభిమన్యు పురాణిక్ (భారత్) 43 ఎత్తుల్లో వైశాలి (భారత్)పై విజయం సాధించారు.

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-ఎకానమీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- జనరల్ ఇంగ్లిష్

అవకాశాల ‘గేట్’వే

గ్రాడ్యుయేట్ అప్టిట్యూడ్ టెస్ట్ ఫర్ ఇంజనీరింగ్ (గేట్)-2026కు నోటిఫికేషన్ విడుదలైంది. ఇది జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రతిష్టాత్మక పరీక్ష. గేట్ స్కోర్‌తో బహుళ ప్రయోజనాలు అందుకోవచ్చు. టాప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఉన్నత విద్యతోపాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో కొలువులు సొంతం చేసుకునే అవకాశం ఉంది. అంతేకాకుండా మాస్టర్స్, డాక్టోరల్ ప్రోగ్రామ్స్‌లో చేరి స్కాలర్‌షిప్ పొందేందుకు మార్గం గేట్. ఈ నేపథ్యంలో.. గేట్ 2026తో ప్రయోజనాలు, దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష ప్యాట్రన్, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» గేట్ 2026 నోటిఫికేషన్ విడుదల
» ఆగస్టు 25 నుంచి దరఖాస్తులు ప్రారంభం
» 2026 ఫిబ్రవరిలో సీబీటీ విధానంలో పరీక్ష

గేట్ 2026 పరీక్షను కేంద్ర విద్యాశాఖ తరఫున ఐఐఎస్సీ–బెంగళూరు, ఐఐటీలు ఉమ్మడిగా నిర్వహిస్తాయి. ఐఐటీ గౌహతి ఈ పరీక్ష నిర్వాహక సంస్థగా ఉంది. ఇంజనీరింగ్/టెక్నాలజీ/సైన్స్/కామర్స్/ఆర్ట్స్/ఆర్కిటెక్చర్/హ్యుమానిటీస్ విభాగాల్లో గేట్ పరీక్షను నిర్వహిస్తారు. అండర్‌గ్రాడ్యుయేట్ స్థాయిలోని వివిధ సబ్జెక్టుల్లో అభ్యర్థి ప్రావీణ్యాన్ని పరీక్షించేలా ప్రశ్న పత్రం ఉంటుంది.



విద్యార్థులు గేట్ 2026కు దరఖాస్తు చేసుకోవచ్చు.

గేట్‌తో ప్రయోజనాలు

- గేట్ 2026 స్కోర్‌తో ఇంజనీరింగ్/టెక్నాలజీ/సైన్స్/ఆర్కిటెక్చర్/హుమానిటీస్ విభాగాల్లో మాస్టర్స్ ప్రోగ్రామ్స్, డైరెక్ట్ డాక్టోరల్(బీటెక్/బీఈ/ఎమ్మెస్సీ తత్సమానం తర్వాత నేరుగా పీహెచ్‌డీ), డాక్టోరల్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులు కేంద్ర విద్యాశాఖ, ఇతర ప్రభుత్వ సంస్థల నుంచి ఆర్థిక సహాయం(స్కాలర్‌షిప్‌లు /ఫెలోషిప్పులు) పొందే అవకాశం ఉంటుంది.
- గేట్ స్కోర్‌తో ఎంటెక్ విద్యార్థులకు నెలకు రూ.12వేల స్కాలర్‌షిప్ అందుతుంది. సాధారణంగా 22 నెలల పాటు ఈ ఉపకార వేతనం లభిస్తుంది.
- గేట్ స్కోర్‌తో పీహెచ్‌డీలో ప్రవేశం పొందిన వారికి మొదటి రెండేళ్లు నెలకు రూ.37వేలు, ఆ తర్వాత మూడో ఏడాది నుంచి ఐదో ఏడాది వరకూ నెలకు రూ.42వేలు ఫెలోషిప్ అందుతుంది.
- స్కాలర్‌షిప్‌లు అందించని పలు కాలేజీలు, ఇన్‌స్టిట్యూట్స్ సైతం గేట్ స్కోర్ ఆధారంగా ప్రవేశం కల్పిస్తున్నాయి.
- గేట్ స్కోర్‌తో బీహెచ్ఈఎల్, ఈసీఐఎల్, ఐవోసీఎల్, ఎన్‌టీపీసీ, ఓఎన్‌జీసీ వంటి అనేక ప్రభుత్వ రంగ సంస్థలు(పీఎస్‌యూ)లు నియామకాలు జరుపుతున్నాయి.

అర్హతలు

ఇంజనీరింగ్/టెక్నాలజీ/ఆర్కిటెక్చర్/సైన్స్/కామర్స్/ఆర్ట్స్/హ్యుమానిటీస్ విభాగాల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సు ఉత్తీర్ణులు లేదా ఆయా అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల మూడో ఏడాది చదువుతున్న విద్యార్థులు గేట్ 2026కు దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష విధానం

- మొత్తం 30 టెస్ట్ పేపర్లలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో గేట్ 2026 పరీక్ష నిర్వహించనున్నారు.–ఒకటి లేదా రెండు టెస్ట్ పేపర్లకు అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉంది.
- గేట్ పరీక్షలో జనరల్ అప్టిట్యూడ్(15 మార్కులకు) అందరికీ కామన్‌గా ఉంటుంది. మిగతా 85 మార్కులకు అభ్యర్థి ఎంచుకునే సంబంధిత సబ్జెక్టు నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- కొన్ని పేపర్లలో జనరల్ అప్టిట్యూడ్ 15మార్కులకు,ఇంజనీరింగ్ మ్యాథమెటిక్స్ 13మార్కులకు, సంబంధిత సబ్జెక్టు 72 మార్కులకు ఉంటాయి.
- ప్రశ్న పత్రంలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు(ఎంసీక్యూ), మల్టిపుల్ సెలక్ట్ ప్రశ్నలు(ఎంఎస్‌క్యూలు), న్యూమరికల్ ఆన్సర్ టైప్ (ఎన్ఏటీ) ప్రశ్నలు అడుగుతారు ప్రతి ప్రశ్నకు ఒకటి లేదా రెండు మార్కులు కేటాయిస్తారు.
- ఈ పరీక్ష ప్రశ్న పత్రం ఇంగ్లిష్‌లో ఉంటుంది. పరీక్ష వ్యవధి మూడు గంటలు.
- గేట్ 2026లో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ఒక మార్కు ఎంసీక్యూల్లో ప్రతి తప్పు సమాధానానికి 1/3 వంతు మార్కు తగ్గిస్తారు. రెండు మార్కుల ఎంసీక్యూల్లో ప్రతి తప్పు సమాధానానికి 2/3 వంతు మార్కు తగ్గిస్తారు. ఎంఎస్‌క్యూలు, ఎన్ఏటీల్లో ఎలాంటి నెగిటివ్ మార్కులు ఉండవు.

30 టెస్ట్ పేపర్లు ఇవే

ఎయిరోస్పేస్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కెమిస్ట్రీ, డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎకాలజీ అండ్ ఎవల్యూషన్, జియోమాటిక్స్ ఇంజనీరింగ్, జియాలజీ అండ్ జియోఫిజిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, మెటల్లర్జికల్ ఇంజనీరింగ్, నావెల్ ఆర్కిటెక్చర్ అండ్ మెరైన్ ఇంజనీరింగ్, పెట్రోలియం ఇంజనీరింగ్, ఫిజిక్స్, ప్రొడక్షన్ అండ్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, స్టాటిస్టిక్స్, టెక్స్‌టైల్ ఇంజనీరింగ్ అండ్ ఫైబర్ సైన్స్, ఇంజనీరింగ్‌సైన్సెస్, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 25.08.2025
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 25.09.2025
- ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరి తేది: 06.10.2025
- గేట్ 2026 పరీక్ష తేదీలు: 2026 ఫిబ్రవరి 07, 08, 14, 15
- ఫలితాల వెల్లడి తేది: 19.03.2026
- వెబ్‌సైట్: https://gate2026.iitg.ac.in

విద్య, ఉద్యోగ సమాచారం



ఎయిమ్స్ నాగ్‌పూర్‌లో 108 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

నాగ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 108.
» **విభాగాలు:** అనెస్థీషియాలజీ, అనాటమీ, బయోకెమిస్ట్రీ, కార్డియాలజీ, డెంటిస్ట్రీ, డెర్మటాలజీ, ఎండోక్రైనాలజీ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, మైక్రోబయాలజీ, నెఫ్రాలజీ, న్యూరో సర్జరీ, న్యూక్లియర్ మెడిసిన్, గైనకాలజీ, ఆప్తాల్మాలజీ, ఆర్థోపెడిక్స్, పాథాలజీ, పల్మనరీ మెడిసిన్, రేడియోథెరపీ, రుమటాలజీ, క్లినికల్ ఇమ్యునాలజీ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో మెడికల్ డిగ్రీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 45 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.67,700
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.08.2025
» **వెబ్‌సైట్:** https://aiimsnagpur.edu.in

ఏపీలో 42 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు.. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 42.
» **జోన్ల వారీగా ఖాళీలు:** జోన్ 1–13, జోన్ 2–12, జోన్ 3–12, జోన్ 4–05.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీతో పాటు లా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఇంటర్మీడియట్ తర్వాత ఐదేళ్ల న్యాయకోర్సులో ఉత్తీర్ణులైన అభ్యర్థులు కూడా అర్హులు. 04.08.2025 నాటికి రాష్ట్రంలోని క్రిమినల్ కోర్టుల్లో కనీసం మూడేళ్లు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసిన అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.07.2025 నాటికి 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 11.08.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.09.2025
» **రాతపరీక్ష తేది:** 05.10.2025.
» **వెబ్‌సైట్:** https://slprb.ap.gov.in

సీఎస్ఐఆర్-ఐఐసీబీ, కోల్‌కతాలో జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ పోస్టులు

కోల్‌కతాలోని సీఎస్ఐఆర్–ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ బయాలజీ(ఐఐసీబీ) జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
» **పోస్టుల వివరాలు:** జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్–01, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(ఎఫ్–ఎ)–03, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్ (ఎస్–పీ)–02, జూనియర్ స్టెనోగ్రాఫర్–02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 10+2 ఉత్తీర్ణతతో పని అనుభవం ఉండాలి.
» **వయసు:** జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్‌కు 28 ఏళ్లు, జూనియర్ స్టెనోగ్రాఫర్‌కు 27 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ప్రొఫిషియెన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.08.2025
» **వెబ్‌సైట్:** https://iicb.res.in

ఎన్ఎస్‌సీ, న్యూఢిల్లీలో 24 టెక్నీషియన్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియమ్స్‌కి చెందిన నేషనల్ సైన్స్ సెంటర్(ఎన్ఎస్‌సీ) టెక్నీషియన్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 24.
» **పోస్టుల వివరాలు:** టెక్నీషియన్ ఏ–18, ఆర్టిస్ట్ ఏ–03, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఏ–02, ఎగ్జిబిషన్ అసిస్టెంట్ ఏ–01.
» **విభాగాలు:** ఫిట్టర్, కార్పెంటర్, ఎలక్ట్రానిక్స్, పెయింటర్, కంప్యూటర్ హెచ్/డబ్ల్యూ–నెట్‌వర్కింగ్, డ్రాఫ్ట్స్‌మాన్, ఎలక్ట్రికల్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో ఎస్ఎస్‌సీ+సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ సర్టిఫికేట్ విజువల్/ఫైన్/కమర్షియల్ ఆర్ట్స్‌లో డిప్లొమా/డిగ్రీ, సర్టిఫికేట్, సైన్స్, డిగ్రీ, 3 సంవత్సరాల ఎలక్ట్రికల్ డిప్లొమాలో ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఆప్టిట్యూడ్ టెస్ట్, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.08.2025
» **వెబ్‌సైట్:** https://nscd.gov.in

యూనియన్ బ్యాంక్‌లో 250 వెల్త్ మేనేజర్ పోస్టులు

ముంబైలోని యూనియన్ బ్యాంక్ ఇండియా.. వెల్త్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 250.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీఏ/పీజీడీఎం, పీజీడీబీఎం, పీజీడీబీఏ, పీజీడీఎంలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 25 ఏళ్ల నుంచి 35 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.68,820 నుంచి రూ.93,960.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.08.2025
» **వెబ్‌సైట్:** www.unionbankofindia.co.in



స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	765	79,857
నిఫ్టీ ▽	233	24,363

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	21,450	△	207
డోజోన్స్	44,176	△	207
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,096	▽	5
డాక్స్	21,163	▽	30
షాంఘై	3,635	▽	5
నికాయ్	41,820	△	761

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.15	88.17
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.80	118.74
€	యూరో	ఎస్‌బీఐ	100.80	103.59
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.76	60.26
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.03	58.29
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.89	69.57
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.49	23.99
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.98	24.22
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.33	13.15

హాలీడే ట్రిప్.. జాలీగా సాగాలంటే!

విదేశీ పర్యటనలకు బీమా ఉండాల్సిందే..

- ఊహించని పరిస్థితుల్లో ఆదుకునే సాధనం
- అనారోగ్యం, ప్రమాద ఘటనల్లో పరిహారం
- విమాన రద్దు, బ్యాగేజీ నష్టానికీ చెల్లింపులు
- ఆర్థిక నష్టాన్ని భర్తీ చేసుకోవచ్చు
- ప్రీమియం భారం కాదు.. తక్కువే

కొత్త జంట హనీమూన్ కోసమని యూరప్ దేశాలకు ప్రయాణమైంది. రెండో రోజు వారి లగేజీ బ్యాగ్ కనిపించకుండా పోయింది. అందులో విలువైన వస్తువులు, డాక్యుమెంట్లు ఉండడంతో ఆందోళన చెందిన ఆ జంట పర్యటనను కుదించుకుని వెంటనే వెనక్కి వచ్చేసింది. ట్రావెల్ ఇన్సూరెన్స్ ఉంది. కానీ, తక్కువ ప్రీమియంకు వస్తుందని చెప్పి చౌక ప్లాన్ తీసుకోవడంతో అది అక్కరకు రాలేదు. ఫలితంగా పర్యటనను ఆస్వాదించకుండానే, ఆర్థిక నష్టంతో వెనుదిరగాల్సి వచ్చింది. అన్ని విధాలుగా ఆదుకునే ట్రావెల్ ఇన్సూరెన్స్ అవసరంపై అవగాహన కల్పించే కథనమిది...

– సాక్షి, బిజినెస్ డెస్క్

నేడు విదేశీ విహార యాత్రలకు ఎక్కువ మంది ఉత్సాహం చూపిస్తున్నారు. దుబాయ్, శ్రీలంక, థాయ్‌లాండ్, మలేషియా, ఇండోనేషియా, సింగపూర్ తదితర పర్యాటక ప్రదేశాలను తక్కువ సమయంలోనే చూసి వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. విద్య, వ్యాపార అవకాశాల కోసం.. దూరంగా ఉన్న పిల్లలను చూసి వచ్చేందుకు ఎంతో మంది విదేశాలకు వెళ్లివస్తున్నారు. కానీ, ఈ సమయంలో తప్పకుండా ఉండాల్సిన ట్రావెల్ ఇన్సూరెన్స్ పట్ల అశ్రద్ధ కనిపిస్తోంది. బీమా అన్నది వీసా కోసం తీసుకునేది ఎంత మాత్రం కాదు. ఊహించనివి జరిగితే ఆదుకునే మొదటి సాధనమే ఇది. వైద్యపరంగా అత్యవసర పరిస్థితి ఎదురుకావొచ్చు. విమానం ఆలస్యం కావొచ్చు. పాస్‌పోర్ట్ కనిపించకుండా పోవచ్చు. ఇలాంటి సందర్భాల్లో ట్రావెల్ ఇన్సూరెన్స్ చేదోడుగా నిలుస్తుంది. ముఖ్యంగా కొన్ని దేశాల్లో అడుగు పెట్టాలంటే ట్రావెల్ ఇన్సూరెన్స్ ఉంటేనే సాధ్యం. కనుక దీని ప్రాధాన్యాన్ని పూర్తిగా అర్థం చేసుకుని, సమగ్ర బీమా రక్షణతో పర్యటనకు ప్లాన్ చేసుకోవడం మంచిది.

వైద్య రక్షణ

ట్రావెల్ ఇన్సూరెన్స్ పాలసీల్లో ఉండే అత్యంత ముఖ్యమైన సదుపాయం మెడికల్ కవరేజీ. యూఎస్, కెనడా లేదా యూకే వంటి దేశాల్లో వైద్య చికిత్సల వ్యయాలు భారీగా ఉంటాయి. ఆయా దేశాల్లో పర్యటించే వారు అనారోగ్యంతో లేదా ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చేరాల్సి వస్తే ఇన్సూరెన్స్ కంపెనీయే చెల్లింపులు చేస్తుంది. అంతేకాదు సర్జరీ చేయాల్సి వచ్చినా లేదా వైద్య పరంగా అత్యవసరంగా ఉన్న చోట నుంచి ఆస్పత్రికి తరలించడానికి అయ్యే వ్యయాలను సైతం బీమా కంపెనీయే భరిస్తుంది. అనారోగ్యం కారణంగా విదేశాల్లోనే నిర్ణీత కాలానికి మించి ఉండాల్సిన సందర్భాల్లో అయ్యే ఖర్చులను సైతం దీని కింద పొందొచ్చు. తిరుగు ప్రయాణానికి ఆరోగ్యం సహకరిస్తుందని వైద్యులు ధ్రువీకరించేంత వరకు సాయం తీసుకోవచ్చు. కుటుంబంతో కలసి వెళుతుంటే అందరికీ కలిపి (60 ఏళ్లలోపు ఇద్దరు పెద్దలు, 21 ఏళ్లలోపు పిల్లలు) ఒకటే పాలసీ తీసుకోవచ్చు. 60 ఏళ్లు నిండిన వృద్ధుల కోసం విడిగా తీసుకోవాలి. కేవలం 2–3 రోజుల పర్యటనకు ట్రావెల్ ఇన్సూరెన్స్ వృథా అని భావించొద్దు.

లగేజీ కోల్పోతే..

మీకు సంబంధించిన లగేజీని ఎవరైనా చోరీ చేసినా లేదా కనిపించకుండా పోయిన సందర్భాల్లోనూ ఈ పాలసీలో రక్షణ ఉంటుంది. ఎయిర్‌లైన్స్ నిర్వహణ సరిగ్గా లేని కారణంగా బ్రీఫ్ కేసులోని విలువైన వస్తులకు నష్టం వాటిల్లినట్టయితే.. క్రెడిట్/డెబిట్ కార్డు/పాస్‌పోర్ట్‌లను కోల్పోయిన సందర్భాల్లోనూ ఆర్థిక నష్టాలను భర్తీ చేస్తుంది. కోల్పోయిన వాటిని తిరిగి పొందేందుకు అయ్యే ఖర్చులను బీమా కంపెనీ నుంచి పొందొచ్చు.

ఫ్లయిట్ రద్దయితే..

విమానం అనుకున్న సమయానికి కాకుండా, షెడ్యూలింగ్ మారిపోతే లేదా వాతావరణం అనుకూలించక ఏకంగా సర్వీసు రద్దు అయితే, దీనివల్ల పర్యటన ప్రణాళిక దెబ్బతింటుంది. ఇలాంటివి చోటు చేసుకుంటే వేరొక విమాన సర్వీసులో బుక్ చేసుకునేందుకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుంది. హోటల్ బుకింగ్‌లపైనా నష్టపోవాల్సి వస్తుంది. ట్రావెల్ ఇన్సూరెన్స్ ఉంటే ఇలాంటి ఖర్చులను బీమా కంపెనీ భరిస్తుంది. ప్రయాణానికి చివరి ఘడియల్లో కుటుంబంలో అత్యవసర పరిస్థితి కారణంగా ట్రిప్ రద్దు చేసుకోవాల్సి రావచ్చు. అలాంటప్పుడు నష్టాన్ని ఈ పాలసీ కింద క్లెయిమ్ చేసుకోవచ్చు. విదేశీ పర్యటనలో అనారోగ్యం లేదా ఇతర కారణాల దృష్ట్యా పర్యటనను కుదించుకోవాల్సి వచ్చిన సందర్భంలోనూ బీమా కంపెనీలు కవరేజీని ఆఫర్ చేస్తున్నాయి.

మనవల్ల ఇతరులకు నష్టం జరిగితే..

పర్యటన సమయంలో మన తప్పిదం లేదా మన పిల్లల కారణంగా ఎవరికైనా గాయం కావడం లేదంటే ఇతరుల ప్రాపర్టీకి నష్టం వాటిల్లడం వంటి సంఘటనల్లో చెల్లింపుల మేర బీమా కంపెనీ నుంచి పరిహారం పొందొచ్చు. పాలసీ నియమ నిబంధనలపై ఈ మొత్తం ఆధారపడి ఉంటుంది.

ఇంటికి రక్షణ

కొన్ని రకాల ట్రావెల్ ఇన్సూరెన్స్ ప్లాన్లలో ఇంటికి సైతం రక్షణ ఉంటోంది. పర్యటన సమయంలో ఇంట్లో చోరీ.. లేదంటే అగ్ని ప్రమాదం కారణంగా ఆస్తి నష్టం వాటిల్లితే ఆ మేరకు పరిహారం పొందొచ్చు.

వీటికి మినహాయింపులు..

ట్రావెల్ ఇన్సూరెన్స్ పాలసీ ఏదైనా సరే, కొన్ని మినహాయింపులు ఉంటాయి. ముఖ్యంగా ముందస్తు వ్యాధుల కారణంగా పర్యటన సమయంలో వైద్య చికిత్సలు అవసరం పడితే కవరేజీ ఉండదు. కావాలని గాయం చేసుకున్నా లేదా యుద్ధం, ఉగ్రవాదం, అల్లర్ల కారణంగా ఏర్పడే నష్టానికి పరిహారం రాదు. అధిక రిస్క్ ఉండే సాహస క్రీడలకు సంబంధించి మినహాయింపులు ఉంటాయి.

ప్రీమియం ఎంత ఉండొచ్చు?

అంతర్జాతీయ పర్యటన 3–5 రోజుల కోసం అయితే ఒక్కొక్కరికీ రూ.200–700 మధ్య ఉంటుంది (60 ఏళ్ల లోపు వారికి). ఎంపిక చేసుకున్న ప్రాంతం, వయసు, సమ్ ఇన్సూర్డ్ (బీమా రక్షణ)పై బీమా ప్రీమియం ఆధారపడి ఉంటుంది. యూరప్ ట్రిప్ కోసం 50వేల నుంచి లక్ష డాలర్ల సమ్ ఇన్సూర్డ్ తీసుకునేట్టు అయితే.. ప్రీమియం రూ.500 వరకు ఉంటుంది. దేశీ పర్యటనలు అయితే ప్రీమియం రోజువారీ రూ.20–50 మధ్య ఉంటుంది.





తీసుకునే ముందు చూడాల్సినవి..



- పాలసీ నియమ, నిబంధనలను పూర్తిగా చదివి వేటికి కవరేజీ ఉంటుంది? వేటికి ఉండదన్న విషయాలను స్పష్టంగా తెలుసుకోవాలి. కొన్ని పాలసీల్లో ఖరీదైన ఎలక్ట్రానిక్స్ వస్తువులకు కవరేజీ ఉండడం లేదు. ప్రీమియం ఎక్కువైనా సరే అన్నింటికీ రక్షణనిచ్చే పాలసీని తీసుకోవడం మంచి నిర్ణయం అవుతుంది.
- కొన్ని దేశాల వీసా నిబంధనలు ప్రత్యేకంగా ఉంటున్నాయి. ఉదాహరణకు యూరప్ టూరిస్ట్ వీసా కోసం కనీసం 30,000 పౌండ్ల మెడికల్ ఇన్సూరెన్స్ తప్పనిసరి. కనుక వెళుతున్న దేశానికి సంబంధించిన నిబంధనలు తెలుసుకోవాలి. వీసా కోసం తప్పనిసరి కాకపోయినప్పటికీ.. పర్యటించే దేశాల్లో వైద్య సేవల ఖర్చులను తెలుసుకుని, అందుకు అనుగుణంగా మెరుగైన బీమా రక్షణతో పాలసీ తీసుకోవాలి.
- ట్రావెల్ ఇన్సూరెన్స్ ప్లాన్లు అన్నీ ఒకే రకమైనవి కావు. వ్యాపార పర్యటన, చదువు కోసం వెళ్లే వారు, కుటుంబంతో కలసి సెలవుల్లో విహరించేందుకు వెళ్లే వారు, సాహస క్రీడల కోసం వెళ్లే వారు తమకు అనుకూలమైన ప్లాన్లపై దృష్టి సారించాలి.
- కేవలం విదేశీ పర్యటనల కోసమే అని కాదు. దేశీయంగానూ విహార యాత్రల కోసం వెళ్లేవారు సైతం ట్రావెల్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవచ్చు.
- దేశీయంగా రోడ్డు లేదా ట్రెయిన్ మార్గంలో టూర్‌కు ప్లాన్ చేసుకున్న వారు.. అప్పటికే తమ కుటుంబ సభ్యులకు ఫ్యామిలీ ఫ్లోటర్ హెల్త్ ప్లాన్‌తోపాటు, వ్యక్తిగత ప్రమాద బీమా కలిగి ఉంటే ట్రావెల్ ఇన్సూరెన్స్ అవసరం ఉండదు. ఆస్పత్రిలో చేరాల్సి వస్తే అప్పటికే ఉన్న బీమా ప్లాన్ ద్వారా నగదు రహిత సేవలు పొందొచ్చు. బస్సు, రైలు, హోటల్ బుకింగ్‌లు రద్దు చేసుకున్నా, పూర్తి మొత్తం వెనక్కి వచ్చే విధంగా జాగ్రత్త పడితే సరిపోతుంది.
- కేవలం 24 గంటల ప్రయాణమే అయి, హోటల్ లేదా ఫ్లయిట్ బుకింగ్‌లు లేకుండా వెళ్లే వారికీ ట్రావెల్ ఇన్సూరెన్స్ అవసరపడదు.
- దేశీ పర్యటనలు, అవి కూడా సమీప ప్రాంతాల్లోని వాటికి ట్రావెల్ ఇన్సూరెన్స్ అంత లాభదాయకం కాదు. దేశంలోనే పర్వత ప్రాంతాలు, సున్నితమైన మారుమూల పర్యాటక ప్రదేశాలు, విదేశీ పర్యటనలకు ఇది ఉపయోకరంగా ఉంటుంది.
- ప్రీమియం తక్కువే ఉంటుంది. కనుక, అనవసర ఖర్చు కింద చూడడం సరికాదు.
- హెల్త్ లేదా వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ లేని వారు మాత్రం దగ్గర, దూర పర్యటనంతో సంబంధం లేకుండా ట్రావెల్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి.

ఈ తప్పులు చేయొద్దు..

- కొన్ని దేశాల వీసా ప్రాసెసింగ్‌కు బీమా తప్పనిసరి అని చెప్పి, చౌక పాలసీ తీసుకోవద్దు. అత్యవసర పరిస్థితుల్లో ఆదుకోనప్పుడు పాలసీ ఉన్నా నిష్ప్రయోజనమే.
- పర్యటనలో ఏ ఇబ్బందీ రాదులే లేదా కొన్ని రోజులే కదా అని భావించి బీమాను పక్కన పెట్టొద్దు.
- పాలసీ తీసుకునే నాటికి ఉన్న ఆరోగ్య సమస్యలను తప్పకుండా వెల్లడించాలి.
- రూ.100–200 ఆదా కోసం తక్కువ కవరేజీకి పరిమితం కావొద్దు.
- కొన్ని క్రెడిట్ కార్డులు ఆఫర్ చేసే ట్రావెల్ ఇన్సూరెన్స్‌పై ఆధారపడొద్దు. వాటి కవరేజీ ఎన్నో షరతులు, పరిమితులతో ఉంటుంది.



ఏజీఐ ఇన్‌ఫ్రా | నువామా ఇన్‌స్టిట్యూషనల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 1,063
టార్గెట్: రూ. 1,448
ఎందుకంటే: పంజాబ్‌లో రియల్టీ కార్యకలాపాలు విస్తరించిన కొద్దిపాటి సుప్రసిద్ధ కంపెనీలలో ఏజీఐ ఇన్‌ఫ్రా ఒకటి. ప్రధానంగా జలంధర్‌లో ప్రబలమైన బిజినెస్‌ను కలిగి ఉంది. పటిష్ట ట్రాక్ రికార్డ్‌కుతోడు.. అత్యంత నాణ్యమైన ప్రాజెక్టులతో వినియోగదారులను ఆకట్టుకుంది. పరిమిత బ్రాండెడ్ సంస్థలుగల మార్కెట్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. తద్వారా అత్యుత్తమ స్థాయిలో నిలుస్తోంది. అంతేకాకుండా అత్యధిక డిమాండ్‌గల పంజాబ్‌లోని మైక్రోమార్కెట్లపై దృష్టిపెట్టి ముందుకు సాగుతోంది. కీలక ప్రాంతాలలో తగిన భూములు(ల్యాండ్ బ్యాంక్), భారీ పరిమాణంలో అభివృద్ధి చేస్తున్న ప్రాజెక్టుల ద్వారా పంజాబ్‌లో వేగంగా పెరుగుతున్న హౌసింగ్ డిమాండును అందిపుచ్చుకోనుంది. వ్యూహాత్మక ప్రాంతాలలో అవసరమైన ల్యాండ్ బ్యాంక్, సమర్థవంత యాజమాన్యం, ప్రాజెక్టులలో పటిష్ట ఎగ్జిక్యూషన్, పెరుగుతున్న డిమాండ్ తదితరాలను కంపెనీకి సానుకూల అంశాలుగా పరిగణించవచ్చు. వీటికితోడు అత్యుత్తమ బ్యాలన్స్‌షీట్, పటిష్ట క్యాష్ ఫ్లోను కలిగి ఉంది. పటిష్ట ఫండమెంటల్స్ కలిగి, సహేతుక స్థాయిలో షేరు ధర కదులుతోంది. ఈ నేపథ్యంలో విభిన్న ప్రాంతాలలోని భూముల అభివృద్ధి ద్వారా తగినంత క్యాష్ ఫ్లోలను సాధించేందుకు అవకాశముంది. ఇందుకు సుప్రసిద్ధ బ్రాండింగ్, ప్రీమియం ధరలు తోడ్పాటునివ్వనున్నాయి. వెరసి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26)లో సాధించనున్న(అంచనా) ఎన్‌ఏవీ ఆధారంగా టార్గెట్ ధరను నిర్ణయించాం. అయితే ఎగ్జిక్యూషన్, డెలివరీలలో ఆలస్యం, పంజాబ్ మార్కెట్లో కేంద్రీకృతమైన కార్యకలాపాలు, సైక్లికల్‌గా రియల్టీ బిజినెస్‌లో మందగమనం వంటి అంశాలను కీలక ప్రతికూలతలుగా పరిగణించవచ్చు.

షేర్లు స్టాక్స్

సెల్లో వరల్డ్ | ఎల్‌కేపీ సెక్యూరిటీస్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 571
టార్గెట్: రూ. 768
ఎందుకంటే: డైవర్సిఫైడ్ కన్జూమర్ డ్యూరబుల్స్ కంపెనీ సెల్లో వరల్డ్ మూడు విభాగాలలో ప్రధానంగా కార్యకలాపాలు విస్తరించింది. ఆదాయంలో కన్జూమర్ హౌస్‌వేర్ వాటా 68.4 శాతంకాగా.. రైటింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్ నుంచి 14.4 శాతం, మౌల్డెడ్ ఫర్నిచర్ నుంచి 17.2 శాతం చొప్పున సాధిస్తోంది. సుప్రసిద్ధ సెల్లో బ్రాండ్‌తో కంపెనీ కస్టమర్లను ఆకట్టుకుంటోంది. తద్వారా ఒపల్‌వేర్, గ్లాస్‌వేర్, స్టెయిన్‌లెస్ స్టీల్ డ్రింక్‌వేర్ తదితర ప్రీమియం ధరల ప్రొడక్టులలో బిజినెస్‌ను విస్తరించింది. ఆయా ప్రొడక్టులలో 77 శాతంవరకూ సొంత యూనిట్ల(ఇన్‌హౌస్) ద్వారానే తయారు చేస్తోంది. దీనికితోడు 1.5 లక్షలకుపైగా ఔట్‌లెట్ల నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. ఇవన్నీ ప్రీమియం ప్రొడక్టుల బిజినెస్‌కు మద్దతిస్తున్నాయి. ప్రొడక్టులలో స్థానిక తయారీ, ప్రీమియమైజేషన్, పంపిణీ విస్తరణకు వీలుగా పెట్టుబడులను కొనసాగిస్తోంది. దీంతో బ్రాండెడ్ ప్రొడక్టులవైపు మళ్లుతున్న వినియోగదారుల డిమాండును మరింతగా అందిపుచ్చుకోనుంది. ఇందుకు అనుగుణంగా అధిక మార్జిన్లుగల ఒపల్‌వేర్, గ్లాస్‌వేర్ తదితర ప్రీమియం విభాగాలలో కార్యకాలపాల పెంపుపై దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా వచ్చే ఆర్థిక సంవత్సరానికల్లా(2026–27) సామర్థ్య వినియోగాన్ని పూర్తిస్థాయికి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అంతేకాకుండా దిగుమతుల నిషేధం నేపథ్యంలో స్టీల్‌వేర్ తయారీలోకి వ్యూహాత్మకంగా ప్రవేశించింది. మరోపక్క రైటింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో క్రమంగా రికవరీ నమోదవుతోంది. అయితే సమీప భవిష్యత్‌లో డిమాండ్ అనిశ్చితులున్నప్పటికీ పటిష్ట ఫండమెంటల్స్ కలిగి ఉండటంతో 24–26 శాతం నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు సాధిస్తోంది. 77 శాతం ప్రొడక్టులను సొంతంగా రూపొందిస్తోంది. ఇవి సానుకూల అంశాలు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

న్యూ ఫండ్ ఆఫర్

బరోడా బీఎన్‌పీ పారిబా గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్



బరోడా బీఎన్‌పీ పారిబా ఏఎంసీ తాజాగా గోల్డ్ ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్(ఎఫ్‌వోఎఫ్)ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఆగస్టు 14తో ముగుస్తుంది. పసిడి సంబంధ అసెట్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలంలో పెట్టుబడి వృద్ధిని కోరుకునే ఇన్వెస్టర్లకు ఇది అనువైనదిగా ఉంటుంది. 10–25 ఏళ్ల వ్యవధిలో చూస్తే ఈక్విటీలకు మించి పసిడి రాబడులు అందించిన సందర్భాలు కూడా కొన్ని ఉన్నాయి. ప్రస్తుతం పసిడి ధర భారీగా పెరిగిపోయి, చాలా మందికి అందుబాటులో లేకుండా పోయిన నేపథ్యంలో.. అతి తక్కువ పెట్టుబడితో బంగారంలో ఇన్వెస్ట్ చేసేందుకు ఈ ఎఫ్‌వోఎఫ్ ఉపయోగపడుతుందని సంస్థ సీఈవో ప్రశాంత్ పింప్లే తెలిపారు. కనీసం రూ. 1,000 నుంచి, సిప్ విధానంలోనైతే రూ. 500 నుంచి ఈ స్కీములో ఇన్వెస్ట్ చేయొచ్చు.

కోటక్ మహీంద్రా ఏఎంసీ నిఫ్టీ ఆల్ఫా 50 ఇండెక్స్ ఫండ్



నిఫ్టీ ఆల్ఫా 50 ఇండెక్స్‌ను ట్రాక్ చేసే కొత్త ఫండ్‌ను కోటక్ మహీంద్రా ఏఎంసీ ప్రవేశపెట్టింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఆగస్టు 11తో ముగుస్తుంది. నిఫ్టీ ఆల్ఫా 50 ఇండెక్స్‌లో, గత ఆరు నెలల వ్యవధిలో సగటు మార్కెట్ క్యాప్, సగటు రోజువారీ టర్నోవరు ప్రాతిపదికగా 300 టాప్ కంపెనీల నుంచి ఎంపిక చేసిన 50 స్టాక్స్ ఉంటాయి. చారిత్రకంగా అధిక రాబడులు అందించే సామర్థ్యాలను ప్రదర్శిస్తున్న కంపెనీల్లో క్రమశిక్షణతో ఇన్వెస్ట్ చేయడానికి, దీర్ఘకాలికంగా పెట్టుబడి వృద్ధికి ఈ ఫండ్ ఉపయోగపడుతుంది.

డీఎస్‌పీ నుంచి కొత్త ఇండెక్స్ ఫండ్



డీఎస్‌పీ మ్యూచువల్ ఫండ్.. డీఎస్‌పీ నిఫ్టీ 500 ఫ్లెక్సీక్యాప్ క్వాలిటీ 30 ఇండెక్స్ ఫండ్ పేరుతో ఒక ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. అంటే నిఫ్టీ టాప్ 500 కంపెనీల్లో భవిష్యత్తులో మెరుగ్గా వృద్ధి చెందే నాణ్యమైన 30 కంపెనీలను ఎంపిక చేసి పెట్టుబడులు పెడుతుంది. లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్ కంపెనీల మధ్యపెట్టుబడులను వర్గీకరిస్తుంది. ఒక్కో విభాగం నుంచి 10 కంపెనీలను ఎంపిక చేస్తుంది. ప్రతి త్రైమాసికానికి ఒకసారి పోర్ట్‌ఫోలియో సమీక్షించి మార్పులు చేస్తుంది. ఆర్థిక అంశాలకు తోడు సాంకేతిక అంశాల ఆధారంగా స్టాక్స్‌ను ఎంపిక చేస్తుంది. దేశంలో తొలి ఫ్లెక్సీక్యాప్ ఇండెక్స్‌ను ఈ పథకం పనితీరుకు ప్రామాణికంగా చూడొచ్చు. ఈ నెల 22వ తేదీ వరకు పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
గణాంకాలపై మార్కెట్ల ఫోకస్
ఫారం 16.. ఎన్నో ప్రశ్నలు.. అన్నింటికీ జవాబులు

పిల్లల విద్య కోసం పెట్టుబడి మార్గం?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను రూ.30 లక్షలు ఇన్వెస్ట్ చేద్దామని అనుకుంటున్నాను. వీటిపై మెరుగైన రాబడులకు ఉన్న మార్గం ఏంటి?? – సుదీప్త్ సేన్


ఏ ఇన్వెస్టర్ అయినా గరిష్ట రాబడి కోరుకోవడం సహజమే. కానీ, అధిక రాబడి ఒక్కటే ప్రామాణికం కాకూడదు. పెట్టుబడులపై మెరుగైన రాబడులను పొందేందుకు కొన్ని అంశాల పరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. ముందుగా సరైన పెట్టుబడి సాధనాన్ని ఎంపిక చేసుకోవాలి. కేవలం రాబడి కోణంలోనే పెట్టుబడి సాధనాన్ని ఎంపిక చేసుకుంటే అది నష్టానికి దారితీయవచ్చు. అందుకుని ప్రతీ పెట్టుబడి సాధనం ఎంపిక ముందు అందులోని సానుకూల, ప్రతికూలతలను చూడాలి. ఈక్విటీ పథకాలు స్వల్పకాలంలో అధిక రాబడులు ఇవ్వగలవు. కానీ, దీనికి గ్యారంటీ ఉండదు. మార్కెట్ ఏ సమయంలో అయినా దిద్దుబాటుకు గురికావచ్చు. అస్థిరతలు ఎక్కువగా ఉంటుంటాయి. అత్యవసర పరిస్థితుల్లో మార్కెట్లు కరెక్షన్‌కు లోనై ఉంటే అప్పుడు నష్టానికి అమ్ముకోవాల్సి వస్తుంది. అందుకుని స్వల్పకాలానికి ఈ తరహా రిస్క్‌ను అధిగమించేందుకు డెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. ఐదేళ్లు అంతకుమించిన కాలానికి ఈక్విటీలను ఎంపిక చేసుకోవాలి. అలాగే పెట్టుబడులను వివిధ రకాల మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుకోవడం ద్వారా వైవిధ్యం ఉండేలా చూసుకోవాలి. ఒకవేళ ఏదైనా ఒక ఫండ్ బలహీన పనితీరు చూపించినా.. మరో ఫండ్ మంచి పనితీరుతో రాబడుల్లో స్థిరత్వం ఉంటుంది. క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసుకోవడం మరో మార్గం. ఇందుకు సిప్‌ను ఎంపిక చేసుకోవచ్చు. దీనివల్ల స్వల్పకాలంలో పెట్టుబడులపై మార్కెట్ కరెక్షన్ల ప్రభావాన్ని అధిగమించొచ్చు. చివరిగా అస్సెట్ అలోకేషన్‌ను పాటించాలి. డెట్, ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయడంతోపాటు, ఆ పెట్టుబడులను ఏడాదికోసారి సమీక్షించుకోవాలి. మీ లక్ష్యాలు, రిస్క్ సామర్థ్యానికి అనుగుణంగా డెట్, ఈక్విటీ పెట్టుబడుల్లో, కేటాయింపుల్లో మార్పులు చేసుకోవాలి.



నాకు పదేళ్లలోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి ఉన్నత విద్య కోసం ఏక మొత్తంలో పెట్టుబడి పెట్టాలన్నది ఆలోచన. ఇందుకు ఏ సాధనాలను ఎంచుకోవాలి? – విద్యారణ్య

పిల్లల భవిష్యత్తు కోసం ఎక్కడ ఇన్వెస్ట్ చేయాలనే విషయంలో చాలా మంది తల్లిదండ్రులు సందేహం ఎదుర్కొంటుంటారు. ఒకే విడత పెట్టుబడితోపాటు క్రమానుగత పెట్టుబడి (సిప్)ని సైతం ఎంపిక చేసుకోవచ్చు. ఉన్నత విద్య కోసం అనుకుంటే అందుకు, సాధారణంగా పదేళ్ల కాల వ్యవధి ఉంటుంది. అటువంటప్పుడు ఈక్విటీలు మెరుగైన సాధనమే అని చెప్పాలి. ఫ్లెక్సీక్యాప్ విభాగం అనుకూలంగా ఉంటుంది. ఎందుకంటే ఫ్లెక్సీక్యాప్ పథకాలు పెట్టుబడుల్లో వైవిధ్యం ఉండేలా చూస్తాయి. అన్ని రంగాల పరిధిలో, భిన్న మార్కెట్ క్యాప్ కలిగిన (డైవర్సిఫైడ్) కంపెనీల్లో పెట్టుబడులు పెడుతుంటాయి. ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్ ఐదేళ్ల కాలంలో సగటున 12 శాతానికి పైనే వార్షిక రాబడులు ఇచ్చాయి. ఈ రాబడి రేటు ప్రకారం ఎవరైనా రూ.లక్షను పదేళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేస్తే.. రూ.3.14 లక్షలు సమకూరుతుంది. ఈక్విటీల్లో అస్థిరతలు సహజంగా ఉంటాయి. కనుక ఫ్లెక్సీక్యాప్ పథకాల్లోనూ ఈ ప్రభావం కనిపిస్తుంది. అందుకనే ఈక్విటీల్లో ఏక మొత్తంలో ఇన్వెస్ట్ చేయడం కాకుండా, తమ దగ్గరున్న పెట్టుబడులను కొన్ని విడతలుగా ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీనివల్ల కొనుగోలు ధర సగటుగా మారి, మార్కెట్లు గరిష్టాల వద్ద ఉన్నప్పుడు రిస్క్‌ను తగ్గిస్తుంది. మీ దగ్గర ఉన్న మొత్తాన్ని ఒక డెట్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసి.. దాని నుంచి ప్రతి నెలా సిస్టమ్యాటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ (ఎస్‌టీపీ) రూపంలో ఎంపిక చేసుకున్న ఈక్విటీ పథకాల్లోకి మళ్లించుకోవాలి. మూడేళ్ల కాలంలో దీన్ని పూర్తి చేయాలి. దీనివల్ల మార్కెట్ల ర్యాలీ, కరెక్షన్లలోనూ ఇన్వెస్ట్ చేసినట్టు అవుతుంది.

ఎనలేని పనిభారం.. జీవితం నిస్సారం



నిరంతరం బిజీ జీవితంతో మానసిక, శారీరక అలసట

- ఉద్యోగుల ఉత్పాదకత, పనితీరుపై ప్రతికూల ప్రభావం
- వర్క్- లైఫ్ బ్యాలెన్స్‌లో విఫలం కావటమూ కారణమే
- 50 శాతం కంటే ఎక్కువ మందిలో బర్న్ ఔట్ సమస్య
- పలు అధ్యయనాల్లో వెల్లడి

ఆధునిక జీవన శైలిలో దాదాపు అందరూ బిజీగా మారిపోయారు. రోజంతా క్షణం తీరిక లేకుండా పనులు చేస్తూనే ఉంటున్నారు. ఇలా దీర్ఘకాలంపాటు పనిచేయటం వల్ల చాలా మంది 'బర్న్ ఔట్'పరిస్థితిని ఎదుర్కొంటున్నారని పలు అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. మానసికంగా, శారీరకంగా, భావోద్వేగ పరంగా తీవ్రంగా అలసిపోవటాన్నే బర్న్ ఔట్ అంటారు. దీనివల్ల పనిపై ఏకాగ్రత కోల్పోవడం వంటి పరిస్థితి ఏర్పడుతుంది. అంతిమంగా ఉత్పాదకత, పనితీరు తగ్గిపోతుంది. ఉద్యోగుల్లో ఈ బర్న్‌ఔట్ సమస్య ఇటీవల గణనీయంగా పెరిగిందని పలు సర్వేల్లో తేలింది. 50 శాతం కంటే ఎక్కువ మంది బర్న్ ఔట్‌ను ఎదుర్కొంటున్నారని వెల్లడైంది. వృత్తిగత, వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యం సాధించడంలో విఫలం కావడమే ఇందుకు కారణమని అంటున్నారు.

– సాక్షి, హైదరాబాద్

తమ రోజువారీ జీవితంలో అత్యంత బిజీగా గడిపేవారు ఒత్తిడికి గురవుతున్నారు. ఇష్టమైన పని అయినా మితిమీరి చేయడంతో బర్న్ ఔట్‌కు గురవుతారు. దీనివల్ల ముఖ్యమైన బాధ్యతలపై పూర్తి దృష్టిని కేంద్రీకరించే పరిస్థితులు ఉండడం లేదు. కోపం, చిరాకు పరిపాటిగా మారుతుంది. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనే వారు తమను తాము 'సెల్ఫ్ ఆడిట్'చేసుకుని పని భారాన్ని తగ్గించుకొనే విషయంలో కచ్చితమైన నిర్ణయం తీసుకోవాలి. సమస్యను అధిగమించడానికి సైకాలజిస్ట్ లేదా థెరపిస్ట్‌ను సంప్రదించాలి. ఏదైనా క్రీడలో పాల్గొనడం, వీకెండ్స్‌లో మిత్రులతో గడపడం, సంగీతం వినడం, పుస్తకాలు చదవడం వంటి ఏదో ఒక కొత్త హాబీని అలవరుచుకుని ఒత్తిడిని అధిగమించి 'బర్న్ ఔట్'కు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.



– సి.వీరేందర్, సైకాలజిస్ట్, యూ అండ్ మీ కౌన్సెలింగ్ సెంటర్

వివిధ సంస్థల సర్వేల్లో తేలిన అంశాలు

- ఫోర్బ్స్ పరిశీలన ప్రకారం 66 శాతం మంది కార్మికులు బర్న్ ఔట్‌కు గురవుతున్నారు. మరొక నివేదిక ప్రకారం అమెరికాలోని 44 శాతం ఉద్యోగులు బర్న్ ఔట్‌కు గురవుతున్నారు. దీనివల్ల విధులకు గైర్హాజరు పెరుగుతోంది. వ్యక్తిగత సంబంధాలను దెబ్బతీయడంతో పాటు శారీరక, మానసిక సమస్యలు పెరుగుతున్నట్లు అమెరికన్ సైకలాజికల్ అసోసియేషన్ పేర్కొంది.
- ఇటీవల ఇండియా టుడేలో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం.. చాలా మంది ఉద్యోగులు ఎక్కువ గంటలు పని చేయాల్సి రావటం, చేస్తున్న పనులకు సరైన గుర్తింపు లేకపోవడం, ఉన్నతాధికారుల నుంచి తగిన మద్దతు లభించకపోవడం వంటివి బర్న్ ఔట్‌కు ప్రధాన కారణాలుగా తేలింది. 'నిరంతరం బిజీగా ఉండాలనే ఒత్తిడి, తరచుగా అంచనాలు అందుకోలేకపోవడంతో ఒత్తిడి, అలసటకు గురవుతున్నారు. ఇది మానసిక, శారీరక ఆరోగ్యాలపై ప్రతికూల ప్రభావం చూపి ఉత్పాదకత, పనితీరు తగ్గడానికి దారితీస్తోంది'అని ది ఎకనామిక్ టైమ్స్ సర్వే పేర్కొంది.
- దాదాపు 52 శాతం మంది ఉద్యోగులు వర్క్ – లైఫ్ బ్యాలెన్స్ చేసుకోలేక బర్న్ ఔట్‌కు గురవుతున్నట్టు ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, పంజాబ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో న్యూయార్క్‌కు చెందిన వెర్టెక్స్ గ్రూప్ నిర్వహించిన అధ్యయనంలో తేలింది. ఈ పరిస్థితి నుంచి ఉద్యోగులను బయటపడేయాలంటే వారాంతాల్లో వారితో ఎక్కువ గంటలు పనిచేయించడం మానేయాలని సూచించింది. సంస్థల పురోగతికి ఉద్యోగుల 'మెంటల్ వెల్ బీయింగ్'ఎంతో ముఖ్యమని పేర్కొంది.
- ఉద్యోగులు బిజీగా ఉండటం వల్ల నిద్ర, వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు నిర్లక్ష్యానికి గురవుతాయి. ఇవన్నీ శారీరక, మానసిక అంశాలపై దుష్ప్రభావం చూపిస్తాయి అని హోప్ ట్రస్ట్ తన అధ్యయనంలో పేర్కొంది.
- పై అధ్యయనాలకు భిన్నంగా జనరేషన్ జెడ్‌గా పిలుస్తున్న (1997–2012 మధ్యలో పుట్టిన వారు) వారు తమ చుట్టూ జరుగుతున్న మార్పులను నిశితంగా గమనిస్తూ, పనిప్రదేశాల్లో ఎదురయ్యే పరిస్థితులను అంచనా వేస్తూ వర్క్–లైఫ్ బ్యాలెన్స్‌తో పాటు తాము కోరుకున్న విలువలకు అనుగుణంగా జీవన శైలి, కెరీర్లను ఎంచుకుంటున్నట్టు డెలాయిట్ 2024 జెన్ జెడ్ అండ్ మిలీనియల్ సర్వే పేర్కొంది.



కోడిపుంజుకు కమ్మలు.. మెడలో మద్యం సీసా

ముత్యాలమ్మ తల్లికి వినూత్నంగా మొక్కులు

కేసముద్రం: కోడిపుంజుకు కమ్మలు కుట్టించి, మెడలో మద్యం బాటిల్ వేసి.. మేళతాళాల నడుమ ముత్యాలమ్మ తల్లికి ఒక భక్తుడు వినూత్నంగా మొక్కులు చెల్లించుకున్నాడు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీ పరిధి కేసముద్రంస్టేషన్‌లో ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. గ్రామానికి చెందిన తోడేటి వెంకన్న ముత్యాలమ్మ బోనాల పండుగ సందర్భంగా.. కోడిపుంజుకు కమ్మలు కుట్టించి, మెడలో మద్యం సీసా వేశాడు. అనంతరం దాన్ని మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి, అమ్మవారికి మొక్కు చెల్లించుకున్నాడు. ఈ దృశ్యాన్ని భక్తులంతా ఆసక్తిగా తిలకించారు.

ఓట్ల కోసం మా వీధికి రావొద్దు

పెద్దపల్లి జిల్లా రామారావుపల్లి గ్రామస్తుల వినూత్న నిరసన



పాలకుర్తి: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులు తమ వీధికి రాకండని.. హెచ్చరిస్తూ పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం రామారావుపల్లి గ్రామంలో ఆదివారం ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. తమవాడలో వీధి దీపాలు, సరైన విద్యుత్ సౌకర్యం, ఇళ్లకు విద్యుత్ మీటర్లు లేవని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో బయటకు వెళ్లలేని పరిస్థితిపై విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని వివరించారు. ముప్పయ్ ఏళ్లుగా పరిస్థితి ఇలాగే ఉందని, తమకు సాయం చేసి సౌకర్యాలు కల్పించే అభ్యర్థికే ఓటు వేస్తామని స్పష్టం చేశారు. అలాకాకుండా కేవలం ఓట్ల కోసం ఏ రాజకీయ నాయకుడు తమ వాడకు దయచేసి రావద్దంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.



నూతన గృహంలో ఆనందంలో కుటుంబ సభ్యులు

అమ్మానాన్నలకు గూడు.. అమ్మాయిలే తోడు

తల్లిదండ్రులకు ఇల్లు కట్టించిన కూతుళ్లు



చిట్యాల: కొడుకుల్లేరని ఆ దంపతులెప్పుడూ బాధపడలేదు. కూతుళ్లను బాగా చదివించి.. విలువలతో పెంచారు. ఇప్పుడు వారే ఆ వృద్ధ తల్లిదండ్రులకు ఆసరాగా నిలుస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రానికి చెందిన బుర్ర నర్సయ్య, సాంబలక్ష్మి దంపతులకు ఏడుగురు కుమార్తెలు. నర్సయ్య గతంలో సర్పంచ్‌గా పనిచేశారు. విలువలతో కూడిన రాజకీయం చేయడంతో ఆయన ఏమీ సంపాదించుకోలేకపోయారు. కొద్ది నెలల క్రితం ఉన్న ఇల్లు సైతం వర్షానికి కూలిపోయింది. దీంతో వారు నాయకులను కలిసి ఇల్లు మంజూరు చేయాలని మొర పెట్టుకున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి పథకాలు అందకపోవడంతో.. ఆయన ఏడుగురు కుమార్తెలు తలా కొంత డబ్బులు వేసుకుని (రూ.5 లక్షలతో) తల్లిదండ్రులకు ఇల్లు కట్టి ఇచ్చారు. నర్సయ్య ఆదివారం గృహ ప్రవేశం చేశారు. తల్లిదండ్రుల రుణం తీర్చుకునేందుకు ఇల్లు కట్టించి ఇచ్చామని కూతుళ్లు చెబుతున్నారు.



భద్రత గాలికి.. ప్రచారం పైపైకి!

- దేశీ ఎయిర్‌లైన్స్‌పై 76% మంది ప్రయాణికుల ఆరోపణ..
- లోకల్ సర్కిల్స్ సర్వే వెల్లడి

సాక్షి, హైదరాబాద్: దేశీ విమానయాన సంస్థలు భద్రత కంటే ప్రచారానికే అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని విమాన ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు లోకల్ సర్కిల్స్ అనే సంస్థ ఇటీవల సర్వే చేపట్టి వారి అభిప్రాయాలను సేకరించింది. సర్వేలో పాల్గొన్న ప్రయాణికుల్లో 76 శాతం మంది విమానాల నిర్వహణకు సంబంధించి భద్రతా లోపాలు ఎక్కువగానే ఉంటున్నాయని పేర్కొన్నారు. గత మూడేళ్లలో కనీసం ఒక్కసారైనా టేకాఫ్/ల్యాండింగ్ లేదా విమానంలో ఇబ్బంది ఎదుర్కొన్నట్లు 64 శాతం మంది చెప్పారు. ఈ ఏడాది జూన్ 12న అహ్మదాబాద్‌లో ఎయిరిండియా 171 విమానం కూలిన ఘటన తర్వాత విమాన ప్రయాణికుల్లో భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఆ ఘటన తర్వాత కూడా దేశవ్యాప్తంగా ఎక్కడో ఒకచోట భద్రతాపరమైన, సాంకేతిక లోపాలకు సంబంధించిన ఉదంతాలు నమోదవుతున్న నేపథ్యంలో లోకల్ సర్కిల్స్ ఈ సర్వే నిర్వహించింది. దేశవ్యాప్తంగా 44 వేల మంది విమాన ప్రయాణికుల నుంచి మూడేళ్ల ప్రయాణ అనుభవాలను సేకరించింది.

'యాక్ట్' ఉంటేనే యాక్షన్!

పోకిరీల కట్టడికి ప్రత్యేక చట్టం లేని షీ-టీమ్స్

2015లోనే తమిళనాడు తరహా చట్ట ప్రతిపాదన చేసిన పోలీసు విభాగం

ఇప్పటికీ ప్రభుత్వం వద్ద ఫైలు పెండింగ్‌లో ఉన్న వైనం

భాగ్యనగర వీధుల్లో ఇటీవల జరిగిన వివిధ ఊరేగింపులు, వేడుకల్లో మహిళలు, యువతులను అసభ్యంగా తాకుతూ, అనుచితంగా ప్రవర్తిస్తూ 644 మంది ఆకతాయిలు షీ-టీమ్స్‌కు చిక్కారు. కానీ వారిలో కేవలం ఐదుగురిపైనే పోలీసులు కేసులు నమోదు చేయగలిగారు. మిగిలిన వారిని మందలింపులు, కౌన్సెలింగ్‌లతోనే సరిపెట్టి పంపించేశారు. అందుకు కారణం.. పోకిరీలకు చెక్ చెప్పడానికి అవసరమైన ప్రత్యేక చట్టం లేకపోవడమే.



సాక్షి, హైదరాబాద్: చిన్నారులపై లైంగిక నేరాలకు పాల్పడే వారికి జీవితఖైదు లాంటి తీవ్ర శిక్షలు విధించేందుకు వీలు కల్పించే అత్యంత కఠినమైన పోక్సో చట్టం అమల్లో ఉండగా.. మహిళలు, యువతులను వేధించే ఆకతాయిలు, పోకిరీలపై కఠిన చర్యలు తీసుకోవడానికి మాత్రం ప్రస్తుత చట్టాల్లోని సెక్షన్లు ఉపయుక్తంగా లేవు. ఇలాంటి సమస్యలకు పరిష్కారంగా షీ-టీమ్స్ తయారు చేసిన ప్రతిపాదనే తెలంగాణ ప్రొహిబిషన్ ఆఫ్ ఈవ్ టీజింగ్ యాక్ట్. పోకిరీల పీచమణిచేందుకు ప్రత్యేక చట్టం కావాలని షీ-టీమ్స్ పదేళ్ల క్రితమే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ఇప్పటికీ స్పందన రాలేదు. ఈ ఫైల్ న్యాయ విభాగం వద్దే పెండింగ్‌లో ఉండిపోయింది.

పోకిరీలు మొదలు ఆన్‌లైన్‌లో, సోషల్ మీడియా ద్వారా అదును చూసి కాటువేస్తున్న నయవంచకుల వరకు.. ఎందరో మృగాళ్ల బారి నుంచి అతివల్ని రక్షిస్తున్న హైదరాబాద్ షీ-టీమ్స్ ఏర్పడి 11 ఏళ్లు కావస్తోంది. ఇప్పటికే గణనీయమైన ఫలితాలు సాధిస్తున్న ఈ బృందాల పనితీరును మరింత మెరుగుపరచడంతోపాటు మహిళలు/యువతులకు పూర్తిస్థాయి భరోసా ఇవ్వడానికి ప్రత్యేక చట్టం అవసరం ఉందని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

తమిళనాడులో 1998 నుంచే...

దీనికోసం తమిళనాడులో 1998 నుంచి అమల్లో ఉన్న 'తమిళనాడు ప్రొహిబిషన్ ఆఫ్ ఈవ్ టీజింగ్ యాక్ట్' తరహాలో రూపొందించిన ముసాయిదాను 2015లోనే రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు.

రాష్ట్ర షీ-టీమ్స్ 2024 గణాంకాల ప్రకారం పోకిరీలపై కేసుల సంఖ్య	
చిక్కిన పోకిరీలు	26,526
కౌన్సెలింగ్‌తో బయటపడిన వాళ్లు	15,664
వారిలో ఫిర్యాదులతో చిక్కింది	10,862
పెట్టీ కేసులుగా నమోదైనవి:	3,329
ఐపీసీ/బీఎన్ఎస్‌ల కింద నమోదైన ఎఫ్ఐఆర్‌లు	830

బహిరంగ ప్రదేశాల్లో యువతులు/మహిళల్ని వేధిస్తున్న పోకిరీలను నిత్యం షీ-టీమ్స్ పట్టుకుంటున్నా తీవ్రత, ఆధారాలు ఉంటే తప్ప నిందితులపై బీఎన్ఎస్‌తోపాటు నిర్భయ, యాంటీ ర్యాగింగ్ యాక్ట్‌ల ప్రకారం కేసులు నమోదు చేయడం సాధ్యం కావట్లేదు. ఫలితంగా రాష్ట్రంలో ఏటా షీ-టీమ్స్‌కు చిక్కుతున్న పోకిరీల్లో 90 శాతం మంది పెట్టీ కేసులు, నామమాత్రపు జరిమానాతో బయటపడిపోతున్నారు.

చిక్కుతున్నా చిన్న కేసులే...

ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతూ రెండోసారి చిక్కిన వ్యక్తులతోపాటు తీవ్ర స్థాయిలో రెచ్చిపోయిన వారిపైనే కేసులు నమోదు చేయగలుగుతున్నారు. అయితే ప్రతి సందర్భంలోనూ రిపీటెడ్ అఫెండర్స్‌ను గుర్తించడం సాధ్యం కావట్లేదు. పోకిరీల వేధింపులు చిన్న విషయంగా కనిపించినా బాధితులపై వాటి ప్రభావం తీవ్రంగా ఉండటంతోపాటు సమాజం, పోలీసులపై ఏహ్యాభావం ఏర్పడే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో న్యాయశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న ముసాయిదా చట్టం కార్యరూపం దాలిస్తే తెలంగాణలోనూ సత్ఫలితాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

ప్రత్యేక చట్ట ముసాయిదాలోని ముఖ్యాంశాలు

- బహిరంగ ప్రదేశాలతోపాటు పనిచేసే ప్రాంతాలు, మాల్స్... ఇలా ఎక్కడైనా ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతూ చిక్కిన పోకిరీలపై నేరం రుజువైతే ఏడాది జైలు లేదా రూ. 10 వేల జరిమానా లేదా రెండూ పడతాయి.
- ఈవ్ టీజింగ్ చేయడానికి పోకిరీలు వాహనాలను వినియోగిస్తే వాటిని పోలీసులు స్వాధీనం చేసుకొనే అవకాశం ఏర్పడుతుంది.
- దేవాలయాలతోపాటు మాల్స్, సినిమా హాల్స్, విద్యాసంస్థలు తదితర చోట్ల జరిగే ఈవ్ టీజింగ్‌లను నిరోధించాల్సిన బాధ్యత వాటి నిర్వాహకులపై ఉంటుంది. అలాంటి సమాచారాన్ని తక్షణం సంబంధిత పోలీసులకు చేరవేయాల్సిందే. దీనికి భిన్నంగా వ్యవహరిస్తే ఆ నేరానికి యాజమాన్యాలనూ బాధ్యుల్ని చేయవచ్చు. వారికి కూడా న్యాయస్థానం జరిమానా విధించే అవకాశం ఉంటుంది.



చౌటుప్పల్‌లో హైదరాబాద్ వైపు వెళ్లే మార్గంలో బారులుతీరిన వాహనాలు

ఇంటికి తిరిగెళ్దాం..

కిటకిటలాడిన జాతీయ రహదారి

చౌటుప్పల్: హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఆదివారం కొనసాగింది. వరుస సెలవులు, రాఖీ పండుగ ముగియడంతో ప్రజలు గమ్యస్థానాలకు తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం వివాహాలు పెద్ద సంఖ్యలో ఉండడం, చాలా గ్రామాల్లో గ్రామ దేవతల పండుగలు జరుగుతుండడంతో.. ప్రజలు భారీగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో చౌటుప్పల్ పట్టణం నుంచి ఇరువైపులా సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రధానంగా హైదరాబాద్ మార్గంలో లింగోజిగూడెం వరకు బారులు తీరాయి. పరిస్థితిని అదుపు చేసేందుకు సివిల్, ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగారు. కూడళ్లను మూసివేసి.. సాయంత్రం వేళ బస్‌స్టేషన్‌లోకి బస్సులను పంపించడం నిలిపివేశారు. చిన్నకొండూర్ రోడ్డు, బస్టాండ్, వలిగొండ రోడ్డు, తంగడపల్లి రోడ్డు ప్రాంతాలలో పోలీసులు మోహరించారు. అడ్డగోలుగా హైవే పైకి వాహనాలు, జనాలను అనుమతించకుండా కట్టడి చేశారు.

బడుగుల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- కేంద్ర మాజీ మంత్రి శివశంకర్ 96వ జయంతి వేడుకలో డిప్యూటీ సీఎం భట్టి
- పాల్గొన్న మంత్రులు ఉత్తమ్, జూపల్లి, శ్రీధర్‌బాబు, పొన్నం, వాకిటి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో బండారు దత్తాత్రేయ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, మహేశ్‌కుమార్‌గౌడ్, వాకిటి శ్రీహరి, కేవీపీ తదితరులు

గన్‌ఫౌండ్రీ: దేశంలో బడుగు, బలహీనవర్గాలు సహా అన్ని వర్గాలకూ న్యాయం చేయాలని రాహుల్ గాంధీ చేస్తున్న ప్రయత్నానికి అందరూ మద్దతివ్వాల్సిన అవసరం ఎంతో ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కేంద్ర మాజీ మంత్రి పుంజాల శివశంకర్ 96వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. శివశంకర్ దేశంలోనే ఉన్నత స్థితికి చేరుకున్నారని గుర్తుచేశారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు, గిరిజనులు ఆయన్ను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. సామాజిక రుగ్మతలపై ఆనాడే ఆయన పోరాడారని.. కాంగ్రెస్‌లో సామాజిక న్యాయం సాధ్యమవుతుందన్నారు.

42% రిజర్వేషన్ల పోరుకు ఆయనే స్ఫూర్తి: మంత్రులు ఉత్తమ్, వాకిటి

బీసీల గురించి గతంలోనే పోరాడిన యోధుడు శివశంకర్ అని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కొనియాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని తాము చేస్తున్న పోరాటానికి ఆయనే స్ఫూర్తి అని పేర్కొన్నారు. త్వరలో ఆయన స్మారక చిహ్నం, విగ్రహ ఆవిష్కరణ ఉంటుందని ప్రకటించారు. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ బీసీల అభ్యున్నతి కోసం నిరంతరం పరితపిస్తున్నారని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ తెలియజేశారు. శివశంకర్ జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ విద్య ఉంటేనే ఉన్నత స్థానాలకు ఎదగవచ్చని శివశంకర్ ఆయన జీవితంతో సమాజానికి తెలియజేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, మాజీ ఎంపీలు కేవీపీ రామచంద్రరావు, మధుయాష్కీ గౌడ్, సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్, కార్పొరేషన్ల చైర్మన్లు నూతి శ్రీకాంత్‌గౌడ్, అనిల్, సంవిధాన్ బచావో కమిటీ చైర్మన్ వినయ్‌కుమార్, దళిత ఉద్యమ జాతీయ నాయకుడు జె.బి. రాజు తదితరులు పాల్గొన్నారు.

సృష్టి కేసులో రంగంలోకి ఈడీ

- ఎఫ్ఐఆర్, రిమాండ్ రిపోర్టుల కోసం పోలీసులకు లేఖ
- 'సృష్టి'ముఠా మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు అనుమానాలు
- పీఎంఎల్ఏ చట్టం కింద దర్యాప్తు చేయనున్న కేంద్ర సంస్థ

సాక్షి, హైదరాబాద్: సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసులో మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు జరిపేందుకు సిద్ధమైంది. ఇందుకోసం ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ సహా నిందితుల రిమాండ్ రిపోర్టులు ఇవ్వాలని హైదరాబాద్ నార్త్ జోన్ డీసీపీ, గోపాలపురం పోలీసులకు లేఖలు రాసింది. వీటి ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్‌ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్)ను రిజిస్టర్ చేయనుంది. ప్రధాన నిందితురాలు నమ్రత సహా కేసులో నిందితుల బ్యాంకు లావాదేవీలు, ఆస్తుల కొనుగోళ్లు, దేశ విదేశాల్లో పెట్టుబడులకు సంబంధించిన వివరాలు సేకరించనుంది. నమ్రత శిశు విక్రయాల ద్వారా కోట్లు సంపాదించిందని ఈడీ ఇప్పటికే ఆధారాలు సేకరించింది. హైదరాబాద్ సహా 8 రాష్ట్రాల్లో సృష్టి కార్యకలాపాలు విస్తరించి ఉన్నట్లుగా గోపాలపురం పోలీసులు గుర్తించారు. నిరుపేద కుటుంబాల పిల్లలను కొనుగోలు చేసి, సంతానం లేనివారికి అమ్మినట్లు ఆధారాలు లభించాయి. బాధితుల ఫిర్యాదులు ఆధారంగా ఇప్పటికే 9 కేసులను రిజిస్టర్ చేశారు. ఈ వ్యవహారంలో 30 మందిని అరెస్ట్ చేశారు. నమ్రత అక్రమాల ద్వారా రూ.40 కోట్లకు పైగా సంపాదించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ డబ్బును మనీలాండరింగ్ చేసినట్లు భావిస్తున్నారు. ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రత, ఆమె భర్త సురేశ్, ఆమె చెల్లెలు కీర్తి సహా దాదాపు 50 మందికి పైగా సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ద్వారా భారీగా ఆస్తులు సంపాదించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. పిల్లల కొనుగోలుకు రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు చేసి, సరోగసీ పేరుతో రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షలకు వారిని విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. 86 మందికి పైగా శిశువులను చైల్డ్ ట్రాఫికింగ్ చేసినట్లు తేలింది.

నగదు రూపంలోనే లావాదేవీలు

ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం రూ.2 లక్షల కంటే ఎక్కువ మొత్తం నగదు రూపంలో చెల్లించకూడదు. అలా చేయాల్సి వస్తే ఆధార్, పాన్ తదితరాలను పొందుపరచాలి. అయితే ఇవేవీ పట్టించుకోని నమ్రత ముఠా నగదు రూపంలో పెద్దఎత్తున లావాదేవీలు చేసినట్లు గుర్తించారు. దీనిని ఈడీ మనీలాండరింగ్ కిందే పరిగణిస్తుంది. సృష్టి విషయంలో పీఎంఎల్ఏ ఉల్లంఘన జరిగినట్లు ఈడీ భావిస్తోంది. ఈ చట్టం కింద ఈడీ అధికారులు నేరుగా కేసును నమోదు చేసి దర్యాప్తు చేపట్టే అవకాశం లేదు. పోలీస్ స్టేషన్లు సీసీఎస్, సీఐడీ, సీబీఐ వంటి ప్రత్యేక విభాగాలు నమోదు చేసే ఎఫ్ఐఆర్ ఆధారంగానే ఈడీ పీఎంఎల్ఏ కింద కేసు నమోదు చేస్తుంది. అందులో భాగంగానే వివరాలు ఇవ్వాలని పోలీసులకు లేఖ రాసింది.

అంబులెన్స్ రాలేదు.. స్నేహితుడు ప్రాణం నిలపాలని

40 కి.మీ. బైక్‌పై..

- విషం తాగిన స్నేహితుడి ప్రాణాలు కాపాడటానికి స్నేహితుల విఫలయత్నం..
- ఆస్పత్రికి చేరేలోగానే మృతి..



వెంకటేశం (ఫైల్)

పుల్‌కల్(అందోల్): విషం తాగిన యువకుడిని ఆస్పత్రికి తరలించేందుకు ఫోన్ చేసినా 108 అంబులెన్సు రాలేదు.. దీంతో స్నేహితులే అతన్ని 40 కిలోమీటర్ల దూరం బైక్‌పై తరలించారు. కానీ ఆస్పత్రికి చేరేలోపే బాధితుని ఊపిరి ఆగిపోయింది. సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండల పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. మండలంలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన ఎర్రగొల్ల వెంకటేశం (32) ఆదివారం ఇంట్లో పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్నేహితులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేస్తూనే.. సమయాన్ని వృథా చేయకుండా ద్విచక్రవాహనంపై యువకున్ని తీసుకెళ్లారు. మార్గమధ్యలో అంబులెన్స్ ఎదురైతే.. అందులో తరలించవచ్చని భావించి ఇద్దరు స్నేహితులు.. బైక్‌పై బాధితుడిని తరలించారు. కానీ సంగారెడ్డి ఆస్పత్రికి వెళ్లినా అంబులెన్స్ మాత్రం రాలేదు. వైద్యులు పరీక్షించి యువకుడు చనిపోయాడని చెప్పారు. సమయానికి అంబులెన్స్ వస్తే యువకుడు బతికేవాడని స్నేహితులు, కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

అందాల ‘గుమ్మితం’




కొండపై జాలువారుతున్న వర్షం నీరు

ఆకు పచ్చని అటవీ అందాల మధ్యన ఎత్తైన కొండపై నుంచి పాల నురగ వలే తెల్లని జలపాతాలు నేలకు తాకుతుండటం చూస్తే మనస్సు పులకించాల్సిందే. ఇటీవల నల్లమల అటవీ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ఇందిరేశ్వరం సమీపంలోని గుమ్మితం వద్ద జలపాతం కళకళలాడుతోంది. వర్షం నీరు కొండ ప్రాంతం నుంచి కిందకు ప్రవహిస్తుండగా సరికొత్త అందాలు ఆవిష్కృతమవుతున్నాయి. ఈ ప్రాంతం పులుల అభయారణ్యం కావడంతో పర్యాటకులకు అనుమతి లేదు. దీంతో జలపాతం అందాలు అడవి కాచిన వెన్నెలలా మారిందని చెప్పవచ్చు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా కర్నూలు జిల్లా గుమ్మితం వాటర్‌ఫాల్స్‌ను అభివృద్ధి చేసి పర్యాటకులకు అవకాశం కల్పించాలని పలువురు కోరుతున్నారు. **– ఆత్మకూరు**



నల్లమలలో ఆకట్టుకున్న జలపాతం



దేవరకోన జలకళ

తుమ్మలపెంట సమీపంలోని దేవరకోనలో జలపాతం కళకళలాడుతోంది. నాలుగు రోజుల క్రితం ఈ పరిసరాల్లో భారీ వర్షం కురవడంతో జలపాతానికి పెద్ద ఎత్తున నీళ్లు వచ్చి చేరాయి. ఎత్తు నుంచి నీళ్లు పరవళ్లు తొక్కడటంతో కనువిందు చేస్తున్నాయి. ఈ జలపాతాన్ని వీక్షించేందుకు ఇతర ప్రాంతాల నుంచి జనం వస్తున్నారు. – కొలిమిగుండ్ల

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 84,404 మంది స్వామివారిని దర్శించుకోగా 34,930 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.06 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది.

16న ఎస్వీ గోసంరక్షణశాలలో గోకులాష్టమి

తిరుపతి అన్నమయ్యసర్కిల్: టీటీడీ శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలలో ఈనెల 16వ తేదీన గోకులాష్టమి వేడుకలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గోసంరక్షణశాలలో గోపూజ, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నారు. గోశాలలోని గోసంపదను అందంగా అలంకరించి భూలోక గోకులంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గోశాలకు విచ్చేసే భక్తులు గోశాలలో బెల్లం, బియ్యం, పశుగ్రాసాన్ని భక్తులు స్వయంగా పశువులకు తినిపించే అవకాశాన్ని టీటీడీ కల్పిస్తోంది.

21న రాగి రేకులకు టెండర్ కమ్ వేలం

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలకు హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన కాపర్ సిల్వర్ కోటెడ్ రాగి రేకులు ఈ నెల 21వ తేదీన టెండర్ కమ్ వేలం (ఆఫ్‌లైన్) వేయనున్నారు. ఈ మేరకు ఆదివారం టీటీడీ ముఖ్య ప్రజాసంబంధాల అధికారి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇతర వివరాలకు తిరుపతిలోని హరేరామ హరేకృష్ణ రోడ్డులో గల టీటీడీ మార్కెటింగ్ కార్యాలయం (వేలం) 0877–2264429, నంబర్లలో కార్యాలయం పని వేళల్లో లేదా టీటీడీ వెబ్‌సైట్ ను సంప్రదించాలి.

కరుణించమ్మ.. గంగమ్మ..

చౌడేపల్లి: కరుణించమ్మ.. గంగమ్మ తల్లీ.. కోరిన కోర్కెలు తీర్చే వర తల్లీ అంటూ భక్తులు ఆదివారం బోయకొండ గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. చిత్తూరు జిల్లాలో రెండో పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలివచ్చారు.

సైడర్..!



మన ఇంట్లో బంగారం పోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. మన కుటుంబంపై ఎవరైనా దాడికి పాల్పడినా.. ఆడపిల్లలను ఏడిపించినా.. ఎవరైనా మోసగించినా వెంటనే స్పందిస్తాం. అంతేవేగంగా పోలీసులు సైతం విచారణ చేపడతారు. సాధ్యమైనంత త్వరగా నిందితులను పట్టుకోవడానికి ప్రయత్నిస్తారు. అయితే రూ.కోట్లలో మోసాలకు పాల్పడే కంటికి కనిపించని, పరిచయం లేని సైబర్ మోసగాళ్లపై పరువు అనే సమస్యకు భయపడి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు మాత్రం అంతా వెనకడుగు వేస్తారు. ఎందుకంటే టెక్నాలజీ పరంగా, సామాజిక మాధ్యమాల పరంగా కొన్ని బలహీనతలకు లోబడి చేసే తప్పులు బయట పడితే ఇబ్బందులు వస్తాయని ఆగిపోతున్నారు. కుటుంబంలో తెలిస్తే బాధపడతారని రూ.లక్షల్లో మోసపోతున్నారు. కొంతమంది ఎవరికీ చెప్పకోలేక ఆత్మహత్యలకు సైతం పాల్పడుతున్నారు.

– శ్రీకాకుళం క్రైమ్

- రెచ్చిపోతున్న సైబరాసులు
- రూ.కోట్లలో బాధితులకు టోకరా
- పరువు పేరుతో ఫిర్యాదు చేసేందుకు బాధితుల వెనకడుగు

గత కొన్ని నెలలుగా శ్రీకాకుళం జిల్లా ప్రజలు సైబర్ చక్రబంధంలో చిక్కుకొని విలవిలలాడుతున్నారు. వాట్సాప్, ఇన్‌స్టాగామ్ ఇతర సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన సైబరాసురులు హనీ ట్రాప్, డిజిటల్ అరెస్టు, ట్రేడింగ్, పార్ట్‌టైం జాబ్‌ల పేరిట రెచ్చిపోతున్నారు. రూ.లక్షల్లో పోగొట్టుకున్న బాధితుల ఫిర్యాదులతో సుమారు ఏడెనిమిది కేసులు నమోదయ్యాయని, స్టేషన్ మెట్లెక్కని బాధితులు మరింతమంది ఉండొచ్చని పోలీసు వర్గాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. మోసపోయినవారిలో ఉన్నత ఉద్యోగ వర్గాలే ఉండడం విశేషం.

హనీ ట్రాప్‌లో పడి..



జిల్లాకేంద్రం సమీపంలోని సంపన్న వర్గానికి చెందిన ఒక వ్యక్తికి ఇటీవల ఒక అమ్మాయి వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పెట్టింది. ప్రొఫైల్ పిక్‌లో అమ్మాయి ఫొటో ఉండడంతో ఆకర్షితమైన సదరు వ్యక్తి వెంటనే హాయ్ అని రిప్లయ్ ఇచ్చాడు. ఆ తర్వాత నిత్యం చాటింగ్ చేయడం రివాజైంది. కొన్నాళ్లకు వాట్సాప్ కాల్‌లో మాట్లాడడం.. వీడియో కాల్స్ చేయడం ఆరంభించింది. అలా ఆ వ్యక్తిని ముగ్గులోకి దింపిన యువతి వీడియో కాల్స్‌లో న్యూడ్ కాల్స్ చేయడం ప్రారంభించింది. కొద్దిరోజులు తానే న్యూడ్‌గా కనిపించి ఆ తర్వాత సదరు వ్యక్తిని సైతం న్యూడ్‌గా కనిపించాలని కోరిక కోరడంతో, అతడు కూడా నగ్నంగా మాట్లాడడం ఆరంభించాడు. దీంతో ఆ వ్యక్తి నగ్నంగా మాట్లాడిన వీడియో కాల్‌ను రికార్డింగ్ చేసిన ఆ యువతి అక్కడి నుంచి డబ్బులు డిమాండ్ చేస్తూ బ్లాక్ మెయిల్ చేయడం ఆరంభించింది. ఆమె తరపున మరికొంతమంది సైతం వీడియోలు బయటపెడతామంటూ బెదిరించడంతో ఇంట్లో తెలిస్తే పరువు పోతుందేమోనని భయపడి, చేసేదేమీలేక వారు చెప్పిన బ్యాంకు ఖాతాలకు దఫదఫాలుగా రూ.28 లక్షల వరకు పంపించేశాడు. అయినప్పటికీ డబ్బుల కోసం పీడిస్తుండడంతో చేసేదేమీలేక పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డిజిటల్ అరెస్టు పేరిట..



విశాఖపట్నంలోని ఒక అకౌంటింగ్ సెక్షన్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న శ్రీకాకుళం నగరవాసి డిజిటల్ అరెస్టు పేరిట రూ.11 లక్షలను సైబర్ కేటుగాళ్ల చేతిలో మోసపోయారు. మీ పేరిట కొరియర్‌లో డ్రగ్స్ ప్యాకెట్ వచ్చిందని.. మీ ఆధార్ లింక్ నంబర్‌తో కొన్ని ఆర్థిక లావాదేవీలు జరిగాయని సీబీఐ, కస్టమ్స్ అధికారులు అరెస్టు చేసే వీలుందని ఒక వ్యక్తి బెదిరించడంతో నిజమేనని నమ్మాడు. దీనినుంచి బయటపడాలంటే ముందుగా రూ.30 వేలు తాము చెప్పిన ఖాతాలో వేయాలని చెప్పడంతో ఎందుకొచ్చిన గొడవలే అనుకుని ఉద్యోగి వేశాడు. మళ్లీ ఆ వ్యక్తి ఫోన్ చేసి పై అధికారులను మేనేజ్ చేయడం కుదరడం లేదని.. వారే మీకు లైన్‌లోకి రావొచ్చని మెల్లగా జారుకున్నాడు. కొన్ని గంటల్లోనే పోలీసు సెటప్‌తో ఉన్న ఓ రూంలో యూనిఫాంతో ఓ వ్యక్తి వీడియో కాల్‌లో ప్రత్యక్షమై తాను ఢిల్లీ సీబీఐ అసిస్టెంట్ డైరెక్టర్‌నని పరిచయం చేసుకున్నాడు. మేం నిన్ను నమ్మాలంటే మీ బ్యాంకు అకౌంట్లు, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్లు వెరిఫికేషన్ చేయాలన్నాడు. వాటి ఆధారంగా ఇటీవల జరిగిన ఆన్‌లైన్ లావాదేవీలు పరిశీలించాలని.. కొంత అమౌంట్‌ను కూడా వెరిఫికేషన్‌లో భాగంగా తీయాల్సి వస్తుందని చెప్పాడు. అందులో జెన్యూనిటీ ఉంటే తిరిగి మీ ఖాతాలో అమౌంట్ వేయడం జరుగుతుందని చెప్పడంతో సదరు ఉద్యోగి ఓకే చేశాడు. అడిగిన వివరాలు అన్నీ ఇచ్చేయడంతో పాటు ఓటీపీలు చెప్పడంతో రూ.11 లక్షలను కొట్టేశారు. దీంతో తాను మోసానికి గురయ్యానని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఇదే తరహాలో జిల్లా కేంద్రానికి సమీపంలో ఓ ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న జేఈ రూ.3 లక్షలు, నగరానికి చెందిన ఓ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ రూ.3 లక్షలు పోగొట్టుకున్నారు. హ్యూమన్ ట్రాఫికింగ్ చేస్తున్నారంటూ వీరిని సైబరాసురులు అధికారుల పేరిట బెదిరించడం విశేషం.

ఉపాధ్యాయుడికి టోకరా

నగర పరిసరాల్లో ఉండే ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఉన్నత చదువుల నిమిత్తం విదేశాల్లో ఉన్న తన కుమారుడు ఓ నేరం చేశాడని.. సీబీఐ, ఈడీ విభాగాల అధికారులు అరెస్టు చేసే వీలుందని సైబర్ నేరగాళ్లు భయపెట్టారు. దానికి తగ్గ ఆధారాలు తమ వద్దనున్నాయని చెబుతూనే ఫేక్ వివరాలు వాట్సాప్‌లో పంపడంతో ఉపాధ్యాయుడు ఖంగుతిన్నాడు. మీ అబ్బాయి నేరం నుంచి బయటపడి, విదేశాల నుంచి రావాలనుకుంటే అధికారులకు అమౌంట్ కట్టాల్సి ఉంటుందన్నారు. పత్రికలు, మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా ఈ విషయం బయటకు తెలిస్తే మీ పరువు పోతుందని అనడంతో చేసేదేమీలేక రూ.35 లక్షలు వారు చెప్పిన వివిధ ఖాతాల్లోకి పంపించాడు. ఎక్కడ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేస్తాడోనని గంట గంటకు ఉపాధ్యాయునికి వాట్సాప్ వీడియో కాల్ నేరస్తులు చేసేవారు. తర్వాత వాళ్ల నంబర్లకు ఫోన్ కాకపోవడంతో బాధిత ఉపాధ్యాయుడు మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు.



పార్ట్‌టైం జాబ్ ఫ్రాడ్స్..

వాట్సాప్, ఇన్‌స్టాగామ్‌ల్లో పరిచయమైన కొంత మంది వ్యక్తులు ఇంట్లోనే ఉంటూ పార్ట్‌టైం జాబ్ చేసే వీలుందని చెప్పడంతో నగరంలో నలుగురు చిరుద్యోగులు ఈ ఉచ్చులో పడ్డారు. ముందుగా వారు క్రియేట్ చేసిన గ్రూపుల్లో మెంబర్లుగా చేరారు. మొదటి టాస్క్‌లో రూ.5 వేలుకు రూ.1000లు అదనంగా రూ.6 వేలు, రెండో టాస్క్‌లో రూ.10 వేలకు రూ.2 వేలు అదనంగా రూ.12 వేలు వేయడంతో విత్‌డ్రా చేసుకున్నారు. అనంతరం అత్యాశకు పోయి తర్వాత టాస్క్‌ల్లో రూ.30 వేలు, రూ.50 వేలు, రూ.1 లక్ష, రూ.2 లక్షలకు అదనపు సొమ్ము ఖాతాల్లో ఉన్న ఆప్షన్‌లో చూపించినా విత్‌డ్రా చేయడానికి వీలుకాకపోవడం.. ఆ తర్వాత అవతలివాళ్లు వీరి నంబర్లు బ్లాక్ చేయడంతో మోసపోయామని గ్రహించారు.

పోలీసులకు ఆసక్తి ఉన్నా..

పోలీసులు కూడా కేసులు నమోదు చేస్తున్నా మోసం చేసే సైబర్ కేటుగాళ్లు రాష్ట్రాలు, దేశాలు దాటి విదేశాల్లో సైతం ఉండడం.. తెలియని ప్రాంతాల్లో రిస్క్ చేసి పట్టుకోవడానికి వెళ్లే ఆసక్తి ఉన్నా.. రాను పోను ఖర్చులు, వసతి ఖర్చులకు చేతి చమురు తగులుతుండటం.. ఆపై ఎక్కువ రోజుల సమయం వెచ్చించాల్సి రావడంతో వెనకడుగు వేస్తున్నారు. అలా కేసుల్లో అధికశాతం పెండింగ్ ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అందువలన ప్రభుత్వాలు కాస్తా చొరవ తీసుకుని ఆర్థికంగా చేయూతనిస్తే కేసుల ఛేదన సులభమేనంటూ పోలీసులు చెబుతున్నారు.

క్షణాల్లో మోసాన్ని గ్రహించాలి



సహజంగా జరిగే చోరీలు.. ప్రస్తుతం ట్రెండ్‌లో ఉన్న సైబర్ మోసాలను పరిశీలిస్తే 1:10 నిష్పత్తిలో నగదు మోసానికి గురవుతోంది. సైబర్ నేరగాడు బాధితుడి ఆర్థిక స్థితిని చూడడు. అత్యాశనే చూస్తాడు. వారు చేసే మోసాన్ని క్షణాల్లో మనం గ్రహించి స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే నష్టాన్ని పూడ్చవచ్చు. ఈవిధంగానే ఇటీవల డిజిటల్ అరెస్టు వలలో పడి రూ.13.5 లక్షల పోగొట్టుకున్న జెమ్స్ వైద్యురాలి కేసు ఛేదించాం. కోచిగూడ్, మైసూర్ వెళ్లి నిందితులను పట్టుకున్నాం. రాష్ట్రంలో రోజుకి రూ.కోటి నుంచి రూ.1.50 కోట్లు బాధితులు నష్టపోతున్నారు.

– సీహెచ్ పైడపునాయుడు, సీఐ, శ్రీకాకుళం రూరల్

ఖర్జూర సిరులు



ఎడారి పంట అయిన ఖర్జూరం కరువు నేల ‘అనంత’లో సిరులు కురిపిస్తోంది. జిల్లాలో పలువురు రైతులు సంప్రదాయ పంటల సాగుతో పాటు ఆధునిక, ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో ప్రజలకు ఆరోగ్యం తెచ్చిపెట్టే ఖర్జూర పంటతో మంచి లాభాలు వస్తుండటంతో రైతులు దీనివైపు ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా క్రమేణా సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

- అనంతపురం జిల్లాలో విస్తరిస్తున్న సాగు
- ఒకసారి సాగు చేస్తే 40 ఏళ్లపాటు దిగుబడులు
- ఖర్జూరాలకు మార్కెట్లో మంచి డిమాండ్
- ఆదర్శంగా నిలుస్తున్న రైతు రమణారెడ్డి

గార్లదిన్నె: అనంతపురం జిల్లాలోని పలువురు రైతులు ఎప్పటికప్పుడు కొత్త తరహా పంటలు సాగు చేసి మంచి దిగుబడులతో దూసుకెళ్తున్నారు. అనంతపురం మండలం సిండికేట్‌నగర్‌కు చెందిన రైతు రమణారెడ్డి కూడా వినూత్న పంటల సాగుతో పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. గార్లదిన్నె మండలం మర్తాడు, కోటంక గ్రామాల్లోని తమ వ్యవసాయ భూముల్లో ఇప్పటికే డ్రాగన్ ఫ్రూట్ పంట పెట్టి సక్సెస్ అయిన ఈయన ఖర్జూర పంటను పెట్టారు. ఈయన 2019లో కన్యాకుమారి యాత్రకు వెళ్తూ తమిళనాడులో జాతీయ రహదారిపై ఖర్జూర పండ్లు అమ్మడం చూశారు. అక్కడ ఉన్న ఖర్జూర పండ్ల తోటలను గమనించి, ఈ ఎడారి పంట సాగు విధానం చూసి ఎలాగైనా మన నేలలో సాగు చేయాలని భావించారు. అలా అనుకున్నదే తడవు తమకు మర్తాడు, కోటంక గ్రామాల పరిధిలో ఉన్న ఆరు ఎకరాల విస్తీర్ణంలో టిష్యూ కల్చర్ విధానంలో ఖర్జూర పంట కూడా సాగు చేస్తున్నారు. అబుదాబి నుంచి బర్హీ ఎల్లో రకం మొక్క రూ.4500 చొప్పున 500 ఆడ, 50 మగ మొక్కలు కొనుగోలు చేశారు. ప్రతి 100 ఆడ మొక్కల్లో 10 మగ మొక్కలు ఉండేలా నాటారు. ఒక్కసారి మొక్క నాటితే 40 ఏళ్లపాటు పంట దిగుబడి వస్తుంది. సాధారణంగా ఫిబ్రవరిలో పూత దశ ఉంటుంది. పూత సమయంలో ఆడ, మగ మొక్కలు సంపర్కం చేస్తేనే ఖర్జూర పంట వస్తుంది. సంపర్కం జరగకపోతే ఈత కాయల తరహాలో మారిపోతాయి. సంపర్కం చేసే రోజు వర్షం వస్తే పంట దిగుబడి రాదు. అలాగే తోటలో మగ మొక్కలు పూత తక్కువ వస్తే, సంపర్కం కోసం మగ పూత కిలో రూ.12,500 వెచ్చించి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. జూలై చివరిలో పంట కోత దశకు వస్తుంది.

ఏకరాకు రూ.7లక్షల దాకా పెట్టుబడి..

పంట సాగులో మొదటి నుంచి సేంద్రియ ఎరువులు, ఆవుపేడ, గంజు, కోడి, గొర్రెల పెంట వంటి హిట్ ఎరువులు, జీవామృతం అధికంగా వాడాలి. ఎకరాకు రూ.7 లక్షల దాకా పెట్టుబడి అవుతుంది. నీరు కూడా చాలా ఎక్కువ అవసరం. ఎకరాకు 100 మొక్కలు సాగు చేయవచ్చు. మూడు నుంచి నాలుగేళ్లకే దిగుబడి వస్తుంది. ఐదు సంవత్సరాల్లో ఒక చెట్టు వంద కేజీల ఖర్జూర కాయలు కాస్తుంది. ఒక ఎకరంలో 5 టన్నుల దిగుబడి వస్తుంది.

సేంద్రియ ఎరువులతో తెగుళ్లకు చెక్..

ఖర్జూర పంటలో రైనోబీటిల్, రెడ్‌విల్ వంటి తెగుళ్లు వస్తాయి. ఈ తెగుళ్లు సోకిన మొక్క కిందకు వాలిపోతుంది. సేంద్రియ ఎరువులు అధికంగా వాడి తెగుళ్లను నివారించవచ్చు. పంట సాగుకు చౌడు, నల్లరేగడి, ఇసుక లోమి నేలలు అనుకూలం.

డిమాండ్ ఎక్కువే..

ఖర్జూరకాయలకు డిమాండ్ ఎక్కువగానే ఉంది. విశాఖపట్నం, గుంటూరు, తణుకు, విజయవాడ, హైదరాబాద్ నుంచి వ్యాపారస్తులు తోట వద్దకే వచ్చి పసుపు పచ్చని ఖర్జూర కాయలు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం హోల్‌సేల్ కిలో రూ.120తో, టన్ను రూ.1.20 లక్షల నుంచి రూ.1.30 లక్షల వరకు విక్రయిస్తున్నారు. ఇప్పటి వరకు రమణారెడ్డి 25 టన్నుల ఖర్జూర కాయలు విక్రయించారు. ఇంకా 10 టన్నులదాకా కాయలు చెట్ల మీద ఉన్నాయి.

లాభదాయకమైన పంట



ఖర్జూర దిగుబడిని చూపుతున్న రైతు రమణారెడ్డి

మేము సిండికేట్ నగర్‌లో పట్టు చీరల వ్యాపారం చేస్తూ జీవనం సాగించే వారం. కన్యాకుమారికి విహార యాత్రకు వెళ్లినప్పుడు ఖర్జూర పంట సాగు విధానం పరిశీలించాను. మా వ్యవసాయ భూమిలో సాగు చేద్దామని ప్రయోగాత్మకంగా చేపట్టాను. మొదట్లో ఇబ్బంది పడినా క్రమేణా సాగులో మెలకువలు తెలుసుకొని మంచి దిగుబడులు సాధిస్తున్నాం. పంట పెట్టుబడి ఎక్కువైనా ఆశించిన దిగుబడి వస్తోంది. 30 నుంచి 40 ఏళ్లపాటు దిగుబడి వస్తుందని అంటున్నారు. ఇది మంచి లాభదాయకమైన పంటే.

– రమణారెడ్డి, రైతు, మర్తాడు

మొక్కుబడి తంతు

బడి బస్సు భద్రమేనా..!



- కనీస తనిఖీలు చేపట్టని ఆర్టీఏ అధికారులు
- ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ ప్రైవేటు సంస్థకు అప్పగింత

పట్నంబజారు: విద్యా సంస్థల బస్సుల భద్రతపై నీలిమేఘాలు కమ్ముకుంటున్నాయి. రవాణాశాఖ అధికారులు పూర్తిస్థాయి పర్యవేక్షణ లేకపోవటం అందుకు కారణం అవుతోందనే వాదనలు వినవస్తున్నాయి. రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) అధికారుల గణాంకాల ప్రకారం.. గుంటూరు జిల్లాలో 1600 వరకు విద్యా సంస్థల బస్సులు ఉన్నాయి. గతంలో ఆర్టీఏ అధికారులు పూర్తిస్థాయిలో బస్సులను మ్యానువల్, సెన్సార్‌ల ప్రకారం తనిఖీలు నిర్వహించి ఎఫ్‌సీలు జారీ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎఫ్‌సీ జారీ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ సంస్థకు కట్టబెడుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో జర్మనీ మిషన్‌లు, సెన్సార్‌ల ప్రకారం.. బస్సుల తనిఖీలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మిషనరీ ద్వారా కొద్దిపాటి తనిఖీలు మాత్రమే జరుగుతున్నాయని తెలుస్తోంది. దీనిపై పలుమార్లు ఆర్టీఏ, ప్రైవేట్ ఎఫ్‌సీ సంస్థలను వివరాలు అడిగినప్పటికీ ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. అయితే మిషనరీకి సంబంధించినవి మాత్రమే ప్రైవేట్ ఎఫ్‌సీ సెంటర్ నిర్వాహకులు నిర్వహిస్తున్నారని, సుమారు 16 నిబంధనలు మ్యాన్యువల్ ప్రకారం చేయాల్సి ఉందని చెబుతున్నారు.

నిబంధనలు..

- 60 సంవత్సరాలు వయో పరిమితి దాటిన వ్యక్తి విద్యాసంస్థల బస్సు డ్రైవర్‌గా అనర్హుడు
- డ్రైవర్‌కు ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆరోగ్య పరీక్షలు ఆయా యాజమాన్యాలు విధిగా చేయించి, రికార్డులను భద్రపరచాలి.
- డ్రైవర్‌ల నియామకాన్ని ఆర్టీఓ అధికారులకు తెలియపరచాలి
- ప్రతి వాహనంలో ఫిర్యాదు పుస్తకాన్ని ఏర్పాటు చేయాలి. విద్యార్థుల వివరాలను యాజమాన్యాలు నోట్ చేసుకోవటంతో పాటు, తల్లిదండ్రులకు డ్రైవర్ వివరాలు తెలియజేయాలి.
- 15 సంవత్సరాలు దాటిన బస్సులకు అనుమతి ఉండదు.

తనిఖీలు తూతూమంత్రం

విద్యా సంస్థల బస్సుల పర్యవేక్షణలో భాగంగా గతంలో అనేక కేసులు నమోదు అయ్యాయి. నిబంధనలు పాటించకుంటే బస్సులు సీజ్ చేసే అధికారం ఆర్టీఏ అధికారులకు ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో అధికారులు మరింతగా బడి బస్సుల భద్రతపై దృష్టి సారించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంతో పోలిస్తే ప్రస్తుతం తనిఖీలు తగ్గిపోయాయి. 2022లో జిల్లావ్యాప్తంగా బస్సులను తనిఖీలు చేసి, నిబంధనలు పాటించనివాటిపై 545 కేసులు నమోదు చేసిన అధికారులు ఈ ఏడాది 98 కేసులు మాత్రమే నమోదు చేయడం వారి పని తీరుకు అద్దం పడుతోంది. ఇప్పటికైనా అధికారులు మేల్కొని తనిఖీలు నిర్వహించి, బడి బస్సుల భద్రతపై దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

చార్‌ధామ్ ప్రకృతి యాత్ర


గంగోత్రి | యమునోత్రి | కేదార్‌నాథ్ | బద్రీనాథ్

**యమునోత్రి యమునానది పుట్టిన ప్రదేశం.
గంగోత్రి... గంగానది పుట్టిన ప్రదేశం.
కేదార్‌నాథ్ మంచుకొండల్లోని జ్యోతిర్లింగం.
బదరీనాథ్ హిమాలయాల్లో విష్ణు మందిరం.
ఇది... ప్రాశస్త్యం కలిగిన చార్‌ధామ్ యాత్ర.
వీటితోపాటు...
రాముడు తపస్సు చేసిన దేవప్రయాగ.
శివుడు ప్రేమను వ్యక్తం చేసిన గుప్తకాశీ.
పాండురాజు నివసించిన పాండుకేశ్వర్.
శివ గౌరి పెళ్లి వేదిక త్రియుగినారాయణ్.
అందుకే ఇది డబుల్ కా మీఠా టూర్.**

1 వ రోజు చెన్నై నుంచి ఘజియాబాద్‌కు ప్రయాణం. ఘజియాబాద్‌లో విమానం దిగిన తరవాత రోడ్డు మార్గాన హరిద్వార్‌కు ప్రయాణం. హరిద్వార్‌లో హోటల్ గదిలో చెక్ ఇన్ కావడం, విశ్రాంతి. రాత్రి బస. ప్యాకేజ్ ప్లాన్‌లో గంగా హారతి పన్నెండవ రోజు ఉంది. కానీ ఆసక్తి ఉన్న వాళ్లు స్వయంగా ఈ రోజు కూడా వెళ్లవచ్చు.

2 వ రోజు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత గది చెక్ అవుట్ చేసి హరిద్వార్ నుంచి బార్కోట్‌కు ప్రయాణం. బార్‌కోట్‌లో గదిలో చెక్ ఇన్. రాత్రి బస అక్కడే.

ఆకుపచ్చ హిమాలయాల వీక్షణం

హరిద్వార్ నుంచి బార్కోట్‌కు రెండు వందల కిలోమీటర్ల దూరం ఉంటుంది. మన మైదాన ప్రాంతంలో సాగినట్లు ప్రయాణం వేగంగా సాగదు. ఆరు గంటలు పడుతుంది. హరిద్వార్ నుంచి యమునోత్రికి వెళ్లే దారిలో యమునానది తీరాన ఉన్న చిన్న పట్టణం బార్కోట్. నాలుగువేల అడుగుల ఎత్తులో ఉంది. ఉత్తరాది రాష్ట్రాల్లో ముఖ్యంగా ఉత్తరాఖండ్‌లో, హిమాలయాల పర్వత శ్రేణుల్లో విస్తరించిన గ్రామాల్లో అక్షరాస్యత తక్కువ. కానీ బార్‌కోట్‌లో 75శాతం అక్షరాస్యులే. జాతీయ సరాసరి అక్షరాస్యతకంటే దాదాపు పదిశాతం ఎక్కువ. ఇక్కడ పర్యాటకం మంచి జీవనోపాధి కావడంతో చదువుకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఇక్కడ హిమాలయాల మీద మంచు కనిపించదు. పశ్చిమ కనుమల్లాగా చిక్కటి ఆకుపచ్చ రంగులో ఉంటాయి. ఇక్కడ ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ రాత్రి బస చేయడం మరిచిపోలేని అనుభూతి.

3 వ రోజు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత బార్‌కోట్ నుంచి హనుమాన్ చట్టికి, ఆ తర్వాత యమునోత్రికి ప్రయాణం. దర్శనం తర్వాత తిరిగి బార్‌కోట్‌కి తిరుగు ప్రయాణం. రాత్రి బస బార్‌కోట్‌లోనే.

యమున పుట్టిల్లు!

బార్కోట్ నుంచి యమునోత్రికి వెళ్లే దారిలో హనుమాన్ చట్టి దాటిన తరవాత 13 కిలోమీటర్ల దూరంలో కాళింది పర్వతం మీద ఉంది యమునోత్రి. ఇది హిమనీనదం. మంచు కరుగుతూ ప్రవాహరూపం సంతరించుకుంటున్న పరిస్థితి. పర్వతాల మధ్య నిశ్శబ్దం తప్ప మరేమీ లేనంత ప్రశాంతత నెలకొని ఉంటుంది. పర్యాటకుల రణగొణ ధ్వనులు తప్ప సాధారణ శబ్దాలేవీ వినిపించవు. యమునా నది పుట్టిన ప్రదేశంలో ఓ ఆలయం. ఆ ఆలయంలో పూజాదికాలు నిర్వహించే పూజారి కుటుంబంతోపాటు మరికొన్ని కుటుంబాలు తప్ప ఇది పెద్ద జనావాసం కాదు. ఈ ప్రదేశానికి చేరాలంటే కాలి నడక లేదా గుర్రాల మీద మాత్రమే. స్థానికులు జమ్‌నోత్రి అంటారు. వారితో మాట్లాడేటప్పుడు జమునోత్రి అనడమే సులువుగా ఉంటుంది. యమునోత్రి ఆలయాన్ని గర్వాల్ రాజు మహారాజా ప్రతాప్ షా నిర్మించాడు. కొంతకాలానికి భూకంపం వచ్చినప్పుడు అది కూలి పోవడంతో ఇప్పుడు మనకు కనిపించే ఆలయాన్ని జైపూర్ మహారాణి 19వ శతాబ్దంలో నిర్మించారు. యమునోత్రికి ఏడు కిలోమీటర్ల దూరాన జానకి చట్టిలో సూర్యకుండ్ హాట్ వాటర్ స్ప్రింగ్ ఉంది. ఈ ఉష్ణనీటి గుండంలో స్నానం చేయవచ్చు.

4 వ రోజు బార్‌కోట్ నుంచి ఉత్తరకాశీకి ప్రయాణం. హోటల్ గదిలో చెక్ ఇన్. సాయంత్రం విశ్రాంతి. రాత్రి బస కూడా అక్కడే.

ఇది ఉత్తరాఖండ్ కాశీ

ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ట్రెకింగ్‌కి ఉత్తరకాశీ చక్కటి ప్రదేశం. పర్వతాల మీద వాలే మంచు దూదిపింజల్లా తేలుతూ ఉంటే పర్వతాల నడుమ కనుమల్లో పచ్చదనాన్ని ఆస్వాదిస్తూ సాగే నడక, క్యాంపింగ్ ఒక జీవితకాలపు మధురానుభూతినిస్తాయి. ఈ టూర్ ప్లాన్‌లో ట్రెకింగ్ లేదు. కానీ ఈ టూర్‌లో యువత ఉంటే నాలుగవ రోజు విశ్రాంతి సమయం లేదా ఐదవరోజు ఖాళీ సమయాల్లో సొంతంగా క్యాంపింగ్ ప్లాన్ చేసుకోవచ్చు. ఇక్కడ విశ్వనాథుడి పేరుతో ఉన్న శివాలయం ప్రసిద్ధి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, వారణాసి (కాశీ) లోని విశ్వనాథుడి దర్శనానికి వెళ్లలేని వాళ్ల కోసం శివుడు ఇక్కడ అదే పేరుతో వెలిశాడని చెబుతారు. కాశీలో ఉన్నట్లే ఇక్కడ కూడా హనుమంతుడు, దుర్గ, పరశురామ, దత్తాత్రేయ, భైరవ్, అన్నపూర్ణ ఆలయాలున్నాయి.

5 వ రోజు బ్రేక్‌ఫాస్ట్ తర్వాత ఉత్తరకాశీ నుంచి గంగోత్రికి ప్రయాణం. దర్శనం తర్వాత తిరిగి ఉత్తరకాశీకి ప్రయాణం. రాత్రి బస ఉత్తరకాశీలో.

గంగ పుట్టిల్లు!

ఉత్తరకాశీ పట్టణానికి వంద కిలోమీటర్ల దూరాన ఉంది గంగోత్రి. పదివేల అడుగుల ఎత్తులో ఉంది. ఇక్కడ మనం చూసే ప్రదేశం గంగోత్రి గ్లేసియర్ (హిమానీనదం). మంచు రూపంలో ఉన్న నది. మంచు కరుగుతూ క్రమంగా ప్రవాహ రూపం సంతరించుకుంటుంది. ఇక్కడ గంగోత్రి నుంచి జాలువారిన ప్రవాహాన్ని భాగీరథి నదిగా పిలుస్తారు. ఈ నది దేవప్రయాగలో అలకనంద నదిలో సంగమించిన తర్వాత ఆ సంగమ ప్రవాహాన్ని గంగ అని పిలుస్తారు. భగీరథుడి ప్రయత్నం వల్ల శివుడి తల మీద నుంచి గంగ నేలకు వచ్చిన ప్రదేశంగా భావిస్తూ భాగీరథి పేరుతో పిలుస్తారు. నీటిని దైవంగా భావించే సంస్కృతిలో భాగంగా గంగోత్రిలో ఆలయం ఉంది. ఇక్కడ ఆశ్చర్యకరమైన ఓ సంగతి ఉంది. ఇక్కడ నివసించే ప్రజల్లో అక్షరాస్యత శాతం 99. ఆశ్చర్యపోయే ముందు ఇక్కడ జనాభా సంఖ్యను తెలుసుకుందాం. ఇక్కడ నివసించే కుటుంబాల సఖ్య యాభై లోపే. జనాభా నూట పది మంది మాత్రమే.

6 వ రోజు తెల్లవారు జామున గుప్త కాశీకి ప్రయాణం. హోటల్ గదిలో చెక్ ఇన్. రాత్రి బస

శివుడు ప్రేమ క్షేత్రం

గుప్తకాశీ కూడా ఉత్తరకాశీలాగానే హిమాలయ పర్వతాల్లో ఉన్న శైవక్షేత్రం. ఉత్తరప్రదేశ్‌లో గంగా నది తీరాన ఉన్న కాశి (వారణాసి)కి మరొక ప్రతిరూపం గుప్తకాశి. ఇక్కడ విశ్వనాథ ఆలయంతోపాటు అర్ధనారీశ్వర ఆలయం కూడా ఉంది. ఈ ప్రదేశాన్ని కేదార్ ఖండ్ అంటారు. ఇక్కడ మణికర్ణిక కుండ్ అనే సరస్సు ఉంది. దీనిని గంగ, యమున నదులకు ప్రతీకగా చెబుతారు. ఇందులో మునిగితే ఈ రెండు నదుల్లో స్నానమాచరించిన ఫలితం ఉంటుందని భక్తుల అభిప్రాయం. మహాభారత యుద్ధం తర్వాత పాండవులు తమకు యుద్ధం కారణంగా వచ్చిన పాపాల నుంచి విముక్తి ప్రసాదించమని కోరుతూ కాశీకి వెళ్లారని, పాండవులను కలవడానికి ఇష్టపడని శివుడు అక్కడి నుంచి మాయమై గుప్తకాశీకి వచ్చాడని చెబుతారు. అలాగే శివుడు తన ప్రేమను పార్వతికి తెలియచేసిన ప్రదేశం కూడా ఇదేనని చెబుతారు.

7 వ రోజు గుప్తకాశీ నుంచి జీపులో సోన్‌ప్రయాగ మీదుగా గౌరీకుండ్‌కు ప్రయాణం. కేదార్‌నాథ్‌కు నడక. దర్శనం తర్వాత తిరిగి గౌరీకుండ్ మీదుగా సోన్ ప్రయాగ్ నుంచి గుప్తకాశీకి ప్రయాణం. రాత్రి బస గుప్తకాశీలో.

పార్వతి తపస్సు చేసిందిక్కడే

గౌరీకుండ్ నుంచి కేదార్‌నాథ్‌కు 14 కి.మీల దూరం. ఇది కేదార్‌నాథ్ పర్యాటకులకు ఒక మజిలీ. ఇక్కడి నుంచి కాలి నడకన లేదా హెలికాప్టర్‌లో వెళ్లవచ్చు. శివుని కోసం పార్వతి తపస్సు చేసిన ప్రదేశం గౌరీకుండ్ అని చెబుతారు. దీనికి సమీపంలో ఉన్న త్రియుగినారాయణ్ అనే ప్రదేశంలో శివపార్వతులు వివాహం చేసుకున్నట్లు చెబుతారు. గౌరీకుండ్ దగ్గర నిలబడి ఎటు చూసినా చక్కటి పచ్చదనమే. ఏ మాత్రం కలుషితం కాని ఆహ్లాదకరమైన వాతావరణం. ట్రెకింగ్ చేయగలిగితే అద్భుతమైన అనుభూతి.

కేదార్‌నాథ దర్శనం

హిమాలయ పర్వతాల్లో ఓ చిన్న పట్టణం కేదార్‌నాథ్. దాదాపుగా పన్నెండు వేల అడుగుల ఎత్తులో ఉంది. కేదారనాథుడి పేరుతో పూజలందుకుంటున్న దేవుడు శివుడు. ఇక్కడ కేదార్‌నాథుడి ఆలయంతోపాటు చూడాల్సిన ప్రదేశం చోరాబారి హిమానీనదం. ఇక్కడి మంచు కరిగి మందాకిని నది పేరుతో ప్రవహిస్తోంది. కేదార్‌నాథ్ ఆలయాన్ని మంచుకురిసే సమయాల్లో ఆరు నెలల పాటు (నవంబర్ నుంచి ఏప్రిల్) మూసివేస్తారు. ఆలయాన్ని మూసివేసే ముందు ఉత్సవమూర్తిని పల్లకిలో గుప్తకాశీకి దగ్గరలో ఉన్న ఉఖీమఠ్ లోని ఓంకారేశ్వర్ టెంపుల్‌కి తీసుకువస్తారు. ఆరు నెలలపాటు అక్కడే పూజలు నిర్వహిస్తారు. ఆలయం తెరిచేటప్పుడు తిరిగి అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తారు.


8 వ రోజు రోజంతా గుప్తకాశీలో విశ్రాంతి. పర్వతాల మీదకు ట్రెకింగ్, స్థానిక ఆలయాల దర్శనాలకు వెళ్లవచ్చు. ఇది ఎవరికి వారు ప్లాన్ చేసుకోవాలి.

> ఐఆర్‌సీటీసీ నిర్వహించే చార్‌ధామ్ యాత్ర ఈ నెల 22వ తేదీ న మొదలవుతుంది. సెప్టెంబర్ మూడవ తేదీ తో పూర్తవుతుంది. ఈ పర్యటనలో యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బదరీనాథ్ ప్రదేశాలను దర్శించుకోవచ్చు.
> **ప్యాకేజ్ ఇలాగ:** • సింగిల్ ఆక్యుపెన్సీలో దాదాపు 70 వేల రూపాయలు. డబుల్ ఆక్యుపెన్సీలో ఒక్కొక్కరికి అరవై వేలు, ట్రిపుల్ ఆక్యుపెన్సీలో ఒక్కొక్కరికి 58 వేలకు పైగా అవుతుంది.
> • ఇది ఫ్లయిట్ జర్నీ. విమానం 22వ తేదీ ఉదయం 5.50 నిమిషాలకు చెన్నై ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరుతుంది. ఎనిమిదిన్నరకు ఘజియాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఘజియాబాద్ నుంచి సెప్టెంబర్ మూడవ తేదీ సాయంత్రం నాలుగున్నరకు బయలుదేరి ఆరు గంటల పది నిమిషాలకు చెన్నై చేరుతుంది.

9 వ రోజు బ్రేక్‌ఫాస్ట్ తర్వాత గది చెక్ అవుట్ చేసి పాండుకేశ్వర్‌కు ప్రయాణం. అక్కడ గదిలో చెక్ ఇన్ అయి రాత్రికి బస.


పాండురాజు వనవాసమిక్కడే!

గుప్తకాశీ నుంచి పాండుకేశ్వర్‌కు రోడ్డు మార్గాన దాదాపు రెండు వందల కిలోమీటర్ల ప్రయాణం. ఆ రోజంతా ప్రయాణంలోనే గడిచిపోతుంది. ఇది బదరీనాథ్‌కు వెళ్లడానికి మధ్యలో ఒక మజిలీ. జోషిమఠ్‌కు బదరీనాథ్‌కు మధ్యలో ఉంటుంది. పాండవుల తండ్రి పాండురాజు రాజ్యాన్ని ధృతరాష్ట్రుడికి వదిలేసి వనవాసానికి వెళ్లినట్లు కథనం. ఆ వనవాసంలో పాండురాజు ఇక్కడ నివసించాడని అందుకే ఈ ప్రదేశానికి ఆ పేరు వచ్చిందని చెబుతారు. ఇక్కడ యోగధ్యాన బదరీ ఆలయం, వాసుదేవ ఆలయం ఉన్నాయి. వీటిని పాండురాజు నిర్మించినట్లు తామ్ర శాసనాలు దొరికాయి. అప్పటి పాంచాలదేశమే నేటి ఉత్తరాఖండ్ అని చెబుతారు. కురుక్షేత్ర యుద్ధంలో గెలిచిన తర్వాత పాండవులు తమ రాజ్యాన్ని పరీక్షిత్తుకు అప్పగించి మోక్షమార్గాన్ని అన్వేషిస్తూ ఇక్కడ కొంతకాలం నివసించారని స్థానిక కథనం. మంచు కురిసే సమయాల్లో బదరీనాథ్ ఆలయాన్ని మూసివేసేటప్పుడు ఉత్సవమూర్తిని పల్లకీలో ఊరేగింపుగా ఇక్కడి యోగధ్యాన బదరీ ఆలయానికి తీసుకువస్తారు.


యమునోత్రి మార్గంలో బార్కోట్ గ్రామం



గంగోత్రి గ్లేసియర్


దేవప్రయాగ


ఉత్తరకాశీ


గౌరీకుండ్


పాండుకేశ్వర్


రిషికేశ్‌లోని లక్ష్మణ్‌ఝూలా



చార్‌ధామ్ యాత్ర మార్గం

10 వ రోజు బ్రేక్‌ఫాస్ట్ తర్వాత పాండుకేశ్వర్ నుంచి బదరీనాథ్‌కు ప్రయాణం. బదరీనాథ్‌లో పూజ, మధ్యాహ్న భోజనం తర్వాత మాయాపూర్‌కు ప్రయాణం. మాయాపూర్‌లో హోటల్‌లో చెక్ ఇన్. రాత్రి బస.

రంగవల్లుల మందిరం

బదరీనాథ్ ఆలయ నిర్మాణమే ఒక అద్భుతం. యాభై అడుగుల ఎత్తు ఉంటుంది. సునిశితమైన నిర్మాణ నైపుణ్యానికి ప్రతీక ఈ ఆలయం. దూరానికి కూడా కళ్లకు కొట్టొచ్చే రంగులతో ఆకట్టుకుంటుంది. ఆలయ స్తంభాల నుంచి పై కప్పు, మండపం ప్రతిదీ శిల్ప నైపుణ్యంతో ఆకట్టుకుంటుంది. ఉత్తరాది ఆలయాల్లో గ్రానైట్ రాయిలో ఇంత గొప్ప శిల్పనైపుణ్యం నిండిన ఆలయాలను తక్కువగా చూస్తుంటాం. రంగవల్లులతో అలంకరించినట్లు ఉంటుంది. ఈ ఆలయంలో విష్ణుమూర్తికి ఎదురుగా వాహనం గరుడపక్షి విగ్రహం మోకాళ్ల మీద కూర్చున్న భంగిమ ప్రత్యేక ఆకర్షణ. గర్భాలయంలో బంగారు పూత ఉంటుంది. ఈ ఆలయంలో విష్ణుమూర్తి పద్మాసన స్థితిలో కూర్చుని ధ్యానముద్రలో ఉంటాడు. బదరీనారాయణ సాలిగ్రామ రూపాన్ని శంకరాచార్యుడు తప్తకుండ్ దగ్గర ఉన్న గుహలో గుర్తించాడని చెబుతారు. ఆ విగ్రహాన్ని 16వ శతాబ్దంలో గర్వాల్ రాజు గర్భాలయంలో ప్రతిష్ఠించాడని చెబుతారు. ఈ ఆలయంలో గణేశ్, కుబేరుడు, నారదుడు, నరనారాయణ ద్వయం వంటి పదిహేను విగ్రహాలున్నాయి.

11 వ రోజు ఉదయం త్వరగా బ్రేక్‌ఫాస్ట్ ముగించుకుని దేవప్రయాగకు ప్రయాణం. అక్కడ రఘునాథ్ ఆలయ దర్శనం. అలకనంద-భాగీరథి నదుల సంగమం స్థలి వీక్షణం. రిషికేశ్‌కు ప్రయాణం. అక్కడ రామ్ ఝూలా, లక్ష్మణ్ ఝూలా, స్వర్గాశ్రమ సందర్శనం తర్వాత హరిద్వార్‌కు ప్రయాణం. హరిద్వార్‌లో హోటల్ చెక్ ఇన్. రాత్రి బస.

రాముడు తపస్సు చేసిన నేల

దేవప్రయాగకు ఉన్న పౌరాణిక ప్రాశస్త్యం చాలా గొప్పది. ఇది పంచప్రయాగల్లో ఒకటి. ఇక్కడ ఉన్న రఘునాథ్ జీ ఆలయం వెయ్యేళ్ల పైబడిన నిర్మాణం. అలకనంద-భాగీరథి సంగమ స్థలికి ఎగువ భాగాన ఉంది. రావణసంహారం తర్వాత శ్రీరాముడు విజయంతో అయోధ్యకు తిరిగి వచ్చిన తర్వాత ఈ ప్రదేశంలో కొంతకాలం తపస్సు చేశాడని చెబుతారు. ఇక్కడ ప్రకృతి చాతుర్యం అలకనంద- భాగీరథి నదుల సంగమం. అలకనంద నీరు మట్టితో కలిసి గోధుమరంగులోనూ, భాగీరథి నీరు ఆకు పచ్చరంగులోనూ ఉంటాయి. ఈ రెండింటి కలయిక తర్వాత ఈ ప్రవాహాన్ని గంగానదిగా పిలుస్తారు.

> **ఆర్‌వీ టూర్స్ అండ్ ట్రావెల్స్ నిర్వహిస్తున్న చార్‌ధామ్ యాత్ర హైదరాబాద్ నుంచి మొదలవుతుంది. ఈ పన్నెండు రోజుల టూర్ సెప్టెంబర్ ఐదవ తేదీ నుంచి మొదలవుతుంది. ఇందులో ఒక్కొక్కరికి దాదాపుగా అరవై వేల రూపాయలవుతుంది.**

ఉత్తుంగ తరంగం

రిషికేశ్‌కి ఉన్న పౌరాణిక ప్రాశస్త్యంతో పాటు భౌగోళిక వైశిష్ట్యం కూడా పెద్దదే. దేవప్రయాగ నుంచి గంగానది రిషికేశ్‌కి వచ్చేటప్పటికి ప్రవాహం ఉధృతంగా ఉరకలెత్తుతూ ఉంటుంది. ఆశ్చర్యంగా నీరు ఇక్కడ అత్యంత స్వచ్ఛంగా ఉంటాయి. అలకనంద-భాగీరథి నదుల నీటిలో కనిపించే పచ్చరంగు, బురద రంగు ఛాయలు కూడా కనిపించవు. రిషికేశ్ రివర్ రాఫ్టింగ్‌కి అద్భుతమైన ప్రదేశం. రాఫ్టింగ్ ప్రాక్టీస్ చేయించే ఆపరేటర్‌లు ఉంటారు. రాఫ్టింగ్ మెళకువలు నేర్పించి రోడ్డు మార్గాన రిషికేశ్ ఎగువ ప్రాంతానికి తీసుకువెళ్లి అక్కడ నదిలో వదులుతారు. ప్రవాహంతోపాటుగా కేరింతలు కొడుతూ ఒక్కో రాఫ్టింగ్ బోట్ పరుగులు తీస్తుంటుంది. రిషికేశ్‌లో గంగానది ఒక ఒడ్డు నుంచి మరొక ఒడ్డుకు చేరడానికి ఒక వంతెన ఉంటుంది. దానిని లక్ష్మణ్ ఝూలా అంటారు. సీతాదేవి నదిని దాటడం కోసం లక్ష్మణుడు చెట్ల తీగలు, వేళ్లతో వంతెన ఏర్పాటు చేశాడని చెబుతారు. ఇప్పుడు మనకు కనిపించే ఇనుప వంతెనను బ్రిటిష్ పాలకులు నిర్మించారు. ఇరవయ్యవ శతాబ్దపు తొలినాళ్లలో వేళ్ల, చెట్ల తీగల వంతెన పర్యాటకుల తాకిడికి కుంగిపోవడంతో ఇనుప వంతెన నిర్మించారు. రిషికేశ్ కి ఒక కిలోమీటరు దూరాన రాముడు కట్టిన వంతెన ఉంటుంది. దాని పేరు రామ్‌ఝూలా.

12 వ రోజు బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హరిద్వార్‌లో సైట్ సీయింగ్. మానసదేవి ఆలయ దర్శనం. సాయంత్రం గంగాహారతి, షాపింగ్, రాత్రి బస.

నిర్మల గంగ

హరిద్వార్‌లో గంగానది నిర్మలంగా ప్రవహిస్తుంటుంది. నగరంలో మోటారు వాహనాలను అనుమతించరు. గంగానది ఒక ఘాట్ నుంచి మరొక ఘాట్‌కు వెళ్లడానికి ఎలక్ట్రిక్ ఆటోలుంటాయి. చండీదేవి ఆలయానికి వెళ్లడానికి రోప్‌వే ఉంటుంది. రోప్‌వే మీద ప్రయాణిస్తూ గంగానది ఏరియల్ వ్యూ చూడడం మర్చిపోవద్దు. మానసాదేవి ఆలయం నుంచి ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించవచ్చు. సాయంత్రం గంగాహారతి వీక్షణం కనువిందు చేస్తుంది. నాలుగు గంటలకే ఘాట్‌కు చేరితే హారతి మొదలయ్యే లోపు వెలుతురు ఉండగానే కలియతిరగవచ్చు. షాపింగ్ కూడా అప్పుడే పూర్తి చేసుకోవాలి. హారతి తర్వాత చీకటి పడుతుంది. కాబట్టి నేరుగా గదికి రావడమే ఉంటుంది.

13 వ రోజు బ్రేక్‌ఫాస్ట్ తర్వాత ఘజియాబాద్‌కు ప్రయాణం. ఎయిర్‌పోర్టులో డ్రాప్ చేయడంతో నిర్వాహకుల బాధ్యత పూర్తవుతుంది. పర్యాటకులు విమానం ఎక్కి చెన్నైకి రావడంతో చార్‌ధామ్ యాత్ర పూర్తవుతుంది.

- వాకా మంజులారెడ్డి,
సాక్షి, ఫీచర్స్ ప్రతినిధి



...ఆలోచన పెట్టుకోకూడదు.
- ఇదోవు కొయెనికన్, ప్రఖ్యాత రచయిత
- జోనాథన్ స్విఫ్ట్, ఆంగ్లో ఐరిష్ రచయిత

గణాంకాలపై మార్కెట్ల ఫోకస్

క్యూ1 ఫలితాలకూ ప్రాధాన్యం • కీలకంకానున్న ఎఫ్‌పీఐల ధోరణి

టారిఫ్ అంశాలపైనా ఇన్వెస్టర్ల దృష్టి • ఈ వారం ట్రేడింగ్ నాలుగు రోజులే

ప్రధానంగా ఆర్థిక గణాంకాలు, వాహన విక్రయాలు, యూఎస్ టారిఫ్‌లు ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లకు దిక్సూచి కానున్నాయి. అంతేకాకుండా ఇటీవల నిరవధికంగా అమ్మకాలకు పాల్పడుతున్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు) ధోరణి సైతం సెంటిమెంటుకు కీలకంగా నిలవనుంది. మరోపక్క ముగింపు దశకు చేరుకున్న క్యూ1 ఫలితాల సీజన్‌కూ ప్రాధాన్యత ఉన్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. వివరాలు చూద్దాం..

– సాక్షి, బిజినెస్ డెస్క్



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం(15న) సెలవుకావడంతో ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితం కానుంది. అయితే ద్రవ్యోల్బణ గణాంకాలు, ఏప్రిల్-జూన్(క్యూ1) ఫలితాలు, యూఎస్‌తో వాణిజ్య సంబంధాలు, ఎఫ్‌పీఐల అమ్మకాలు ఈ వారం మార్కెట్లపై తీవ్ర ప్రభావాన్ని చూపే వీలున్నట్లు స్టాక్ విశ్లేషకులు చెబుతున్నారు. జూలై నెలకు వినియోగ ధరల ద్రవ్యోల్బణం(సీపీఐ) గణాంకాలు మంగళవారం(12న) విడుదలకానున్నాయి. జూన్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం వరుసగా 8వ నెలలోనూ దిగివస్తూ 2.1 శాతానికి పరిమితమైంది. 2019 జనవరి తదుపరి ఇది కనిష్ఠంకాగా.. 2025 మే నెలలో 2.8 శాతంగా నమోదైంది. ఇక జూలై నెలకు టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణ(డబ్ల్యూపీఐ) వివరాలు గురువారం(14న) వెల్లడికానున్నాయి. జూన్‌లో డబ్ల్యూపీఐ అనూహ్యంగా 0.13 శాతం క్షీణించింది. దిగివచ్చింది. మే నెలలో 0.39 శాతం పెరుగుదల నమోదుకాగా.. 2023 అక్టోబర్ తర్వాత తొలిసారి వెనకడుగు వేసింది.

క్యూ1 జాబితా

ఈ వారం మరికొన్ని దిగ్గజాలు ప్రస్తుత ఏడాది(2025-26) తొలి త్రైమాసిక ఫలితాలను ప్రకటించనున్నాయి. జాబితాలో పీఎస్‌యూ దిగ్గజాలు ఓఎన్‌జీసీ, భారత్ పెట్రోలియం కార్పొరేషన్(బీపీసీఎల్), ఇండియన్ ఆయిల్(ఐవోసీ)తోపాటు.. ఎస్‌జేవీఎన్, ఐఆర్‌సీటీసీ, ఆస్ట్రల్ పాలీ, హిందాల్కో, అపోలో హాస్పిటల్స్, పీఐ ఇండస్ట్రీస్, సంవర్ధన మదర్సన్, ముత్తూట్ ఫైనాన్స్, జూబిలెంట్ ఫుడ్, అశోక్ లేలాండ్, పతంజలి ఫుడ్స్ తదితరాలు చేరాయి. ఇవికాకుండా జూలైలో ప్రయాణికుల వాహన అమ్మకాల వివరాలను సియామ్ 15న విడుదల చేయనుంది. 2025 జూన్‌లో మొత్తం ప్రయాణికుల వాహన అమ్మకాలు 6 శాతం క్షీణించి 2,75,766 యూనిట్లకు పరిమితంకావడం గమనార్హం!

ఎఫ్‌పీఐల భారీ అమ్మకాలు

కొద్ది రోజులుగా పెట్టుబడులు వెనక్కి

ఇటీవల కొద్ది రోజులుగా దేశీ స్టాక్స్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) నిరవధిక అమ్మకాలు చేపడుతున్నారు. ఈ నెలలో ఇప్పటివరకూ దాదాపు రూ. 18,000 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. ఇక గత నెల(జూలై)లోనూ నికరంగా అమ్మకాలకే కట్టుబడ్డారు. దీంతో జూలైలో రూ. 17,741 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. అంతకుముందు మూడు నెలల్లో(ఏప్రిల్ నుంచి జూన్) నికర కొనుగోలుదారులుగా నిలిచారు. వెరసి రూ. 38,673 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. కాగా.. ఈ కేలండర్ ఏడాది(2025)లో ఇప్పటివరకూ నికరంగా చూస్తే ఎఫ్‌పీఐలు రూ. 1.13 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం గమనార్హం! యూఎస్ టారిఫ్ ప్రకటనలు, క్యూ1 ఫలితాల నిరుత్సాహం తదితర అంశాల కారణంగా ఎఫ్‌పీఐలు ఇటీవల తిరిగి అమ్మకాల బాటలో సాగుతున్నట్లు ఏంజెల్ వన్ సీనియర్ ఫండమెంటల్ విశ్లేషకులు వకార్‌జావేద్ ఖాన్, మార్నింగ్‌స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా రీసెర్చ్ మేనేజర్ హిమాన్షు శ్రీవాస్తవ అభిప్రాయపడ్డారు.



విదేశీ అంశాలు

భారత్ దిగుమతులపై టారిఫ్‌లను 50 శాతానికి పెంచుతున్నట్లు యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ ప్రకటించడంతో ఎగుమతి సంబంధ రంగాలపై ప్రతికూల ప్రభావం కనిపించనున్నట్లు విశ్లేషకులు తెలియజేశారు. ఫార్మాపైనా వడ్డింపులు తప్పవన్న ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ఔషధ రంగంతోపాటు.. లెదర్, కెమికల్స్, ఫుట్‌వేర్, ఆక్వా, ఐటీ, టెక్స్‌టైల్స్ ప్రభావితంకానున్నట్లు పేర్కొన్నారు. కాగా.. జూలై నెలకు చైనా, యూఎస్ ద్రవ్యోల్బణం తదితర గణాంకాలు ఈ వారం విడుదలకానున్నాయి. ఈ అంశాలన్నీ మార్కెట్లో సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా, స్వస్తికా ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సంతోష్ మీనా తెలియజేశారు. టారిఫ్‌లపై స్పష్టత వచ్చేవరకూ మార్కెట్లు కన్సాలిడేట్ కావచ్చని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా అభిప్రాయపడ్డారు.

గత వారమిలా..

గతవారం(4-8) దేశీ స్టాక్ మార్కెట్లు వరుసగా ఆరో వారంలోనూ నష్టాలతోనే ముగిశాయి. బీఎస్‌ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 742 పాయింట్లు(0.9 శాతం) క్షీణించి 79,858 వద్ద నిలిచింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ సైతం 202 పాయింట్లు(0.8 శాతం) నీరసించి 24,363 వద్ద ముగిసింది. ఈ బాటలో బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.3 శాతం, స్మాల్ క్యాప్ 1.9 శాతం చొప్పున బలహీనపడ్డాయి.

సాంకేతికంగా..

ఎఫ్‌పీఐల అమ్మకాలు, యూఎస్ టారిఫ్‌ల వడ్డింపు నేపథ్యంలో దేశీ స్టాక్ మార్కెట్లు క్షీణపథంలో కదులుతున్నాయి. ఇదే బాటలో ఈవారం సైతం మరింత నీరసించే వీలున్నట్లు సాంకేతిక నిపుణులు పేర్కొంటున్నారు. సాంకేతికంగా చూస్తే ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ వెనకడుగు వేస్తే తొలుత 24,200 పాయింట్ల వద్ద, తదుపరి 24,000 వద్ద మద్దతు లభించవచ్చని అంచనా వేశారు. ఒకవేళ బలపడితే 24,500 పాయింట్లవద్ద, 24,600 వద్ద రెసిస్టెన్స్ కనిపించవచ్చని అభిప్రాయపడ్డారు.

క్రమశిక్షణతోనే ఆర్థిక స్వేచ్ఛ



రోహిత్ మట్టూ
నేషనల్ హెడ్ (రిటైల్ సేల్స్) యాక్సిస్ ఏఎంసీ

అంతా ఆర్థిక స్వేచ్ఛ గురించి మాట్లాడుతుంటారు గానీ దాని అంతరార్థం గురించి చాలా మందికి పెద్దగా అవగాహన ఉండదు. సాధారణంగా ఆర్థిక స్వేచ్ఛ అనగానే సంపద పోగేసుకుని, విశాలమైన ఇల్లు కట్టుకుని, విలాసవంతంగా విహారయాత్రలు చేస్తుండటమో, ఎర్లీగా రిటైర్ కావడమో అనుకుంటూ ఉంటారు. మన దగ్గరున్న డబ్బు గురించే తప్ప దాన్ని సంపాదించడానికి, నిలబెట్టుకోవడానికి అవసరమైన అలవాట్ల గురించి ఎక్కువగా ఆలోచించరు. కానీ, ఆర్థిక స్వేచ్ఛ అంటే మన దగ్గర ఎంత డబ్బు ఉంది, మన విలువ ఎంతఅనేది మాత్రమే కాదు.మనం కాలక్రమేణా అలవాటు చేసుకునే ఆర్థిక క్రమశిక్షణ కూడా చాలా ముఖ్యం.

ఆర్థిక స్వేచ్ఛకు సరికొత్త నిర్వచనం

భారీగా సంపాదించడం లేదా బాగా పొదుపు చేసుకుని దాచి పెట్టుకోవడమనేది ఆర్థిక భద్రత అనిపించవచ్చు. కానీ సంపాదన బాగా ఉన్నంత మాత్రాన మనశ్శాంతి గానీ ఆర్థిక సమస్యల నుంచి ఊరట గానీఉంటాయని గ్యారంటీ లేదు. అంతా అసూయపడేంత ఆదాయం ఉన్నవాళ్లు కూడా అప్పులతో సతమతమవుతూ నెలనెలా జీతమొస్తే గానీ గడవని పరిస్థితి ఉంటుంది. ఎంత వచ్చినా సరిపోవడం లేదనిపిస్తుంది. మరోవైపు, మరికొందరు అంతంత మాత్రం సంపాదన, ఒక మోస్తరు వనరులు ఉన్నా ఆర్థికంగా సాధికారత కలిగి ఉన్నట్లుగా కనిపిస్తారు. రెండు వర్గాల మధ్య వ్యత్యాసం క్రమశిక్షణే. పని, కుటుంబం, లైఫ్‌స్టయిల్ విషయాల్లో మనం సరైనవి ఎంచుకునేందుకు అవసరమైన ఆత్మవిశ్వాసాన్ని ఇది అందిస్తుంది.

సంపద పరిమితులు..

బోలెడంత డబ్బుంటే ఆటోమేటిక్‌గా ఆర్థిక కష్టాలన్నీ తీరిపోతాయనిపిస్తుంది. అయితే, సంపదతో అవకాశాలు వచ్చినా, రిస్కులు కూడా పెరుగుతాయి. వివేకంతో వ్యవహరించకపోతే ఎంత సంపదైనా వేగంగా కరిగిపోతుంది. కొన్ని సందర్భాల్లో ఈ ధోరణి చాలా స్పష్టంగా కనిపిస్తుంటుంది. వారసత్వంగానో లాటరీల రూపంలోనో వచ్చిపడే డబ్బు కొన్నేళ్లలోనే ఆవిరైపోతుంది. అంతకు ముందు కన్నా పరిస్థితి మరింత దారుణంగా మారుతుంది. దీనికి కారణం వనరులు లేకపోవడం కాదు. సరైన ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడమే. కాబట్టి సంపదతో స్వేచ్ఛను సాధిస్తామా లేక ఆర్థిక కష్టాలను మరింతగా పెంచుకుంటామాఅనేది మన అలవాట్లను బట్టే ఉంటుంది.



ఆర్థిక క్రమశిక్షణకు మూలస్తంభాలు

ఆర్థికంగా దీర్ఘకాలిక సంక్షేమం అనేది రాత్రికి రాత్రి వచ్చేది కాదు. అలాగని దీనికి అసాధారణ మేథోశక్తో లేదా అదృష్టమో అవసరం లేదు. చిన్న చిన్న మంచి అలవాట్లే కాలక్రమేణా ఆర్థిక స్వేచ్ఛకు పునాదులు వేస్తాయి. అలాంటి అలవాట్లు కొన్ని చూద్దాం..

- **బడ్జెట్ వేసుకోవడం:** ఆదాయాన్ని, ఖర్చుల తీరుతెన్నులను ఎప్పటికప్పుడు ట్రాక్ చేసుకుంటూ ఉంటే అనవసర ఖర్చులను నివారించుకోవచ్చు.
- **సిస్టమాటిక్‌గా పొదుపు:** పొదుపు ఉద్దేశపూర్వకంగానే ఉండాలే తప్ప మిగిలిపోయిన డబ్బును దాచిపెట్టుకునే వ్యవహారంగా ఉండకూడదు. ఆటోమేటిక్‌గా పొదుపు చేసే అలవాటును అలవర్చుకోవాలి.
- **నిలకడగా పెట్టుబడులు:** మార్కెట్లు ఎలా ఉన్నా సరే నిలకడగా పెట్టుబడులను కొనసాగిస్తే కాలక్రమేణా కాంపౌండెడ్ వృద్ధితో ప్రయోజనాలను పొందడం సాధ్యపడుతుంది.
- **లైఫ్‌స్టయిల్ ప్రలోభాలకు లొంగకపోవడం:** ఆదాయం పెరిగే కొద్దీ, లైఫ్‌స్టయిల్‌ని కూడా అప్‌గ్రేడ్ చేసుకోవాలనే కోరిక బలంగా పెరుగుతుంది. కానీ, అదనపు ఆదాయాన్ని సంపద నిర్మించుకునే అసెట్స్‌లోకి మళ్లిస్తూ, నిర్దిష్ట జీవన ప్రమాణాలను కొనసాగిస్తేనే సిసలైన పురోగతి సాధ్యపడుతుంది.

సాధనాలు, సిస్టంలతో క్రమశిక్షణకు దన్ను

క్రమశిక్షణకు సంకల్పంతో పాటు నిర్దిష్ట సాధనాలు కూడా తోడైతే మరిన్ని సత్ఫలితాలను పొందవచ్చు.

- **పెట్టుబడుల ఆటోమేషన్:** సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లనేవి (సిప్) మార్కెట్ పరిస్థితులు ఎలా ఉన్నా క్రమానుగతంగా నిర్దిష్ట మొత్తాన్ని ఇన్వెస్ట్ చేస్తూ ముందుకెళ్లేందుకు ఉపయోగపడతాయి.
- **లక్ష్యాల ఆధారిత ప్లానింగ్:** ఇంటి కొనుగోలు, పిల్లల చదువు లేదా రిటైర్మెంట్.. ఇలా ఏదో ఒక లక్ష్యాన్ని పెట్టుకుని, దానికి తగ్గట్లుగా ఇన్వెస్ట్ చేసే మీ పెట్టుబడులకు ఒక దశ, దిశా ఏర్పడతాయి. నిర్మాణాత్మకమైన లక్ష్యాలు స్ఫూర్తిని కలిగించేవిగా ఉంటాయి.

వివేకవంతంగా కేటాయింపులు

మీ ప్రొఫైల్‌కి తగ్గట్లుగా రిస్కులు, రివార్డుల మధ్య సమతూకం ఉండేలా, పెట్టుబడుల్లో వైవిధ్యాన్ని పాటించాలి. వివిధ సాధనాలకు కేటాయింపుల విషయంలో క్రమశిక్షణతో ఉంటే ఒడిదుడుకుల్లోనూ మీ దీర్ఘకాలిక వ్యూహం పట్టాలు తప్పకుండా ఉంటుంది.

మైండ్‌సెట్‌లో మార్పు

ఇవన్నీ జరగాలంటే ముఖ్యంగా మైండ్‌సెట్‌ను మార్చుకోవాలి. సాధారణంగా రియాక్టివ్, ప్రోయాక్టివ్ అంటూ రెండు రకాల మైండ్‌సెట్‌లు ఉంటాయి. పరిస్థితిని బట్టి ప్రతిస్పందించే రియాక్టివ్ ధోరణిలో ప్రతి నెలా ఎంత మిగిలితే అంతే పొదుపు చేయడం. అత్యవసర పరిస్థితులు వస్తే అప్పటికప్పుడు హడావిడిగా ఏర్పాట్లు చేసుకోవడం, దీర్ఘకాలికంగా పనికొచ్చేవి అలవాటు చేసుకోవడం కన్నా సత్వర లాభాల వెంట పరుగులు తీయడంలాంటి తీరు ఉంటుంది. క్రియాశీలకమైన, ప్రోయాక్టివ్ మైండ్‌సెట్ దీనికి పూర్తి విరుద్ధంగా ఉంటుంది. ముందుగా మన అవసరాలను చూసుకోవడం, అత్యవసర పరిస్థితుల కోసం ప్లానింగ్ చేసుకోవడం, ముందుగా నిర్దేశించుకున్న ఫ్రేమ్‌వర్క్‌కి లోబడే ఖర్చులు ఉండేలా చూసుకోవడంలాంటివి ఈ ధోరణిలో ఉంటాయి. ఇది ఆర్థికంగా ఆందోళనను తగ్గిస్తుంది. స్పష్టతనిస్తుంది. పరిస్థితులను మన అదుపులో ఉంచుకునేలా నియంత్రణను ఇస్తుంది. కాలక్రమంలో నిజమైన ఆర్థిక స్వేచ్ఛ దిశగా ముందుకెళ్లే అవకాశాన్ని కల్పిస్తుంది.

ఇలా ఆటోమేటిక్‌గా పొదుపు చేయడం, ఖర్చులను సమీక్షించుకునేందుకు రిమైండర్లను పెట్టుకోవడం లాంటి చిన్న చిన్న అలవాట్లనేవి మెరుగైన ఫలితాలను అందిస్తాయి. క్రమశిక్షణను భారంగా కాకుండా రోజువారీ జీవితంలో భాగంగా మారుస్తాయి.

చివరిగా చెప్పేదేమిటంటే, బ్యాంకు అకౌంటులో మ్యాజిక్ ఫిగర్ బ్యాలెన్స్‌తోనో, ఒకేసారి వచ్చిపడే లాభాలతోనో ఆర్థిక స్వేచ్ఛ రాదు. ఇది క్రమశిక్షణ, వివేకవంతమైన చిన్న చిన్న నిర్ణయాలతో ముడిపడి ఉండే జీవితకాలపు ప్రక్రియ. మీ 'స్వాతంత్ర్య దినోత్సవం' అనేది మీ సంపాదన పరిమాణంపై ఆధారపడి ఉండదు. ఆర్థిక స్వేచ్ఛకు దోహదపడే అలవాట్లను, క్రమశిక్షణను అలవర్చుకోవడంపైనే ఆధారపడి ఉంటుంది. మరి ఇంకెందుకు ఆలస్యం. మొదటి అడుగు ముందుకు వేయండి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-8-2025	
విశాఖ	530-00
చిత్తూరు	533-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	505-00
విజయవాడ	510-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	470-00
వరంగల్	472-00
రిటైల్ ధర	5.30

ఎస్‌ఎంఎస్ ఫార్మా ఆదాయం రూ. 196 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఎస్‌ఎంఎస్ ఫార్మా రూ. 196 కోట్ల ఆదాయం (స్టాండెలోన్ ప్రాతిపదికన) ప్రకటించింది. గత క్యూ1లో ఇది రూ. 164 కోట్లుగా ఉంది. ఇక సమీక్షా కాలంలో లాభం రూ. 18 కోట్లకు చేరింది. క్రితం క్యూ1లో ఇది రూ. 16 కోట్లు.

ఫారం 16.. ఎన్నో ప్రశ్నలు.. అన్నింటికీ జవాబులు

ఫారం 16. దీనికి సంబంధించి ఎన్నెన్నో ప్రశ్నలు అడుగుతున్నారు. ఆ ప్రశ్నలు.. అలాగే వాటికి జవాబులు ఇక్కడ తెలుసుకుందాం.



కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

ఇదివరకే చాలాసార్లు దీనికి సమాధానం రాశాం. ముందుగా ఆదాయాన్ని లెక్కించండి. అంటే .. అందులో ఏయే అంశాలున్నాయనేది చూసుకోండి. ఉదాహరణకు వేతనమా? ఇంటి మీద అద్దె? వ్యాపారమా? వృత్తి చేస్తున్నారా? క్యాపిటల్ గెయిన్స్ ఉన్నాయా? ఇవన్నీ కాకుండా అదనంగా ఇంకా ఏమేమి ఆదాయాలు ఉన్నాయి, మొత్తంగా ఎన్ని ఉన్నాయో తెలుసుకొని ఒక పద్ధతి ప్రకారం క్రమంగా వ్రాయండి. ఇలా చేయడానికి మీరు కాస్త కసరత్తు చేయాలి. జీతానికి సంబంధించిన వివరాలు, అలాగే పెన్షన్ వివరాలు.. ఒక ఏడాది కాలంలో యాజమాని లేదా ఉద్యోగం మారారా? మారితే ఫారం 16 ఇచ్చారా ? అందులో ఎంత జీతం చూపించారు. ఇద్దరూ చెరొకసారి స్టాండర్డ్ డిడక్షన్ ఇచ్చారా? అలా ఇవ్వకూడదు. అలాగే ఇద్దరూ బేసిక్ లిమిట్ పరిగణలోకి తీసుకున్నారా? అలా తీసుకోకూడదు.

చాలా మంది స్టాండర్డ్ డిడక్షన్‌ని, బేసిక్ లిమిట్‌ని రెండు చోట్ల తీసుకొని... ఎక్కడా పన్ను భారం లేదు కదా అని మురిసిపోతుంటారు. తీరా రెండూ కలిపి లెక్కలు తీసి, పన్ను భారం వేసేసరికి షాక్ అవుతుంటారు. కొందరు యజమానులను, కన్సల్టెంట్లను తిట్టుకుని, ఇరుగు పొరుగుని సంప్రదించి ఎగవేతల వెంకటేశ్వరరావుని ఆదర్శంగా తీసుకుని సంతోషపడినా.. మరొక దూరపు బంధువు జాగ్రత్తల జగన్నాధం అలాంటి 'శషభిషలు' పనికి రావు అని శాసిస్తే.. చివరికి సరైన దారిలోకి వస్తుంటారు.

అంటే రెండు చోట్లా డిడక్షన్లు క్లయిం చేస్తారు. యజమాని సహకారం, ఉదాసీనత, అరకొర జ్ఞానం, మిడిమిడి జ్ఞానం మొదలగు వాటి ముసుగులో హెచ్‌ఆర్‌ఏ విషయంలో దొంగ రశీదులు, ఎక్కువ చెల్లించినట్లు రశీదులు, చనిపోయిన మావగారింట్లో చూరుపట్టుకొని వేలాడుతూ ఇల్లరికం అల్లుడిలా చెలామణి అవుతూ, మావగారి సంతకంతో ఒక రశీదు పడేస్తారు. ఆఫీసులో కొంతమంది ప్రబుద్ధులు, భార్యభర్తలు .. అద్దె చెల్లించకుండా, తండ్రి ఇంట్లో ఉచితంగా ఉంటూ, ఇద్దరూ హెచ్‌ఆర్‌ఏ విషయంలో క్లెయిం చేసి చేతులు దులుపుకుంటున్నారు. కొందరు స్వంత ఇంట్లోనే ఉంటూ, తన పేరు మీదే ఇల్లు ఉన్నా, గతంలో ఒక ఇల్లు/వాకిలి/స్థలం అమ్మేసిన సొమ్ము వస్తే, ఆ సంగతి ఆదాయపు పన్ను శాఖ వారికి చెప్పకుండా, అదృష్టం బాగుండి ఏ అప్పూ లేకుండా ఇల్లు పూర్తి చేస్తుంటారు. తన పేరు మీదే మున్సిపల్ ట్యాక్స్ చెల్లించినా కూడా హెచ్‌ఆర్‌ఏ సంగతి గుర్తుకు రాగానే, కంగుతిని, భార్యామణి చేత సంతకం పెట్టించి, ఆమెనే ఓనరుగా చూపించి హెచ్‌ఆర్‌ఏ క్లెయిం చేస్తుంటారు. అలాగే యజమాని సహకారం/ ప్రేమ/ జాలి / కరుణ గల ఉద్యోగ రత్నాలు తమకు వర్తించే అన్ని డిడక్షన్లు క్లెయిం చేస్తున్నారు. ఒక విధంగా దొంగ క్లెయిమ్‌లు చూపించి, వాటిని ఫారం 16లో పొందుపరిచి, వాటికి పవిత్రను ఆపాదించే ఉద్యోగరాయుళ్లు ఉన్నారు.

అందుకే కాబోలు...డిపార్ట్‌మెంట్ వారు కఠినంగా వ్యవహరించేందుకు సన్నద్ధులు అయ్యారు. ఆ యుద్ధం చేసే ముందు ఒక మంచి అవకాశం ఇస్తున్నారు. అదేమిటంటే ప్రతి డిడక్షన్‌కి సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాలి. ఆ కాగితాలను జతపరచకపోయినా వాటిలోని వివరాలు చాలా చాలా ఇవ్వాలి. ఇస్తే ఎటువంటి సమస్య ఉండదు. ఇవ్వకపోతే క్లెయిమ్/డిడక్షన్ ఇవ్వరు. ఫారంలో వివరాలు ఇస్తే గనుక, రిటర్నులు దాఖలు చేయాలి. ఫారం 16 అంశాలు సమీక్షించి సరైన కాగితాలు సమకూర్చుకుని, సన్నద్ధం కండి.



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

దీర్ఘకాలంలో సంపద సృష్టి!

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ వ్యాల్యూ డిస్కవరీ ఫండ్

దీర్ఘకాలంలో పెట్టుబడిని సంపదగా సృష్టించుకోవాలనే ఇన్వెస్టర్లకు వ్యాల్యూ ఫండ్స్ విభాగం అనుకూలంగా ఉంటుంది. వ్యాల్యూ ఫండ్స్ అధిక విలువ దాగుండి.. ధరల్లో అది ప్రతిఫలించని స్టాక్స్‌ను గుర్తించి వాటిల్లో పెట్టుబడులు పెడుతుంటాయి. ఆ తర్వాత దీర్ఘకాలం పాటు ఆయా స్టాక్స్‌ను పోర్ట్‌ఫోలియోలో కొనసాగించడం ద్వారా అధిక రాబడులు సమకూర్చుకుంటాయి. ముఖ్యంగా ఎంపిక చేసుకున్న స్టాక్‌కు కాలం కలిసొచ్చే వరకూ ఓపిక పట్టడాన్ని ఈ ఫండ్స్‌లో చూడొచ్చు. ఈ విభాగంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ వ్యాల్యూ డిస్కవరీ ఫండ్‌కు మంచి రాబడుల చరిత్ర ఉంది.

రాబడులు..

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ వ్యాల్యూ డిస్కవరీ ఫండ్ గడిచిన ఏడాది కాలంలో 3.31 శాతం రాబడులను ఇచ్చింది. గత ఏడాది కాలంలో మార్కెట్లు ఎలాంటి వృద్ధి లేకుండా ఒక శ్రేణి పరిధిలో చలిస్తుండడం తెలిసిందే. మూడేళ్ల కాలంలో పనితీరును గమనిస్తే ఏటా 22 శాతం చొప్పున రాబడులు ఉన్నాయి. ఐదేళ్ల కాలంలో 26.52 శాతం, ఏడేళ్లలో 18.15 శాతం, పదేళ్లలో 15.24 శాతం (డైరెక్ట్ ప్లాన్) చొప్పున ఈ పథకం పెట్టుబడులపై ప్రతిఫలాన్ని అందించింది. వ్యాల్యూ ఫండ్స్ విభాగం కంటే ఈ పథకంలోనే అధిక రాబడిని గమనించొచ్చు. అంతే కాదు బీఎస్‌ఈ 500 టీఆర్‌ఐ సూచీ కంటే కూడా ఈ పథకమే మెరుగైన పనితీరును చూపించింది. అంతెందుకు 2004లో ఈ పథకం ఆరంభం కాగా.. నాటి నుంచి చూసిన ఏటా రాబడి 20 శాతంగా ఉండడం గమనార్హం. వ్యాల్యూ ఫండ్స్ విభాగంలో దీర్ఘకాలంగా పనిచేస్తుండడం, మెరుగైన రాబడుల చరిత్ర ఉండడంతో.. ఏడుళ్లు, అంతకుమించిన కాలం కోసం ఈ పథకాన్ని పెట్టుబడులకు పరిశీలించొచ్చు.



పెట్టుబడుల విధానం..

చారిత్రక వ్యాల్యూయేషన్లు (విలువలు) కంటే తక్కువ ధరల వద్ద ట్రేడవుతున్న వాటిని ఈ పథకం ఎంపిక చేస్తుంది. లాభాలు, పుస్తక విలువ, నగదు ప్రవాహాలు తదితర అంశాల ఆధారంగా ఎంతో విలువ దాగున్న స్టాక్స్‌ను గుర్తిస్తుంది. తద్వారా దీర్ఘకాలంలో మెరుగైన రాబడుల అవకాశాలపై ఫండ్ మేనేజర్లు దృష్టి పెడతారు. లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాల్లో ఎక్కడ విలువైన అవకాశాలు కనిపించినా నిస్సందేహంగా వాటిల్లో ఇన్వెస్ట్ చేసే స్వేచ్ఛ ఈ పథకానికి ఉంది.

పోర్ట్‌ఫోలియో..

ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో రూ.53,716 కోట్ల పెట్టుబడులు (నిర్వహణ ఆస్తులు) ఉన్నాయి. ఇందులో 91.63 శాతం మేర ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయగా, డెట్ సాధనాల్లో 3.1 శాతం పెట్టుబడులు ఉన్నాయి. 5.27 శాతం నగదు రూపంలో కలిగి ఉంది. ఇక ఈక్విటీ పెట్టుబడులను గమనిస్తే.. 91.6 శాతం మేర లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఉన్నాయి. 7.44 శాతం మేర మిడ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయగా, స్మాల్‌క్యాప్ కంపెనీలకు 1.01 శాతం కేటాయించింది. పోర్ట్‌ఫోలియోలో 61 స్టాక్స్ ఉన్నాయి. ఇందులో టాప్-10 స్టాక్స్‌లోనే 49 శాతం పెట్టుబడులు కలిగి ఉంది. ఇక రంగాల వారీ కేటాయింపులను విశ్లేషించి చూస్తే బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లో 30.49 శాతం పెట్టుబడులు ఉన్నాయి. ఇంధన కంపెనీలు, యుటిలిటీల్లో 14.48 శాతం ఇన్వెస్ట్ చేసింది. టెక్నాలజీ కంపెనీలకు 11.32 శాతం, హెల్త్‌కేర్ కంపెనీలకు 10.75 శాతం, కన్జ్యూమర్ డిస్క్రీషినరీ కంపెనీల్లో 7.65 శాతం, కన్జ్యూమర్ స్టెపుల్స్ కంపెనీల్లో 7.11 శాతం చొప్పున పెట్టుబడులు ఉన్నాయి.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
రిలయన్స్ ఇండస్ట్రీస్	7.61
ఐసీఐసీఐ బ్యాంక్	7.02
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	6.77
ఇన్ఫోసిస్	5.19
యాక్సిస్ బ్యాంక్	4.28
ఎస్‌బీఐ	4.05
సన్ ఫార్మా	4
ఎల్‌అండ్‌టీ	3.58
టీసీఎస్	3.38

సాక్షి ప్లస్
సోమవారం। 11-8-2025

డేవిడ్ ధమాకా

- 52 బంతుల్లో 4 ఫోర్లు, 8 సిక్స్‌లతో 83 పరుగులు చేసిన ఆసీస్ బ్యాటర్
- తొలి టి20లో ఆస్ట్రేలియా విజయం
- 17 పరుగులతో దక్షిణాఫ్రికా ఓటమి



డార్విన్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఆస్ట్రేలియా జట్టు... దక్షిణాఫ్రికాతో టి20 సిరీస్‌లో బోణీ కొట్టింది. ఆదివారం జరిగిన తొలి పోరులో ఆస్ట్రేలియా 17 పరుగుల తేడాతో గెలిచి 1–0తో ముందంజ వేసింది. ఈ ఫార్మాట్‌లో ఆస్ట్రేలియాకు ఇది వరుసగా తొమ్మిదో విజయం కావడం విశేషం. ఈ మైదానంలో 2008 తర్వాత ఇదే తొలి అంతర్జాతీయ మ్యాచ్ కాగా... టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 178 పరుగులకు ఆలౌటైంది. టి20ల్లో ఆస్ట్రేలియా జట్టును ఆలౌట్ చేయడం దక్షిణాఫ్రికాకు ఇదే తొలిసారి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' టిమ్ డేవిడ్ (52 బంతుల్లో 83; 4 ఫోర్లు, 8 సిక్స్‌లు) అర్ధశతకంతో విజృంభించాడు. కామెరూన్ గ్రీన్ (13 బంతుల్లో 35; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు సఫారీ బౌలర్లతో చెడుగుడు ఆడుకున్నాడు. ట్రావిస్ హెడ్ (2), జోష్ ఇన్‌గ్లిస్ (0), కెప్టెన్ మిచెల్ మార్ష్ (13), గ్లెన్ మ్యాక్స్‌వెల్ (1), మిచెల్ ఓవెన్ (2) విఫలమయ్యారు. ఒక దశలో 75 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ ఆసీస్‌ను డేవిడ్ ఆదుకున్నాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో క్వెన్ ఎంఫకె 4 వికెట్లు పడగొట్టగా... రబాడ రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. ఈ క్రమంలో ఐసీసీ పూర్తిస్థాయి సభ్యదేశాల ఆటగాళ్లలో పిన్న వయసులో (19 సంవత్సరాల 124 రోజులు) 4 వికెట్లు తీసిన బౌలర్‌గా ఎంఫకె నిలిచాడు. అనంతరం దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 161 పరుగులకు పరిమితమైంది. వికెట్ కీపర్ రికెల్టన్ (55 బంతుల్లో 71; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకంతో మెరవగా... ట్రిస్టన్ స్టబ్స్ (37; 5 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. ఆస్ట్రేలియా బౌలర్లలో జోష్ హాజిల్‌వుడ్, బెన్ డ్వార్షుయ్ చెరో 3 వికెట్లు పడగొట్టగా... ఆడమ్ జంపా రెండు వికెట్లు తీశాడు. ఇరు జట్ల మధ్య మంగళవారం రెండో టి20 జరగనుంది.

సౌరవ్ కొఠారి గెలుపు

చెంగ్డు (చైనా): జాతీయ స్నూకర్ చాంపియన్ సౌరవ్ కొఠారి ప్రపంచ గేమ్స్‌లో శుభారంభం చేశాడు. ఆదివారం పురుషుల స్నూకర్ విభాగంలో సౌరవ్ కొఠారి 2–0 (91–59, 57–16) తేడాతో జాక్ కాస్కర్ (ఇంగ్లండ్)పై విజయం సాధించాడు. తదుపరి పోరులో ఇంగ్లండ్‌కే చెందిన డారిల్ హిల్‌తో సౌరవ్ తలపడనున్నాడు. గ్రూప్‌లో మెరుగైన ప్రదర్శన కనబర్చిన ఇద్దరు ప్లేయర్లు క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధించనున్నారు. గ్రూప్ 'డి' మ్యాచ్‌లో భారత్‌కే చెందిన కమల్ చావ్లా 0–2 (37–63, 14–58)తో ప్రపంచ చాంపియన్ అలీ అలోబైద్లీ (ఖతార్) చేతిలో ఓడాడు. మహిళల 6–రెడ్ స్నూకర్ పోటీల్లో భారత్‌కు చెందిన నటాషా చేతన్ రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడింది. గ్రూప్ 'ఎ'లో భాగంగా తొలి మ్యాచ్‌లో 1–2 (39–2, 8–42, 10–40)తో సా మన్ యాన్ (హాంకాంగ్) చేతిలో... రెండో మ్యాచ్‌లో 0–2 (7–33, 12–49)తో నరూచ (థాయ్‌లాండ్) చేతిలో పరాజయం పాలైంది.



2006 తర్వాత...

ఆసియా కప్ అండర్- 20 ఫుట్‌బాల్ టోర్నీకి భారత మహిళల జట్టు అర్హత

క్వాలిఫయింగ్ టోర్నీలో అజేయంగా అగ్రస్థానం

యాంగాన్ (మయన్మార్): భారత సీనియర్ మహిళల ఫుట్‌బాల్ జట్టుతో స్ఫూర్తి పొందిన భారత జూనియర్ మహిళల జట్టు అద్భుతం చేసింది. 2006 తర్వాత ఆసియా కప్ అండర్–20 మహిళల టోర్నీకి అర్హత సాధించింది. ఆదివారం ముగిసిన క్వాలిఫయింగ్ టోర్నీలో భారత జట్టు అజేయంగా నిలిచి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. నాలుగు జట్లు పోటీపడ్డ గ్రూప్ 'డి'లో టీమిండియా రెండు విజయాలు, ఒక 'డ్రా'తో ఏడు పాయింట్లు సాధించి టాపర్‌గా నిలిచి ఆసియా కప్ బెర్త్‌ను సంపాదించింది. 2026 ఆసియా కప్ అండర్–20 టోర్నీ థాయ్‌లాండ్‌లో ఏప్రిల్ 1 నుంచి 18వ తేదీ వరకు జరుగుతుంది. గ్రూప్ 'డి'లో భాగంగా మయన్మార్ జట్టుతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 1–0 గోల్ తేడాతో గెలిచింది. ఆట 27వ నిమిషంలో పూజ చేసిన గోల్‌తో ఖాతా తెరిచిన టీమిండియా నిర్ణీత సమయం పూర్తయ్యే వరకు ఈ ఆధిక్యాన్ని నిలబెట్టుకొని విజయాన్ని అందుకుంది. తొలి అర్ధభాగంలో భారత్ ఆధిపత్యం చలాయించగా... రెండో అర్ధభాగంలో మయన్మార్ ఆకట్టుకుంది. నేహా, షిబాని దేవి సమన్వయంతో ముందుకు దూసుకెళ్లడంతో ఆట మూడో నిమిషంలో భారత్ గోల్ చేసినంత పని చేసింది. మరోవైపు మయన్మార్ ఫార్వర్డ్ ను ను ఖిన్ తొమ్మిదో నిమిషంలో ఎదురుదాడికి దిగినా ఫినిషింగ్ లోపంతో గోల్ చేయలేకపోయింది. 27వ నిమిషంలో కుడివైపు నుంచి మయన్మార్ గోల్ పోస్ట్ వైపునకు దూసుకెళ్లిన పూజ బంతిని లక్ష్యానికి చేర్చడంతో భారత్ బోణీ కొట్టింది. రెండో అర్ధభాగంలో మాత్రం సొంత ప్రేక్షకులు ఉత్సాహపరుస్తుండగా మయన్మార్ తమ దాడుల్లో పదును పెంచింది. పలుమార్లు భారత గోల్‌పోస్ట్ వైపు దూసుకొచ్చింది. కానీ టీమిండియా గోల్‌కీపర్ మోనాలీసా దేవి సదా అప్రమత్తంగా ఉంటూ మయన్మార్ జట్టు ఆశలను వమ్ము చేసింది. ఈ మ్యాచ్‌కంటే ముందు భారత్... ఇండోనేసియాతో మ్యాచ్‌ను 0–0తో 'డ్రా' చేసుకొని... తుర్క్‌మెనిస్తాన్ జట్టుపై 7–0తో గెలిచింది. చివరిసారి భారత జట్టు 2006లో జరిగిన ఆసియా కప్ అండర్–20 టోర్నీలో పోటీపడి ఒక్క మ్యాచ్‌లోనూ నెగ్గకుండానే లీగ్ దశలోనే వెనుదిరిగింది.

25 వేల డాలర్ల నజరానా

రెండు దశాబ్దాల తర్వాత ఆసియా కప్ టోర్నీకి అర్హత సాధించిన భారత మహిళల జట్టుకు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) నజరానా ప్రకటించింది. జట్టు మొత్తానికి 25 వేల డాలర్లు (రూ. 21 లక్షల 88 వేలు) అందజేస్తామని తెలిపింది.

ముష్టిఘాతాలకు ఇద్దరు జపాన్ బాక్సర్లు మృతి


హిరొమస


షిజెతోషి

టోక్యో: ఇద్దరు జపాన్ బాక్సర్లు ప్రత్యర్థి బాక్సర్ల పంచ్‌లకు గాయపడి ప్రాణాలు వదిలారు. టోక్యోలోని కొరకుయెన్ హాల్‌లో జరిగిన ఓ బౌట్‌లో 28 ఏళ్ల షిజెతోషి కొతరి పోటీ ముగిసిన వెంటనే కుప్పకూలాడు. ఆస్పత్రికి తరలించిన లాభం లేకపోయింది. జూనియర్ లైట్‌వెయిట్ చాంపియన్ యామటో హటతో ఈ నెల 2న జరిగిన బౌట్‌లో 12 రౌండ్లపాటు షిజెతోషి హోరాహోరీగా తలపడ్డాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అయితే తల, ముఖంపై ప్రత్యర్థి విసిరిన పంచ్‌లకు షిజెతోషి మెదడుకు తీవ్రంగా గాయాలైనట్లు తదుపరి పరీక్షల్లో తేలింది. ఆలస్యం చేయకుండా అత్యవసర మెదడు శస్త్రచికిత్స చేస్తుండగానే అతను మృతి చెందాడు. ఇదే విధమైన కారణంతో 28 ఏళ్ల హిరొమస ఉరకవా కూడా మరణించాడు. యోజి సయితోతో జరిగిన నాకౌట్ పోరులో హిరొమస ఓడిపోయాడు. తర్వాత కాసేపటికే అతని పరిస్థితి కూడా విషమించడంతో ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగానే మృతిచెందాడు. ఈ ఏడాది ప్రారంభంలోనే ఐర్లాండ్ బాక్సర్ జాన్ కూనే కూడా బౌట్ ముగిసిన వెంటనే అపస్మారక స్థితికి వెళ్లాడు. అతన్ని ఇంటెన్సివ్ కేర్‌లో ఉంచి చికిత్స అందించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. యువ బాక్సర్లు మృతి చెందడం పట్ల ప్రపంచ బాక్సింగ్ సమాఖ్య విచారం వ్యక్తం చేసింది.

ఫామ్‌లో ఉంటే కొనసాగించాలి





- వన్డేల్లో రోహిత్, కోహ్లి అసాధారణ క్రికెటర్లు
- 'క్యాబ్' అధ్యక్ష పదవికి పోటీ చేస్తా
- టీమిండియా మాజీ కెప్టెన్ గంగూలీ వ్యాఖ్య

కోల్‌కతా: భారత వన్డే జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లిలను వన్డే ఫార్మాట్‌లో కొనసాగించడమే ఉత్తమమని మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నాడు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో రోహిత్, కోహ్లి అసాధారణ క్రికెటర్లని... ఫామ్‌లో ఉంటే మరిన్ని రోజులు ఈ ఇద్దరినీ ఆడించాలని 'దాదా' సూచించాడు. మీడియాలో రోహిత్, కోహ్లి భవితవ్యంపైనే తరచూ ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది ఆస్ట్రేలియా పర్యటనతోనే ఇద్దరి అంతర్జాతీయ కెరీర్ ముగుస్తుందనే వార్తలపై స్పందించిన గంగూలీ 'నాకు వాటి గురించి ఏమాత్రం తెలియదు. కాబట్టి వ్యాఖ్యానించను' అని అన్నాడు. ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన అతను మీడియాతో మాట్లాడుతూ 'ఇద్దరి ఫామ్‌ను చూడాలి. బాగా ఆడుతుంటే కొనసాగించాలి. వన్డేల్లో కోహ్లిది అసాధారణ రికార్డు. రోహిత్‌ది కూడా! జట్టుకు భారంగా ఏమీ లేరు. బాధ్యతగానే రాణిస్తున్నారు. అలాంటపుడు ఈ ఫార్మాట్‌లో కొనసాగించడంలో తప్పేముంది' అని అన్నాడు. కోహ్లి, రోహిత్ ఇదివరకే టి20, టెస్టులకు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే.

టీమిండియానే ఫేవరెట్...

వచ్చే నెలలో జరిగే ఆసియా కప్ టి20 టోర్నీలో భారతే ఫేవరెట్ అని గంగూలీ అన్నాడు. 'టెస్టుల్లో భారత్ ఎంతటి కఠినమైన ప్రత్యర్థో ఇటీవలి ఇంగ్లండ్ పర్యటనలో చాటుకుంది. వన్డే, టి20ల్లో కూడా మన జట్టు మేటిగా ఉంది. దుబాయ్ వేదికపై భారత్ తప్పకుండా సత్తా చాటుకుంటుంది. కొత్త కెప్టెన్ శుబ్‌మన్ గిల్ మంచి నాయకుడు. అతనికి మంచి భవిష్యత్తు ఉంది' అని 'దాదా' చెప్పాడు. సభ్యుల సహకారంతో బెంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అధ్యక్ష పదవికి మరోసారి పోటీ పడతానని గంగూలీ తెలిపాడు. 2015 నుంచి 2019 వరకు 'క్యాబ్' అధ్యక్షుడిగా కొనసాగిన గంగూలీ... తర్వాత బీసీసీఐ అధ్యక్షుడిగానూ పని చేశాడు. తదుపరి వన్డే ప్రపంచకప్ 2027లో జరగనుంది. ఇంకా రెండేళ్ల సమయం ఉంది. అప్పటివరకు కోహ్లి, రోహిత్ ఆడతారనే స్పష్టత ఎవరికీ లేదు. ఈ నేపథ్యంలోనే ఆస్ట్రేలియా పర్యటనతోనే ఆ ఇద్దరి భవితవ్యం తేలిపోతుందనే చర్చ మీడియాలో జోరందుకుంది. అక్టోబర్ 19న ఆస్ట్రేలియా టూర్ మొదలవుతుంది. పెర్త్, అడిలైడ్, సిడ్నీ వేదికలపై టీమిండియా మూడు వన్డేలు ఆడుతుంది. అలాగే స్వదేశంలో దక్షిణాఫ్రికాతోనూ మూడు వన్డేల ద్వైపాక్షిక సిరీస్‌లో పాల్గొంటుంది. వచ్చే క్యాలెండర్ ఇయర్‌లో న్యూజిలాండ్, అఫ్గానిస్తాన్, ఇంగ్లండ్, వెస్టిండీస్‌లతో భారత్‌కు బిజీ షెడ్యూల్ ఉంది.

ఫైనల్లో హరియాణా, జార్ఖండ్



సాక్షి, కాకినాడ: జాతీయ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్‌లో హరియాణా, జార్ఖండ్ జట్లు టైటిల్ పోరుకు అర్హత సాధించాయి. సెమీఫైనల్స్‌లో హరియాణా 3–0 తో ఛత్తీస్‌గఢ్ జట్టుపై నెగ్గగా... జార్ఖండ్ 3–0 తో ఉత్తరప్రదేశ్ జట్టును ఓడించింది. హరియాణా తరఫున కెప్టెన్ శశి కాషా (8వ నిమిషంలో) ఒక గోల్ చేయగా... సుప్రియ (45వ, 47వ నిమిషాల్లో) రెండు గోల్స్ నమోదు చేసింది. జార్ఖండ్ జట్టుకు స్వీటీ డుంగ్‌డుంగ్ (13వ నిమిషంలో), రీనా కుల్లు (56వ నిమిషంలో), కెప్టెన్ రజని కెర్కెట్టా (59వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. మంగళవారం ఫైనల్ జరుగుతుంది.



భారత మహిళల రగ్బీ జట్టుకు కాంస్యం

రాజ్‌గిర్ (బిహార్): ఆసియా రగ్బీ మహిళల అండర్–20 సెవెన్–ఎ–సైడ్ టోర్నమెంట్‌లో భారత జట్టు కాంస్య పతకం సాధించింది. ఆదివారం బిహార్‌లోని రాజ్‌గిర్‌లో ముగిసిన ఈ టోర్నీలో భారత జట్టు కాంస్య పతకం కోసం జరిగిన మ్యాచ్‌లో 12–5 పాయింట్ల తేడాతో ఉజ్బెకిస్తాన్ జట్టును ఓడించింది. భారత జట్టు తరఫున భూమిక శుక్లా 7 పాయింట్లు, గురియా కుమారి 5 పాయింట్లు స్కోరు చేశారు. ఉజ్బెకిస్తాన్ తరఫున హల్కర్ ఒలిమ్‌బెర్గనోవా 5 పాయింట్లు సాధించింది. అంతకుముందు లీగ్ దశలో భారత జట్టు కజకిస్తాన్, యూఏఈ జట్లపై గెలిచి హాంకాంగ్ చేతిలో ఓడిపోయి తమ గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన హాంకాంగ్ తొలి స్థానంలో నిలిచి భారత్‌తోపాటు సెమీఫైనల్ చేరుకుంది. మరో గ్రూప్ నుంచి చైనా, ఉజ్బెకిస్తాన్ జట్లు సెమీఫైనల్లోకి ప్రవేశించాయి. సెమీఫైనల్స్‌లో భారత్ 7–28తో చైనా చేతిలో, ఉజ్బెకిస్తాన్ 5–24తో హాంకాంగ్ చేతిలో ఓడిపోయాయి. ఫైనల్లో చైనా 29–21తో హాంకాంగ్‌ను ఓడించి చాంపియన్‌గా అవతరించింది.



కష్టాల్లో క్లబ్ ఫుట్‌బాల్!

- అనిశ్చితిని అధిగమిస్తేనే మెరుగైన ఫలితాలు
- సమష్టి కృషితోనే ఐఎస్‌ఎల్ భవితవ్యం
- ఏఐఎఫ్‌ఎఫ్ అధ్యక్షుడు కల్యాణ్ చౌబే వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలోని అగ్రశ్రేణి ఫుట్‌బాల్ టోర్నమెంట్... ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) భవిష్యత్తుపై అనిశ్చితి కారణంగా క్లబ్ ఫుట్‌బాల్ సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని అఖిల భారత ఫుట్‌బాట్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) అధ్యక్షుడు కల్యాణ్ చౌబే అన్నారు. ఈ కఠిన పరిస్థితులను అధిగమించడానికి సమష్టి కృషి అవసరమని పేర్కొన్నారు. 2010లో ఏఐఎఫ్‌ఎఫ్ చేసుకున్న మాస్టర్ రైట్స్ అగ్రిమెంట్ (ఎంఆర్‌ఏ) పునరుద్ధరణపై అనిశ్చితి కారణంగా 2025–26 ఐఎస్‌ఎల్ సీజన్‌ను నిలిపేయాల్సి వచ్చింది. లీగ్ నిర్వాహకుల నిర్ణయం అనంతరం ఐఎస్‌ఎల్‌లోని మూడు క్లబ్‌లు తమ జట్టు కార్యకలాపాలను ఆపేశాయి. ఇందులో భాగంగా ఆటగాళ్లు, సిబ్బందికి వేతనాలు సైతం నిలిపివేశాయి. ఈ నేపథ్యంలో కల్యాణ్ చౌబే మాట్లాడుతూ... 'సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నామన్నది నిజమే. స్వార్థ ప్రయోజనాలతో కొంతమంది ఈ పరిస్థితిని సృష్టించారు. అయితే సమష్టి కృషితోనే దీన్ని దాటి ముందుకు సాగగలమనే నమ్మకముంది' అని 1999 నుంచి 2006 వరకు భారత సీనియర్ జట్టుకు గోల్‌కీపర్‌గా వ్యవహరించిన కల్యాణ్ చౌబే అన్నారు.

క్లబ్ సీఈవోలతో చర్చలు విఫలం

భారత ఫుట్‌బాల్‌లోని ప్రస్తుత పరిస్థితిని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకురావాలని ఐఎస్‌ఎల్‌లోని 11 క్లబ్‌లు కోరడంపై కల్యాణ్ చౌబే ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఏఐఎఫ్‌ఎఫ్ తమ అభ్యర్థనపై చర్య తీసుకోకపోతే స్వతంత్రంగా న్యాయ సహాయం కోరడం తప్ప తమకు వేరే మార్గం లేదని ఐఎస్‌ఎల్ క్లబ్‌లు ఒక లేఖలో పేర్కొన్నాయి. మొత్తం 13 క్లబ్‌లలో మోహన్ బగాన్ సూపర్ జెయింట్, ఈస్ట్ బెంగాల్ మినహా మిగిలిన 11 జట్లు దానిపై సంతకం చేశాయి. క్లబ్ సీఈవోలతో చర్చించిన మరుసటి రోజే ఈ లేఖ వెలుగు చూడటం ఆశ్చర్యపరిచిందని కల్యాణ్ అన్నారు. 'ఈనెల 7న ఢిల్లీలో 13 క్లబ్‌ల సీఈవోలతో జరిగిన సమావేశంలో అనేక అంశాలపై చర్చించాం. అయితే మరుసటి రోజే 11 క్లబ్‌లు లేఖ రాయడం ఆశ్చర్యం కలిగించింది. ఈ సమాచార లోపాన్ని నివారించి ఉండాల్సింది. ఏదేమైనా దేశంలో ఫుట్‌బాల్ అభివృద్ధికి ఏఐఎఫ్‌ఎఫ్ కట్టుబడి ఉంది. ఆటకు ఏది మంచిదో అది చేసేందుకు సదా సిద్ధంగా ఉంటాం. దీనిపై న్యాయ సలహా తీసుకునే ఆలోచనలో ఉన్నాం. ఆ తర్వాత తిరిగి క్లబ్‌ల సీఈవోలతో భేటీ అవుతాం. ఈ నెల 17 తర్వాత మరోసారి సమావేశమవుతాం. క్లబ్‌ల ఆదాయ మార్గాలు పెంపొందించేందుకు ప్రణాళికలు రచించే అంశాన్ని సైతం పరిశీలిస్తున్నాం. తక్షణం తీసుకోవాల్సిన చర్యలతో కూడిన 5 అంశాల అజెండాను రూపొందిస్తున్నాం' అని ఏఐఎఫ్‌ఎఫ్ అధ్యక్షుడు పేర్కొన్నారు.

సొంతంగా ఐఎస్‌ఎల్ సాధ్యమా..

మాస్టర్స్ రైట్స్ అగ్రిమెంట్ పునరుద్ధరణ అంశంలో అనిశ్చితి నెలకొనడంతో... ఐఎస్‌ఎల్ లీగ్‌ను సొంతంగా నిర్వహించే అంశాన్ని కూడా ఏఐఎఫ్‌ఎఫ్ పరిశీలిస్తోంది. 'ప్రస్తుతానికి అలాంటి ప్రతిపాదనేం లేదు. అయితే అన్ని దారులు తెరిచే ఉన్నాయి. వాటాదారులతో చర్చిస్తున్నాం. ఎంఆర్‌ఏ పునరుద్ధరణ అంశంలో ఆలస్యం జరిగింది. దేశంలో ఫుట్‌బాల్ అభివృద్ధి కోసం ఎలాంటి సమావేశానికి అయినా ఫుట్‌బాల్ సమాఖ్య సదా సిద్ధంగా ఉంటుంది. ఐఎస్‌ఎల్‌తో దేశంలో ఫుట్‌బాల్ మౌలిక సదుపాయాలు మెరుగయ్యాయనేది ముమ్మాటికి నిజం. మైదానాలు, ఆటగాళ్ల జీతాలు, విదేశీ ప్లేయర్ల సూచనలు, ప్రముఖ కోచ్‌ల మార్గనిర్దేశం, అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యం, సినీ రంగ ప్రముఖుల ప్రమేయం ఇలా అన్నీ అంశాల్లో భారత ఫుట్‌బాల్‌లో గణనీయమైన మార్పుకు ఈ లీగ్ కారణమైంది. దీంతో భారత ఫుట్‌బాల్ బ్రాండ్ విలువ పెరిగింది. ఈ సహకారం ఇలాగే కొనసాగుతూ... యువ నైపుణ్యాన్ని సరైన పద్ధతిలో వినియోగిస్తే వచ్చే పదేళ్లలో భారత జాతీయ జట్టు ర్యాంకింగ్ మెరుగవడం ఖాయమే' అని 48 ఏళ్ల కల్యాణ్ అన్నారు.

ర్యాంకింగ్స్‌లో మెరుగవ్వాలంటే...

గత నెల విడుదల చేసిన 'ఫిఫా' ర్యాంకింగ్స్‌లో భారత పురుషుల జట్టు 133వ స్థానంలో నిలిచింది. తొమ్మిదేళ్లలో మన జట్టుకు ఇదే అత్యల్ప ర్యాంకు. ఇటీవలి కాలంలో టీమిండియా పేలవ ప్రదర్శన చేస్తుండటంతో ఆరు స్థానాలు కోల్పోవాల్సి వచ్చింది. దీనిపై కల్యాణ్ స్పందిస్తూ... 'అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో మెరుగైన ప్రదర్శన కనబరిస్తేనే ర్యాంకింగ్స్‌లో పురోగతి ఉంటుంది. అయితే ఈ ర్యాంకింగ్ విధానం కూడా కాస్త సంక్లిష్టమైంది. ఆడిన మ్యాచ్‌లు, ప్రత్యర్థి ర్యాంక్‌ల ఆధారంగా దీన్ని లెక్కిస్తారు. 2023లో ఏఐఎఫ్‌ఎఫ్ అధ్యక్షుడిగా బాధ్యతలు అందుకున్న సమయంలో మన జట్టు 106వ ర్యాంక్ నుంచి 99వ స్థానానికి చేరింది. ఇప్పుడు రెండేళ్ల తర్వాత 133వ ర్యాంక్‌లో నిలిచింది. ఆస్ట్రేలియా, ఉజ్బెకిస్తాన్ వంటి బలమైన జట్ల చేతిలో ఓడటంతో ర్యాంకింగ్స్‌పై అధిక ప్రభావం చూపింది. అయితే ఆటగాళ్లపై విశ్వాసం కోల్పోము. సీఏఎఫ్‌ఏ నేషన్స్ కప్, ఆసియా కప్ క్వాలిఫయింగ్ టోర్నీలో మన జట్టు మెరుగైన ఆటతీరు కనబరుస్తుందనే నమ్మకముంది. 'ఫిఫా' ర్యాంకింగ్స్ వ్యవస్థ ప్రవేశపెట్టిన సమయంలో భారత్ 143వ ర్యాంక్‌తో ప్రారంభించింది. ఆ తర్వాత అత్యల్పంగా 173వ స్థానానికి పడిపోయింది. 1996లో అత్యుత్తమంగా 94వ ర్యాంక్‌లో నిలిచింది. ఐఎస్‌ఎల్ ద్వారా దేశంలో క్లబ్ క్రికెట్‌కు మంచి ఆదరణ లభిస్తోంది. ఆసియాలో అత్యధిక మంది వీక్షించిన ఫుట్‌బాల్ టోర్నీ ఐఎస్‌ఎల్‌నే. జాతీయ అంతర్జాతీయ సంస్థలు ఇందులో భాగస్వాములుగా ఉన్నాయి. అయితే ఐఎస్‌ఎల్ ఫలాలు జాతీయ జట్టుకు అందడం లేదు. కానీ కష్టం ఎప్పటికీ వృథా పోదు. దాని ప్రభావం టీమిండియాపై కనిపించే రోజులు ఎక్కువ దూరంలో లేవు' అని కల్యాణ్ వివరించారు.

ఎంపీల కోసం కొత్తగా 184 నివాసాలు



ఢిల్లీలోని బాబా ఖరక్ సింగ్ మార్గ్‌లో నిర్మాణం

- ఒక్కో ఫ్లాట్ విస్తీర్ణం 5 వేల చదరపు అడుగులు
- గ్రీన్ టెక్నాలజీ, భూకంప నిరోధక టెక్నాలజీ
- నేడు ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ సభ్యుల కోసం నిర్మించిన కొత్త నివాస గృహాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆవిష్కరించనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు దేశ రాజధాని ఢిల్లీలోని బాబా ఖరక్ సింగ్ మార్గ్‌లో నిర్మించిన 184 టైప్-7 మల్టీ స్టోరీ ఫ్లాట్లను ప్రధాని ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా ఎంపీల నివాస సముదాయంలో ప్రధాని మోదీ 'సిందూర' మొక్కను నాటి, ఆ తర్వాత నిర్మాణంలో పాల్గొన్న శ్రమజీవులతో ముచ్చటిస్తారు. అనంతరం సభికులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. స్వయం సమృద్ధి లక్ష్యంగా రూపొందించిన ఎంపీల నూతన నివాస సముదాయం పార్లమెంట్ సభ్యుల అవసరాలకు తగిన అన్ని ఆధునిక సదుపాయాలతో ఉంటుంది. ప్రతి యూనిట్ విస్తీర్ణం సుమారు 5 వేల చదరపు అడుగులు కాగా, ఇందులో నివాసంతో పాటు అధికారిక పనులకు అనుకూలంగా గదులను కేటాయించారు. సిబ్బంది నివాసాలు, కార్యాలయాలు, కమ్యూనిటీ సెంటర్ వంటి సదుపాయాలు కల్పించారు. నివాస సముదాయంలో కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థను అమలు చేసినట్లు ప్రధాన మంత్రి కార్యాలయ అధికారులు తెలిపారు. పర్యావరణ హిత సాంకేతికతతో నిర్మాణం చేపట్టి, గ్రీహ 3 స్టార్ రేటింగ్, నేషనల్ బిల్డింగ్ కోడ్-2016 ప్రమాణాలను అనుసరించారు. దీంతో శక్తి పొదుపు, పునరుత్పత్తి ఇంధన వనరుల వినియోగం, వ్యర్థాల నిర్వహణలో మెరుగులు సాధ్యమవుతాయని అధికారులు పేర్కొన్నారు. అల్యూమినియం షట్టరింగ్ విధానంలో మోనోలిథిక్ కాంక్రీట్ సాంకేతికతతో నిర్మాణం పూర్తి చేయడం వల్ల సమయానికి పనులు ముగిశాయని.. భూకంప నిరోధకంగా, దివ్యాంగులకు అనుకూలంగా ఈ భవనాలను రూపొందించారు. ప్రాజెక్ట్ కోసం భూమి పరిమితంగా ఉండటంతో అపార్ట్‌మెంట్ తరహా గృహ నిర్మాణం చేశారు.

అక్షరంపై ఆంక్షలు

కశ్మీర్‌లో 25 పుస్తకాలపై నిషేధం

సెన్సార్‌షిప్‌పై ఆందోళనలు • సర్వత్రా నిరసన

అక్షరంపై అంక్షలు... పుస్తకాలపై నిషేధం అంటే.. చరిత్రను సమాధి చేయడం . ప్రజల జ్ఞాపకాలను కప్పెట్టేయాలని ప్రయత్నించడం. అధికారాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడం. ఇటీవల జమ్మూ కశ్మీర్‌లో జరిగిందదే. 25 పుస్తకాలపై రాష్ట్రంలోని కేంద్రపాలిత ప్రభుత్వం నిషేధం విధించింది. బుకర్ ప్రైజ్ విజేత అరుంధతీ రాయ్, ప్రముఖ రచయితలు ఏజీ నూరానీ, విక్టోరియా స్కోఫీల్డ్, సుమంత్ర బోస్, డేవిడ్ దేవదాస్, అనురాధ భాసిన్, అయేషా జలాల్‌తోపాటు పలువురి పుస్తకాలపై నిషేధాన్ని ప్రకటించింది. తప్పుడు కథనాలు, వేర్పాటువాదం, ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నాయనే కారణంతో ఆయా పుస్తకాలను నిషేధిస్తున్నట్లు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా నేతృత్వంలోని ప్రభుత్వం తెలిపింది. 'విశ్వసనీయ నిఘా వర్గాల సమాచారం ఆధారంగా హింస, ఉగ్రవాదంలో యువత పాల్గొనేలా తప్పుడు కథనాలు, వేర్పాటువాద సాహిత్యం ఉసిగొల్పుతున్నాయి. ఇవి ఉగ్రవాదాన్ని కీర్తించి భారత్‌పై హింసను ప్రేరేపించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. వీటివల్లే యువత తప్పుదారి పడుతోందని నిఘా వర్గాల నుంచి సమాచారం అందిన తరువాతే ఈ పుస్తకాలను నిషేధిస్తున్నాం' అని జమ్మూ కశ్మీర్ హోం శాఖ గత బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ప్రభుత్వ ఉత్తర్వులో పుస్తకాలు ఏ విధంగా హింసను కీర్తించాయో ప్రత్యేకంగా ప్రస్తావించలేదు. కేవలం విశేషణాలను మాత్రమే ఉపయోగించింది. హోంశాఖ ఆదేశాలకు అనుగుణంగా 48 గంటల్లో, జమ్మూ కశ్మీర్ పోలీసులు పుస్తకాల దుకాణాల్లో సోదాలు నిర్వహించి పుస్తకాలను జప్తు చేశారు. వేసవి రాజధాని శ్రీనగర్‌తో పాటు, మధ్య కశ్మీర్‌లోని గండర్‌బాల్, ఉత్తర కశ్మీర్‌లోని హంద్వారా, దక్షిణ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాల్లోని పుస్తక దుకాణాల్లో దాడులు చేశారు. శ్రీనగర్‌లో చినార్ పుస్తక ఉత్సవం జరుగుతున్న సమయంలో ఈ నిషేధం విధించడం గమనార్హం. ఈ నిషేధం ప్రజల్లో సెన్సార్‌షిప్ భయాలను పెంచుతోంది.

నిషేధిత జాబితాలో ఉన్న ప్రముఖ పుస్తకాలు..

ప్రభుత్వ నిషేధ జాబితాలో బుకర్ ప్రైజ్ విజేత అరుంధతీ రాయ్ రాసిన 'ఆజాదీ', రాజ్యాంగ నిపుణుడైన ఏజీ నూరానీ రాసిన 'ది కశ్మీర్ డిస్ప్యూట్: 1947-2012', బ్రిటిష్ రచయిత్రి, చిత్రకారిణి విక్టోరియా స్కోఫీల్డ్ రాసిన 'కశ్మీర్ ఇన్ కాన్‌ఫ్లిక్ట్ - ఇండియా, పాకిస్తాన్ అండ్ ది అన్‌ఎండింగ్ వార్', జర్నలిస్ట్, కశ్మీర్ టైమ్స్ ఎడిటర్ అనురాధ భాసిన్ రాసిన 'ది డిస్మాంటిల్డ్ స్టేట్: ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ కశ్మీర్ ఆఫ్టర్ 370', 'కంటెస్టెడ్ ల్యాండ్స్', డేవిడ్ దేవదాస్ రాసిన 'ఇన్ సెర్చ్ ఆఫ్ ఏ ఫ్యూచర్ - ది స్టోరీ ఆఫ్ కశ్మీర్', తారిక్ అలీ, హిలాల్ భట్, హబ్బా ఖాతున్, పంకజ్ మిశ్రా, అరుంధతీ రాయ్‌లతో కలిసి ఆంత్రోపాలజిస్ట్ అంగనా ఛటర్జీ రాసిన 'కాశ్మీర్: ఎ కేస్ ఫర్ ఫ్రీడమ్', మొహమ్మద్ యూసఫ్ సరాఫ్ రాసిన 'కశ్మీరీస్ ఫైట్ ఫర్ ఫ్రీడం', అబ్దుల్ గోక్‌హామి జబ్బార్ రాసిన 'కశ్మీర్ పాలిటిక్స్ అండ్ ప్లెబిసైట్', ఎస్సార్ బటూల్ రాసిన 'డు యూ రిమెంబర్ కునాన్ పోష్పోరా?', రాజకీయ శాస్త్రవేత్త, చరిత్రకారుడు సుమంత్ర బోస్ రాసిన 'కశ్మీర్ ఎట్ ది క్రాస్‌రోడ్స్', హఫ్సా కంజ్వాల్ రాసిన 'కాలనైజింగ్ కశ్మీర్: స్టేట్-బిల్డింగ్ అండర్ ఇండియన్ ఆక్యుపేషన్', మరో ఇద్దరు విదేశీ రచయితలు కలిసి రచించిన 'హ్యూమన్ రైట్స్ వయొలేషన్స్ ఇన్ కశ్మీర్'తో పాటు పలు పుస్తకాలు ఉన్నాయి.

పుస్తకాల్లో ఏముంది?

అరుంధతీ రాయస్ రాసిన ఆజాదీ.. 2018 నుంచి 2020 మధ్య కాలంలో ఆమె రాసిన వ్యాసాలు, చేసిన ఉపన్యాసాల సంకలనం. ఇది భారత ప్రజాస్వామ్యానికి చీకటి కాలమని, మెజారిటీవాదం, మతోన్మాదం పెరుగుదల దేశానికి అత్యంత ప్రమాదకరమని చెబుతుంది. దేశం ఎలా స్వేచ్ఛను కోల్పోయిందో వివరిస్తుంది. ఏజీ నూరానీ ది కశ్మీర్ డిస్ప్యూట్.. దీర్ఘకాల కశ్మీర్ సమస్య సంక్లిష్ట చరిత్రను, దాని చుట్టూ ఉన్న రాజకీయ అసంతృప్తి, అసమ్మతిని వివరిస్తుంది. ముఖ్యంగా జమ్మూ కశ్మీర్ రాష్ట్రాన్ని కేంద్ర పాలితంగా మార్చడంపై ప్రశ్నలను సంధిస్తుంది. అనురాధా భసిన్ రాసిన పుస్తకం ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ కశ్మీర్‌లోని ప్రజల జీవితాలు, స్థానిక రాజకీయాలు, సామాజిక రంగాలపై ఆ చర్యల ప్రభావం గురించి చర్చిస్తుంది. మొత్తంగా పుస్తకాలన్ని.. కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు, మారణహోమాలు, ఈ ప్రాంతపు దశాబ్దాల రాజకీయ ప్రస్థానాన్ని, చరిత్రను ప్రతిబింబిస్తాయి.


శ్రీనగర్‌లోని ఓ బుక్ స్టోర్

విమర్శల వెల్లువ...

పుస్తకాల నిషేధంపై జమ్మూకశ్మీర్‌తోపాటు దేశ వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నిషేధాన్ని ప్రజల జ్ఞాపకాలపై దాడిగా పౌర హక్కుల ఉద్యమకారులు, రాజకీయ పార్టీలు, రచయితలు అభివర్ణిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా నిరసిస్తున్నారు. ప్రభుత్వంపై అసమ్మతిని అణచివేయడానికి సెన్సార్‌షిప్ ఒక ఉదాహరణని, ఇది దేశమంతటా ఉండగా.. 2019 తరువాత జమ్మూ కశ్మీర్‌లో అత్యంత దారుణంగా మారిందని పేర్కొన్నారు. నిషేధాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని లెఫ్టినెంట్ గవర్నర్‌ను డిమాండ్ చేస్తున్నారు. 'ఈ నిషేధం ఇప్పుడు కశ్మీర్‌లో జరుగుతోంది. రేపు మరోచోట జరగొచ్చు. అధికారం రాతలను అణచివేయొచ్చు. కానీ కశ్మీర్ చరిత్ర పుస్తకాలలో మాత్రమే లేదు. అది మౌఖిక సంప్రదాయంలో ఉంది. ప్రజల జ్ఞాపకాలలో ఉంది. ఆ జ్ఞాపకాలు చెరిపేస్తే చెరిగిపోవు. అవి ఒక తరం నుంచి మరో తరానికి అందజేస్తాయి'అని రచయితలు చెబుతున్నారు.


ప్రమాదకర ధోరణి : అనురాధ భాసిన్

'**మొ**దట వారు జర్నలిస్టుల కోసం వచ్చారు, మా గొంతులు నొక్కేయడంలో విజయం సాధించామని గ్రహించి, ఇప్పుడు విద్యారంగంపై దృష్టి సారించారు'అని ప్రముఖ ఎడిటర్ అనురాధ భాసిన్ విమర్శించారు. తన పుస్తకం హింసను ప్రోత్సహిస్తుందనే ఆరోపణలను భాసిన్ ఖండించారు. 'నా పుస్తకం ఎక్కడా ఉగ్రవాదాన్ని కీర్తించలేదు. ప్రభుత్వాలను విమర్శించింది. ఈ రెండింటికీ తేడా ఉందనే విషయాన్ని అధికారులు గమనించడం లేదు. ఇది చాలా ప్రమాదకరమైన ధోరణి'అని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. పుస్తకాలను నిషేధించడం వల్ల చరిత్ర చెరిగిపోదని జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పీడీపీ) అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ అన్నారు. 'పుస్తకాలను నిషేధించడం వల్ల చరిత్ర చెరిగిపోదు. అది విభజనను మాత్రమే పెంచుతుంది. కశ్మీర్‌లో, ప్రజాస్వామ్య గొంతులను నొక్కేయడం, ప్రాథమిక హక్కులను అణచివేయడం అపనమ్మకాన్ని, పరాయి పాలనలో ఉన్నామనే భావనను పెంచుతుంది'అని ఆమె ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

నియంత్రణకు సుదీర్ఘ చరిత్ర...

సెన్సార్‌షిప్ చరిత్ర ప్రపంచానికి కొత్త కాదు. కశ్మీర్‌కు అసలే కాదు. పుస్తకాలను నిషేధించడం ద్వారా ఆలోచనను అణచివేయాలనుకోవడం చాలా పాత వ్యూహమే. మానవ చరిత్ర అంతటా ఇది ఉంది. 1910లో, బ్రిటిష్ వారు మహాత్మా గాంధీ రాసిన హింద్ స్వరాజ్ పుస్తకం గుజరాతీ ఎడిషన్‌ను నిషేధించారు. దీనిని రాజద్రోహంగా అభివర్ణించారు. 1933లో మే నాజీ విద్యార్థులు జర్మన్ కానివిగా భావించిన వేలాది పుస్తకాలను తగలబెట్టారు. 1904లో, మున్షీ ముహమ్మద్ దిన్ ఫౌక్ శ్రీనగర్ నుంచి ఒక వార్తాపత్రికను ప్రచురించడానికి అప్పటి డోగ్రా పాలకుడు మహారాజా ప్రతాప్ సింగ్ అనుమతి కోరారు. ఫౌక్ అనుమతి నిరాకరించడమే కాకుండా, భవిష్యత్తులో అలాంటి అభ్యర్థనలను స్వీకరించకుండా నియమాలను రూపొందించాలని ఆయన తన ప్రధాన మంత్రిని ఆదేశించారు. 2010లో 17 ఏళ్ల విద్యార్థి తుఫైల్ మట్టూ హత్య తర్వాత పెద్ద ఎత్తున నిరసనలు చెలరేగడంతో ప్రభుత్వం ఎస్ఎంఎస్ సేవలను నిషేధించింది. మూడేళ్ల తరువాత పునరుద్ధరించింది. 2016లో తిరుగుబాటు తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు శ్రీనగర్‌లోని ఇండిపెండెంట్ పత్రిక అయిన 'కశ్మీర్ రీడర్'ను ప్రభుత్వం నిషేధించింది. హింసను ప్రేరేపించే ధోరణిలో ఉందంటూ నిలిపేసింది. కశ్మీర్‌లో నిత్య నిర్బంధాన్ని ఎదుర్కొన్నవారు జర్నలిస్టులే. ఆ నమూనా 2019 నుంచి మరింత పెరిగింది.

- సాక్షి, నేషనల్ డెస్క్


గిర్‌లో

సింహగర్జన

5 ఏళ్లలో 32% పెరిగిన జనాభా

- 674 నుంచి 891కు పెరిగిన సింహాల సంఖ్య
- 'ప్రాజెక్ట్ లయన్'ఫలితమేనన్న కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోనే ప్రసిద్ధి చెందిన గిర్ అడవుల్లో ఆసియాటిక్ సింహాల సంఖ్య రికార్డు స్థాయికి చేరింది. 2020లో 674గా ఉన్న ఈ సింహాల సంఖ్య 2025 నాటికి 891కి పెరిగింది. కేవలం ఐదేళ్లలో 32 శాతం వృద్ధి సాధ్యమైంది. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ ఈ వృద్ధిని 'ప్రాజెక్ట్ లయన్'విజయానికి నిదర్శనంగా అభివర్ణించారు. గుజరాత్‌లోని దేవభూమి ద్వారక జిల్లాలోని బర్దా వన్యప్రాణి అభయారణ్యంలో జరిగిన ప్రపంచ సింహ దినోత్సవ వేడుకల్లో భూపేందర్ యాదవ్ మాట్లాడారు. సింహాల సంరక్షణపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రధానమంత్రి గానూ, అంతకుముందు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడూ ప్రత్యేక శ్రద్ధ చూపారని మంత్రి యాదవ్ గుర్తు చేశారు. 1990లో 284 మాత్రమే ఉన్న సింహాల సంఖ్య 2025లో 891కి చేరడం ప్రపంచ వన్యప్రాణి సంరక్షణలో అరుదైన ఘనత అని చెప్పారు. 'సింహం గిర్‌లోనే ఉంది. ఇది గుజరాత్ గౌరవం, భారత పర్యావరణ బలానికి ప్రతీక'అన్నారు.

బర్దాలో రూ.180 కోట్ల ప్రాజెక్టులు

గుజరాత్‌లోని బర్దా ప్రాంతంలో 143 ఏళ్ల తర్వాత మళ్లీ సింహాల నివాసం ఏర్పడిందని ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ అన్నారు. బర్దా వన్యప్రాణి అభయారణ్యం పోర్ బందర్, దేవభూమి ద్వారకా జిల్లాల్లో 192.31 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. 2023లో సింహం ఈ ప్రాంతానికి సహజంగా వలస వచ్చిన తరువాత, సింహాల సంఖ్య 17కు పెరిగింది. అందులో 6 పెద్దవి, 11 పిల్లలు ఉన్నాయని వెల్లడించారు. అంతేగాక సుమారు 248 హెక్టార్ల విస్తీర్ణంలో సఫారీ పార్కును ప్రారంభించాలని యోచిస్తున్నారు. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయించింది. సింహాల వెటర్నరీ కేర్, నూతన హాబిటాట్స్, ఇకోటూరిజం మౌలిక సదుపాయాల కోసం రూ.180 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ప్రాజెక్ట్ లయన్

2020 ఆగస్టు 15న ఎర్ర కోట నుంచి ప్రధాని మోదీ ప్రకటించిన ప్రాజెక్ట్ లయన్‌కు 10 ఏళ్ల కాలానికి రూ.2,927.71 కోట్ల నిధులు కేటాయించారు. గుజరాత్‌లోని 11 జిల్లాల్లో సుమారు 35 వేల చదరపు కి.మీ. విస్తీర్ణంలో సింహాల ఉనికి విస్తరించి ఉంది. బర్దా వన్యప్రాణి అభయారణ్యంను రెండో సింహ నివాసంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించింది.

రాబర్ట్ వాద్రాపై ఈడీ చార్జిషీట్

న్యూఢిల్లీ: హరియాణాలో భూఒప్పందానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాపై గత నెల 17న ఢిల్లీలోని ప్రత్యేక మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్ఏ) కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. 2008 నాటి ఈ కేసులో దర్యాప్తునకు రాబర్ట్ వాద్రా సహకరించలేదని, తప్పించుకొనే ధోరణిలో సమాధానాలు చెప్పారని ఈడీ వెల్లడించింది. ఈ ల్యాండ్‌డీల్‌లో వాద్రాకు రూ.58 కోట్లు ముట్టినట్లు తెలియజేసింది. ఇదిలా ఉండగా, ఈడీ చార్జిషీట్‌లోని 11 మంది నిందితులకు ప్రత్యేక జడ్జి సుశాంత్ చంగోత్ర ఈనెల 2వ తేదీన నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను ఈ నెల 28వ తేదీకి వాయిదా వేశారు.

26న ఉదయగిరి, హిమగిరి జల ప్రవేశం

న్యూఢిల్లీ: భారత నావికాదళం ఉదయగిరి, హిమగిరి యుద్ధ నౌకలు ఈ నెల 26వ తేదీన విశాఖపట్టణంలో జలప్రవేశం చేయనున్నాయి. ప్రాజెక్ట్ 17ఏలో భాగమైన స్టెల్త్ ఫ్రిగేట్లు ఇవి. ఇందులో మొదటిదైన నీలగిరిని జనవరిలో ముంబైలోని నావల్ డాక్‌యార్డులో ప్రధాని మోదీ జల ప్రవేశం చేయించారు. ఈ ప్రాజెక్టులోని మొత్తం ఏడు ఫ్రిగేట్లలో మజగావ్ డాక్‌యార్డు నాలుగింటిని, మూడింటిని కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ ఇంజనీర్స్ సంస్థ నిర్మించనున్నాయి.

క్లోరిన్ గ్యాస్ లీకై 600 మందికి అస్వస్థత

బాగ్దాద్: ఇరాన్‌లో నీటి శుద్ధి ప్లాంట్ వద్ద లీకైన క్లోరిన్ వాయువు పీల్చి 600 మందికి పైగా షియా యాత్రికులు శ్వాస సమస్యతో ఆస్పత్రిలో చేరారు. షియాల పవిత్ర స్థలాలైన నజాఫ్- కర్బలా నగరాల మార్గంలో మధ్య శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. కర్బలా వద్ద క్లోరిన్ గ్యాస్ లీకైన ఘటనలో అస్వస్థతకు గురైన 621 మందికి ఆస్పత్రుల్లో చికిత్స అందించామని ఇరాక్ ఆరోగ్య శాఖ తెలిపింది. వీరంతా స్వస్థత చేకూరి, అనంతరం డిశ్చార్జి అయ్యారని కూడా వెల్లడించింది.

ఆహార కేంద్రాల వద్ద కాల్పుల్లో 31 మంది మృతి

దెయిర్ అల్-బలాహ్: గాజాలోని ఆహార కేంద్రాల వద్దకు చేరిన పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ కాల్పుల ఘటనలు కొనసాగుతున్నాయి. ఆదివారం చోటుచేసుకున్న కాల్పుల్లో కనీసం 31 మంది చనిపోయినట్లు ఆస్పత్రుల వర్గాలు తెలిపాయి. రఫా-ఖాన్‌యూనిస్‌లను వేరు చేస్తూ కొత్తగా ఏర్పాటైన మొరాగ్ కారిడార్‌లో ఆహార ట్రక్కుల కోసం ఎదురుచూస్తున్న వారిపై జరిగిన కాల్పుల్లో 15 మంది చనిపోయినట్లు నాస్సెర్ ఆస్పత్రి తెలిపింది. జికిమ్ క్రాసింగ్ వద్ద కాల్పుల్లో ఆరుగురు, నుసెయిరత్ శరణార్థి శిబిరం నలుగురు, ఖాన్‌యూనిస్, రఫాల్లోని ఆహార పంపిణీ కేంద్రాల సమీపంలో జరిగిన కాల్పుల్లో మరో ఆరుగురు చనిపోయారు.అదేవిధంగా, ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో గాజా సిటీలో ముగ్గురు, ఖాన్‌యూనిస్‌లో ఇద్దరు చిన్నారులు సహా నలుగురు ప్రాణాలు కోల్పోయారు.

వచ్చే ఏడాది నుంచి 9వ తరగతికి

ఓపెన్ బుక్ అసెస్‌మెంట్స్

ఆమోదం తెలిపిన సీబీఎస్ఈ

న్యూఢిల్లీ: 9వ తరగతి విద్యార్థులకు ఓపెన్- బుక్ అసెస్‌మెంట్స్ (ఓబీఏ) ప్రవేశపెట్టాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నిర్ణయించింది. పాఠశాలల్లో ఈ ఫార్మాట్ సాధ్యాసాధ్యాలు, పైలట్ అధ్యయనం తర్వాత పాలకమండలి ఈ నిర్ణయాన్ని ఆమోదించింది. 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఇది అమల్లోకి రానుంది. బట్టీ పట్టడం నుంచి యోగ్యత ఆధారిత అభ్యాసం వైపు విద్యార్థి దృష్టి మళ్లించడం లక్ష్యంగా దీనిని అమల్లోకి తెస్తున్నారు. ఈ ఓపెన్-బుక్ అసెస్‌మెంట్ ఫార్మాట్‌ను లాంగ్వేజెస్, గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రం వంటి ప్రధాన సబ్జెక్టుల్లో నిర్వహిస్తారు. విద్యార్థులు పరీక్ష సమయంలో పాఠ్యపుస్తకాలు, ఇతర వనరులను ఉపయోగించుకోవచ్చు. ఇవి ప్రతి విద్యా సంవత్సరంలో మూడు పెన్-పేపర్ పరీక్షల్లో ఉంటాయి. అయితే.. ఈ ఫార్మాట్‌ను స్వీకరించాలా? లేదా అనేది పాఠశాలల ఇష్టం. డిసెంబర్ 2023లో పైలట్ ప్రాజెక్టుకు ఆమోదం తర్వాత ఈ ప్రతిపాదన వచ్చింది. ఇది 9 నుంచి 12 తరగతుల్లో ఓపెన్ -బుక్ పరీక్షలను పరిశీలించింది. ట్రయల్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు ఓబీఏపై సానుకూలత వ్యక్తంచేయడంతో దీనికి ఆమోద ముద్ర వేశారు.

మా పనిని పూర్తి చేస్తాం: నెతన్యాహూ

జెరూసలేం: గాజాలో హమాస్ అంతమే తమ లక్ష్యమని, దానిని పూర్తి చేస్తామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ తెలిపారు. హమాస్ ఆయుధాలను వదిలేసేందుకు సిద్ధంగా లేదని తెలిపిన ఆయన...ఇంతకుమించి తమకు మరో మార్గం లేదన్నారు. గాజాలోకి సైన్యాన్ని పంపించాలన్న ప్రతిపాదనను ఆయన సమర్థించుకున్నారు. ఇది స్వల్పకాలంలోనే పూర్తయ్యే ఆపరేషన్ అని చెప్పారు. హమాస్‌ను సంపూర్ణంగా ఓడించి తమ పనిని పూర్తి చేసుకుంటామని చెప్పారు. ఆదివారం నెతన్యాహూ జెరూసలేంలో విదేశీ మీడియాతో మాట్లాడారు. 'మా లక్ష్యం గాజాను ఆక్రమించుకోవడం కాదు. గాజాకు హమాస్ నుంచి విముక్తి కల్పించడమే మా ఉద్దేశం'అని ఆయన సమర్థించుకున్నారు. తమ దేశంపై ప్రపంచవ్యాప్తంగా అబద్ధాల ప్రచారం జరుగుతోందంటూ మండిపడ్డారు. ఆంక్షలను సడలించడం ద్వారా గాజాలోకి మరింత మంది విదేశీ జర్నలిస్టులను అనుమతించాలని ఆర్మీని ఆదేశించినట్లు వెల్లడించారు. కాగా, గాజాను నియంత్రణలోకి తెచ్చుకునేందుకు సైన్యాన్ని పంపించాలని ఇజ్రాయెల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై భద్రతా మండలిచర్చించనుంది.

ఢిల్లీలో పాదచారులపైకి దూసుకెళ్లిన ఎస్‌యూవీ

ఒకరి మృతి, మరొకరికి గాయాలు

న్యూఢిల్లీ: వేగంగా దూసుకొచ్చిన థార్ కారు ఇద్దరు పాదచారులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం తెల్లవారుజామున ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ నుంచి కేవలం 2 కి.మీ దూరంలో ఉన్న హై-సెక్యూరిటీ జోన్‌లో జరిగింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోవడానికి చాలా సమయం పట్టడంతో గంటల తరబడి మృతదేహం రోడ్డుపైనే పడి ఉండటం వీడియోల్లో కనిపించింది. ఆ తరువాత వచ్చిన చాణక్యపురి పోలీసులు కారు నడుపుతున్న 26 ఏళ్ల ఆశిష్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన వ్యక్తిని ఆసుపత్రిలో చేర్చారు. వాహనంలో మద్యం సీసాలు లభ్యమయ్యాయి. తాను నిద్రమత్తులో ఉండి వాహనంపై నియంత్రణ కోల్పోయానని, దీనివల్లే ప్రమాదం జరిగిందని డ్రైవర్ పోలీసులకు తెలిపారు.

భారత విమానాలకు గగనతలం మూసేసి.. రూ.1,240 కోట్లు నష్టపోయిన పాక్

ఇస్లామాబాద్: భారత విమానాలకు గగనతలాన్ని మూసేసిన పాకిస్తాన్ భారీ ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటోంది. పాకిస్తాన్ విమానాశ్రయాల అథారిటీ (పీఏఏ) కేవలం రెండు నెలల్లో రూ. 1,240 కోట్లు నష్టపోయింది. ఈ విషయాన్ని ఆ దేశ రక్షణ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాద దాడి తరువాత, భారత్ సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడంతో, భారత్ విమానాలకు పాక్ గగనతలాన్ని మూసేయడం తెలిసిందే. ఇది ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో దేశం ఆదాయంలో భారీ నష్టాన్ని ఎదుర్కొంటోందని ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా మొహమ్మద్ ఆసిఫ్ తెలిపారు. దీనివల్ల రోజుకు 100 నుంచి 150 భారతీయ విమానాలు ప్రభావితం అయ్యాయన్నారు. ఏప్రిల్ 24 నుంచి జూన్ 30 మధ్య ఓవర్‌ఫ్లైయింగ్ ఛార్జీల నుంచి పీఏఏ ఆదాయం పడిపోయిందని పేర్కొన్నారు. ఈ ఆంక్షల వల్ల పాకిస్తాన్ విమాన ట్రాఫిక్ దాదాపు 20 శాతం తగ్గిందని వెల్లడించారు. ఇదిలా ఉండగా.. భారత విమానాలకు తన గగనతల మూసివేతను ఆగస్టు 24 వరకు పాక్ పొడిగించింది.

లండన్‌లో భారీ నిరసన ప్రదర్శన

466 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

లండన్: పాలస్తీనా యాక్షన్ గ్రూప్(పీఏజీ)పై యూకే ప్రభుత్వం విధించిన నిషేధాన్ని నిరసిస్తూ శనివారం లండన్‌లో అతిపెద్ద ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో పాల్గొన్న 466 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ స్థాయిలో అరెస్టులు లండన్ చరిత్రలోనే లేదని నిరసనకారులు అంటున్నారు. గాజాలో ఇజ్రాయెల్ దాడులను నిరసిస్తూ ప్లకార్డులను చేబూనిన నిరసనకారులు శనివారం లండన్‌లోని పార్లమెంట్ స్క్వేర్ వద్ద పెద్ద సంఖ్యలో గుమికూడారు. హ్యాండ్సాఫ్ గాజా అంటూ నినాదాలు చేస్తూ కూర్చున్న నిరసనకారులను పోలీసులు ఎత్తుకెళ్లారు. దీంతో, వారంతా షేమ్ ఆన్‌యూ అంటూ కేకలు వేశారు. రాత్రి 9 గంటల సమయానికి మొత్తం 466 మందిని, ఇతర నేరాలకు పాల్పడిన మరో 8 మందిని అరెస్ట్ చేశామని మెట్రోపాలిటన్ పోలీస్ విభాగం తెలిపింది.

కాంగ్రెస్ విదేశీ వ్యవహారాల విభాగం చీఫ్ ఆనంద్ శర్మ రాజీనామా

న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత ఆనంద్ శర్మ ఆ పార్టీ విదేశీ వ్యవహారాల విభాగం చైర్మన్ పదవికి ఆదివారం రాజీనామా చేశారు. యువ నేతలకు అవకాశం కల్పించేందుకు, విదేశీ వ్యవహారాల విభాగాన్ని పునర్నిర్మించేందుకు వీలుగా ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. తన నిర్ణయాన్ని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకి, పార్లమెంటరీ పార్టీ నేత సోనియాగాంధీకి తెలియజేశానన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు.



అంతరిక్షం నుంచి గంగా నది డెల్టా కనువిందు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్) నుంచి భారత్‌లోని గంగా నది డెల్టా ప్రాంతం కనువిందు చేస్తోంది. నాసా వ్యోమగామి డాన్ పెటిట్ ఈ ఫోటోను చిత్రీకరించారు. సోషల్ మీడియాలో పోస్టుచేశారు. గంగా నది డెల్టా ప్రపంచంలోనే అతిపెద్ద రివర్ డెల్టాగా గుర్తింపు పొందింది. తూర్పు భారతదేశం, బంగ్లాదేశ్‌లో విస్తరించి ఉంది. సారవంతమైన భూములు, పచ్చిక బయళ్లకు పెట్టింది పేరు. దీన్ని గంగా-బ్రహ్మపుత్ర డెల్టా లేదా బెంగాల్ డెల్టా లేదా సుందర్బన్స్ డెల్టా అని కూడా అంటారు. విస్తీర్ణం లక్ష చదరపు కిలోమీటర్లకు పైమాటే. లక్షలాది మందికి ఇదొక జీవరేఖ. డాన్ పెటిట్ నియర్-ఇన్‌ఫ్రారెడ్ ఫోటోగ్రఫీతో ఈ చిత్రాన్ని బంధించారు. నదులు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ ఫోటోకు సోషల్ మీడియాలో, సైన్స్ చానళ్లలో ప్రశంసల వర్షం కురుస్తోంది. నెటిజన్లు డాన్ పెటిట్‌ను అభినందిస్తూ పోస్టులు పెడుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానమే కాకుండా కళాత్మక దృష్టి కూడా ఇందులో కనిపిస్తోంది.

నవ రత్నాలు ఏ రాజు ఆస్థాన కవులు?

మౌర్య సామ్రాజ్యం అంతమైన తర్వాత మళ్లీ ఉత్తర భారత దేశాన్ని ఏకం చేసి పాలించిన రాజులు గుప్తులు. కుషాణ రాజ్య శిథిలాలపై క్రీ.శ. 4వ శతాబ్దంలో ఆవిర్భవించిన ఈ రాజ్యం 6వ శతాబ్దం వరకూ కొనసాగింది.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

గుప్త సామ్రాజ్యం

గుప్తుల సమాచారం అనేక సాహిత్య, పురావస్తు ఆధారాల ద్వారా లభిస్తోంది. వీరి కాలంలోని అనేక మంది కవులు గుప్తులకు సంబంధించిన సమాచారాన్ని తమ గ్రంథాల ద్వారా అందించారు. సాహిత్యాధారాలతోపాటు గుప్తులు 42 శాసనాలను జారీ చేశారు. వీటిలో కొన్ని రాజ ప్రశస్తులు కాగా మిగిలినవి దాన శాసనాలు. మొదట కుషాణులకు సామంతులుగా ఉన్న గుప్తులు వారి రాజ్య పతనం తర్వాత అధికార పగ్గాలు చేపట్టారు.

గుప్తుల రాజకీయ చరిత్ర

శ్రీగుప్తుడు:

ఇతడు కుషాణుల సామంతుడిగానే పరిపాలన సాగించినట్లు తెలుస్తోంది. అందుకే నాటి సామంత రాజులు, భూస్వాములు ధరించే 'మహారాజ' అనే సాధారణ బిరుదును శ్రీగుప్తుడు ధరించాడు. ఇత్సింగ్ ప్రకారం.. మృగశిఖవనం వద్ద చైనాకు చెందిన బౌద్ధ సన్యాసుల ప్రయోజనార్థం శ్రీగుప్తుడు ఒక దేవాలయాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. అంతేగాక దాని నిర్వహణకు 20 గ్రామాలను కూడా అతడు దానం చేశాడు.

ఘటోత్కచ గుప్తుడు:

ఇతడు క్రీ.శ. 300 ప్రాంతంలో రాజ్యానికి వచ్చాడు. ఘటోత్కచుడు కూడా తన తండ్రి శ్రీగుప్తుడిలాగే ఒక సామంతరాజుగానే పరిపాలించాడు. ఇతడు తన కుమారుడైన మొదటి చంద్రగుప్తుడికి లిచ్ఛవీల రాకుమార్తె కుమారదేవితో వివాహం జరిపించాడు. తద్వారా గుప్త రాజ్య పటిష్టతకు కృషి చేశాడు.

మొదటి చంద్రగుప్తుడు:

ఇతడు తన తాత, తండ్రిలా 'మహారాజ' అనే బిరుదుతో కాకుండా 'మహారాజాధి రాజు'గా ప్రసిద్ధుడయ్యాడు. గుప్తవంశంలో తొలి స్వతంత్ర రాజుగా ఇతడిని భావించాలి. మొదటి చంద్రగుప్తుడు క్రీ.శ.320లో గుప్త శకాన్ని ప్రారంభించాడు. తన భార్య తరఫు నుంచి మగధ రాజ్యాన్ని పొందాడు. అందుకే తన నాణేలన్నింటిపై తన భార్య కుమారదేవి చిత్రంతో పాటు లిచ్ఛవీ వంశస్తుల పేర్లనూ ముద్రించాడు. గుప్త సామ్రాజ్య విస్తరణను చంద్రగుప్తుడే ప్రారంభించాడు.

సముద్ర గుప్తుడు:

సముద్ర గుప్తుడు రాజ్యానికి రాకముందు.. 'కచ' అనే మరో గుప్త రాకుమారుడు ఈ రాజ్యాన్ని పాలించినట్లు కొన్ని నాణేల ద్వారా తెలుస్తోంది. సముద్రగుప్తుడు ఈ వంశంలో అందరి కంటే గొప్ప రాజు. గుప్తుల జైత్రయాత్రను ఆసేతు హిమాచలం కొనసాగించాడు. సముద్రగుప్తుడి విజయాలపై ఇతడి ఆస్థాన కవి హరిసేనుడు ప్రయాగ ప్రశస్తి (అలహాబాద్ ప్రశస్తి)ని జారీ చేశాడు. దక్షిణాపథాన్ని పాలించే 12మంది రాజులను సముద్రగుప్తుడు జయించాడు. తర్వాత వారినే తన సామంతులుగా నియమించుకున్నాడు. ఆర్యావర్తాన్ని పాలించే 8 మంది రాజులను ఓడించి వారి రాజ్యాలను స్వాధీనం చేసుకున్నాడు. ఆ తర్వాత నేపాల్, బెంగాల్, అస్సాం మొదలైన సరిహద్దు రాజ్యాలను జయించాడు. అనేక ఆటవిక రాజ్యాలూ సముద్రగుప్తుడికి దాసోహమన్నాయి. ఆ తర్వాత దైవపుత్ర షహానుషాహీలు, శక మురుండులు, సింహళీయులూ ఇతడి సార్వభౌమత్వాన్ని స్వచ్ఛందంగా అంగీకరించారు. సముద్రగుప్తుడిలో సైనిక సామర్థ్యంతో



పాటు, కవితా గుణాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇతడికి 'కవిరాజు' అనే బిరుదు ఉంది. తన విజయాలకు గుర్తుగా సముద్రగుప్తుడు అశ్వమేధ యాగాన్ని నిర్వహించాడు. పులిని వేటాడుతున్నట్లు, వీణను సాధన చేస్తున్నట్లు ఉండే చిహ్నాలతో పలు నాణేలు జారీ చేశాడు. అప్రతిరథ, సర్వరాజోచ్ఛేత, అశ్వమేధ పరాక్రమ, వ్యాఘ్ర పరాక్రమ.. తదితర బిరుదులు ఇతడికి ఉన్నాయి.

రెండో చంద్రగుప్తుడు:

ఇతడికి విక్రమాదిత్య, నరేంద్రచంద్ర, సింహచంద్ర, సింహ విక్రమ.. తదితర బిరుదులున్నాయి. విశాఖదత్తుని 'దేవీచంద్రగుప్తం' అనే గ్రంథం ప్రకారం.. రెండో చంద్రగుప్తుడు తన అన్న రామగుప్తుడిని వధించి సింహాసనాన్ని ఆక్రమించినట్లు తెలుస్తోంది. ఇతడు సౌరాష్ట్ర, గుజరాత్ ప్రాంతాలను తన సామ్రాజ్యంలో విలీనం చేశాడు. దీంతో పశ్చిమాసియాతో పెద్ద ఎత్తున వ్యాపార-వాణిజ్యాలు నిర్వహించే అవకాశం కలిగింది. రెండో చంద్రగుప్తుడు.. తన కుమార్తె ప్రభావతీ గుప్తను వాకాటక రెండో రుద్రసేనుడికిచ్చి వివాహం చేశాడు. ఇతడు తన సైనిక విజయాలను చంద్ర అనే పేరుతో మెహ్రౌలీ ఇనుప స్తంభ శాసనాన్ని జారీచేశాడు. తన తండ్రి సముద్రగుప్తుడిలాగే రెండో చంద్రగుప్తుడు కూడా అనేక బంగారు నాణేలు జారీ చేశాడు. సింహాన్ని వధిస్తున్నట్లుగా, చేతిలో పుష్పాన్ని ధరించినట్లుండే చిహ్నాలతో ఇతడు బంగారు నాణేలు జారీ చేశాడు. ఇతడు ఉజ్జయినీని తన రెండో రాజధానిగా చేసుకున్నాడు. రెండో చంద్రగుప్తుడి ఆస్థానంలో నవరత్నాలు అనే కవులున్నట్లు ప్రతీతి.

కుమార గుప్తుడు:

తన సోదరుడు గోవింద గుప్తుడితో వారసత్వ తగాదాల అనంతరం ఇతడు రాజ్యానికి వచ్చాడు. క్రీ.శ.415 నుంచి క్రీ.శ.455 వరకు దాదాపు 40 ఏళ్ల పాటు ఇతడు గుప్త సామ్రాజ్యాన్ని పరిపాలించాడు. కుమారగుప్తుడు జారీచేసిన 1,400 నాణేలు మహారాష్ట్రలోని సామండ్ అనే ప్రాంతంలో బయటపడ్డాయి. తాను నిర్వహించిన అశ్వమేధ యాగానికి గుర్తుగా.. సముద్రగుప్తుడిలాగే ఇతడు కూడా అశ్వమేధ నాణేలు జారీ చేశాడు. కుమారు గుప్తుడు.. మహేంద్రాదిత్య, అశ్వమేధ మహేంద్ర అనే బిరుదులతో నాణేలు జారీ చేశాడు. మయూర వాహనంపై కార్తికేయుడి చిత్రంతో బంగారు నాణేలు ముద్రించాడు.

స్కంద గుప్తుడు:

ఇతడు విక్రమాదిత్యుడు అనే బిరుదును ధరించాడు. వారసత్వ యుద్ధాల్లో పురు గుప్తుడిని ఓడించి రాజ్యానికి వచ్చాడు. జునాగఢ్, భిటారి ప్రశస్తుల్లో.. స్కందగుప్తుడు తన శత్రువుల గురించి పేర్కొన్నాడు. హూణులపై ఇతడు సాధించిన విజయాల వల్ల 50 ఏళ్ల పాటు గుప్త సామ్రాజ్యానికి హూణుల నుంచి ప్రమాదం తొలగిపోయింది.

బుధ గుప్తుడు:

బుధ గుప్తుడి కాలంలో గుప్తసామ్రాజ్య పతనం ప్రారంభమైంది. ఇతడి తర్వాత భానుగుప్తుడు, నరసింహ గుప్త, బాలాదిత్యుడు, 3వ కుమారగుప్తుడు, విష్ణుగుప్తుడు పాలించారు. గుప్తవంశ పాలన క్రీ.శ. 550లో అంతమైంది.

మాదిరి ప్రశ్నలు

1. 'ఆర్య మంజుశ్రీ మూలకల్ప' గ్రంథం ప్రకారం బౌద్ధులను హింసించిన గుప్తరాజు?
ఎ) సముద్ర గుప్తుడు బి) కచ గుప్తుడు
సి) నరసింహ బాలాదిత్యుడు
డి) విష్ణు గుప్తుడు
2. భూమిపై ఉన్న సమస్త రాజులను ఓడించినట్లు ఎరాన్ ప్రశస్తిలో పేర్కొన్న రాజు?
ఎ) మొదటి చంద్రగుప్తుడు
బి) రెండో చంద్రగుప్తుడు
సి) సముద్రగుప్తుడు డి) స్కంద గుప్తుడు
3. గుప్తుల అధికారిక చిహ్నం?
ఎ) పులి బి) గరుడ
సి) వీణ డి) సింహం
4. కామరూపలో సముద్రగుప్తుడి ప్రతినిధిగా నియమితుడైన రాజు?
ఎ) భాస్కర వర్మన్ బి) సూర్య వర్మన్
సి) పుష్య వర్మన్ డి) గృహ వర్మన్
5. సముద్రగుప్తుడికి కానుకలు పంపిన గాంధార రాజు?
ఎ) కిదార బి) చిరాతదత్త
సి) సిద్ధార్థ డి) నరసింహన్
6. రోమ్‌కు రాయబార బృందాన్ని పంపిన గుప్తరాజు?
ఎ) పురు గుప్తుడు బి) సముద్ర గుప్తుడు
సి) కుమార గుప్తుడు డి) బుధ గుప్తుడు
7. బోధ్‌గయలో సింహళ విహారాన్ని నిర్మించిన శ్రీలంక రాజు?
ఎ) శ్రీ మార విజయోత్తుంగ వర్మ
బి) శ్రీ మేఘవర్మ
సి) విజయబాహు డి) కుమార బాహు
8. తాను వీణ వాయిస్తున్నట్లుగా బంగారు నాణేలను జారీ చేసిన రాజు..?
ఎ) కుమార గుప్తుడు
బి) చంద్రగుప్త విక్రమాదిత్యుడు
సి) సముద్ర గుప్తుడు
డి) శ్రీ గుప్తుడు
9. కృష్ణ చరితం అనే గ్రంథాన్ని రచించిన గుప్తరాజు?
ఎ) సముద్ర గుప్తుడు
బి) నరసింహ గుప్తుడు
సి) మొదటి చంద్రగుప్తుడు
డి) రెండో చంద్రగుప్తుడు
10. అశ్వమేధ నాణేలు జారీ చేసిన గుప్తరాజు?
ఎ) విష్ణు గుప్తుడు బి) సముద్ర గుప్తుడు
సి) కుమార గుప్తుడు డి) బి, సి
11. సముద్ర గుప్తుడిని 'ఇండియన్ నెపోలియన్' అని పిలిచినవారు ?
ఎ) సర్ విలియం జోన్స్
బి) వి.ఎ.స్మిత్
సి) హెచ్.సి. రామచౌదరి
డి) కె.పి. జయస్వాల్
12. రెండో చంద్రగుప్తుడి చేతిలో హతుడైన శకరాజు?
ఎ) రెండో రుద్రసేనుడు
బి) మూడో రుద్రసేనుడు
సి) రెండో రుద్రసింహుడు
డి) మూడో రుద్రసింహుడు
13. సాహసాంక, శకారి అనే బిరుదులున్న గుప్త రాజు?
ఎ) మొదటి చంద్రగుప్తుడు
బి) రెండో చంద్రగుప్తుడు
సి) సముద్ర గుప్తుడు
డి) కుమార గుప్తుడు
14. నవ రత్నాలు ఏ రాజు ఆస్థాన కవులు?
ఎ) సముద్రగుప్తుడు బి) కచ గుప్తుడు
సి) రెండో చంద్రగుప్తుడు
డి) బుధ గుప్తుడు
15. రెండో చంద్రగుప్తుడి కాలంలో భారతదేశాన్ని సందర్శించిన చైనా యాత్రికుడు?
ఎ) ఇత్సింగ్ బి) పాన్‌చావో
సి) హుయాన్‌చాంగ్ డి) ఫాహియాన్
16. ఖడ్గమృగాన్ని సంహరిస్తున్నట్లుగా నాణేలు జారీ చేసింది?
ఎ) కుమార గుప్తుడు బి) 2వ చంద్రగుప్తుడు
సి) సముద్రగుప్తుడు
డి) మొదటి చంద్రగుప్తుడు
17. సుదర్శన తటాకానికి మరమ్మతులు నిర్వహించినట్లు శాసనం జారీ చేసింది?
ఎ) స్కంద గుప్తుడు బి) కుమార గుప్తుడు
సి) పురు గుప్తుడు డి) బుధ గుప్తుడు
18. హూణుల దాడిని విజయవంతంగా ఎదుర్కొన్న గుప్తరాజు?
ఎ) సముద్ర గుప్తుడు
బి) నరసింహ గుప్తుడు
సి) స్కంద గుప్తుడు డి) బి, సి
19. వంద రాజులకు అధిపతిగా ప్రశస్తుడైన గుప్త రాజు?
ఎ) స్కంద గుప్తుడు
బి) సముద్ర గుప్తుడు
సి) మొదటి చంద్రగుప్తుడు
డి) రెండో చంద్రగుప్తుడు
20. సముద్రగుప్తుడి పాలనలో హరిసేనుడు అధిష్ఠించిన పదవి?
ఎ) మహాదండ నాయకుడు
బి) కుమారామాత్యుడు
సి) సంధి విగ్రాహకుడు
డి) పైవన్నీ
21. గుప్తుల కాలంలో రాష్ట్ర పాలకులను ఎలా పిలిచేవారు?
ఎ) విషయపతి బి) ఉపారిక
సి) కుమారామాత్య డి) అమాత్యా
22. గుప్తుల కాలంలో భూమి శిస్తు ఎంత?
ఎ) 1/6వ వంతు బి) 1/4వ వంతు
సి) 1/4 నుంచి 1/6వ వంతు
డి) 1/8వ వంతు
23. గుప్తుల కాలంనాటి అధికారులను సరిగా జతపరచండి?

A) టిలుపతి	1) గజదళ అధ్యక్షుడు
B) పుష్టపాల	2) భూ విక్రయాల రికార్డులు
C) దివిర	3) లేఖకుడు
D) శౌల్కిక	4) సుంకాల వసూలు అధికారి

	A)	B)	C)	D)
ఎ)	1	2	3	4
బి)	2	1	4	3
సి)	4	3	2	1
డి)	3	4	1	2

24. గుప్తుల కాలంలో ఉపారికార, హిరణ్య అనేవి?
ఎ) పన్నులు బి) అధికారులు
సి) భూమి కొలబద్దలు డి) నాణేలు
25. గుప్తుల కాలంలో గుజరాత్ నుంచి మాందసోర్‌కు వలస వెళ్లిన వ్యాపార సంఘం ఏ వృత్తికి సంబంధించింది?
ఎ) కుండల తయారీ బి) సిల్క్ తయారీ
సి) దంతపు వస్తువుల తయారీ
డి) ఇనుప వస్తువుల తయారీ

సమాధానాలు

1) బి; 2) సి; 3) బి; 4) సి; 5) ఎ; 6) బి; 7) బి; 8) సి; 9) ఎ; 10) డి; 11) బి; 12) డి; 13) బి; 14) సి; 15) డి; 16) ఎ; 17) బి; 18) డి; 19) ఎ; 20) డి; 21) బి; 22) బి; 23) ఎ; 24) ఎ; 25) బి.

మొక్కల ఆకులు ఆకుపచ్చ రంగులో ఉండటానికి కారణం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

మాదిరి ప్రశ్నలు

1. భూమిపై ఉన్న వృక్షాలన్నీ నశిస్తే జీవులన్నీ మరణిస్తాయి. కారణం? (సివిల్స్, 1988)
1) కార్బన్ డై ఆక్సైడ్ లేకపోవడం
2) ఆక్సిజన్ లేకపోవడం
3) 1, 2 4) ఏదీకాదు
2. మడ వృక్షాలు (మంగ్రూవ్ అడవులు) అంటే? (గ్రూప్-1, 1999)
1) నీటి మొక్కలు 2) ఉప్పునీటి వృక్షాలు
3) పండ్లనిచ్చే వృక్షాలు 4) ఆల్గే
3. హైడ్రోఫోనిక్స్ అంటే ఏమిటి? (సివిల్స్, 2000)
1) ధ్వని తరంగాలతో నీటిని శుద్ధిచేయడం
2) వాతావరణం, నీరు అవసరం లేకుండా మొక్కలు పెంచే పద్ధతి
3) మృత్తిక అవసరం లేకుండా మొక్కలు పెంచే పద్ధతి
4) తడి గాలిని పంపి మొక్కలను పెంచే పద్ధతి
4. హెర్బేరియం అనేది ఒక..? (ఎఫ్ఆర్‌వో, 2005)
1) ఎండు ఔషధ మొక్కల సంకలనం
2) వివిధ ఔషధ మొక్కల తోట
3) విత్తనాలను నిల్వచేసే సంస్థ
4) ఎండు మొక్కల నమూనాలను భద్రపరిచే సంస్థ
5. కాఫీలో కలిపే చికోరి పౌడర్‌ను మొక్క ఏ భాగం నుంచి గ్రహిస్తారు? (గ్రూప్-1, 2010)
1) కాండం 2) వేరు
3) ఆకులు 4) విత్తనాలు
6. 'రాడిష్' అనేది ఒక ..? (ఏఈఈ, 2009)
1) బల్బ్ 2) మొక్కజొన్న
3) మార్పుచేసిన వేరు 4) ట్యూబర్
7. వేరు బుడిపెలు ఉన్న పంటలను ఎక్కువగా సాగు చేస్తే నేలలో స్థాపితమయ్యే మూలకం ఏది? (వీడీవో, 1992)
1) కాల్షియం 2) పొటాషియం
3) భాస్వరం 4) నత్రజని
8. అల్లం అనేది ఒక ..? (గ్రూప్-1, 2003, గ్రూప్-4, 1996)
1) కండ కలిగిన వేరు
2) కండ కలిగిన కాండం 3) నిల్వచేసే వేరు
4) ఉపవాయుగత కాండం
9. 'జెనెటిక్స్' అనే పదాన్ని ప్రతిపాదించింది ఎవరు?
1) హ్యూగో డీవ్రీస్ 2) మెండల్
3) బేట్‌సన్ 4) సట్టన్-జొహెన్‌సన్
10. ఆకుల ద్వారా జరిగే ట్రాన్స్పిరేషన్ ప్రక్రియలో పాల్గొనే నిర్మాణాలేవి? (గ్రూప్-2, 2003)
1) క్యూటికిల్ 2) లెంటిసెల్స్
3) స్టొమాట 4) హైడథోడ్స్
11. కుంకుమపువ్వును మొక్క ఏ భాగం నుంచి సేకరిస్తారు? (గ్రూప్-1, 1999)
1) ఎండిన రక్షక పత్రాలు
2) ఎండిన పూమొగ్గలు
3) కీలాగ్రం 4) ఆకర్షణ పత్రాలు
12. కింద పేర్కొన్న పత్రరంధ్రాల ద్వారా నీరు బిందువుల రూపంలో స్రవితమవుతుంది. ఆ నిర్మాణాలను ఏమంటారు? (సివిల్స్, 1996)
1) లెంటిసెల్స్ 2) ఫయలోపోర్
3) హైడథోడ్స్ 4) స్టొమాట
13. పీచర్ ప్లాంట్‌లోని ఏ భాగం పీచర్‌గా మార్పు చెందుతుంది? (సివిల్స్, 2007; ఎఫ్ఆర్‌వో, 2009)
1) కాండం 2) ఆకు
3) స్టిప్యూల్స్ 4) పిటియోల్
14. కింది వాటిలో మాంసాహార మొక్క ఏది? (సివిల్స్, 1996)
1) నెపంథిస్ 2) డ్రాసిరా
3) డయోనియా 4) పైవన్నీ
15. జీవితకాలంలో కొన్ని మొక్కలు ఒకేసారి పుష్పిస్తాయి. వాటిని ఏమని పిలుస్తారు? (గ్రూప్-4, 2010)
1) మోనోకార్పిక్ 2) మోనోగామస్
3) మోనోజెనిక్ 4) మోనోమార్పిక్
16. అతిపెద్ద పుష్పం ఏది? (గ్రూప్-4, 2010)
1) క్రైసాంథిమమ్ 2) రఫ్లేషియా
3) సన్‌ఫ్లవర్ 4) జిన్నియా
17. ఆపిల్‌లో తినే భాగం ఏది? (గ్రూప్-4, 1998)
1) కార్పెల్ 2) థాలమస్
3) పెడిసిల్ 4) ఎండోకార్ప్
18. పప్పుధాన్యాల్లో ప్రధానంగా ఉండే పోషక విలువలేవి? (ఏఈఈ, 2009)
1) పిండి పదార్థాలు 2) విటమిన్లు
3) కొవ్వులు 4) మాంసకృత్తులు
19. సుగంధద్రవ్యంగా ఉపయోగపడే లవంగం అనేది ఒక..? (డీఎల్, 2012)
1) వేరు 2) ఫలం
3) ఎండిన విప్పారని పూమొగ్గ
4) కాండం
20. 'చందన వృక్షం' శాస్త్రీయ నామం? (గ్రూప్-4, 2002)
1) సాంటాలమ్ ఆల్బం
2) షోరియా రొబెస్టా
3) సిడ్రస్ డియోడరా
4) పైనస్ రాక్స్‌బర్గై
21. 'మార్ఫిన్'ను మొక్క ఏ భాగం నుంచి సేకరిస్తారు? (గ్రూప్-2 బ్యాక్‌లాగ్, 2003)
1) పుష్పం 2) ఆకు
3) పండు/కాయ లేటెక్స్ 4) కాండం
22. వృక్ష కణం, జంతు కణానికి మధ్య తేడా? (వాటర్‌వర్క్స్ మేనేజర్, 2008)
1) కేంద్రకం 2) ప్లాస్మాత్వచం
3) క్లోరోప్లాస్ట్ 4) మైటోకాండ్రియా
23. సూక్ష్మదర్శిని ద్వారా కణాన్ని పరిశీలించిన తొలి శాస్త్రవేత్త ఎవరు? (గ్రూప్-2 బ్యాక్‌లాగ్, 2000)
1) రాబర్ట్ హుక్ 2) ఎ.వి. లీవెన్‌హుక్
3) టి. ష్వాన్ 4) ఎం.జె. ష్లైడన్
24. కింది వాటిలో ప్రోకారియోటిక్(కేంద్రక పూర్వ) కణం కానిది?
1) క్లోరెల్లా 2) ఈస్ట్
3) క్షయ బ్యాక్టీరియా 4) 1, 2
25. వాణిజ్యపరంగా 'కార్క్' అనేది ఏ వృక్షం నుంచి తీసిన బెండు?
1) ఎల్మ్ 2) విల్లో
3) ఆర్కిడ్ 4) ఓక్
26. 'ప్రతి జీవి దేహం కణాలతో నిర్మితమవుతుంది. జీవుల నిర్మాణాత్మక, క్రియాత్మక ప్రమాణం కణం' అని కణ సిద్ధాంతాన్ని వివరించినవారు? (సివిల్స్, 1998)
1) లూయీపాశ్చర్ 2) రాబర్ట్ హుక్
3) ష్లైడన్-ష్వాన్ 4) లీవెన్‌హుక్
27. జన్యువు (Gene) అంటే? (గ్రూప్-1, 1988)
1) ప్రోటీన్‌లోని అమైనో ఆమ్లం
2) ఆర్ఎన్ఏలో కొంత భాగం
3) డీఎన్ఏ ముక్క
4) సహలగ్న సముదాయం
28. అంతర్లీనంగా దాగి ఉండే లక్షణాన్ని ఏమంటారు? (గ్రూప్-4, 1989)
1) డామినెంట్ 2) F_1 జనరేషన్
3) రెసిసివ్ 4) పైవేవీకాదు
29. హరగోవింద్ ఖురానా చేసిన పరిశోధన ఏమిటి? (పాలిటెక్నిక్ లెక్చరర్, 2011)
1) నూతన కణాల గుర్తింపు
2) ప్రయోగశాలలో కృత్రిమ జన్యువు సృష్టి
3) మొక్కల్లో పరివర్తన
4) జన్యు మార్పిడి
30. 'జన్యువు' అని పేరు పెట్టినవారెవరు?
1) బేట్‌సన్ 2) మెండల్
3) జొహెన్‌సన్ 4) క్రిక్-వాట్సన్
31. జీవ పరిణామ సిద్ధాంతాన్ని తొలిసారిగా శాస్త్రీయంగా ప్రతిపాదించినవారు? (గ్రూప్-1, 1987-88)
1) లామార్క్ 2) డార్విన్
3) డీవ్రీస్ 4) మెండల్
32. 'ది ఆరిజన్ ఆఫ్ స్పీసీస్' గ్రంథకర్త? (గ్రూప్-1, 2003)
1) లామార్క్ 2) చార్లెస్ డార్విన్
3) డీవ్రీస్ 4) మెండల్
33. సముద్రంలో ఏర్పడిన, కిరణజన్య సంయోగ క్రియ జరిపే మొదటి జీవులేవి? (గ్రూప్-2, 2002)
1) శైవలాలు 2) సయనో బ్యాక్టీరియా
3) శిలీంధ్రాలు 4) మొక్కలు
34. ఉత్పరివర్తన పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారు? (సివిల్స్, 2006)
1) డార్విన్ 2) లామార్క్
3) మెండల్ 4) హ్యూగో డీవ్రీస్
35. 'ప్రోటీన్ల కర్మాగారాలు' అని వేటిని పిలుస్తారు?
1) పెరాక్సీజోమ్‌లు 2) రైబోజోమ్స్
3) హరితరేణువు 4) మైటోకాండ్రియా
36. మానవుడి శుక్రకణంలోని క్రోమోజోమ్‌ల సంఖ్య?
1) 46 2) 44+XX
3) 22 4) 23
37. కొబ్బరి అంకురచ్ఛద స్థితి?
1) ఏక స్థితికం 2) ద్వయ స్థితికం
3) త్రయ స్థితికం 4) బహు స్థితికం
38. సమ విభజనను పరిశీలించడానికి అనువైన స్థానం ఏది?
1) కాండం 2) ఉల్లి వేరుకొన
3) మొగ్గ 4) పుష్పంలోని పరాగకోశం
39. డీఎన్ఏ డబుల్ హెలిక్స్ నమూనాను ప్రతిపాదించినవారు?
1) ష్లైడన్ - ష్వాన్ 2) క్రిక్-వాట్సన్
3) బెంథమ్-హుకర్
4) ఎంగ్లర్ ప్రాంటల్
40. అంటుకట్టడం, గాయాలు మానడంలో ఇమిడి ఉన్న ప్రక్రియ ఏది?
1) ద్విదావిచ్ఛిత్తి 2) బహుదావిచ్ఛిత్తి
3) సమ విభజన 4) క్షయకరణ విభజన
41. పాకిటీన్ ఉపదశ దేనిలో ఉంటుంది?
1) సమ విభజన 2) క్షయకరణ విభజన
3) అసమ విభజన 4) ఏదీకాదు
42. కిరణజన్య సంయోగక్రియ ఏ కాంతిలో ఎక్కువగా జరుగుతుంది?
1) నీలి కాంతి 2) సూర్య కాంతి
3) అరుణ కాంతి 4) అతినీలలోహిత కాంతి
43. క్లోరోఫిల్ అణువులో ఏ మూలకం ఉంటుంది? (గ్రూప్-1, 1999)
1) ఇనుము 2) మెగ్నీషియం
3) కోబాల్ట్ 4) కాల్షియం
44. మానవ నిర్మిత ధాన్యపు మొక్క (Man made cereal)?
1) ఓట్స్ 2) రెపానో బ్రాసికా
3) ట్రిటికేల్ 4) షర్బతి సానోరా
45. నీటిలో కరిగే వర్ణద్రవ్యాలు?
1) క్లోరోఫిల్స్ 2) కెరోటినాయిడ్స్
3) జాంతోఫిల్స్ 4) పైకోబిలిన్లు
46. శిలీంధ్రం నుంచి రూపొందించిన ఫైటోహార్మోన్ ఏది?
1) ఆక్సిన్ 2) జిబ్బరెల్లిన్
3) సైటోకైనిన్ 4) ఇథిలీన్
47. అగ్రాధిక్యతకు కారణమైన హార్మోన్ ఏది?
1) ఆక్సిన్ 2) జిబ్బరెల్లిన్
3) సైటోకైనిన్ 4) ఇథిలీన్
48. కింది వాటిలో జిబ్బరెల్లిన్ల చర్య ఏది?
1) మొక్కల పొడవు పెంచుతుంది
2) అన్ని రకాల మొక్కల పొడవు పెంచుతుంది
3) పొట్టి మొక్కల పొడవు మాత్రమే పెంచుతుంది
4) పొడవు మొక్కల పొడవు పెంచుతుంది
49. విత్తన రహిత ఫలాలు ఏర్పడటానికి దోహదపడే హార్మోన్ ఏది?
1) అబ్‌సైసిక్ ఆమ్లం 2) సైటోకైనిన్
3) ఆక్సిన్ 4) జిబ్బరెల్లిన్లు
50. ఫ్రూట్ రైపనింగ్ హార్మోన్ ఏది?
1) అబ్‌సైసిక్ ఆమ్లం 2) ఇథిలీన్
3) సైటోకైనిన్ 4) జిబ్బరెల్లిన్
51. వార్ధక్యాన్ని నివారించే హార్మోన్ ఏది?
1) ఆక్సిన్ 2) సైటోకైనిన్
3) ఇథిలీన్ 4) అబ్‌సైసిక్ ఆమ్లం
52. కణ విభజనను ప్రోత్సహించే హార్మోన్?
1) ఇథిలీన్ 2) సైటోకైనిన్
3) జిబ్బరెల్లిన్ 4) అబ్‌సైసిక్ ఆమ్లం
53. సుప్తావస్థను కలుగజేసే హార్మోన్ ఏది?
1) ఇథిలీన్ 2) సైటోకైనిన్
3) జిబ్బరెల్లిన్ 4) అబ్‌సైసిక్ ఆమ్లం
54. మొక్కల ఆకులు ఆకుపచ్చ రంగులో ఉండటానికి కారణం? (ఏఈ, 2009)
1) మెలనిన్ 2) టానిన్
3) క్లోరోఫిల్ 4) బ్యాక్టీరియా
55. మొక్కల పెరుగుదలకు కావాల్సిన ప్రధాన సమ్మేళనం ఏది? (ఏఈ, 2009)
1) సల్ఫర్ 2) సోడియం
3) కార్బన్ 4) నైట్రోజన్
56. క్వినైన్ దేని నుంచి లభిస్తుంది? (గ్రూప్-2, 2002)
1) మల్బరీ 2) కోకో
3) సింకోనా 4) యూకలిప్టస్
57. 'ద్వి ఫలదీకరణం' ఏ మొక్కల ముఖ్య లక్షణం? (ఎంపీడీవో, 1997)
1) శైవలాలు 2) బ్రయోఫైటా
3) వివృత బీజాలు 4) ఆవృత బీజాలు
58. లిట్మస్ పేపర్ తయారీకి ఉపయోగించే మొక్క ఏది?
1) శైవలాలు 2) శిలీంధ్రం
3) లైకేన్లు 4) ఫెర్న్
59. పిండి పదార్థాలను గుర్తించే రసాయనం?
1) కోబాల్ట్ క్లోరైడ్ 2) అయొడిన్
3) సోడియం హైడ్రాక్సైడ్
4) కాపర్ సల్ఫేట్
60. పాక్షిక స్వయం ప్రతిపత్తి ఉన్న కణాంగం?
1) హరిత రేణువు 2) మైటోకాండ్రియా
3) రైబోజోమ్స్ 4) 1, 2
61. జీవ పరిణామంలో ప్రకృతి ఎన్నిక సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శాస్త్రవేత్త? (వీడీవో, 1988)
1) లామార్క్ 2) డార్విన్
3) డీవ్రీస్ 4) మెండల్
62. జీవుల్లో వంశపారంపర్య లక్షణాలు కలిగించేది ఏది? (గ్రూప్-2, 1991)
1) ఆర్ఎన్ఏ 2) ఏటీపీ
3) డీఎన్ఏ 4) హిమోగ్లోబిన్
63. క్రోమోజోమ్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది ఎవరు? (గ్రూప్-4, 1996)
1) డార్విన్ 2) మెండల్
3) సట్టన్-బవేరి 4) లామార్క్
64. శిశువు లింగ నిర్ధారణ ఎవరిపై ఆధారపడి ఉంటుంది?
1) తల్లి 2) తండ్రి
3) తల్లి, తండ్రి 4) పూర్వీకులు
65. డీఎన్ఏలోని క్రియాత్మక ప్రమాణం?
1) సిస్ట్రాన్ 2) రేకాన్
3) మ్యూటాన్ 4) ఏదీకాదు

సమాధానాలు

1) 2; 2) 2; 3) 3; 4) 4; 5) 2; 6) 3; 7) 4; 8) 2; 9) 3; 10) 3; 11) 3; 12) 3; 13) 2; 14) 4; 15) 1; 16) 2; 17) 2; 18) 4; 19) 3; 20) 1; 21) 3; 22) 3; 23) 1; 24) 4; 25) 4; 26) 3; 27) 3; 28) 3; 29) 2; 30) 3; 31) 2; 32) 2; 33) 2; 34) 4; 35) 2; 36) 4; 37) 3; 38) 2; 39) 2; 40) 3; 41) 2; 42) 3; 43) 2; 44) 3; 45) 4; 46) 2; 47) 1; 48) 3; 49) 4; 50) 2; 51) 2; 52) 2; 53) 4; 54) 3; 55) 4; 56) 3; 57) 4; 58) 3; 59) 2; 60) 4; 61) 2; 62) 3; 63) 3; 64) 2; 65) 1.

‘సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన’ లక్ష్యం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఎకానమీ

పేదరిక, నిరుద్యోగ నిర్మూలన పథకాలు

1. కింది వాటిలో దేన్ని ప్రత్యేక ప్రాంతాల అభివృద్ధి పథకంగా భావించలేం?
   ఎ) కరువు ప్రాంతాల అభివృద్ధి పథకం
   బి) ఎడారి ప్రాంతాల అభివృద్ధి పథకం
   సి) అటవీ ప్రాంతాల అభివృద్ధి పథకం
   డి) గ్రామీణ యువతకు స్వయం ఉపాధిలో శిక్షణ
2. ‘సరళీకరణ ఫలితాలు గ్రామీణ పేదలకు చేరడం లేదని, తద్వారా ఆదాయ అసమానతలు పెరుగుతున్నాయ’ని 2001 ఆగస్టు 15న ఎవరు అభిప్రాయపడ్డారు?
   ఎ) రాజీవ్ గాంధీ బి) వి.పి.సింగ్
   సి) అటల్ బిహారీ వాజ్‌పేయి
   డి) దేవెగౌడ
3. వ్యవసాయరంగంలో కౌలు చట్టాలు, మిగులు భూమి పంపిణీ, కమతాల సమీకరణ మొదలైన వాటితో భూసంస్కరణలపై, వ్యవసాయదారులపై జాతీయ విధానం శ్రద్ధ వహించాలని ఎన్నో ప్రణాళిక ముసాయిదా పేర్కొంది?
   ఎ) 9వ బి) 10వ సి) 11వ డి) 12వ
4. ఇందిరా ఆవాస్ యోజన ద్వారా భారత్‌లో ఏ ఏడాది నాటికి అందరికీ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది?
   ఎ) 2017 బి) 2020
   సి) 2025 డి) 2026
5. ప్రజల భాగస్వామ్యంతో సంపూర్ణ గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా ప్రారంభించిన పథకం?
   ఎ) సామాజిక అభివృద్ధి పథకం
   బి) ఎడారి ప్రాంత అభివృద్ధి పథకం
   సి) కనీస అవసరాల కార్యక్రమం
   డి) కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్
6. ఉపాధి హామీ పథకాన్ని మొదటగా ఎప్పుడు ప్రారంభించారు?
   ఎ) 1952 బి) 1972-73
   సి) 1973-74 డి) 1975
7. భూగర్భ జలాల అభివృద్ధి లక్ష్యంగా ప్రారంభించిన పథకం?
   ఎ) సామాజిక అభివృద్ధి పథకం
   బి) కనీస అవసరాల కార్యక్రమం
   సి) కరవు పీడిత ప్రాంతాల కార్యక్రమం
   డి) ఎడారి ప్రాంత అభివృద్ధి పథకం
8. ‘క్రాష్ స్కీమ్ ఫర్ రూరల్ ఎంప్లాయిమెంట్’ను ఎప్పుడు ప్రారంభించారు?
   ఎ) 1955 బి) 1963
   సి) 1970 డి) 1973
9. సాంకేతిక, విత్తపర సహాయం లక్ష్యంగా ప్రారంభమైన పథకం?
   ఎ) ఉపాంత రైతులు, వ్యవసాయ కార్మికుల అభివృద్ధి ఏజెన్సీ
   బి) ఉపాధి హామీ పథకం
   సి) పనికి ఆహారపథకం



   డి) ఆక్సిలరేటెడ్ రూరల్ వాటర్ సప్లయ్
10. 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమాన్ని ప్రకటించిందెవరు?
   ఎ) మొరార్జీదేశాయ్ బి) ఇందిరా గాంధీ
   సి) రాజీవ్ గాంధీ డి) వి.పి.సింగ్
11. ఎడారి ప్రాంత అభివృద్ధి కార్యక్రమాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
   ఎ) 1965 బి) 1972
   సి) 1975 డి) 1977
12. చిన్న రైతుల అభివృద్ధి ఏజెన్సీ కింది ఏ ప్రణాళికలో ప్రారంభమైంది?
   ఎ) 2వ బి) 3వ
   సి) 4వ డి) 5వ
13. అభివృద్ధి పనుల్లో శ్రామికులకు ఆహార ధాన్యాలను వేతనాలుగా ఇవ్వడం లక్ష్యంగా ప్రారంభమైన పథకం?
   ఎ) 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం
   బి) పనికి ఆహార పథకం
   సి) సమీకృత గ్రామీణాభివృద్ధి కార్యక్రమం
   డి) పైవేవీకావు
14. స్వయం ఉపాధి పథకాల్లో గ్రామీణ ప్రాంత యువకులకు శిక్షణ ఎప్పుడు ప్రారంభించారు?
   ఎ)1979 బి)1980
   సి)1983 డి)1985
15. గ్రామీణ పేదల సంపూర్ణ అభివృద్ధి లక్ష్యంగా 1980లో ప్రారంభమైన పథకం?
   ఎ) 20 సూత్రాల ఆర్థిక పథకం
   బి) చిన్న రైతుల అభివృద్ధి ఏజెన్సీ
   సి) సమీకృత గ్రామీణాభివృద్ధి కార్యక్రమం
   డి) ఉపాధి హామీ పథకం
16. గ్రామీణ పేదలకు లాభదాయకమైన ఉపాధి లక్ష్యంగా 1980లో ప్రారంభమైన పథకం?
   ఎ) సామాజిక అభివృద్ధి పథకం
   బి) జాతీయ గ్రామీణ ఉపాధి కార్యక్రమం
   సి) నేషనల్ ఫండ్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్
   డి) పైవేవీకావు
17. పనికి ఆహార పథకాన్ని పునర్నిర్మించి ప్రారంభించిన కార్యక్రమం?
   ఎ) మధ్యాహ్న భోజన పథకం
   బి) విద్యావంతులైన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి
   సి) జాతీయ గ్రామీణ ఉపాధి కార్యక్రమం
   డి) ప్రధాన మంత్రి రోజ్‌గార్ యోజన
18. గ్రామీణ ప్రాంతాల్లో భూమిలేని పేదల కోసం ఉపాధి హామీ పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
   ఎ) 1983 బి) 1985
   సి) 1987 డి) 1989
19. గ్రామీణాభివృద్ధికి విత్త సహాయాన్ని అందించడం లక్ష్యంగా 1985లో ఏర్పాటు చేసింది?
   ఎ) జవహర్ రోజ్‌గార్ యోజన
   బి) నేషనల్ ఫండ్ ఫర్ రూరల్ డెవలప్ మెంట్
   సి) నెహ్రూ రోజ్‌గార్ యోజన
   డి) జాతీయ గ్రామీణ ఉపాధి కార్యక్రమం
20. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి లక్ష్యంగా 1982-83లో ప్రారంభమైన పథకం?
   ఎ) డ్వాక్రా
   బి)ఆర్.ఎల్.ఇ.జి.పి సి) ఎన్.ఆర్.ఇ.పి
   డి) కనీస అవసరాల కార్యక్రమం
21. సబ్సిడీలు, బ్యాంకు విత్తం కల్పన లక్ష్యంగా 1986లో ప్రారంభమైన పథకం?
   ఎ) డ్వాక్రా
   బి) పట్టణ పేదలకు స్వయం ఉపాధి కార్యక్రమం
   సి) మహిళా సమృద్ధి యోజన
   డి) గంగా కల్యాణ్ యోజన
22. కింది వాటిలో దేన్ని వేతన ఉపాధి కార్యక్రమంగా భావించవొచ్చు?
   ఎ) జవహర్ రోజ్‌గార్ యోజన
   బి) సమీకృత గ్రామీణాభివృద్ధి కార్యక్రమం
   సి) డ్వాక్రా
   డి) మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం
23. ప్రధానమంత్రి సమీకృత పట్టణ పేదరిక నిర్మూలన పథకాన్ని ఎప్పుడు ప్రకటించారు?
   ఎ) 1993 బి) 1995
   సి) 1997 డి) 1999
24. కింది వాటిలో పట్టణ ప్రాంతాలకు సంబంధించిన వేతన ఉపాధి పథకం?
   ఎ) నెహ్రూ రోజ్‌గార్ యోజన
   బి) జవహర్ రోజ్‌గార్ యోజన
   సి) కమాండ్ ఏరియా అభివృద్ధి కార్యక్రమం
   డి) పైవేవీ కావు
25. స్పెషల్ గ్రూప్ ఆన్ టార్గెటింగ్ టెన్ మిలియన్ ఎంప్లాయిమెంట్ ఆపర్చునిటీస్ (2002) కమిటీ అధ్యక్షుడు?
   ఎ) ఎస్.పి. గుప్తా బి) టెండూల్కర్
   సి) విజయ్ కేల్కర్ డి) బరూచా
26. గ్రామీణ ప్రాంతాల్లో వంద రోజుల ఉపాధి కల్పన లక్ష్యంగా 1993లో ప్రారంభించిన పథకం?
   ఎ) జవహర్ రోజ్‌గార్ యోజన
   బి) నెహ్రూ రోజ్‌గార్ యోజన
   సి) ఉపాధి హామీ పథకం
   డి) మహిళా సమృద్ధి యోజన
27. పోస్టాఫీసుల్లో గ్రామీణ మహిళల పొదుపును ప్రోత్సహించడానికి ప్రారంభించిన పథకం?
   ఎ) మహిళా సమృద్ధి యోజన
   బి) గంగా కల్యాణ్ యోజన
   సి) కనీస అవసరాల కార్యక్రమం
   డి) రాజ రాజేశ్వరి మహిళా కల్యాణ్ యోజన
28. స్వర్ణ జయంతి శహరీ రోజ్‌గార్ యోజనను ఎప్పుడు ప్రారంభించారు?
   ఎ) 1994 బి) 1995
   సి)1996 డి) 1997
29. పేదల ఆహార భద్రత లక్ష్యంగా 2000 సంవత్సరంలో ప్రారంభించిన పథకం?
   ఎ) ఆశ్రమ బీమా యోజన
   బి) జనశ్రీ బీమా యోజన
   సి) అంత్యోదయ అన్నయోజన
   డి) అన్నపూర్ణ యోజన
30. ‘రాజ రాజేశ్వరి మహిళా కల్యాణ్ యోజన (1998)’ లక్ష్యం?
   ఎ) మహిళలకు విద్యావకాశాల పెంపు
   బి) మహిళలకు బీమా రక్షణ
   సి) మహిళలకు ఆహార భద్రత
   డి) గర్భిణుల సంరక్షణ
31. పెన్షన్ పొందని వృద్ధులకు 10 కిలోల బియ్యం లక్ష్యంగా ప్రారంభించిన పథకం?
   ఎ) శిక్షా సయోగ్ యోజన
   బి) జనశ్రీ బీమా యోజన
   సి) భారత్ నిర్మాణ్
   డి) అన్నపూర్ణ యోజన
32. ఇళ్లు, తాగునీరు, పరిశుభ్రత కల్పన లక్ష్యంగా 1999లో ప్రారంభించిన పథకం?
   ఎ) భారత్ నిర్మాణ్
   బి) స్వర్ణ జయంతి ఆవాస్ యోజన
   సి) వందేమాతరం
   డి) పైవేవీకావు
33. జవహర్ గ్రామీణ సమృద్ధి యోజనను ఎప్పుడు ప్రారంభించారు?
   ఎ) 1997 బి) 1998
   సి) 1999 డి) 2000
34. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక అవసరాలు తీర్చడానికి ఉద్దేశించిన పథకం?
   ఎ) ప్రధానమంత్రి గ్రామోదయ యోజన
   బి) స్వర్ణ జయంతి గ్రామ స్వరోజ్‌గార్ యోజన
   సి) వాల్మీకి అంబేద్కర్ ఆవాస్ యోజన
   డి) సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన
35. ‘సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన (2001)’ లక్ష్యం?
   ఎ) పేద వర్గాలకు బీమా
   బి) ఉపాధి, ఆహారభద్రత
   సి) గర్భిణుల సంరక్షణ
   డి) బాలింతల సంరక్షణ
36. పేద జిల్లాల్లో ఉపాధి కల్పన లక్ష్యంగా 2001లో ప్రారంభించిన పథకం?
   ఎ) జయప్రకాశ్ నారాయణ్ రోజ్‌గార్ గ్యారంటీ యోజన
   బి) జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం
   సి) జవహర్ గ్రామీణ సమృద్ధి యోజన
   డి) నేషనల్ ఫుడ్ ఫర్ వర్క్ ప్రోగ్రామ్
37. అనుబంధ వేతన ఉపాధి లక్ష్యంగా 2004లో ప్రారంభమైన పథకం?
   ఎ) జాతీయ పనికి ఆహార పథకం
   బి) ఎస్ఆర్ఈపీ
   సి) భారత్ నిర్మాణ్ డి) వందేమాతరం
38. సోషల్ సెక్యూరిటీ పైలెట్ స్కీం (2004) లక్ష్యం ?
   ఎ) అనుబంధ వేతన ఉపాధి
   బి) అసంఘటిత రంగంలోని శ్రామికులకు బీమా, పెన్షన్, వైద్య సదుపాయాల కల్పన
   సి) గర్భిణుల సంరక్షణ
   డి) పేద జిల్లాల్లో ఉపాధి కల్పన
39. నేషనల్ సోషల్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్‌ను ఎప్పుడు ప్రారంభించారు?
   ఎ) 1992 బి) 1993
   సి) 1994 డి) 1995
40. పక్కా రోడ్ల ద్వారా గ్రామాలను కలపడానికి ఉద్దేశించిన పథకం?
   ఎ) ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన
   బి) భారత్ నిర్మాణ్
   సి) ఇందిరమ్మ
   డి) సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన
41. భూమి లేని వ్యవసాయ కార్మికులకు బీమా లక్ష్యంగా 2001లో ప్రారంభమైన పథకం?
   ఎ) జనశ్రీ బీమా యోజన
   బి) కేతీహార్ మజ్దూర్ బీమా యోజన
   సి) జననీ సురక్ష యోజన
   డి) శిక్షా సంయోగ్ యోజన
42. పట్టణ ప్రాంతాల్లోని మురికివాడల ప్రజలకు గృహ నిర్మాణానికి ఉద్దేశించిన పథకం?
   ఎ) వాల్మీకి అంబేద్కర్ ఆవాస్ యోజన
   బి) ఇందిరా ఆవాస్ యోజన
   సి) జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం
   డి) పీఎం గ్రామోదయ యోజన
43. గర్భిణుల సంరక్షణకు ఉద్దేశించిన పథకం?
   ఎ) జననీ సురక్ష యోజన
   బి) జనశ్రీ బీమా యోజన
   సి) వందేమాతరం
   డి) గంగా కల్యాణ్ యోజన
44. తల్లుల సంరక్షణ లక్ష్యంగా 2005లో ప్రారంభించిన పథకం?
   ఎ) జననీ సురక్ష యోజన
   బి) వందేమాతరం
   సి) రాజ రాజేశ్వరి మహిళా కల్యాణ్ యోజన
   డి) ఆశ్రయ బీమా యోజన
45. ఉపాధి కోల్పోయిన వారికి నష్ట పరిహారాన్ని అందించే ఆశ్రయ బీమా యోజన ఎప్పుడు ప్రారంభమైంది?
   ఎ) 1997 బి) 1999
   సి) 2001 డి) 2005
46. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎప్పుడు ప్రారంభమైంది?
   ఎ) 2005 ఫిబ్రవరి 2
   బి) 2006 ఫిబ్రవరి 2
   సి) 2007 ఫిబ్రవరి 2
   డి) 2008 ఫిబ్రవరి 2
47. ‘ఉజ్వల’ పథకాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
   ఎ) 2005 డిసెంబర్
   బి) 2006 డిసెంబర్
   సి) 2007 డిసెంబర్
   డి) 2008 జనవరి

సమాధానాలు

1) డి;	2) సి;	3) సి;	4) బి;
5) ఎ;	6) బి;	7) సి;	8) డి;
9) ఎ;	10) బి;	11) డి;	12) సి;
13) బి;	14) ఎ;	15) సి;	16) బి;
17) సి;	18) ఎ;	19) బి;	20) ఎ;
21) బి;	22) ఎ;	23) బి;	24) ఎ;
25) ఎ;	26) సి;	27) ఎ;	28) డి;
29) సి;	30) బి;	31) డి;	32) బి;
33) సి;	34) ఎ;	35) బి;	36) ఎ;
37) ఎ;	38) బి;	39) డి;	40) ఎ;
41) బి;	42) ఎ;	43) సి;	44) ఎ;
45) సి;	46) బి;	47) సి;	

India is younger than the world!

BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. No. 1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. They're charging an exorbitant price (1)/ for fixing the car, (2)/ but they've get us over a barrel (3)/ because we can't do without it. (4)/ No error (5)
2. He accepted (1)/ her apology (2)/ very (3)/ graceful. (4)/ No error (5)
3. His words caused (1)/ a great deal (2)/ of dissension about (3)/ his followers. (4)/ No error (5)
4. The film was highly praised, (1)/ but is (2)/ not a (3)/ commercial success. (4)/ No error (5)
5. I didn't have (1)/ any money to give him; (2)/ the much I could do (3)/ was offer him my support. (4)/ No error (5)
6. He was asked (1)/ the same question so many time (2)/ that the answer (3)/ became mechanical. (4)/ No error (5)
7. An ounce in liquid (1)/ was different (2)/ from an ounce (3)/ in dry measure. (4)/ No error (5)
8. She was holding (1)/ the wheel with one hand (2)/ and waves (3)/ with the other. (4)/ No error (5)
9. It wasn't really (1)/ a propitiate moment (2)/ to raise the subject (3)/ of my pay rise. (4)/ No error (5)
10. Now that television has become (1)/ important in elections, (2)/ a new set off circumstances (3)/ has come into play. (4)/ No error (5)

Directions (Q. No. 11-20): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

In seven years, India will **surpass** China to become the world's most **populous** country and will have 1.7 billion residents by 2050, new projections from the United Nations show. Experts, however, caution that India might be lowering its fertility at a faster rate than what the U.N.'s projections indicate. The 2015 revision to the U.N.'s World Population Projections was released early on Thursday. The world population reached 7.3 billion as of mid-2015, adding approximately one billion people in the past 12 years. The world population, however, is growing slower now; 10 years ago, the growth rate was 1.24 per cent a year, while today, it is growing by 1.18 per cent or approximately, an additional 83 million people annually. It will take 15 years to add the next billion people, taking the world population to 8.5 billion in 2030. By 2050, the world will have 9.7 billion people and 11.2 billion by 2100. As a region, Africa will have its population - **propelled** to a large extent by Nigeria which will be the third largest populated country in the world in 2050 overtaking the U.S. — grow the fastest. The population of 48 countries, most of them in Europe and including Japan, will in contrast **shrink** between 2015 and 2050.



The median age of the global population — that is, the age at which half the population is older and half is younger — is 29.6. About one-quarter (26 per cent) of the world's people are under 15 years of age, 62 per cent are aged 15 to 59, and 12 per cent 60 or above. India is younger than the world; the median age is a full three years younger and 28.8 per cent are under the age of 15, while just 8.9 per cent are 60 or over. By 2050, India will have aged significantly, and the share of people over 60 will be twice as big, while the median age will be 37.3.

China's population will start declining by the 2030s, while India's is projected to **decline** only after 2069 when its population is around 1.75 billion. However, demographic experts say the U.N.'s projections may not be keeping pace with the speed at which India is reducing its fertility. As of 2013, India's Sample Registration System (SRS) — the official source of fertility statistics, which come from the Registrar-General's office — said the total fertility rate (average number of children per woman) was down to 2.3. However, the U.N. projects a rate of 2.34 for 2015-20. By the SRS rates, India could reach **replacement** fertility levels — when every woman has just enough children to replace the parents on average — by 2020, but the U.N. projections would see this happening around a decade later.

11. The concern expressed in the passage is
   1) The growing age
   2) World old age ratio
   3) Exponential growth in population
   4) Median age of people in Africa
   5) Japan's mortality rate
12. The third largest populated country in the world is located in
   1) Nigeria 2) Asia3) Japan
   4) Africa 5) Europe
13. India is younger than the world means:
   1) India is a budding country
   2) India is a developing nation
   3) India is a country with lower fertility rate
   4) Every woman has just enough children to replace the parents
   5) The population of the younger folks is relatively high
14. What does the author say about the world population?
   1) It is steadily making a progress
   2) It is showing larger growth beyond control
   3) It is difficult to control the population for the next ten years
   4) It is growing slower now when compared with the last decade
   5) The rise in population indicates rise of problems

Directions (Q. No. 15-17): Choose the word which is MOST SIMILAR in meaning to the word printed in bold.

15. **Surpass**
   1) Beside 2) Besides 3) Exceed
   4) Limit 5) Confide
16. **Populous**
   1) Crowded 2) Demur 3) Protest
   4) Cozy 5) Homely
17. **Replacement**
   1) Postpone 2) Proxy 3) Privy
   4) Pilferage 5) Procrastinate

Directions (Q. No.18-20): Choose the word which is OPPOSITE in meaning to the word printed in bold.

18. **Decline**
   1) Refuse 2) Reject 3) Reflect
   4) Rebuff 5) Recognize
19. **Shrink**
   1) Shrivel 2) Shiver 3) Nurture
   4) Wither 5) Smallest
20. **Propel**
   1) Force 2) Boost 3) Vigor
   4) Weakness 5) Energy

Directions (Q. No. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Former President, top scientist, Bharat Ratna, Missile Man of India.... These are just some of the ____ (21) that come ____ (22) the name of APJ Abdul Kalam who died in Shillong, collapsing in the middle of what he loved doing most - talking to students. He was 83. Born on 15th October 1931 in Rameswaram ____ (23) Tamil Nadu to humble parents - his father was a boat owner - APJ Abdul Kalam distributed newspapers at ____ (24) time to support his family and his education. He graduated with physics from the Madras University, went on to study aerospace engineering, wanted to be a fighter pilot but just missed that bus. But there was no stopping him. The DRDO, ISRO, chief scientific advisor to the prime minister in 1992, the Pokhran 2 nuclear tests... Abdul Kalam straddled them all, till he _____ (25) India's 11th President in 2002. It was the _____ (26) he will probably be most remembered for - a president who brought Rashtrapati Bhavan to the people.... earning him the tribute of the People's President. Signing the Office of Profit Bill was the toughest decision he had taken during his tenure - that's what Abdul Kalam himself was once quoted saying. There were also controversial decisions - his response to mercy petitions from death row ____ (27) and the imposition of President's Rule in Bihar in 2005. But what he will be _____ (28) for was his engagement with the people _____ (29) children - even after his presidency and the books that he wrote - India 2020 and, of course, Igniting minds. "If you want to shine like a sun, first burn like a sun," APJ Abdul Kalam ____ (30) in one of his inspirational speeches.

21. 1) titles 2) tag 3) names
   4) identity 5) headings
22. 1) beside 2) before
   3) besides4) forefront
   5) in front
23. 1) for 2) at 3) in
   4) with 5) from
24. 1) an 2) the 3) previous
   4) one 5) early
25. 1) elected 2) elect 3) is elected 4) has elected 5) was elected
26. 1) role 2) character
   3) attitude 4) behavior
   5) roll
27. 1) acquit 2) convicts
   3) exonerates
   4) release 5) guilty
28. 1) thought 2) taught
   3) remembered 4) added
   5) recollect
29. 1) special 2) specialty
   3) specialist 4) especially
   5) particular
30. 1) will say 2) says3) has said
   4) would say 5) had said

Answers

1. 3	2. 4	3. 3	4. 2	5. 3
6. 2	7. 2	8. 3	9. 2	10. 3
11. 3	12. 4	13. 5	14. 4	15. 3
16. 1	17. 2	18. 5	19. 3	20. 4
21. 1	22. 2	23. 3	24. 4	25. 5
26. 1	27. 2	28. 3	29. 4	30. 5